


సంపుటం. ౧౭ విక్రమ, శ్రావణమాసము (ఆగస్టు 1940) సంఖ్య. ౮

కనకదుర్గ

శ్రీ శివ శంకర శాస్త్రి

౧

విజయవాటికలోన ఆవిర్భవించి
పూర్వయుగమున, త్రైలోక్యపూజ్య మైన
కనకదుర్గాంబ నేడు నన్ కనికరించె
అమృత నిష్యంది మోహనాపాంగవీక్ష !

౨

ఇంద్రకీలాచల మ్మధిష్ఠించి యున్న
కనకదుర్గాంబ కీనాడు కరుణ కలిగె
మూడు మారులు మందిరమునకు నేను
స్విన్ననయనాలతో ప్రదక్షిణము సేయ !

౩

కామిసందోహ కల్పవృక్షాయమాన
కనదుర్గాంబ నామీద కరుణ బూనె
కరముల న్మోడ్చి, కల్యాణకాంక్షి నగుచు
పూర్ణహృదయముతో నేను పూజ సేయ !

సాహిత్యము : జీవితము

శ్రీ క్రొవ్విడి రామం

శ్రావ్యమైన జోలపాట పాడితే పసిపాప పోరుపెట్టడం మాని హాయిగా నిద్రపోతుంది. చక్కని కథ చెప్పినట్లయితే పిల్లలంతా చెవి కోసుకొని వింటారు. మిసిమిజవ్వనుల వలపు వగల తీరును సొంపుగా వివరించినట్లయితే వయసువచ్చిన ప్రతిఅక్షరాస్యుడూ ఆగ్రంథాన్ని చదివి తన్మయుడౌతాడు. మానవ జీవితంలో నిత్యమూ సంభవించే చిత్రమైన సన్నివేశములను రసవంతంగా చిత్రించడంచేతనే మంచికథలూ, చక్కని పాటలూ, పద్యాలూ ఆబాలగోపాలం యెంతో ఆప్యాయంగా వింటారు. ఒకజాతి తాలూకు చరిత్రను పరిశీలించినట్లయితే, లిపికి పూర్వమే సాహిత్యం వున్నట్టు మనకు తెలుస్తుంది. సవరభాషకు లిపిలేకపోయినా, సవరపాటలు హృద్యమైన భావసంపదతో తులతూగుతూ వుంటాయనిన్నీ, సవరలు ప్రతిదినం చేసే ప్రసంగములలో శబ్దాలంకారములు, అర్థాలంకారములు గల మాటలు వుంటాయనిన్నీ డాక్టరు సీతాపతిగారు సెలవిచ్చారు.

మానవజీవిత మనే గ్రంథాన్ని యెంత సూక్ష్మదృష్టితో పరిశీలిస్తే కవి అంత నేర్పుతో తనకావ్యాన్ని రచించగలుగుతాడు. జీవితపరిశీలనకు ప్రతిభావంతమైన ధీపటిమ, రసికత నెరిగినహృదయం అవసరం.

మహర్షులు ప్రసాదించిన ధర్మసూత్రములను, హిందూమత సంప్రదాయాలను విపులంగా ప్రచారం చెయ్యడానికి సంస్కృతంలో మొదట వ్యాసుడు భారతాన్ని వ్రాశాడు. శోకమోహములచేత స్తంభించిపోయిన అర్జునుడికి, కృష్ణుడు కర్మయోగాన్ని ఉపదేశించి కార్యరంగంలోకి దుముకమన్నప్పుడూ, అరణ్యవాససమయంలో ధర్మరాజు మునిపుంగవులతో ఆధ్యాత్మిక విషయమైన ప్రసంగములు చేసినప్పుడూకూడా యీ ధర్మజిజ్ఞాస చాలావరకు సాగింది. శాస్త్రపఙ్క్తులతో సూత్రప్రాయంగా యీ మహత్తర విషయాలను చెప్పినట్లయితే సామాన్యజనానికి అర్థంకాదు గనుక, తిక్కన హృద్యమైన దేశభాషలోనే రసవంతంగా భారతకథను నడిపించాడు. ఇంతేకాకుండా యీనాడు రాజకీయ విషయాలకు యెంత ప్రాధాన్యం వుందో ఆనాడు మత విషయాలకు అంత ప్రాధాన్యం వుండేది. శైవ, వైష్ణవ మతములకు తరుచుగా సంఘర్షణలు జరుగుతూ వుండేవి. కవిబ్రహ్మ తిక్కన భారతాన్ని హరిహరనాథునికి అంకితమిచ్చి శివకేశవులకు భేదంలేదని నిరూపించాడు—

పూర్వం ఉత్తరహిందూస్థానంలో ఉండే రెండు ప్రచండ రాజకీయ సంస్థల సంఘర్షణ భారతరచనకు కథావస్తువు. తిక్కన అమాత్యపదవిని అలంకరించి, రాయబారాన్ని కూడా నడిపించడంచేత, భారతంలో రాజకీయ విషయాలను వివరించవలసి వచ్చినప్పుడు వ్యాసరచనకు మెరుగు

పెట్టాడనే చెప్పాలి. పాత్రలను కన్నులకు కట్టినట్లు సృష్టించడంలోనూ, సన్నివేశములను యథార్థంగా కల్పించడంలోనూ, యెంత మహత్తర విషయమయినా సామాన్యజనానికికూడా సులువుగా అర్థమయ్యేటట్టు వివరించడంలోనూ తిక్కనది అందెవేసిన చెయ్యి. కావ్యదృష్టితో భారతాన్ని చదివితే యీ విషయాలు వ్యక్తమవుతాయి. గొప్పలోకానుభవంతో వ్రాసిన గ్రంథం కనుకనే తిక్కన రచన నాడూ నేడూ కూడా ఆంధ్ర సాహిత్యంలో అగ్రస్థానాన్ని అలంకరించింది.

మానవులందరకూ నిత్యమై, సత్యమైన హృదయ ధర్మములను మానసిక ప్రవృత్తులను నిరూపించడానికి సాహిత్యం వుపచరిస్తుంది. క్రోధము, రోషము, శోకము, సంతోషము, మొదలైన వాటివల్ల కలిగే అనుభవాలు సాధారణంగా మనుష్యులందరకూ ఒకే విధంగా వుంటాయి. కనుక భావవికాసానికి తోడ్పడుతూ హృదయాన్ని కదలించే సంఘటనలను రచించినట్లయితే ఆగ్రంథం అన్ని దేశముల వారి మన్ననలకూ, అన్ని కాలముల వారి ప్రశంసలకూ పాత్రమవుతుంది. ప్రవిమలమైన భక్తిభావంతోనూ, అమితమైన హృదయపరివేదనతోనూ, యెన్నో సంవత్సరాలక్రిందట త్యాగయ్యగారు రచించిన పాటలు, నేటివారికి కూడా ఆవిధమైన భక్తిపారవశ్యాన్నే కలిగిస్తున్నాయి. పెద్దనగారు సృష్టించిన వరూధిని తాలూకు వలపు పలుకులూ వయ్యారిచేష్టలూ ఆధునిక పాఠకుల హృదయాలను కూడా రంజింపజేస్తున్నాయి. ఈవిధంగా మన జీవితంలో వుండే వివిధప్రవృత్తులను ఆహ్లాదకరంగా విశదీకరించడమే సాహిత్యముయొక్క పరమావధి.

ఉత్కృష్టమైన ఆశయాలను సాధించవలసిన మహాపురుషులకు భౌతికవిషయాలతో క్లిష్టమైనసంఘర్షణలు సంభవిస్తాయి. ఎంత త్యాగమైనా చేసి ఆదర్శాన్ని నిర్వహించమని ఆదేశిస్తుంది అంతరాత్మ. ఆదర్శాన్ని అటు నెట్టి, ఐహికభోగాలవైపు దృష్టిని మళ్లిస్తుంది మనస్సు. ఒకఘనకార్యం చేసేటప్పుడు ప్రతివారికీ యీ సంఘర్షణ అనుభవైకవేద్యమే. ఇటువంటి సంఘర్షణనే మహాకవిభవభూతి ఉత్తరరామచరిత్రలో నిరూపించాడు.

జాతితాలూకు వైభవాన్నీ, ఆచారవ్యవహారాలనూ, కళాచాతుర్యాన్నీ మహాకావ్యాలు వెల్లడిచేస్తాయి. కాబట్టి ఆకావ్యములతాలూకు ప్రయోజనం అమితమైనది. మరికొన్ని గ్రంథాలు తాత్కాలికంగా గొప్పప్రాచుర్యాన్ని పొంది తరువాత కాలగర్భంలో లీనమైపోతాయి. అస్పృశ్యత మొదలైన దురాచారాలను నిర్మూలించడానికిగాని, లేదా కొన్ని మూఢనమ్మకాలను పోగొట్టడానికిగాని అనేకమంది ప్రహసనాలు, చిన్నకథలు, నాటకాలు మొదలైన వాటిని వ్రాస్తారు. ఆదురాచారం అంతరించిపోగానే ఆరచనతాలూకు ప్రయోజనం కూడా తీరిపోతుంది. కాని యిటువంటి రచనలలో కూడా కళాపోషణ వున్నట్లయితే, ఆరచన చాలాకాలంవరకు నిలుస్తుంది.

సమయోచితంగా ప్రయోగిస్తే కత్తిపోటుకంటె కలంపోటే యెక్కువ పనిచేస్తుంది. ౧౯౪౬-వ సంవత్సరంలో శ్రీ శ్రీ శ్రీ

పెదవిజయరామరాజుగారికీ బాదుల్లాఖానుకూ యుద్ధం జరిగినప్పుడు శ్రీవారు పరాజితులై వస్తూంటే, ఆస్థానకవీశ్వరుడైన అడిదం సూరకవి—

" మెత్తనై నట్టి యరటాకు మీదగాక
మంటమీదను జెల్లునే ముంటివాడి
బీదలై నట్టి సరదార్ల మీదగాక
కలదె క్రొవ్వాడి బాదుల్లఖానుమీద"

అని కొన్ని పద్యాలు చెప్పాడు. అప్పుడు మహారాజావారికి రోషం వచ్చి, శత్రువును చెండాడి జయలక్ష్మితో విజయంచేశారట.

పారిజాతాపహరణం అనే ప్రబంధంతో సంబంధించిన చిత్రకథను మనపెద్దలు చాలా కాలంనుంచి చెబుతున్నారు. ఆగాథతాలూకు సత్యాసత్యాలు యెలావున్నా, అది కవికలంయొక్క ప్రభావాన్ని తెలియజేస్తుంది కాబట్టి యిక్కడ వివరిస్తున్నాను.

ఒకప్పుడు కృష్ణదేవరాయలవారికీ, చిన్నాదేవిగారికీ కొన్ని భేదాభిప్రాయాలు కలిగాయట. ఈ అంతఃపురరహస్యాన్ని అరణపుకవి ఐనముక్కు తిమ్మన్న కనిపెట్టి, అతను శ్రీవారికి పారిజాతాపహరణం కృతి యిస్తున్నప్పుడు, "అల్లయగు నాథుల్ నేరముల్ సేయ పేరలుకం జెందినయట్టి కాంత లుచితవ్యాపారముల్ నేర్తురే" అనిఅర్థాంతరన్యాసను ప్రయోగించాడు. అన్యాపదేశంగా ప్రయోగించిన యీ అర్థాంతరన్యాసంతాలూకు గూఢార్థాన్ని గ్రహించి,ప్రభువువారు రాణీవారితో రాజీపడ్డారట. ఇప్పుడు మనకిది కట్టుకథలాగు కనిపించినా, ఒకప్పుడు నిజంగా యిలాంటి సంఘటన జరిగిందేమో అనిపిస్తుంది.

పూర్వం సున్నితమైన హాస్యధోరణిలో యింపైన యితివృత్తాలతో సంఘంలో వున్న దురాచారాలను ఖండించి, సంఘాభ్యుదయానికి తోడ్పడడం కోసమే,"అడిసన్" అనే సుప్రసిద్ధాంగ్లేయ రచయిత "స్పెక్టేటరు" అనే పత్రికను ప్రచురించాడు. అది కళావిలసితమైన రచన కావడంచేత, దానివల్ల సంఘాభ్యుదయము, సాహిత్యాభ్యుదయము కూడా కలిగింది. నేడు కూడా ఆంగ్లభాషాకోవిదుడైన "బెర్నార్డుషా" తన కలంతోనే సంఘాన్ని సరిదిద్దుతున్న విషయం మనందరకూ తెలిసినదే.

మహాపురుషుల జీవితవిశేషాలనూ, విధానాలనూ యేర్చి జీవితచరిత్రలు (Biographies) గా రచించే ఆచారం అన్నిదేశాల లోనూ వుంది. "జాన్సన్" అనే ఆయన ప్రతిభావంతుడైన ఆంగ్లభాషాపండితుడు. కూలంకషమైన అతని పాండిత్యాన్ని ఆంగ్లేయులే కాక, తక్కిన ఐరోపావాసులుకూడా మెచ్చుకున్నారు. కాని యితను వ్రాసిన గ్రంథాలు యీ పండితునియొక్క ప్రతిభను పూర్తిగా వ్యక్తీకరించలేకపోయినాయి. కాని "బోస్వెల్" అనే ఆయన "జాన్సన్" పండితుని జీవితచరిత్రను అద్భుతంగా రచించడంచేత, ఆయన సాహిత్యగోష్ఠి, అతనికి సహచరులైన కవీశ్వరుల ప్రసంగములు, ఆనాటి పత్రికలు మొదలైన యెన్నో విషయాలు మనకు తెలిశాయి. ఆజీవితచరిత్రగాని లేకపోయినట్లయితే, జాన్సన్ తాలూకు ప్రజ్ఞను యింతసులువుగా యిప్పటివారు గ్రహించలేకపోదురు.

మహాకవుల జీవితాలనే యితివృత్తంగా తీసుకుని వారి జీవితాలలో సంభవించిన కొన్ని చిత్రమైన సంఘట్టనలకు జిలుగులు

మెరుగులు పెట్టి కొందరు రసవంతమైన కావ్యాలను కూడా వ్రాస్తున్నారు. మానసీయులైన వీలరుసతిగారు "బైరను" మహాకవి జీవితాన్ని ఆధారంగా చేసుకుని "పరిచ్యుతుడు" (Cast away) అనే నవలను వ్రాశారు.

ప్రౌఢనాయకి తాలూకు రసవంతమైన ఛలోక్తులూ, పండితుల ప్రజ్ఞావిశేషాలు మొదలైనవి యెన్నో మన చాటుపద్యాలలో యిమిడివున్నాయి. మరికొంతమంది కవులు స్వీయపరివేదనను శతకములద్వారా వెల్లడించారు.

పండువెన్నెలలో పందెపుగుఱ్ఱాల లాగే ఒకదానికంటె ముందు ఒకటిగా పరిగెత్తుకుని వచ్చే సముద్రపు కెరటాలశోభ, ఆ కెరటాలమీదనుంచి వచ్చే చల్లనిగాలి, సామాన్యమానవుడు అనుభవించి, అక్కడనుంచి లేచిపోగానే ఆదృశ్యాన్ని, ఆఅనుభవాన్ని మరచిపోతాడు. కవిమాత్రం ఆదృశ్యానికే మరింత మెరుగుపెట్టి తన కావ్యంలో వర్ణిస్తాడు. ఆగ్రంథం చదివినప్పుడల్లా, చదువరిమనోనేత్రం ముందు ఆ దృశ్యం ప్రత్యక్షమవుతుంది.

బ్రహ్మ మనలను సృష్టించినట్లే, కవిబ్రహ్మ తనకావ్యప్రపంచకంలో చిత్రవిచిత్రమైన మనుష్యులను, నేత్రపర్వమైన దృశ్యములను సృష్టిస్తాడు. ఈ లోకంలోలాగే కావ్యలోకంలోకూడా అమీరు, ఫకీరు, కష్టజీవి, పుట్టుభోగి, అతిసాత్వికులు, అతిక్రూరులు వుంటారు. అన్ని దేశములలోనూ, అన్ని కాలములలోనూ, కవికలానికి అమితమైన ఆదరణ, గౌరవం వుంది. రాయలవంటి చక్రవర్తి పెద్దనగారి పల్లకీసి యెత్తడానికీ, శ్రీనాథునికి రాజసభలో కనకాభిషేకం జరగడానికీకూడా కారణం కవికలమే! నేటి విద్వాంసులు, కవిశేఖరులు, తమ కావ్యాలద్వారా తెలుగువెలుగును యేవిధంగా వ్యాపింపజేస్తున్నారో యిఁకొకసారి మనవి చేస్తాను.

సుధాశ్రావణి

'హిమానీ'

ఈ నా డీ శుభశుక్రవారముల వాసించెన్ దిశాస్తోమమం
దానందోత్సవముల్ సహస్రములు కల్యాణీ! కళాతేజితం
బై నర్తించు సుధాస్రవన్మధుర శోభా మంగళశ్రావణ
శ్రీ నవ్యోదయకాంతిపుంజముల నుర్వీమాత దీపించెడున్.

పూవులు క్రొత్తతావి వలపుల్ వెదచల్లిన నందనంబుగా
శ్రావణవీధి పొల్చె; మధురంబయి మంగళ తోరణార్ద్రశో
భావిలమై, విలాసరుచిరామృత సౌరభ పూతకాంతి సం
భావితమై మనోజ్ఞ మధుభావ రసాంకిత దివ్యదివ్య మై.

చిరుతమొడందలందు వికసించిన వెన్ని పసిండి కోరికల్
మురువులు గట్టె నీ భువనమోహన శ్రావణవేళలందు, సు
స్థిరతర నూతనప్రణయ జీవిత సౌరభసంపదల్ వసుం
ధర కొనరించె క్రొంబసిడి తావుల తీయని పెండ్లివేడుకల్.

వలపు లెఱుంగనట్టి నును బ్రాయపు కన్నెల లేతపూజలో
వెలువడి పొంగులెత్తిన పవిత్రశుభాశయ రాగవాహినీ
లలితవిలాస సంపద లిలాతల మెల్ల నలంకరించె, పెం
పలరిన క్రొత్తపండుగలు మంగళతోరణ పంక్తి కట్టగా.

కోమలమై, సుధారుచిరకోరక నూతనమంగళార్ద్రశో
భామలమై, విశాలవిమలాంధ్రి యొనర్చిన స్వర్ణపూజలో
కామితముల్ ఫలించె; కలకాలము పూర్వదరిద్ర దూర
భూమి సమస్తసంపదల పొల్పలరారెను స్వర్గసీమమై.

ముక్కుతిమ్మనార్యు ముద్దుపల్కు

శ్రీ కె. నాగభూషణరావు

ముద్దన నెట్టిది? ఒకయనుభావ్య మగు వస్తువును జూచి, యందలి రమణీయ తాది గుణముల నరసి, యానందరస ముప్పొంగి పొరలి పాఱునట్టి సమయమునఁ బుట్టుచేష్ట. ముద్దుపల్కు లన్నమాత్రమునఁ దమి తీరదు. ముద్దులుకులుకు పద్దెము లంటిమేని మాధుర్యాదిగుణాకరములగు నట్టిపద శబ్దముల వైచిత్రియా? ఈపాటి యర్థముతోడ, రసికజన హృదయరంగము లుప్పొంగవు "అమృతము" జగద్విత మగు ప్రభావముగలది. అయ్యది మధుర మగుటచే దాని నాస్వాదింపకున్నను ఆనందమునే వెలిబుచ్చి సార్వకాలికసుఖానుభవముఁ బొందనేరరుగదా? సర్వకళాభిరామయు, లావణ్యవతియు నగు యువతీరత్నమును జూచి యది సతియగుటఁ జేరనోపక, మనంబునఁ దలంచినపు డెల్ల ననుభవించినట్లు, మిథ్యాలింగనాదులఁ దృప్తి బొందకయు, నానందమునే వెలిబుచ్చు పామరవిటుడువోలె నీముద్దుపల్కులు విని, యానందించుట లోకమునకు సహజగుణమై యున్నది. ఆముద్దులమర్మము ననుభవించు రసజ్ఞులకుఁ గాక యవేద్య మన్యులకు.

ముద్దు చమత్కృతి విలసితంబులగు యువతీలాలసకపోలభాగ ము లం దు ను, కౌముదీచందనములవలెఁ జల్లనైన సంజల్పముల నానందింపఁజేయు సాధుబాలకుల శిరంబులయందును ఫలవంత మగుచుండు.

ఇందు ప్రాథమిక విషయలోలుఁడైన శ్రీకృష్ణుడు కవిరూపమున నవతరించి, తన యనుభవమును, వెలిబుచ్చినట్లు తోచెడిని అది నిజమే.

"అధరస్య మధురిమాణం
కుచకాఠిన్యం, దృశోశ్చ తైక్ష్ణ్యంచ,
కవితాయాం పరిపాకం
అనుభవరసికో విజానాతి"

అధరమాధుర్యము, కుచకాఠిన్యము, ఖండితనాయికా దర్శన తైక్ష్ణ్యము, కవితా పరిపాకము వీని ననుభవరసికుఁడే తెలిసికొనుచున్నాడని యర్థము.

యావతమగు శృంగారభావత్రయమునఁ బరిపాకమును బొంది పరిమళించు నీ కవితాలతాలవాలమునం దల్లుగా జేయఁబడిన, శ్రీలీలావతారుఁడగు కృష్ణపరమాత్మయే కవి యనుట కేమిసందియము?

"అపూర్వో భాతి భారత్యాః కావ్యామృతఫలేరసః,
చర్వణే సర్వసామాన్యే స్వాదువిత్కేవలంకవిః."

సరస్వతీదేవికి కావ్యమను నమృతఫలమునందు నూతనమగు రసము ప్రకాశించుచున్నది. సర్వసామాన్యమైయున్నను, నాయమృత ఫలరసము నందలి (స్వాదు) మాధుర్యమును కవిమాత్రమే తెలిసికొని యానందాబ్ధి నోలలాడును.

ఇది శృంగారప్రబంధము. తన్ను జొచ్చిన రసికుల దన్మయులఁగా నొనర్చు శృంగారరస

తరంగిణి. ఈ తిమ్మన వివిధ ప్రపంచవాసనా విశేషముల కాధారభూతమగు విద్యాకల్ప శాఖ నెక్కి కోరిక లీరికలెత్త నమృతఫల భరితంబగు నొక కవితాశాఖ నూగుచు, శాఖాంతఫలరసాస్వాదపాకవశ్యముచే జారి, క్రిందనున్న శృంగారరసతరంగిణిఁబడి "విష్ణుమాయాకల్పితంబగు సరోవరంబునఁ గ్రుంకు వెట్టి, రూపాంతరావేశంబునఁ బూర్వ స్మరణంబులేని నారదమునివోలె" నవస్థాంతరంబుగానక, పూర్వపుణ్యవిశేషంబున లీలా విగ్రహుండగు కృష్ణపరమాత్మ తన్నావహింపఁజేసి తన్మయుఁడై మఱల ననుభవించుచున్నవాడువోలె మనకన్నుల గట్టినట్లు మనమనంబుల నాకర్షించి, తనయనుభవ చిత్రము మనః ఫలకములఁ జిత్రించుచున్నాడు.

ఈతని కవితాప్రతిభయు, భావనాశక్తియు, పదలాలిత్యము నమేయములు. నారదుఁడు రుక్మిణీసదనమునఁ బారిజాత కుసుమ ప్రభావంబు వర్ణించుటలో

మ. "అలినీలాలక! నీవు నీపతి రహ
స్యక్రీడ వర్తించువే
ళ, లతాంతాయుధసంగరంబునను ను
ల్లాసంబు గల్పించు ను
జ్వలదీపాంకురమై రతిశ్రమ తనూ
సంజాత ధారాళ ఘ
ర్మలవంబు ల్దొలగింపగా సురటియై
రంజిల్లు నిచ్చాగతిన్."

ఇది, యది, యన నేల?

"జగత్త్రయమ్మునం బడయగరాని సర్వగుణభవ్యము సుమ్మిది" యని యుద్బోధించినాడు.

రుక్మిణీ మహావైభవమును కనులారఁ జూచి సత్యభామతోఁ జెలికత్తె యిట్లు సెప్పుచున్నది. "కృష్ణునివలన గ్రహించినదై యాపుష్పమును తలఁదాల్చిన యనుక్షణమున

కొలది యిడరాని యొకవింత చెలువుగలిగి
రాజబింబాస్య రుక్మిణి తేజరిల్లె
సానబట్టిన మకరాంకుశస్త్ర మనగ"

తన లీలావతారములం దట్టి వింత చెలువుఁ జూడడో?

ఆహా! ఎట్టి కలవరము? పారిజాత కుసుమధారణమువలన గలిగిన కళాతిశయము ను వేఱ వర్ణింప నశక్య మగుట వెల్లడి యగుచున్నది.

దుష్యంతుడు శకుంతలఁ జూచినప్పుడు "అఖండం పుణ్యానాం ఫల మివచ తద్రూప మనఘం" అని యుప్పొంగినాడు. రసజ్ఞులగు మహాకవుల కిది, సమయోచితమగు వర్ణనముకాక ప్రతియంగమును పచ్చిగా వర్ణించినమాత్రమున సహృదయుల యాందలల నుయ్యాల లూపగల్గునో?

పాత్రోచితములగు పదములఁ బ్రయోగించియు విషయమునకుఁ దగినరీతిని వర్ణన నెలకొల్పుటలో జరిగినకథను మనయెదుట జరుగుచున్నట్లు వ్రాయుట మహాకవి నైజగుణము. అయితే అది వినువారలకు మహేంద్రజాలవిద్యయే.

సత్యభామ కోపగృహంబున మనో వేదనచేఁ గుందుచు వేడినిట్టూర్పులు నిగిడించుచున్నచోటికి మెల్లన జని

"మధ్యందినభానుమండలకరావళి హేళి వాడియున్న తీవం దలపించు నమ్మగువం గనుం గొని,

ఈ లలితాంగిచంద మొక
యించుక చూచెదనంచు, ధూర్త గో
పాలుండు తాళవృంత మొక
భామిని సత్యపెఱుందనుండి మం
దాలసలీలమై విసర
నాదటం గైకొని వీచెం దద్వపుః
కీలితపంచసాయకశి
ఖిం, దరికొల్పుచు నున్న కైవడిన్."

ఎట్టి శృంగారోత్ప్రేక్ష? ఈసతీపతుల రహస్యాడంబరము కవియనుభవించి నేర్చిన విద్యగాబోలు? "ధూర్తకృష్ణుడు" అనుట సాభిప్రాయము. రతిరహస్యమునం దీ కృష్ణుని బ్రతుకంతయు వెల్లడియైనది. పాపము,

అంతట పారిజాతకుసు
మాగత నూతన దివ్యవాసన
ల్వింతలు సేయం దావి యది
విస్మయ మంచు ముసుంగు ద్రోచి య
క్కాంత గృహాంబునల్గడలు
నారసి సంభృతతాలవృంతునిన్
గాంతునిం జూచి బాష్పకణి
కాతరళీకృతలోచనాంతయై."

నాటకమున దీనిభావసూచన మెంతయో కష్టము.

పుష్పము నారదునివలన గ్రహించిన తోడన కలహాభోజనుని యుపదేశమునం గృష్ణుడు రుక్మిణీదేవి కబరి నలంకరింపంజేసె గదా? చేతం బట్టినమాత్రమున నాసౌరభ్య మెంతవఱకే నెడబాయక యంతఃపుర మంతయు నావరించుటయగాక దిట్టముగ ముసుగిడియున్న యభిమానవతికి వింతయై నాసాపుటమూలమున మోహానాంగముల జొక్కించినట్లు సహృదయహృదయరంగముల నా చంద్రార్క మెడబాయకుండుట కీ కవివాగమృతసదాగతియంత్రమే యాధారమై యున్నది.

సత్య తల వాంచి మఱల ముసుంగిడెనంట. ఆమెయావేదనకు మేర లేదు. ధూర్తకృష్ణుడు ప్రార్థించియుం బ్రయోజనంబు లేమి,

పాటలగంధిచిత్తమునం
బాటిలు కోపభరంబు దీర్ప నె
ప్పాటున జాటుగామి మృదు
పల్లవకోమల తత్పదద్వయీ
పాటలకాంతి మౌళిమణి
పంక్తికి వన్నియవెట్ట నాజగ
న్నాటకసూత్రధారి యదు
నందను డర్మిలి మ్రొక్కె మ్రొక్కినన్.

ఆమెకోపం బేరీతి దీర్పగలడు? గట్టు లేని నిలుకడ యెంతవట్టు విచారించును?

వేసినముసుంగుం దొలగద్రోయ సమకట్టెనేమో? కాని యది వలనుపడ దయ్యె ననుటకు నేమి సందియము? మొదట చెలి వీచుచున్న వీవన తాను గైకొని మెల్లగ వీచుట చమత్కారితన మని యామెకుం దెలియకపోలేదు.

ఈతని మెల్లని నడక యపూర్వ మైనది గాదు. సదా వాయించినగంటయే. ఇట్టి ధూర్తుని గుటగుటలు సాగవు. పాప మెంత పరకు పాదు గాలిపై నిలచును? జోములు దిగినవి. తనచెద మెవ్వరేనిం గనిపెట్టుదురో యని దిక్కులుం జూచి యామెపాదములపై వ్రాలెను. మణిమంజీరమంగళారావశోభితము, మృదుపల్లవకోమలము నగు తత్పద

ద్వయపాటలకాంతి తన యవతంసరత్నములకు వన్నియ బెట్టినది.

ఎట్టి మన్మథోద్దీపనసమయము. స్పర్శకొఱకలమటపడుచుండు నా యువకుఁడు అట్టి పాదస్పర్శకేని, నా యభివందనమునకేని నెగ్గు దలంచునా?

నవనవోన్మేషశాలి గదా ఈతని యౌవనము!

ఇందలి యుజ్జ్వలపదబంధముచే సత్యభామయొక్క పాదపాటలకాంతి కృష్ణుని శిరోమణులకు వన్నియ బెట్టినట్లు “కాంతి” యను గుణ మీయుత్పలమాలకు వన్నె పెట్టుచున్నది.

“అత్ర స్వగుణం విహాయ సన్నిహిత వస్తున స్సకాశా దుత్కృష్ట గుణస్వీకరణ తయా తద్గుణః” తద్గుణాలంకారము.

ఈ రక్తోత్పలమున కిట్టి యలంకారమే ముఖ్య మేమో!

“జలజాతాసనవాసవాది సురపూ
జాభాజనంబై తన,
ర్చు లతాంతాయుధుఁ గన్నతండ్రి శిరమ
చ్చోవామపా దంబునన్
దొలగంద్రోచె లతాంగి యట్లయగు, నా
థుల్నేరముల్సేయఁ బే
రలుకం జెందిన యట్టికాంత లుచిత
వ్యాపారముల్నేర్తురే”

ఇట్టిరహస్యక్రియలకు లతాంతాయుధుడు (కాముడు) మూలకందము, కారణమునై యున్నాడు. అట్టివానిఁ గన్నతండ్రి కావుననే యిట్టియవస్థలకు లోఁబడవలసి వచ్చినది. పాపము! ఇట్లు కాలితన్నువలన గగుర్పాటుగలిగి, “ఉద్దీపితమన్మథరాజ్య ప్రాప్తుడై”నాడు. సమయము కోపావిష్టము. (తల దన్నుట). ఇందు శృంగారరసోద్రేకమున్నదఁట! పాదతాడనమున నశోకమువలె నీతనిమనం బనమయ మయ్యును, జిగిర్చినది.

“అశోకః పాదతాడనాత్” అనిగదా?

ఆమెపాదతాడనమునఁ గృష్ణు డశోకరూపియై సంతసించె ననుట యుక్తము.

లీలావిగ్రహులగు నీపద్మినీ పాంచాల దంపతులకే కాక యన్యుల కీయవస్థ దురవస్థయే.

అనుక్షణమున మదన సామ్రాజ్య సింహాసనాధిష్ఠితుఁడు కాఁగోరి,యామెపదంబులొత్తుట యనెడు ప్రథమసోపానము నెక్కి,

“నను భవదీయదాసుని మ
నంబున నెయ్యపుఁగిన్క బూని తా
చినయది నాకు మన్ననయ
చెల్వగునీపదపల్లవంబు మ
త్తనుపులకాగ్రకంటకవి
తానము సోకిన నొచ్చునంచు నే
ననియెద నల్క మానవుగ
దాయిక నైన నరాళకుంతలా!”

అని వేడుచున్నాడు.

ఆహా! “అపారుష్యం సౌకుమార్యం” ఇందలి సౌకుమార్య మాధుర్యాదిగుణములును,భావప్రౌఢిమయు, నెంత సొబగుగూర్చుచున్నవో చూడుడు!

కినుకలో నెయ్యపుఁగినుక యొకటి - (ప్రియమగుకోపము) ఆమెకోపము అసూయ వలనఁగల్గిన వగతోఁగూడియున్నది.

“నాథుల్నేర ముల్సేయఁ బేరలుకం జెందినకాంతలు ఉచితవ్యాపారములు నేర్త

రని, యూహించినట్లు నటించి, ఆ తాడనము తనకు శ్రేయోదాయకమని చెప్పుచున్నాడు.

అపరాధి నగుటచే నన్నుఁ బలుకరింపదో? యనుసందియము మనంబునఁ బెనఁగొని, దైన్యదాహపీడితుడనై యున్న—సాహృదయము అశోకస్నేహశోభితంబగు నీపదపల్లవ స్పర్శనమున శాంతించి, సమ్మదాబ్ధి నోలలాడుచున్నది. 'మన్నన" (గౌరవము) ఇంతకన్నఁ గలదా? ఇంక నంతటి కోపమున కాస్పదమే లేదు. నాపులకితశరీరము సోకిన నెంత నొచ్చెనో! యని పాదము లొత్తుచున్నాడు.

మృదుమధుర పదజాలము, నేర్పరులకు నేర్పు నేర్పు భావగాంభీర్యము గల్గి యీ పద్యము వినిన ప్రతియువకుడు నవ్వు నాపికొనలేఁడు. పాదము నొచ్చుటనుగూర్చిన యీ యసత్యపువ్యసనము, ఆ నేతలు సూచి కారణాంతరమునఁ గఠినమైయున్నను, ఎంతవఱకు మౌనము వహించియుండును? ధూర్తకృష్ణుని నెనరుగలిగించు నటనలకు పక్కున నవ్వు పుట్టియుండును. రుక్మిణీదేవి "వింత చెలువునందలి యసహనముచే ఆనవ్వేదృగ్గా మాతియుండవచ్చును. ఆరోదనము నీ క్రిందివిధముగ వర్ణించియున్నాడు-

ఉ. "ఈసునఁ బుట్టి, డెందమున
హెచ్చినశోకదవానలంబుచే
గా [illegible] సేడ్చెఁ బ్రాణవిభు
కట్టెదుట న్లలితాంగి పంకజ
శ్రీసఖమైన మోముపయిఁ
జేలచెఱంగిడి, బాలపల్లవ
గ్రాసకషాయకంఠ కల
కంఠవధూకలకాకలీధ్వనిన్."

ఇది యొక యనిర్వాచ్యమైన రసికులఁ జొక్కజేయునట్టి మధురధ్వని శృంగారకలా విశారదుల కనుభవైకవేద్య బ్రహ్మానంద రసాధిదేవత.

"పాటలగంధి వేదన నె
పంబిడి, యేడ్చె, గలస్వనంబుతో
మీటిన విచ్చుగుబ్బ చను
మిట్టల నశ్రులుచిందు పొందగన్."

అను పెద్దన వాఙ్మాధుర్యమును గైకొని, తిమ్మకవి తన చాతుర్యమును విస్తరించియున్నాడు.

అద్దియె స్వరాజ్యదేవతోద్యానవాటి

శ్రీ బులుసు సీతారామశాస్త్రి

కార్మికులు కర్షకప్రజ కడుపునిండ
కూడు, గట్టగా శుభ్రమౌ గుడ్డ కలిగి
ఈతిబాధలు లేక సుఖింతు రెచట
నద్దియె స్వరాజ్యదేవతోద్యానవాటి.

భేద మావంతయును లేక వివిధమతము
లెచట స్వేచ్ఛాపథమున వర్ధిల్లుచుండి
అఖిల మానవతతికి నైక్యమ్ము గూర్చు
నద్దియె స్వరాజ్యదేవతోద్యానవనము.

అక్షరజ్ఞానశూన్యులై నట్టి జనులు
విద్య కలిగి నిరుద్యోగపీడితులును
ఎచట లేకుండ నుందురో పృథివిలోన
నదియె స్వాతంత్ర్యదేవతోద్యానవాటి.

పోతన వ్యక్తిత్వము

శ్రీ శిష్టా రామకృష్ణ శాస్త్రి

భరత దేశమునందలి సకల భాషలను రామాయణమున కగ్రస్థాన మొసఁగుచున్నవి. కాని యాంధ్రభాషమాత్రము దీని కపవాదము. ఆంధ్రమున భారతము వ్రాసి 'కవిబ్రహ్మ' యని వాసికెక్కినను నాంధ్రుల రసనాగ్రముల పోతనపద్యము లతికినంతగ తిక్కనపద్యము లతకలేదు.

ఇందులకు కారణము కవిగతము గాని గ్రంథగతము కాదు. భాగవతాంధ్రీకరణము పోతనచేతిలోఁ బడుట యాంధ్రుల నోములపంట. అందుచేఁ గవియు సిద్ధసంకల్పుఁ డయ్యెను. అట్లే పోతనయు భావించెను.

"ఒనరన్ నన్నయ తిక్కనాదికవు లీ
యుర్విం బురాణావళుల్
తెనుగుం జేయుచు మత్పురాకృత శుభా
ధిక్యంబు దా నెట్టిదో
తెనుఁగుం జేయరు మున్ను భాగవతమున్
దీనిం దెనింగించి నా
జననంబున్ సఫలంబుఁ జేసెదఁ బున
ర్జన్మంబు లేకుండఁగన్."

—స్క. ౧. ప. ౨౧.

అట్టి కవియొక్క వ్యక్తిత్వముం గూర్చి తెలిసికొనఁ బ్రయత్నించుట ధర్మము గాక పోదు.

దైవయోగమున తిక్కనకు కేతన దశకుమారచరిత్రము నంకిత మిచ్చుటచే తిక్కనవ్యక్తిత్వముంగూర్చి మనకు కృతిపతి వర్ణాదులను నాశ్వాసాద్యంతపద్యములంబట్టి కొంత తెలియుచున్నది. కాని పోతన విషయమై మన కంత యదృష్టము పట్టలేదు. తిక్కనకాలమున నొక్కఁడైనను వీరపూజ చేయువాఁ డుదయించెను. పోతనకాలమందుఁగూడ నట్టివాఁ డొకఁ డుదయమందిన నాంధ్రులభాగ్య మెట్లుండెడిది? అందుల కాంధ్రులు నోఁచుకొనరైరి.

పోతనఁగూర్చి గోత్రపిత్రాది నామములు దప్ప మన కేమియుఁ దెలియవు. పరంపరాగతకథలకు ప్రమాణములు లేమిన వెక్కువ విశ్వాసార్హములు కావు. పోతన విజ్ఞానస్వరూపాదులఁగూర్చి తెలిసికొనుటకు భాగవతము తప్ప యితరసాధనములు లేవు. కాన భాగవతములో ప్రతిబింబించిన పోతననుమాత్రము మనము చూడఁగలము. నన్నయాదులు తమ్ముఁగూర్చి తమ గ్రంథములందు వ్రాసుకొనినంతమాత్రమైనను పోతన భాగవతమున వ్రాసుకొనలేదు. దీనికితోడు పోతన సహజపాండిత్యము గలవాఁడని చెప్పుకొనుటచే నతనిఁగూర్చి తెలిసికొనుట దుర్లభము. అట్లయ్యు నాంధ్రభాగవతము పేరు చెప్పఁగనే ప్రతియాంధ్రుని మనోనేత్రమునకు నొక పవిత్రమానవుఁడు గోచరించును. వెంటనే యాతఁడు వందనార్హుఁ

డగును. పిమ్మట నాతని భాగవతముఁ జదివినచో నాతనియాత్మ మనకు గోచరింపకపోదు.

ఈ కవి కావ్యప్రయోజనము లైన కీర్త్యాదుల నాశింపక తన గ్రంథమును శ్రీరామార్పణముగ రచించిన నిష్కాముపరుఁడు. ఇతఁడు తన భక్తిపూరిత హృదయమును వ్యక్తీకరించుటకే కవిత్వము నుపయోగించెను కాని శ్రీనాథునివలె తన పాండిత్యమును గాని తిక్కనవలె కవితాశిల్పమునుగాని ప్రదర్శించుటకు కావ్యరచన చేసియుండ లేదు. ఇందులకు భాగవతమందలి వస్తు వవలంబన మైనది. ఇతఁడు భక్తుల హృదయములను విప్పి వ్యాఖ్యానము చేయుటలో కవిత్వము రసవంతముగాఁ జేయఁగలఁడు కాని, చిన్న పరిస్థితులందలి వివిధపాత్రల యుద్రేకపూరిత భావములను కళాదృష్టితో విశ్వజనీన మగునట్లుగ ననుకరించి పాఠకుల హృదయములకు తాకునట్లు రచించి ప్రపంచమునకు దర్పణమువలె కావ్యమును నిర్మింపఁజాలఁడు. అందుచే భాగవతమును కవితాశిల్పమునకై వెదకిన ప్రయోజనము లేదు. శిల్పకళత్వమున తిక్కన పోతనను మించును. భావకవిత్వమున పోతన తిక్కనను మించును.

కవులను రసోపాసకు లనియు కళోపాసకు లనియు విభజించినచో తిక్కన కాళిదాసునివలె కళోపాసకుఁ డనియు, పోతన భవభూతివలె రసోపాసకుఁ డనియు జెప్పవచ్చును. శిల్పకళాదృష్టితో రచించినకవిత్వము రసవంతముగా నుండదాయని ప్రశ్నింతురు కాఁబోలు. అందలిభేద మిది. కళోపాసకుని దృష్టిలో వర్ణ్యస్థితికంటె వీసము హెచ్చినను తగ్గినను రసాభాస మగును. ఇది కత్తిమీఁద సాముచేయుటవంటిది. రసోపాసకుఁడు కళోపాసకునివలె నిశితాసిధారావ్రతము నేయఁడు. రసోపాసకుఁడు తన మనోగత భావముల వర్ణించుచు తన్ను మఱచి, పాఠకులను మఱపించును. కళోపాసకుఁ డెప్పుడును ప్రమత్తుఁడు గాఁడు; తనమనోగత భావముల వర్ణించుచు పరుల మఱపించును కాని తన్ను దాను మఱచి, మితి మీఱి, ముందుసంగతియు మఱచి యౌచిత్యమునకు భంగ మొనర్పఁడు. రసోపాసకుఁడు తన వర్ణ్యరసమున మగ్నుఁడై తన్మయమును జెంది, తన మనోగతభావముల నౌచిత్యము నంగాంగిభావములను గమనింపక యుద్రేకమూగిపోవువరకును చెప్పుచు నేయుండును. పాఠకులు రసోపాసకుని కవిత్వముచే నాకృష్టమానులై కవివలెనే వర్ణ్యవస్తువునందు తన్మయము చెంది యందలియనౌచిత్యాదిదోషముల గమనింపలేరు. ఇది కళోపాసకులకును రసోపాసకులకు నున్న భేదము.

పోతన తిక్కన లిరువురును మహానుభావులే. ఇరువురును వ్యాసకృతపురాణముల భాషాంతరీకరించినవారే. ఇరువురును కృష్ణసంబంధగ్రంథముల రచించినవారే. అట్లయ్యు వీరిగ్రంథరచనావిధానమున బహుభేద ముండుటకు కారణము వీరివ్యక్తుల యందున్న భేదమే. తిక్కన హరిహరారాధనపరుఁడైన ధర్మాద్వైతి. పోతన విష్ణుభక్తిపూర్వకమైన స్మార్తుఁడు. తిక్కనది జ్ఞానమార్గము; పోతనది భక్తిమార్గము. తిక్కన మహాభోగి; పోతన విరాగి. తిక్కన పూర్ణప్రపంచానుభవము గల్గిన లౌకికుఁడు. పోతన ప్రపంచవ్యవహారములఁ దలపెట్టని నిస్సంగుఁడు. కవితామార్గమున తిక్కన కళో

పాసకుఁడు; పోతన రసోపాసకుఁడు. ఇందుచే వీరికవిత్వములందు భేదము లుండుట సహజమే.

భాగవతమునందలి ప్రతిపద్యమునందును పోతనయొక్క వ్యక్తిత్వము ప్రతిబింబించుచున్నదని చెప్పవచ్చును. పద్యమును వినిన వెంటనే పోతనపద్యమును గుర్తింపవచ్చును. అట్టి విశిష్టలక్షణ మతని ప్రతిపద్యమునందును ప్రవహించుచుండును. ఆ విశిష్టలక్షణములు పోతనజీవితమందు గలవు. అవియే యతని కవిత్వమునందును జొరఁబడినవి.

పోతన యమేయమైన విష్ణుభక్తి గలవాఁడు. నిద్రించుచున్నను, నడుచుచున్నను, కూర్చున్నను, సర్వకాల సర్వావస్థలయందును ఆయన మనోనేత్రమునకు

“ఇందీవరశ్యాముఁడు వందితసుత్రాముఁడు”ఇత్యాది-
—స్క. ౧౦. ప. ౯౭౯.

తన సంపూర్ణ దివ్యమంగళవిగ్రహముతో సాక్షాత్కరించుచునే యుండును. అదియే తనకు జీవన్ముక్తి యని పోతన యూహించినాఁడు. అట్టి మూర్తి తన కళ్లయెదుట నిత్యము నుండుటచే పోతన యెప్పుడు విష్ణునామోచ్చారణము చేయవలసి వచ్చినను నొక్కపదమును మాత్ర ముపయోగించి విరమించువాఁడు కాఁడు. అట్లుపయోగించుట యపచార మని యెంచునేమో! విష్ణువు యొక్క గుణములనో, వివిధ నామములనో, నోరార వర్ణించిననే గాని యతనికి తృప్తి యుండదు. తన మనోనేత్రమునకు సాక్షాత్కరించిన విష్ణురూపమునే పోతన కుచేలుఁడు, ప్రహ్లాదుఁడు, మైత్రేయుఁడు, నుద్ధవుఁడు మొదలైనవారి కందరకు నొసఁగెను. సాక్షాత్కృత విష్ణువును బ్రహ్మాదులు చేసిన స్తుత్యాదులు, పోతన తన భవబంధ మోక్షమునకై చేసుకొనిన విన్నపములే. పోతన విష్ణువు నెపుడు స్తుతించినను ‘భవలతాలవిత్ర, భవసాగరతరణ, భవబంధ మోక్ష’ యనియే చేయువాఁడు. ప్రారంభమున తాను కోరినదియే యది.

“శ్రీ కైవల్యపదంబుఁ జేరుటకునై చింతించెదన్ లోకరక్షైకారంభకు” —స్క. ౧. ప. ౧.

ఇట్టి భక్తిపూరితకథాసందర్భములందు మాత్రమే పోతన కావ్యగత పాత్రలతో సహృదయత్వము నెఱపి కవిత్వమును చరితార్థము చేసినాఁడు. తా నెప్పుడును ప్రహ్లాదాదులవలె శ్రీవిష్ణుభక్తుఁడై భవసాగరమును దాటుటకై ప్రయత్నించెను గాని, రాయబారముల నెఱపిన కృష్ణుని, సమర మొనర్చిన యర్జునుని ననుకరించి నీతికోవిదుఁడును యోధుఁడునుఁ గాఁ బ్రయత్నించలేదు. కథానుగుణముగ యుద్ధములను, నాయికానాయకుల యనురాగమును వర్ణింపవలసి వచ్చినపుడు సిద్ధకళాహస్తుఁడుగాక, యొకభక్తుఁ డాయా పాత్రల వెనుకనుండి ఆయాపనులఁ జేయించు నట్లుండును గాని, యాయాపాత్రలు తమ ప్రత్యేకవ్యక్తిత్వముతోఁ జేసినట్లుండవు. భాగవతమునందలి కుచేలుఁడు, ప్రహ్లాదుఁడు, నుద్ధవుఁడు మొదలైనవారు సోదరులే కాని భిన్నభిన్నవ్యక్తులు కారు. వీరు భక్తసోదరులు. భక్తవిజయములోనిభక్తులవలె నుందురు. వారి పాత్రపోషణ మొక్కవిధముగానే యుండును. అందఱును పోతనగారివలె శ్రీవిష్ణుపాదార్పితహృదయులు, ముక్తసంగులు; కానిభారతము నందలిపాత్రలారీతిగాక వివిధము లైనప్రత్యేక లక్షణములు గల వ్యక్తులు. ద్రౌపది, సావిత్రి,

దమయంతి మొదలైనవారు పతివ్రతలశాఖకు చేరినవారైనను నందఱు నేకవిధముగ నుండక, ప్రత్యేకవ్యక్తిత్వముగల భిన్నభిన్న పాత్రలుగా గోచరింతురు. పాత్రపోషణమున నాంధ్రభారత భాగవత కవులకుఁ గల భేద మిది.

ఇతఁడు ప్రపంచము నంతనూ భక్తిమయమైకదృష్టితో, జూచినాఁడు. భక్తికంటె నితరములైన సర్వము తుచ్ఛ మని యితని మతము. ఇట్టి భక్తియోగమునకు వైరాగ్యము తోడైనది పోతనకు. సర్వకార్యములు నిష్కామదృష్టితో, కృష్ణార్పణబుద్ధితోఁ జేయవలయు ననియు, పూర్వకర్మప్రాప్త్యనుగుణముగ నెట్లు జరుగవలయునో సర్వము నట్లు జరుగు ననియు, నందుచే ప్రాపంచిక వ్యవహారములకై యెక్కువ పెనగులాడి ప్రయోజనము లేదనియు, మఱియు నవి యశాశ్వతము లనియు, శాశ్వతమైన కైవల్యమును భక్తిమార్గముచేతనే సాధింపవలయుననియు విశ్వసించువాఁడు. ముక్తసంగుఁడు. ఇట్టివానికి భక్తిలోకము వినా యితర ప్రపంచముతో ప్రసక్తి యేమి? అందుచే నితరప్రపంచ మెట్లుండెనో యెఱుఁగ ప్రయత్నించ లేదు. ఈయన యాధ్యాత్మికసౌఖ్యమునకు ప్రయత్నించినాఁడు గాని యైహికసౌఖ్యము నాశించ లేదు. శ్రీనాథుఁడు దీనారటంకాలతో స్నానము చేసి, హేమపాత్రములలో భోజనమును చేయుచుండ, పోతన

"కమలాక్షు నర్చించు కరములు కరములు"

అని శరీరావయవములు పరమేశ్వరు భక్తితో పూజించుట కుపయోగించునుగాని యన్యములకుఁ గావని, జీవుఁడు భగవద్భక్తి చేయుటకొఱకే జీవించవలెనని యెంచెను. విష్ణుభక్తి కుదిరినజీవుఁడు జగమున నితరము దేనిని కోరఁ డని యాతనిభావము.

"మందార మకరంద మాధుర్యమున దేలు
మధుపంబు వోవునే మదనములకు"
—స్క. ౭. ప. ౧౫౦.

అని వివిధసాదృశ్యములతో సందర్భము వచ్చినపు డెల్లను జ్ఞాపకముచేసి బోధించువాఁడు. ఇదియే యాతని జీవయాత్రయందలి ధర్మసూత్రము. ఈ సూత్రమునే యితఁడుపాసించి జీవన్ముక్తుఁ డాయెను. ఇతఁడు ముక్తసంగుఁడై సర్వవిషయములందు విరక్తుఁ డగుటకు రహస్యకారణ మిదియే. ఈతత్త్వమును ప్రహ్లాదచరిత్రమునందే కాక పోతన భాగవతమునందంతటను బోధించుచు నాయుపమానమునే గ్రహించును. ప్రహ్లాదునినోటి నుండి వచ్చిన యీ మాటలే బ్రహ్మనోటి నుండి కూడ వచ్చెను.

"వరమందార మరంద పానకుతుక
స్వాంతద్విరేఫంబు స,
త్వరమైపోవునె చేఁదువేములకుఁ ద
ద్గంధానుమోదాత్మమై."
—స్క. ౩. ప. ౨౨౩.

ఆపదములనే మైత్రేయుఁడు కూడ నుచ్చరించును.

"......సుపర్వమహీజమరంద పానలా
భానుభవమ్ము నొందుమధు
పవ్రభు వేఁగు నె వేఁప దెట్లునన్."
—స్క. ౩. ప. ౮౮౨.

విష్ణుకథలందు భక్తి నుంచక యితరకథలం దాసక్తిఁ జూపువాఁడు.

"...........ఊరపంది యా
త్మను మనురాజ్యభక్ష్యములు
మాని పురీషము కేఁగు చాడ్పునన్."
—స్క. ౩. ప. ౧౦౨౨.

ప్రవర్తించు నని పోతనబోధ. తన మనము లోని భావమును తీక్ష్ణముగ బోధించుటకై మొగమోటపడువాఁడు కాడు పోతన. తా ననుభవపూర్వకముగ నెఱింగిన తత్త్వమును సర్వజనుల హృదయములకు తాకునట్లు తీవ్రముగ చెప్పెను. ఇట్టి యాత్మశుద్ధి, త్రికరణశుద్ధి యుండుటచేతనే సర్వజనులచే నేకగ్రీవముగా గౌరవింపఁబడినాఁడు. ఇట్టి యుదార భావము లన్నియు ప్రహ్లాదాది పాత్రల భావము లగుటకు పూర్వమే పోతనగారి హృదయమం దుత్పత్తి నొందినవి. ఇట్టి దృఢభక్తి గలవాఁ డగుటచేతనే ప్రజలు పరంపరగాఁ జెప్పుకొను దారిద్ర్యము పోతనగారి మనస్సును కలఁత పెట్టఁజాలకపోయినది. అందుచే నిర్యాణ సమయమునందుకూడ పరమశాంత హృదయముతో పరమానందము నొందుచు నస్తమించెను.

మహాజ్ఞాని, పండితుఁడు నయ్యు సమకాలికుఁడై బాంధవుఁ డని ప్రతీతి గల శ్రీనాథుఁడు, తన జీవితమంతయు నైహికసుఖములనే యాశించి, మహాభోగముల ననుభవించి, కవిసార్వభౌముఁ డని యశము గాంచినను, మరణసమయమున పరమదరిద్రుఁడై యాతన పడక తప్పినది కాదు. ఈసంగతి తొలినాఁడే గ్రహించిన తత్త్వవేది పోతనగారు. అందుచేతనే తన భాగవతమును సర్వజ్ఞసింగభూపాలున కంకితమీయక, సర్వవస్తువులతోఁబాటు తన హృదయమును గూడ విష్ణువునకు సమర్పణ చేసి, శరీరముతో మాత్రము తాను మిగిలినాఁడు. ఇట్టివాఁడు సంకల్పసిద్ధుఁడుగాక మఱి యెవ్వఁ డగును?

బుద్ధుని 'యహింస' యెంత పరమోత్కృష్ట మైనదో, పోతనభక్తి యంత యుత్కృష్టమైనది. బుద్ధుఁడు మతమును బౌద్ధపీఠముల ద్వారా ప్రచారము సేయఁగ పోతన తనభాగవతముమూలమున చేసెను. భక్తిమార్గ మాంధ్రుల కుద్బోధించిన భక్తులు ముగ్గురు; పోతన, త్యాగయ్య, గోపన్న. అందు పోతన కవిత్వముననుు, త్యాగయ్య గానముమూలముననుు, గోపన్న భజనకీర్తనలమూలముననుు ప్రకటించిరి. వీరు ముగ్గురు కవులే; కాని స్వానుభవపూర్వకమైన భావములనే వ్యక్తీకరించువారు. పోతనగారిభక్తి యకల్మషమైనది. ఈయనకు భక్తిలేని కర్మమార్గముగాని జ్ఞానమార్గముగాని నిష్ప్రయోజనము. యజ్ఞయాగాదికర్మలకంటె భక్తియే శ్రేష్ఠమైనదని నమ్మువాఁడు.

"క్రతుదానోగ్రతపస్సమాధి జపస
 త్కర్మాగ్నిహోత్రాఖిల
వ్రతచర్యాదుల నాదరింపవు............
 నీ పదాబ్జయుగళీ
 సేవాభిపూజానమ
స్కృతిసంగస్ఫురణంబు గానిభంగి...."
—స్క. 3 ప. 30౧

ఈతత్త్వమునే

"భక్తిలేని పూజ ఫలము లేదు"

అని త్యాగయ్యాదులు ఘోషించిరి. భక్తిలేని యజ్ఞయాగాది కర్మలు ధనవ్యయమే గాని ముక్తిప్రదము గాదని యీయన బోధించెను.

" అనుపటిలభక్తి కేశవ స
 మర్చనబుద్ధిఁ గ్రతుక్రియల్ వొన
ర్చక విపరీతులై యసుక
 రాసులు దంచి ఫలంబు నంద గా
నక చెడురీతి, నూరక ధ
 నవ్యయ మాటయకాని మోక్షదా

యక మగుచున్న తత్ఫలము
సందరు విష్ణుపరాఙ్ముఖక్రియల్."

—స్క. ౩. ప. ౪౦౧.

భగవత్సాక్షాత్కారము పొందుటకు భక్తిమార్గ ముపయోగించినట్లు కర్మమార్గ ముపయోగపడ దని పోతన యుపదేశించెను.

"క్రతు కర్మములు పెక్కు గావించియును నిన్నుఁ
బొడగానగా లేక"

—స్క. ౩. ప. ౩౦౭.

ఇది యెఱింగినవాఁడు కాఁబట్టియే కాఁబోలు పోతన, నన్నయ తిక్కనలవలె యజ్ఞము చేసినవాఁనివలెఁ గానఁబడఁడు. భక్తిలేని జ్ఞానమార్గము గూడ ముక్తి దాయకము కాదట.

"................ధర్మతత్త్వ ధీ
పరిణతి సాధనం బగు స్వ
భావముఁదాల్చి నయట్టి మర్త్యులు
................తదంఘ్రి పం
కరుహము లర్థిమై కొలువఁ
గానమిపొందరు తత్పదంబులన్."

—స్క. ౩. ప. ౫౧౦.

అని నిరూపించి భక్తిమార్గము మార్గత్రయములలో శ్రేష్ఠమైన దని పోతనసిద్ధాంతము చేసినాఁడు.

ఇట్టి భక్తుఁడైన పోతనకవి సత్త్వగుణ ప్రధానుఁ డని భావించవలసివచ్చుచున్నది. అందుచేతనే సాత్త్వికుఁడైన కవి యయ్యెను. కళోపాసకుఁడైన కవికి సత్త్వరజస్తమోగుణములు సమముగా నుండును. కవి ఋషివలె సత్త్వగుణమువలన పరేంగితజ్ఞానము గలిగి తన దివ్యదృష్టిచే ప్రపంచమునందలి సూక్ష్మ విషయములఁగూడ గ్రహించును. అందుచేతనే "నానృషిః కవిః" "నానృషిః కురుతే కావ్య"మనిరి. ఇట్టిరసవత్సన్నివేశములు కవి కుద్వేగము గలుగఁజేయును. ఇది దానిలో నున్న తమోగుణముచే నుద్భవించును. ఇట్టి యుద్వేగము పాలు పొంగినట్లు కవిహృదయమున పొంగిననేకాని కవిత్వము పరమపదము నొందఁజాలదు. ఆయుద్రిక్తభావము పొంగి కంఠగతమై పొర్లఁజూచును. వెంటనే యాభావమును కవి వ్యక్తీకరింపఁ జూచినచో నది సంస్కారశూన్యమై యుండును. అప్పుడు సత్కవియైనవాఁడు దన సత్త్వగుణముచేఁ దన యుద్రేకమును కొంచె మణచుకొని భావముల క్రమముగా వ్యక్తీకరించును. ఆభావముల వ్యక్తీకరించుటకై కవికి సృష్టించు శక్తి యుండవలెను. స్రష్టృశక్తిచేతనే యతఁడు కవిబ్రహ్మ యనఁబడుచున్నాఁడు. కవి కిట్టి సృష్టిసమయమున బ్రహ్మకువలె రజోగుణ ముండును. సృష్టి రజోగుణముచేతనే సాధ్యము. అట్టి రజోగుణముచేతనే కవిబ్రహ్మ యగుచున్నాఁడు. ఇది కళోపాసకుల యుపాసనాపద్ధతి. ఇట్టివారు కాళిదాసు, తిక్కన, షేక్స్పియరు. పోతన సత్త్వగుణముతో సాత్త్వికులైన భక్తుల హృదయముల నెఱిఁగి, సాత్త్వికోద్రేకములనే పొంది తన భావముల వ్యక్తీకరించినాఁడు. ఆసృష్టియు తనది గా దనుచున్నాఁడు. భక్తిచే శ్రీరాముని వశ్యముచేసుకొని యాయనచే పలికించు కొనినాఁడు.

"పలికించెడువిభుఁడు రామభద్రుండట"

—స్క. ౧. ప. ౧౫.

ఇట్టిభక్తుఁడైన కవికి భగవత్సరీక్ష వచ్చినది. పోతన తన భాగవతమును నరాంకితము చేయ నని సంకల్పించుకొనినాఁడు,

సర్వజ్ఞ సింగన శ్రీనాథునిద్వారా భాగవతమును తన కంకిత మియ్యమని పోతన నడిగినాఁడు. రాజు మహదైశ్వర్యము లిచ్చుటకు సిద్ధముగా నుండెను. అంకిత మీయకపోయిన కవిని దండింతు నని బెదిరింపులు సాగుచున్నవి. తన గృహస్థితియు, నైశ్వర్యవంతుఁడైన తోటికవియొక్క యైహిక సుఖజీవనమును శ్రీనాథునందుఁ జూచుచుండెను. ఇది బాహ్యస్థితి. పోతరాజు నంతరంగమున విష్ణుమూర్తి యంకిత మాశించి వచ్చినాఁడు. కైవల్యమిచ్చెదనని యభయహస్త మెత్తినాఁడు. ఇవి పోతనపరిస్థితులు. ఆయనయు జాగ్రత్తగా రెండు పరిస్థితులను త్రాసులోఁ బెట్టి తూచినట్లు చూచినాఁడు. ఒకవైపు లక్ష్మీదేవి, రెండవవైపు విష్ణువు దన హృదయమును పరీక్షించుచుండిరి. లక్ష్మియున్నతులాభాగముయొక్క చంచలత్వమును, విష్ణువువైపు త్రాసు నిశ్చలముగా నుండుటయు పోతన గ్రహించెను. ఇంతలో వీరి కోడలు నాగతి యేమని చెప్పితివని "కాటుకకంటి నీరు చనుకట్టుపయిం బడ" సాక్షాత్కరించినది. పోతనహృదయము కరఁగిపోయినది. విష్ణువువైపున బల మధికమైనది. అత్తగారొక్కరితెయే యైపోయెను. ఇదియే యత్తాకోడండ్ర కసూయాజనక మయ్యెను. పోతన సంపూర్ణజయముఁ గాంచెను. సర్వజ్ఞసింగని బెదిరింపు లింక సాగి రావు. అభయప్రదాత యభయ మిచ్చుచుండఁగా పోతనమీఁద నీగైనను వ్రాలదు.

ఇట్టిభక్తుఁడైన పోతనవిగ్రహ మెట్టిదని యూహ. విష్ణుభక్తుఁడు కృశీభూత శరీరుఁ డెప్పుడును కాఁడని పోతనయుద్దేశము.

> "కృశీభూతకాయుఁ డయ్యు
> నలినోదరాలాపనవసుధాపూరంబు
> శ్రోత్రాంజలులఁ ద్రావి చొక్కియున్న
> కతన కృశీభూతకాయుఁడు గాక"
>
> —స్క. ౩. ప. ౭౭౨.

యుండును. ఇందుచే పోతన భక్తియోగమున సంపూర్ణదేహదారుఢ్యము గలిగి, బలిష్ఠావయవములతో పరిస్ఫుటమైన యింద్రియసంపద గల్గి యుండువాఁ డని నమ్మవచ్చును. తన మనోనేత్రమునకు నిత్యము విష్ణుమూర్తి సాక్షాత్కరించి 'మందస్మితవదనారవిందుఁడై' పోతనను నవ్వించుచుండ 'ప్రతిస్మితవదనుఁడై' 'నిత్యసంతోషి'యునై యుండఁడా ? సాత్వికస్వభావుఁ డగుటచే పోతన ప్రసన్నముఖుఁ డనియు, నహంకారశూన్యుఁ డగుటచే వినమితగాత్రుఁ డనియు, తత్వజ్ఞాని యగుటచే మహాతేజశ్శాలియు నై యుండవచ్చునని మన మూహింపవచ్చును. పోతన విష్ణుభక్తుఁడగుటచే నాతఁడు శరీరము నిండ నామధారణమును, కంఠమున తులసి హారములను ధరించుమూర్తి యని భావింప నక్కరలేదు. పోతన విష్ణుభ పూర్వకమైన స్మార్తుఁడుగాని, రామానుజమతమునకుఁ జెందిన వైష్ణవుఁడు గాఁడు. సదాచారసంపన్నుఁ డైన నియోగి బ్రాహ్మణుఁడు. అద్వైతి. అందుచేతనే పోతన కృత్యాదిని త్రిమూర్తుల స్మరించినాఁడు.

పోతనవంటి మహానుభావుని స్వరూపస్వభావములఁ గూర్చి యూహింపఁదలఁచుట సాహసకార్యమే. అతని సంపూర్ణస్వరూప మతనివంటి భక్తులకుఁ గాని గోచరము కాదు. నా శక్తికొలఁది నేను ప్రయత్నించితిని. అభిప్రాయభేదము లుండవచ్చును. పోతనకవిత్వమును గూర్చి మఱియొకమారు ప్రసంగింతును.

స్వాగతము

శ్రీ కొండూరు వీరరాఘవాచార్యులు

౧

ఈ నితాంతదుఃఖాశ్రువు లిట్లు లుబికి,
పొరలి ధారలుధారలై పుడమిఁ గట్టు
కాలువలతోడ నీపదక్షాళనమ్ము
సేయ నిది కరఁగదేమొ అమ్మా యెడంద!

౨

కటికిచీఁకటితోడఁ జీకాకులైన
శర్వరీవేళలం గొన్న స్వాపనమ్ము,
అక్షియుగళమ్మునకు మాంద్యమలమె; వాని
మార్జితము సేయుమీ సుధామయకరముల.

౩

ఏ బహుశ్రమములను నిర్మించుకొన్న
మేల్మి రతనాల ముద్దుల మేడ, యెన్ని
యుగము లట్టులె చెదఱక యుండి యొక్క
ప్రళయవాత్యార్భటికిఁ గూలిపడియె నదియు.

౪

ఏ నరేంద్రుల మీసాలలోని నవ్వు
లయ్యెనో నాకుఁ గ్రీడాగృహాంగణములు,
ఆ నృపుల మోములందె నే నన్న నేఁడు
విఱుపు లుదయించుచుండె నీ వింతయేమి?

౫

ఈ తఁడేమైనఁ దనరూపు నే మరిలెనో,
గళితమయ్యెనో శ్రీ విశ్వకర్మకరుణ,
చెడ్డకార్యాల ఫలముచేఁ జిక్కెనేమొ,
కాక యీ వైపరీత్యంబు గలుగు టెట్లు?

౬

ఈ యసృఙ్నాళికానదు లింక నందు
పీతరక్తప్రవాహము ల్పారవేమొ;
ఈ హృదబ్జంబు ముకుళించి యెండిపోయి,
పనికిరాదేమొ లోకబంధురమునకును.

౭

అస్మదాచార్య శిల్పశతాంగమందుఁ
దాండవించు హిందూకళాధ్వజము లపుడు;
తెగి పుడమిఁ గూలి యావి ప్రాఁత తెరునుండి
ఇపుడు హృన్మర్మములను భేదించుచుండె.

౮

ఏ యఖండాభ్రపథముల నెగిరి, ప్రకృతి
లలిత మోహన గీతికాలాపవేళ,
నేను భువనమ్ము నంత వర్ణించినానో
అంకిత మ్మదె నేఁటి యీ యవని కెల్ల.

౯

ప్రణవతత్త్వము నేఁ బాడుకొనినపాట
ఈ విషాదాఖిలచరిత్ర లేమి నేఁడు?
శ్రీ విరాడ్విశ్వకర్మ యర్చించునతఁడు;
ఈ యసురమూర్తి దుష్పూజ లేమియిపుడు?

౧౦

సృష్టి సత్కళ నాముద్దు చేతిగీటు,
ఈ కళాహీనమాకర మేమి నేఁడు?
సకలరాణ్మండలీనాభాస్థలము లునికి,
ఈ యనాదృతభూభాగ మేమి యిపుడు?

*　　*　　*

౧౧

కూడు లేక కృశించినగుండె లోనఁ
జింతలం జిక్కి చివికిన చిత్తమందు
బోధ దీపికాహీనమా బుద్ధిలోన
ఏ క్రియాఘటనాశక్తి యిమిడియుండు?
ఏ మహోన్నతభావసమృద్ధి యుండు?
ఏ తెలివి వెల్గురేక దీపించియుండు?

౧౨

ఆ పురాస్వచ్ఛవిశ్వవిహారములును
ఆయనంత తేజోమహిమానుభూతి
డిందఁగా జీర్ణపర్ణ కుటీరగర్భ
మం దొదిగికొంటి, సంధ్య మార్తాండునట్లు.

౧౩

ఎప్పుడో వేద్యమయ్యెఁ దల్లి! త్వదీయ
ప్రాజ్మహావైభవ మ్మొక భావవీచి
బాలిశత్వపు శైవాలపటలి నంత
తొలఁగఁద్రోసిన దీ యొడ్డుకెలననుండి.

౧౪

స్వాగతార్పణవేళ యీ సన్నమయ్యె
ప్రణయపుష్పాలు నీ మృదుపదములందు
అర్పణముచేసి హృదయసింహాసనమునఁ
బ్రీతి నర్చించి యుందె స్థాపించుకొందు
నీ రుచిరమూర్తి నాలోన నిలిచియుండ!

౧౫

ఏ మహావీరమణులు పూజించినారొ
ఏ సుపుత్రులు స్వాగతం బిచ్చినారొ
అశ్రుదూషితమైన నా యర్ఘ్య నేఁడు
నీకు లభియించెనే జననీమతల్లి!

హిందూభాషల పరిణామము

శ్రీ మండ నరసింహం

ప్రపంచ వాఙ్మయ చరిత్రమున నార్యవైదిక సారస్వతము ప్రాచీనతమము. వేదము లనాది యనియు, నపౌరుషేయము లనియు హైందవుల విశ్వాసము. ఉత్తర కురుక్షేత్రములనదగు మధ్యాసియాఖండమందలి ధ్రువ ప్రాంతము లార్యుల యాదిమ నివాసస్థానములు. శీతోష్ణాదినైసర్గికపరివర్తనములచే వార లీప్రదేశముల విసర్జింప వలసి వచ్చెను. ఆర్యసంతతులలో నొక కొన్ని సంఘములవారు పశ్చిమోత్తరమార్గమున హిందూదేశమున బ్రవేశించి యచటి యాదిమ నివాసులతో బోరియో, విహితము జేసికొనియో, నిర్జించియో విశేష ప్రదేశమును కాలక్రమమున నాక్రమింపజొచ్చిరి. ఇట్టియాక్రమణఫలితముగ, నార్యభాషయు నాచార వ్యవహారములును, మతసాంఘికాచారములును, సంప్రదాయములును హిందూదేశమున వ్యాపించుటయేగాక స్థిరముగ నీదేశమున పాదుకొనగలిగెను.

ఆర్యు లీదేశ మాక్రమించుకాలమునకే ఇచ్చట ద్రావిడాదిజాతులవారు స్థిరనివాస మేర్పరచుకొని యుండిరి. వారిభాషయు నాచారములును మత సంప్రదాయములును భిన్నమై యనేకవిషయముల నార్య సంప్రదాయములకు మిన్నయైయుండెను. శత్రుత్వము ననో, మిత్రత్వముననో, బహుకాల మార్యు లీద్రావిడాది జాతులతో జరిపిన సాహచర్యమున వారి మతాచారాది సంప్రదాయముల గొన్నింటియు, భాషల గొంతయు నన్యోన్యము స్వీకరింపకదప్పలేదు. హిందూదేశమున ద్రావిడాదిజాతుల భాషాచిహ్నము ఆర్యభాషయందు భాషాతత్వవేత్తలకు గనబడకపోలేదు. పరాజితులైన ద్రావిడజాతుల భాషలందు నార్యభాషా సంపర్కము నగపాలు వరకు గూడ కనబడుచున్నది. ఆదిమనివాసులతో వివిధములగు సంపర్కములవలన, ఆర్యభాషయు మార్పునకు లోనయ్యెను. ఈమార్పు భాషకు

వికాసము దెచ్చెనా, క్షీణదశకు దింపెనా, యనునది విమర్శకుల దృష్టిపథమునుబట్టి యుండును. అన్యభాషా సంబంధము స్వభాషను వృద్ధికి దెచ్చునని కొందరును, తత్పారిశుద్ధ్యమును బోగొట్టి పవిత్రతను దొలగించునని కొందరును వాదింప జొచ్చెదరు. ఆ వివాదము నిచట విడనాడి, ఆర్యభాష లెట్టి పరిణామావస్థల నొందెనో నిరూపించుటయే ఈవ్యాస ముఖ్యోద్దేశము.

ఆర్యు లుత్తరధ్రువప్రాంతముల నుండునప్పటి మతాచార వ్యవహారములును సాంఘిక నిత్యజీవనమును వారి పవిత్రగ్రంథము వేదములందు ప్రదర్శింపబడినవి. నాలుగు వేదములందు వివరింపబడిన సారస్వత విమర్శనమువలన నాటిప్రజల నాగరికత వ్యక్తమగును. ఉత్తర కురుభూముల వీరు జీవించుకాలమున వీరిచే వ్యవహరింపబడు భాషకు వైదికభాషయని భాషాశాస్త్రజ్ఞులు పేరిడిరి. ఈభాష మాటాడువారు వేదమహర్షులనియే భ్రాంతిపడరాదు. ఆ కాలమందలి మునీశ్వరులే కాక, సమస్త స్త్రీలు, పురుషులు, పేదలు, భాగ్యవంతులు, పిల్లలు, పెద్దలు, వీరు వారననేల సమస్త జనులు వ్యవహరించు భాషకే వైదిక భాష యని పేరు. అప్పటి సర్వమానవ వ్యవహారమున నుపయోగపడుచుండునదీ వైదికభాషయే.

ఆర్యు లీ హిందూదేశమునకు వచ్చిన తొలుదొల్త పశ్చిమోత్తరమునను, తదుపరి గంగాసింధు నదులు ప్రవహించు సమప్రదేశమునను వ్యాపింప జొచ్చిరి. ఆర్యులు తొలుదొల్త నీ ప్రదేశమున వర్తించుటచే నియ్యది యార్యావర్తమని పేరందినది. ఆర్యు లీ ప్రదేశముల జొచ్చుసరికే ఈప్రదేశమున, నన్య భాషా మతాచార సంప్రదాయములు గల వేరొక తెగవారు స్థిరముగ నివాస మేర్పాటు చేసికొనియుండిరి. ఈ తెగవారుగూడ కొన్నికొన్ని విషయముల నార్యుల

నాగరికతను మించియుండిరి. చిత్రకళలందేమి, భాషయందేమి, రాజ్యపాలనానైపుణ్యమునందేమి, సేద్యమునందేమి ఆర్యులీ తెగవారికి జాలకుండిరి. వీరినే ద్రావిడ సంతతివారని చెప్పుదురు. ద్రావిడులేగాక 'ముండా' భాషను మాటాడు మరియొక తెగవారుగూడ నివసించుచుండిరి. వీరి సంతతులవారే నేటికాలమున పర్వతారణ్యముల నివసించు సవర కోదు మొదలగు ననాగరిక జనులు.

నూతన నివేశన ప్రదేశాన్వేషణమందును, తదాక్రమణమందును ద్రావిడాటవికజాతులవారితో నార్యులు పోరవలసివచ్చెను. ఆ పోరాటమున జయాపజయములు తులదూగుచు తుదకు కాలక్రమమున నార్యులకే విజయము స్థిరమయ్యెను. విజయమందిన యార్యులు ద్విజులుగను పరాజయమంది లొంగిపోయిన ద్రావిడులు శూద్రులుగను పరిగణింపబడిరి. పరాజయమందిన ద్రావిడు లధికనాగరికత కొన్ని విషయముల గలవారయ్యు వర్ణవివక్షతను చతుర్థస్థానము నంది శూద్రులుగ నుండవలసి వచ్చెను. ఓడిన యాటవికులు నాగరికతలో వెనుకబడియుండుటచేత చాతుర్వర్ణ్యమును జెందక పంచములైరి. వీరిలో గొందరార్యుల ధాటి కోర్వజాలక దూరస్థపర్వతారణ్యములకు పలాయనమై యచ్చట స్థిరనివాస మేర్పరచుకొనిరి.

ఆర్యులచే వ్యవహరింపబడు భాష వైదికభాష యని యిదివరకే నిర్వచింపబడినది. హిందూదేశమందార్యులు వివిధప్రాంతములకు జని ద్రావిడాదిభిన్నజాతులతో సాహచర్య మొనరించుటచేతను, బహుకాల పరస్పర సహవాసముచేతను, వారి భాషయు పలువిధములగు మార్పులకు లోనయ్యెను.

ఆర్యులీ హిందూదేశమున, నష్టదిక్కులకు చెదరి యా దిక్కుల స్థిర నివాస మేర్పరచుకొని బహుకాలము ద్రావిడాదిజాతులతో గలసియున్నందున వారి తొలుతటి వైదికభాషయు నష్టవిధములగు మార్పుల చెంది తుద కష్టవిధ ప్రాకృతములకు మూలమయ్యెను. ఇట్లు వైదికభాషనుండే కాలక్రమమున నెనిమిది ప్రాకృతములు జననమై సామాన్య (ప్రాకృత) జనులచే వ్యవహరింపబడుటచేత నీ భాషలు ప్రాకృతములని రూఢికెక్కెను. ఈ ప్రాకృతములు ఏయే దేశభాగముల భాషింపబడుచుండెనో ఆయా దేశనామముల నవి వ్యవహరింపబడజొచ్చెను.

ఏకమాతృకయగు వైదికభాషనుండి వినిర్గతమైన యీ యెనిమిది ప్రాకృతములును దేశమందలి యష్టదిక్కుల వ్యవహరింపబడుచు వచ్చి కాలక్రమమున నొక ప్రాంతమందలి ప్రాకృతము వేరొక ప్రాంతమువారికి సులభముగ గ్రాహ్యము కానంతటి రూపభేదమును పొందజొచ్చెను. కొంతకాలమువరకు నన్ని దిక్కులవారి వ్యవహారమున కుపయోగించుచుండిన భాష యిప్పు డితరప్రాంతములవారి కుపయోగపడక పోవుటకు కారణము ద్రావిడాది ఆదిమవాసుల భాషా సాహచర్యసంపర్కమువనే కాని వేరుగాదు. పదముల పలుకుబడి యందలి యుదాత్తానుదాత్తస్వరితాదులందే కాక పదరూపమందును, ప్రత్యయములందును విశేషముగ మార్పులు రాజొచ్చెను. ఇట్టి ప్రాకృతములు వివిధ భాగముల పరస్పర వ్యవహారమునకు భంగము కొంతవరకు వాటిల్ల చేయుటచేత, నీభాషా బాహుళ్యము వాణిజ్యాది సమస్తసాంఘిక వ్యవహారముల దరిదాపు స్తంభింప జేయునవస్థకు దెచ్చెను.

దుర్గ్రాహ్యమగు నీభాషలస్థితి యాకాలపు పండితులకును పెద్దలకును రాజకీయ వేత్తలకును దుర్భరముగ నుండెను. బహుకాల మార్యకుటుంబములు నిరాటంక వ్యవహారమున కుపయోగపడుచు వచ్చిన యీభాష నేటి కార్యావర్తమున భిన్నరూపములై యార్యజాతిని వివిధ భాషాసంఘములుగ చీల్చివేసిన పరిస్థితి దేశారిష్టదాయక మని పండితబృందముచే నిశ్చయింపబడెను. దీనిని తొలగించుటకు వారు ప్రబలప్రయత్నముల చేయ దొడంగిరి. వివిధమార్గముల నూత్న వికాసముల జెందుచున్న యీ యెనిమిది ప్రాకృతముల సమ్మిశ్ర మొనరించి యేకభాష. నొకదాని నుత్పత్తిజేయ బూనుకొనిరి. సహజముగ దృఢజీవశక్తిచే వికాసమంది సర్వతోముఖముగ నభివృద్ధి గనుచున్న ప్రాకృతభాషల నరికట్టి మానవకల్పిత సూత్రముల బంధించి స్వాధీనమం దుంచుకొనుటకు చేసినప్రయత్నము విఫలము కాకతీరదు,

వివిధ ప్రాకృత భాషల పండితులు వైదిక వాఙ్మయమును యెనిమిది ప్రాకృత భాషల వాఙ్మయమును సూక్ష్మముగ పరిశీలింప బూనుకొనిరి. ఈభాషల పద జాలమునకు ధాతువుల నిర్ణయించి, పదరూపసిద్ధి కనువగు లింగ వచన విభక్తి ప్రత్యయముల స్థిరపరచి, క్రియాపదముల కనువగు కాలరూప ప్రత్యయముల బొందుపరచి సమస్తవ్యాపారములకు సమర్థమగుభాషగ నొనర్చిరి. ఇట్లొనర్చిన పదములను ప్రత్యయములనే తప్ప అన్యరూప పద ప్రత్యయములు ప్రయోగముల కనర్హములని గూడ శాసించిరి. విద్యావంతులును, కవి పండితులును రాజ్యాధికారులును ఈ భాషా శాసనమును దాము వ్రాయు గ్రంథములందు మాత్రము మన్నింపగలిగిరిగాని సామాన్య ప్రజలు ఈ శాసనమును పాటించుటకు వీలులేకపోయెను. వారు మాత్రము నిత్యము సాంఘిక వ్యవహార దక్షమగు నీ ప్రాకృతములనే వాడుచుండిరి. ప్రాకృతములనుండి యేర్చికూర్చి పండితులచే వ్యాకరణాదిసంస్కారములంది పరిష్కరింపబడి యీ కల్పిత భాష పండితుల యాదరణమునుమాత్రమే బడయగలిగినది. వివిధ సంస్కారముల బొందుటచే నీ భాష సంస్కృతమని పిలువబడజొచ్చెను. ఈ కల్పితభాష పొందిన సంస్కారములన్నియు విపులముగ పాణిని వ్యాకరణమున వివరింపబడినవి. ఇట్టి వ్యాకరణ సంస్కారముల బొంది తొల్లింటి వైదికభాషయు, తజ్జనితములగు నష్టవిధ ప్రాకృతములును సమ్మిళితమై యేకరూపమంది పండిత బృందాదరణమున గ్రంథ రచనా సమర్థమై తనరారెను. కాని వ్యవహారమున సూక్ష్మ మనో భావముల ధారాళముగ వెల్లడించుటకు శక్తి చాలమి ప్రజాబాహుళ్యముమాత్రము నిత్య వ్యవహారముల ప్రాకృతములనే వాడుచుండిరి. దీనివలన ప్రాకృతములు యథేచ్ఛగ నభివృద్ధియగుచునే యుండెను కాని వానినుండి విడదీయబడి తీర్చి దిద్దబడిన సంస్కృతము మాత్రము జీవితచిహ్నమగు వృద్ధిక్షయముల బాసి స్తంభించి పండితుల యాదరణను చేపట్టి గ్రాంథిక భాషగా మాత్ర ముండవలసివచ్చెను.

పై నుదాహరింపబడిన వివిధములగు వ్యాకరణాది సంస్కారముల బొందిననాటినుండియు నీభాష సంస్కృతమని వ్యవహరింపబడజొచ్చెను. దేశమందలి పండితులీభాషనే తమ తమ గ్రంథముల వాడజొచ్చిరి. కాళిదాసాది మహాకవు లీభాషనే తమ కావ్యముల బ్రయోగించుచు వచ్చిరి. దేశమేలు ప్రభువులు రాజకీయ వ్యవహారము లన్నియు నీభాషనే నెరవేర్చుచుండిరి. రాజులు బ్రాహ్మణాదులకొసగు భూదానాది తామ్ర శాసనము లీభాషనే రచింపబడుచుండెను. అందుచే నీభాష రాజభాషయై విద్యావంతులెల్లరచే నవలంబింపబడజొచ్చెను.

ప్రాకృతములనుండి విద్యావంతులు గ్రంథరచన కనుకూలమగు సమగ్రమగు నొకభాషను కల్పింపగలిగిరిగాని బలవత్తరమగు జీవశక్తితో గంగానదివలె ధారాళముగ కొనసాగుచున్న ప్రాకృతములనుమాత్ర మరికట్ట వారికి శక్యము కాలేదు. వారికేకా దెరికి నీ కార్యము శక్యముగాదు. ప్రకృతిప్రవాహమున కెదురీదు టెవరితరము? అష్టవిధప్రాకృతములనుండియు వైదిక భాషనుండియు నేర్చికూర్చబడిన ధాతురూపములును, పదజాలమును వేర్వేరు దేశభాగముల వ్యవహరింపబడు ప్రాకృతప్రత్యయములబొంది నూతనముగ నుత్పన్నమగు భాషయగుటచేత, నియ్యది సామాన్యజనులకు సులభ గ్రాహ్యము కాకుండెను. విద్యావంతులు మాత్రమే యీ భాషను గ్రంథరచన కవలంబించుచుండిరి. వారుకూడ నిత్యలోక వ్యవహారముల నీ ప్రాకృతములనే వాడుచుండిరి. మహాకవులు వారి కావ్యములలో పాత్రపోషణమునకును, రసోత్పాదనమునకును, సంస్కృతభాషకు సామర్థ్యము లేకపోవుటచే కాబోలు, ప్రాకృత భాషనుకూడ వాడుక చేయుచువచ్చిరి.

ప్రాకృతము లన్నియు నాయా ప్రాంతముల నార్య సంతతులచే విరివిగ నుపయోగింపబడుచు వచ్చుచుండెనే కాని సంస్కృతభాష యుండుటచే నయ్యవి విసర్జింపబడలేదు. అవి, దినదిన ప్రవర్ధమాన మగుచు నూత్న వికాసపు జీవకళలను జూపట్టుచుండెను. జీవకళ యున్నంతకాలము — అనగా భాషను ప్రజలు భాషించుచుండు నంతకాలము - మార్పుగోచరించుచునే యుండును. నిర్జీవమైనతోడనే వృద్ధిక్షయములు స్తంభించి స్థిరత్వము చేకూరును.

సంస్కారముల బొందునాటి ప్రాకృతభాషల రూపములుగూడ మారుచునే యుండెను. స్వకీయమైన జీవశక్తివలన నూత్నవికాసములతో నీమార్పంతరాయము లేక జరుగుచునేయుండెను. ద్రావిడాదిభాషల విశేషసాహచర్యమున నీప్రాకృతభాషలు శాఖోపశాఖలై నేటి యుత్తరహిందూదేశభాషలుగ పరిణమించెను. అందుచే నీభాషలన్నియు ప్రాకృతభవములని చెప్పవలెను.

తొల్లింటి వైదికభాషయే వివిధ ప్రాకృతములయ్యెననియు, నా ప్రాకృతములనుండియే సంస్కృతము సమగ్రమగు భాషగా రచింపబడినదనియు, నింక నా ప్రాకృతములే నేటి హిందుస్థాన దేశభాషల కెల్ల మాతృకలనియు నిరూపింపబడెను గదా. పండితులు, కవులు, రాజకీయోద్యోగులు మున్నగు విద్యావంతులెల్లరును సంస్కృత భాషను గ్రాంథిక భాషగా జేసికొనిరి. కాని యొకొక్కప్పుడువారుగూడ నీనియమమును విడనాడి వ్యాకరణ శాసనము లతిక్రమించి రసపాత్ర పోషణాదులకొరకు ప్రాకృత భాషల నచ్చటచ్చట వాడుకజేయ నారంభించిరి. సామాన్య జనుల బోధకొరకు నిర్దేశింపబడిన గ్రంథములు గూడ కవి పండితులచే బ్రాకృతభాషల రచింపబడుచు వచ్చెను. గుణాఢ్యుని బృహత్కథ దీనికి ప్రబల నిదర్శనము. బౌద్ధమత స్థాపకుడగు గౌతమబుద్ధుడును, తన్మతబహుళప్రచారకుడగు నశోకచక్రవర్తియు జనసామాన్య బోధకు ప్రాకృతమును, పండితగోష్ఠియందు సంస్కృతమును వాడుటగూడ దీనికి ప్రబల నిదర్శనమే యగుచున్నది. పండితులచే నేర్చి కూర్చబడి, దిద్ది తీర్చబడి, సమగ్రముగ పరిష్కరింపబడి సిద్ధమయిన యీ సంస్కృతభాష మానవకల్పిత మగుటచే పూర్ణత్వమందజాలదయ్యెను. అందుచేతనే సూక్ష్మతర మనోభావముల వాగ్రూపమున గాని లిఖితరూపమునగాని వెల్లడించుటకు ప్రాకృతభాషలును తరువాతికాలమున నా ప్రాకృతజనితములగు నేటి దేశభాషలును కడు సమర్థము లగుచున్నవి.

వేదములందు వివరింపబడిన సారస్వతము వైదికభాషయం దుండెనని యిదివరకే చెప్పబడినది. ఈవేద భాషకే దేవభాష యని మరియొక పేరు కలదు. సంస్కృతముకూడ గొందరచే దేవభాషయని పిలువబడుచున్నది. వేదములీ భాషచే రచింపబడుటవలన నియ్యది వైద (వైదిక) భాష యనియు దేవత లిద్దాని భాషించుటచే నిది దేవభాష యనియు పిలువబడ జొచ్చెను. దేవత లన స్వర్గాది యూర్ధ్వలోకములలో నివసించువారని యూహింపరాదు. పశ్చిమోత్తరద్వారమున హిందూ దేశములో జొచ్చిన యార్యసంతతులకే దేవతలని పేరు. దేవశబ్దము 'దివ్' అనుధాతువువలన నిష్పన్నమగుటచేతను, కాంతిమంతమైన లేక స్ఫురద్రూపముగల యనునర్థము పండితులు నిర్ణయించుటచేతను దేవతలనగా తేజస్సుకలవారనియు, మంచిరూపవంతులనియు నర్థము వచ్చుచున్నది. వీరలే వైదిక ప్రాకృత సంస్కృతభాషలక్రమమున వేర్వేరు కాలముల వ్యవహరించెడు నార్యసంతతులవారు వీరలే దేవతలు; వీరు మాటలాడుభాషయే దేవభాష. వీరి సంఖ్య ముప్పదిమూడుకోట్లు.

రూపమందును, ఆచారవ్యవహారములందును, భాషలందును వీరికి భిన్నమగు జాతులవారు అనార్యులు. ఈయనార్యులనే ద్రావిడాటవికజాతులవారని భావింపవలయును. ఆర్యులీ హిందూదేశమునకు వచ్చిన కొలదికాలముననే, ద్రావిడాదిస్థానికజనులతో యుద్ధము సంభవించెను. బహుకాల మీయుద్ధము నడచి తుదకు విజయమార్యులకే చేకూరెను. వైదికవాఙ్మయమున దేవాసురయుద్ధములని చెప్పబడిన వియ్యవియే యైయుండవలెను. అసురదైత్య దానవరాక్షసాదినామముల నీ యనార్యులచే పిలువబడుచుండిరి. ఆర్యులతో నోడి శరణాగతులైన యనార్యులగు ద్రావిడు లార్యజాతిలో జేరి శూద్రులైరి. కొందరు దూరప్రాంతములకు తరిమివేయబడిరి. ఇందుమూలమున ఆర్యకుటుంబములలోగూడ కొన్నిమార్పులు జరిగెను. హిందూదేశమునకు వచ్చిన యార్యులు ద్విజు లనియు, వారితో యుద్ధాదిసంబంధములచే సమ్మిళితమైనవారు శూద్రులనియు, వారికి లొంగక పర్వతారణ్యములకు బారిపోయినవారు పంచములనియు పరిగణింపబడజొచ్చిరి. ఇట్లీయార్యానార్య సమ్మిళితమున నుభయసంఘముల భాషామతాచార వ్యవ

హారములును సాంఘికస్థితియు మార్పులజెంది కొంక్రమమున భిన్నత్వమున నేకత్వము సిద్ధించెను. పరాజయమంది శరణాగతులైన ద్రావిడు లార్యజాతిలో చతుర్థస్థానముతో తృప్తిపడవలసివచ్చెను. ఆర్యుల పవిత్ర గ్రంథములగు వేదములందుమాత్రము స్థానమీయక జయమును బొందినవారగుట తమయాధిక్యత నార్యులు స్థిరపఱచుకొనిరి.

దూరస్థ పర్వతారణ్య ప్రాంతములకు తరిమివేయబడిన యనార్యులు తమభాషను, ఆచారాదికములను మార్పలేక నిలువబెట్టుకొనిరి. నేటి పర్వతారణ్య ప్రాంతముల నివసించు సవర, కోయ, బడగాదిజాతులు వారి సంతతివారలే. ఆర్యులతో సంఘట్టనమునకు బూర్వము వీరు రాజ్యము లేలినట్లును వీరిలో శబరాదిత్యు డను వాడు బాహుబల పరాక్రమములతో యుద్ధ మొనరించె ననియు చారిత్రపాఠకులకు విశదమే. వీరు ప్రప్రథమమున 'ముండా' భాష మాటలాడుచుండిరనియు, ఆభాషాపరిణామములే నేటి సవరకోయబడగాది భాషలుగా పరిణమించె ననియు భాషాతత్త్వవేత్తలు నిర్ణయించుచున్నారు.

నాటిదేవాసురయుద్ధమున నోడి దక్షిణదిగ్భాగమునకు తరిమివేయబడిన యసురులే నేటి తమిళాంధ్ర కర్ణాటాదిభాషలమాటాడువారి పూర్వులు. సురాసురులు కశ్యపబ్రహ్మ కిరువురు భార్యలవలన గలిగినవారను పురాణగాథ ఆర్యద్రావిడ జాతులకుగల పరస్పర సంబంధమును సూచన చేయుచున్నది. ఆ సంబంధమే వైదికభాషకును ద్రావిడభాషకును కలదు. వైదికభాష నుండి పుట్టిన నేటి ఉత్తరహిందూదేశ భాషలకును ద్రావిడభాషనుండి పుట్టిన నేటి తమిళాంధ్ర కర్ణాటాది భాషలకును అట్టిసంబంధమే కలదు. తొల్లింటి వైదిక ద్రావిడభాషలకు మాతృక యొక్కటే యని దీనివలన నూహింపనగును.

వైదిక ద్రావిడ జాతుల పరస్పరసంబంధమున వారిభాషలుగూడ నన్యోన్యముగ నూతనపదముల స్వీకరించి నూత్నవికాసముతో వృద్ధిగాంచెనని వివరింపబడినది. ద్రావిడభాషాసంభవములగు తమిళాంధ్రకర్ణాట మళయాళాదిభాషలలో సంస్కృతపదములు సగపాలు గనబడుచున్నవి. ప్రతిభాషయు నన్యభాషాపదముల స్వీకరించునపుడు భాషాప్రత్యయముల చేర్చిగాని స్వీకరింపదు. ఏభాషకైనను ప్రత్యయములే నాయువుపట్టు. ద్రావిడభాషలలో సంస్కృత పదములను వానివికృతులను తద్భవములను దీసివేసిన యెడల శేషించిన పదజాలము నిత్య సాంఘిక వ్యవహారమునకు చాలక సమస్త వ్యాపారములు స్తంభించి పోవు నవస్థకు వచ్చును. అందుచే నన్య భాషా పదములు చేరుటచేత స్వభాష చెడుటకు మారుగ నూత్న వికాసమంది సర్వ సూక్ష్మ మనోభావముల వెల్లడించుటకుగూడ సమర్థమై తనరారగలదు. ఇటులనే నేటి మన యాంధ్రమం దింగ్లీషు హిందీ పారసీకారబ్బీ భాషలు చేరుట భాషా వికాస చిహ్నమని యెంచ వలయునేగాని చెడుచున్నదని భ్రమపడరాదు.

భిన్నభాషలు మాటలాడు జనులు వాణిజ్యాది వ్యాపారములచే నేమి, యుద్ధాదులచే నేమి, పరస్పర సంబంధములకు పాల్పడినపుడు వారివారి భాషలుగూడ నూతన పదజాలమును బొందకతీరదు. దేశభాషలలో సగపాలు సంస్కృతపదములు జేరియుండ, సంస్కృత భాషలో ద్రావిడాది భాషా పదజాలము కానబడుచున్నదాయను ప్రశ్నము రాకతీరదు. ఛాందసులగు సంస్కృత భాషా పండితు లంగీకరింపకపోయినను, భాషాతత్త్వ శాస్త్రజ్ఞుల సూక్ష్మ విమర్శ దృష్టికి నేక ద్రావిడపదములు సంస్కృతభాషలో సంస్కృత ప్రత్యయములంది ప్రచ్ఛన్నముగ డాగియున్నవి బయటకు దీయబడినవి. నీరు, కటి, మీను, కరవాలము, అత్త, మౌక్తికము మొదలగు పదములీ జాతిలో చేరినవి.

భాష యొకరిసొత్తు గాదు. దానిని బంధించుటకు నే వ్యక్తికిగాని సంఘమునకుగాని శక్యము గాదు. రాజశాసనమున కది లొంగదు. సంఘాభివృద్ధితో భాషాభివృద్ధియు సంఘ క్షయముతో భాషా క్షయమును గలుగుచుండును. వ్యాకరణాది సంస్కారములు భాషకు బంధనములేయగును కాని వికాసమునకుతోడ్పడవు. భాషయు నీ బంధముల కంతమాత్రము లొంగక వేరొక విధమున వికాసమును జూపుచునే యుండును

విద్యాధికు లిబంధము లేర్పాటు చేసికొని పాటించిన యెడల, దేశభాషలుగూడ కాలక్రమమున జీవశక్తిని గోల్పోయి, స్తంభించి గ్రీకు, ల్యాటిను, సంస్కృతము, అరబ్బీ మున్నగు భాషల స్థితినే బొందగలవు. ఇందు వలన భాషలకు వ్యాకరణము లక్కరలే దని యభిప్రాయపడరాదు. వైయాకరణులు సజీవమగు భాషల వికాసములను మార్పులను గుర్తించుటతో దృష్టి పడ వలయునేకాని శాసించుటకు బూనుకొనరాదు. ఏనాడు పదములును వాని రూపములును నిర్ణయింపబడి యవ్వి యట్లే యుండవలయుననియు, నట్లే ప్రయోగింపబడ వలయు ననియు వైయాకరణులు శాసించెదరో యానాడే వారా భాషాదేవికి శృంఖలముల దగిలించిన వా రగుచున్నారు. భాషను శాసించి ప్రత్యేకసూత్రములకు బద్ధమగు దానినిగా జేసితిమని వ్యాకరణకర్తలు సంతసించెదరేగాని భాషాదేవిమాత్రము వారి కట్టుబాటులకు లొంగక కాలక్రమమున వేరు విధములవికాసమును జూపుచునే యుండును ఆ వికాసములన్నియు పామర నిత్యవ్యవహారముల గోచరించు చుండును. వ్యాకరణకర్తలచే శాసింపబడిన భాష నిర్జీవకళలతో గ్రంథములందే ప్రచారము కలిగి సాంకేతికపదరూపమున పండితుల కానందాభాసమును గలుగజేయుచు నిత్యసాంఘికజీవనమునకు తోడ్పడజాలక సహజమనోభావముల వ్యక్తపరుప సమర్థత జాలమి స్తంభించి పోవును.

'తానుద్రవ్వినగోతిలోఁ దానె పడును'

శ్రీ కొత్త సత్యనారాయణచౌదరి

కలఁడు ధనపాలుఁ డనువాఁ
డిల సార్థకనామధేయుఁ డేలిక యయి భూ
వలయమున నున్నవారల
వలనను గప్పంబు గొనుచు వసుధాధిపుఁడై.

జగమునకు 'హాయి'కూర్చునా చంద్రుఁడకట!
దుస్సహాకళంకమునఁ గీర్తిఁ దొఱఁగునటులు
ప్రకృతధరణీశచంద్రుఁడు పరమనైచ్య
నిలయమగు దుర్గుణం బొండు కలిగియుండె.

అర్థిబృంద మటన్న నయ్యార్తు లన్న
నతిథిజన మన్న ధనము వ్యయం బటంచు
మనమునను భీతి నొంది తత్క్షణమ తనదు
దర్శనము దూరముగఁ జేయఁదలఁచు నతఁడు.

ధనము ప్రార్థింపకయ తన్నుఁ గనిన మనుజు
నమితప్రేమోదయంబున నాదరించు
విభునివలెమాత్ర మగుపడు వేవిధముల
ధనము రక్షించుటయ ముఖ్యమను నతండు.

కాన, లోకంబు నిర్గంధమైన కుసుమ
మంచుఁ దెగడుచు నావిభు నల్పదృష్టి
నరయు, నది యుక్తమేసుమీ! యాత్మప్రజనె
ఆదరింపనిపతి నీచుఁ డనుట లెస్స.

అట్టిపాలనమును సల్పు నతనినగర
మునకు నరిగెను బేదబ్రాహ్మణుఁ డొకండు,
అతఁడు శాస్త్రవిశారదుం డధికపాండి
త్యప్రకర్ష విరాజిత ధీవరుండు.

అరిగి తుద కెట్లొ యధికప్రయాసమునను
రేనికొలువును జేరి యనూననైజ
ధీప్రభావంబున నొసంగె దీవెనను
గాని ధనపాలుఁ డాతనిఁ గాంచఁడాయె.

ఏవంవిధముగఁ బ్రతిదిన
మావంతయు మార్పులేక యరిగెడువిప్రున్
భూవరుఁడు కాంచి యొకనాఁ
డీవిధముగఁ బలికె నైచ్య మేర్పడురీతిన్.

ఆర్య, చిరకాల మిటను మమ్మాశ్రయించు
చున్నదానికిఁ గారణ మున్నఁ దెలుపుఁ
డది యెఱిఁగి యానందింతు మంతెగాని
యేము మీ కేమియు ధనంబు లీయలేము.

వానిమాటలు వినిన యా పండితుండు
భక్తితాత్పర్యములతోడఁ బలికె నంత,
అధిప! ధనధాన్యములు నాకు ననవసరము
లేను గాంక్షించునది యల్పమైన దొకటి.

భవ్యభవదీయ సుగుణసంపదల వినియు
ధనము కోరక సేవింపఁ దలఁచినాఁడ,
సన్నిధిని గూరుచుండి యీ యున్నకొలువు
నందు మాటాడుటకు దేవ! యానతిమ్ము.

మఱియు నేకాంతముగ నొక్కమాటమాత్ర
మనుదినము మీకుఁ జెప్పెద నదియె నాకు
ముఖ్యమని విప్రుఁ డనఁగ నాపుడమిపతియు
సమ్మతించెను దానిని సంతసముగ.

నాఁటినుండియు సభలో ననారతంబు
రేనిపజ్జను గూర్చుండి వానిచెవిని
'తాను ద్రవ్విన గోతిలోఁ దానె పడు న'
టంచు నేకాంతముగఁ బల్కు నవనిసురుఁడు.

యున్నారు; వారిసృష్టి కీశ్వరునికి సంపూర్ణకర్తృత్వము లేదు. 'ఊర్ణనాభి'వలె ఈశ్వరుడు తనయందుండి ఈ జగత్తును సృష్టించుచున్నాడు. ఈ జగత్తున ఉన్న వైషమ్యనైర్ఘృణ్యాదోషములు ఆయన కంటవు. మేఘుని వలె ఆయన నిర్లిప్తుడు; మేఘుడువర్షింప ఆ జలము కొన్నిచోట్ల పడి ఏమియును ఫలించుటలేదు, భూమి సారహీన మగుటజేసి. మఱి, వెవ్వేరుతావుల కట్వామ్లాది భేదములతో గూడిన ఫలములు గలుగుచున్నవి. దీన, మేఘుని దోష మేమి ? అట్లే, జీవుల కర్మఫలముల నీశ్వరుడు ఆయాజీవులకు ఒసగుచున్నాడు. ఈ జగత్తు లేక సృష్టి అనాది. కల్పాంతమున ఈశ్వరునియందు బీజాకృతిని అణగియుండి, మరల తదనంతర కల్పసృష్టికి గారణ మగుచుండును; కనుక, ఈ జగత్తు అనాది. కాని సాంతము, బ్రహ్మజ్ఞానము లభించిన లయమగును.

జగత్తనిన కేవల మీ సౌరజగత్తు ఒక్కటియే కాదు. భూర్భువరాదిసప్త ఊర్ధ్వలోకములు, తలాతలాది సప్తఅధోలోకములుగూడ ఈ మూడును గలిసి బ్రహ్మాండ మనంబడుచున్నవి. ఇట్టిబ్రహ్మాండములు అసంఖ్యాకములు. ఇవన్నియును గలసి జగత్తు.

౧౦

మనుష్యుని స్థూలశరీరము క్షిత్యాదిపంచభూతాత్మకము. మనోబుద్ధ్యహంకార సమన్విత మగునది సూక్ష్మశరీరము. మనస్సు సంకల్ప వికల్పాత్మకము. బుద్ధి నిశ్చయాత్మిక. అనుసంధానాత్మకము చిత్తము. అభిమానాత్మకము అహంకారము. తరువాతిది కారణ శరీరము. సూక్ష్మశరీర-దర్పణమున బ్రహ్మ-భానుడు ప్రతిబింబింప, మరల దాని ప్రతిఫలమగు సూర్యుడే జీవాత్మ, ఇతడే కారణశరీరాంతర్గతుడు. అందువలన జీవుడు బ్రహ్మముయొక్క అంశ. మనుష్యుని ప్రతి కార్యము ఈ సూక్ష్మశరీరమున ఒక సంస్కారమును ముద్రించుచున్నది. ఈ సంస్కారముల సమష్టియే అదృష్టము. ఈ అదృష్టవశమువనే ఉత్కృష్ట, నికృష్ట జన్మలు. పాపము పుణ్యమువలన ఖండింపబడదు; రెంటిని వెవ్వేరుగ అనుభవింపవలెను. స్థావరజంగమాది జీవజాతమున కంతటికిని సూక్ష్మ, కారణశరీరము లున్నవి, కాని అనభివ్యక్తములు. అంతఃసంజ్ఞ, సుఖదుఃఖములు వాటికిగూడ ఉన్నవి. స్థూలశరీరము పైతొడుగు. మృత్యువనిన దీనిమార్పు. బ్రహ్మజ్ఞానము లభింపనంత వఱకు జననమరణములు తప్పనిసరి. పుణ్యపాపఫలములను స్వర్గనరకముల అనుభవించి భూలోకమున లేక భువర్లోకమున జన్మనెత్తవలసియుండును. సగుణబ్రహ్మోపాసన నొనర్చిన, సత్య, తప, జన, మహః, సువర్లోకముల కేగిన మరల జన్మ లేదు. అట నిర్గుణబ్రహ్మజ్ఞానమునుబడసి ముక్తిని బొందును.

౧౧

నిష్కామ కర్మలవలన చిత్తశుద్ధియును తద్ద్వారమున జ్ఞానమును లభించును; చిత్తశుద్ధ్యనంతరము ఉపాసన అవసరము. ఇయ్యది అంగాంగబద్ధము, ప్రతీకము, అహంగ్రహము అని మూడువిధములు. యజ్ఞాంగముల బ్రహ్మబుద్ధి అంగాంగబద్ధోపాసన. ఆదిత్యాది విషయముల అవలంబించి బ్రహ్మమును భావించుట ప్రతీకోపాసన. కేవల మాత్మచింతన అహంగ్రహోపాసన. ఈ ఉపాసనలవలన చిత్తైకాగ్రత చేకూరును. పిదప, సన్న్యాసపూర్వకముగ గురుముఖమున శ్రవణమొనర్పవలెను. 'మహావాక్యము' లేక వేదశాస్త్రముల గురుముఖమున వినుట శ్రవణము. అనుకూలతర్కము మననము. ధ్యేయవస్తువున నిరవచ్ఛిన్న తైలధారవలె చిత్తము ప్రవహించుట నిదిధ్యాసనము దీనివలన బ్రహ్మైకత్వము ఒనగూడును.

౧౨

ఇట్లు, బ్రహ్మాత్మైక్యమును నిర్గుణ ఉపాసన వలన బొందుట జీవన్ముక్తి. ఇట్టిముక్తుడే జ్ఞాని. వర్తమాన శరీర-అనంతరము మరల జన్మ లేదు. సగుణ బ్రహ్మ ఉపాసకులు దేవయానమార్గమున సగుణబ్రహ్మలోకమున కరిగి, అట ఆకల్పాంతము ఉండి, నిర్గుణధ్యాన సిద్ధులై ముక్తి నందుదురు. జీవన్ముక్తు లీమర్త్యమున ప్రారబ్ధకర్మము క్షయ మగునంతవఱకు వసించి, లోక

సంగ్రహార్థము ఉపకరింతురు. బ్రహ్మజ్ఞానమున సంచిత ఆగామికర్మలు క్షయమగును; ప్రారబ్ధము అనుభవింపనిదే తొలగదు. ఈ జీవన్ముక్తులవలననే గురుశిష్య పరంపర నిలబడుచున్నది. వీరు విధినిషేధముల కతీతులు.

సంసారాధ్వని తాపభానుకిరణ
ప్రోద్భూతదాహవ్యథా
ఖిన్నానాం జలకాంక్షయా మరుభుః
భ్రాంత్యా పరిభ్రామ్యతామ్
అత్యాసన్న సుధాంబుధిం సుఖకరం
బ్రహ్మద్వయం దర్శయ
త్యేషా శాంకరభారతీ విజయతే
నిర్వాణసంధాయినీ.

అచట - ఇచట

శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి

అచట లోకాలు క్షణమాత్ర మందె కాల్చి
భస్మ మొనరింప జాలెడి పాశవంబు
ఇచట దౌర్జన్య దావాగ్ని నిట్టె యార్పి
విమల శాంతిని నెలకొల్పు నమృతధార.

అచట కోటానుకోట్ల ప్రాణానిలముల
గడ్డిపరకగ జూచు రాక్షసప్రవృత్తి
ఇచట నణుమాత్రపుంబ్రాణి యేని చావఁ
గంట నీరొల్కు గల కనికరపు గుండె.

అటనమోఘ మారణ యంత్ర పటల సృష్టి
సతత మొనరించు శాస్త్రవిజ్ఞాన గరిమ
ఇట ప్రకృతిలోని జీవుల కెల్ల సుఖము
సంతరింప బ్రయత్నించు జ్ఞానమహిమ.

అచట ప్రాణుల బాహ్యదేహముల నెటులొ
వశము చేయు నశాశ్వత బాహుబలము
ఇచట జనుల మనస్సుల నెల్ల సతము
వింత గొలుప నాకర్షించు ప్రేమబలము.

జీవితకళ

"శాస్త్రి"

జీవితాన్ని ఒకకళగా తీసికొన్ననాటి నుండీ నిజమయిన నాగరికత ప్రారంభ మయింది. గ్రామఫోనుప్లేటులవలె ఏదో ఒకచైతన్యంలేని శక్తివల్ల మనంచేస్తూవున్న ఈగోలా, భావనా, ఆలోచనా, పుట్టలేదు. మానవజీవితం అర్థంలేని కృత్రిమమైన కార్ఖానా కాదు. నరాలూ, బుద్ధీ, మనస్సూ, ప్రసాదింపబడ్డ ఈ విచిత్రమయిన మానసిక జీవులు - మానవులు - జీవితాన్ని ఒక కళగా ఎంచుకొని ఏదో ఒక ఆనందాన్ని, సౌఖ్యాన్ని, అనుభవిద్దామనే ఆశతో అన్ని యుగాలలోనూ శ్రమించారు.

సృష్టియొక్క వైచిత్ర్యాన్ని చూచిన తర్వాత మనుష్యులకు సరదా, ఆనందం, కన్న భయం ఎక్కువయినరోజులలో మానవ బుద్ధి యీ ప్రపంచానికి యెవడో ఎక్కడో యజమాని ఇంతకన్న ఎక్కువ సుందర తరమయిన, పాములూ, భూకంపాలూ, దుర్మార్గులూ, కురూపత్వమూ, అవినీతిలేని ఒక గొప్ప ప్రపంచకంలో కులాసాగా ఉన్నాడనీ, వానికి మనప్రపంచం ఒకబ్రాంచి దుకాణంవంటి దనీ, సర్కసులో జంతువులను లాగు మనలను ఆడిస్తూవుంటాడని నమ్మింది. అందుచేత ఆయజమాన్ని ఒకమాటు కలిసి కొని వాడు చెప్పినట్లు చేస్తే వాడు కనిక రించి, ఇప్పటి ఈ రోగాలూ, భయంక రాలూ, అన్యాయాలూ పోగొట్టి బాగావుండే టందులకు ఏదోఒక మార్గం చెప్తా డని కొందరు తెలివయినవాళ్లు నిశ్చలంగా ఆ యజమాన్ని పిలిచేవారు. కొంతమందికి వాళ్ల మానసికతీక్ష్ణతవల్ల ఆయజమాని కనబడి నట్లు సుఖంగా వుండడానికి ఒకసేతుల శాస్త్రాన్ని ప్రసాదించినట్లు అగపడేది...... అలాంటివా ళ్లందరూ చెప్పిం దేమి టంటే యింతకన్న మంచి బాగావుండే స్వర్గమనే ఒకలోకం వుందనీ, అచ్చట ఆనందమూ అందమూ తప్ప ఎవ్విధమయిన ద్వంద్వ భావాలూలేవనీ, ఆభగవంతుని ప్రతినిధులచే ఇవ్వబడిన నీతిశాస్త్రాలను 'తుచ'గా అమ లులో పెట్టినవాళ్లకు ఆలోకానికి వెళ్లడానికి అనుజ్ఞ ఇస్తారని చెప్పారు. కాని ఈ స్వర్గ లోకంసంగతి వెళ్లి చూసినవా ళ్లెవరూ కన పడరు. ఈ సంగతులు నమ్మేవాళ్లుకూడా నమ్మకపోతే 'పాడుపనులు' చేస్తా మనే భయంతో నమ్ముతున్నవాళ్లు ఎక్కువగా కనపడుతున్నారు.

ధర్మశాస్త్రకారులచే నియమింపబడ్డ పాపపుణ్యా లన్నీ చాలా పరస్పరవిరుద్ధంగా వున్నాయి. కష్టము ఇనుపగొలుసు అయితే, సుఖము బంగారపుగొలుసు; రెండూ గొలు సులే బంధనాలే అని వేదాంతంలో ఒకడు అన్నాడు. అలాగే పాపపుణ్యాలు కూడా ఒకే నాణెంయొక్క రెండుపక్కలు లాగువున్నాయి. ఉదాహరణంగా "వివాహం"

అనే పుణ్యమయిన సంస్థను తీసికొందాం. దీనికి వ్యతిరేకమయిన సంస్థ వ్యభిచారసంస్థ. స్వేచ్ఛ, వ్యక్తిగత ఆకర్షణ, ప్రధానంగా కావలసిన స్త్రీపురుషసంబంధం విషయంలో వివాహమనే ఒక నిరంకుశసంస్థ సహజ ఫలితంగా వ్యభిచారం పుట్టింది. శ్మశాన వేదాంతు లెట్లాంటి అభిప్రాయ లిచ్చినా, ఆరోగ్యంగా పెరిగిన చాలా మనస్సులకు వివాహసంస్థవల్ల జీవితాదర్శ మెంతోగా నష్టపొయ్యారు... ఈ జీవితము ఒకపాప కార్య మనీ, ఐహికవిషయము లన్నీ వట్టి కలల వంటి మానసికభ్రమ లనీ, ప్రచారం చెయ్య బడ్డ యీ శ్మశాన వేదాంతపు భారత దేశంలో జీవితాన్ని అనుభవించినవారు అరుదు అయి పొయ్యారు. అర్థమూ, సందర్భమూ, వివేకమూ, లేని మన నీతిశాస్త్రాలు, సాంఘిక వ్యవస్థలవల్ల కల్గిన అనర్థం గ్రహించలేక పోయారు. వివాహసంస్థను రద్దుచెయ్యడానికి బదులు వ్యభిచారాన్ని పురికొల్పారు. జయదేవుడు, కాళిదాసు, భవభూతి, చార్వాకుడు, కందను (Kandan, a great logician of 15th century) ఉత్తమ ప్రతిభావంతులు జన్మించి తుప్పపట్టిన హిందూవేదాంతాన్ని ఛేధించలేకపోయినా జీవితం జీవించడం కోసమే అని చాటేరు

జీవితం తప్పకుండా పాప భూయిష్ఠ మయిందనీ, మానవప్రకృతి చాలా నీచ మయిందనీ, అందులోనూ స్త్రీమానవప్రకృతి మరీ ఘోరమయిన దనీ, అందుచేత మనస్సుకు స్వాతంత్ర్యము ఇవ్వడానికి వీల్లేదనీ మనఋషుల అభిప్రాయంగా తోస్తోంది.

మన సాంఘికవ్యవస్థలూ, రాజకీయపద్ధతులూ, ఆర్థికశాస్త్రం, శిక్షాస్మృతులూ, నీతిశాస్త్రమూ, సర్వకళలూ ఈ గొప్ప ఆదరణతోనే ఉద్భవించాయి. మానవనాగరికతలో ఉద్భవించిన గొప్పదయిన సంగీత కళ తీసికొంటే మనదేశంలో సంగీతంకూడా ఈ శ్మశానవేదాంతాన్నే బోధించింది. 'మూడునాళ్ల ముచ్చటకూ మురిసిపోతావే' అని దోపిడీ చెయ్యబడ్డ బికార్రైతుపాట నుండి పెద్దవేదాంతిపాడే 'మాయే....' అనే పాట ఒక్కటే వేదాంతాన్ని బోధిస్తుంది. జీవితం పాపకార్య మనీ, వట్టిమాయ యనీ ఎంతగా ప్రచారం చెయ్యబడ్డా మానవ నైసర్గిక మయిన కామాలను, కోర్కెలను ఎవరూ త్యజింపలేకున్నారు. మాయప్రపంచం కోసం విశ్వామిత్రుడు స్వధర్మాన్ని విడిచి గుప్పెడుమాంసం మింగాడు. కామాన్ని అణుచుకోలేక మేనకను ఆశించాడు. 'మాయ' 'వట్టికల్ల' అయితే మన హిందూవేదాంతు లంతా ఆత్మహత్యలు చేసికోలేకపోయారూ రా? "కామమునకు ఫలియైన ప్రాణి యీలోకమునం దిప్పుడు లేదు. ఇంతకుముం దుండినదియు లేదు. ఇక నుండగలుగుటయును లేదు. ఇదే జీవితతత్త్వము" అని ఆవేశంలో వ్యాసుడంతటి ఆర్యధర్మప్రచారకుడు భీమునిచేత అనిపించాడు (చూ. శాంతిపర్వము, ఆపద్ధర్మపర్వము.)

అనంత కాలంలో మానవజీవితం ఒక్కక్షణమే. అయినా ఆ ఒక్కక్షణమే మన యీ అల్పము లయిన కోర్కెలనూ, కామాలనూ తీర్చుకొనే అందుకు ప్రయత్నం చెయ్యకుండా వుండలేము. తక్కువ మానసికబలమును, బుద్ధికల జంతుకీటకాదులలోనే అందమయిన గూడుకట్టుకొందామని, తమాషాగా కిలకిల అరుద్దామని, గెంతుదామని ఇన్స్టింక్టు

కలుగుతూ వుంటే, పరిణామంలో ఆధునిక జీవరాశి అయిన మానవుడు సుఖంగా వుండడానికి ప్రయత్నించడం ఒక మౌలిక సహజ గుణము (Fundamental instinct) గా వుంటుంది. అనంతకాలంలో మనజీవితం అల్ప మయిందని వైరాగ్యం పొందవలసిన అవసరం లేదు. రోజూ బట్టకట్టుకోవడమూ, తీసికోవడమూ ఈవిధంగా ౩౬౫౦౦ (శత జీవికిమాత్రం) రోజులు రొడ్డకొట్టుగా చెయ్యడం చాలా కష్టమే. శాస్త్రవేత్తలు ఒకప్పుడు మనిషికి అమరత్వాన్ని యిచ్చే మార్గాన్ని కనిపెట్టినా ఈ ప్రపంచంలో ఒక నూరువత్సరాల కన్న ఎవ్వరూ వుండ లేదు. అప్పటికే చాలా విసుగుదలగా వుంటుంది. ఈ రొడ్డకొట్టు ప్రపంచంనుండి మళ్లా యే చంద్రలోకానికో సులభంగా వెళ్లకలగే మార్గం వుంటేనేతప్ప అమరత్వాన్ని ఏ మానసికజీవీ కోర దేమో? విశ్వములో వుండే ఈ ప్రపంచా లన్నిటికీ సంబంధ బాంధవ్యా లుండే ఆతమాషారోజులలో మానవుడికి అమరత్వము ఆరోగ్యంగా వుంటుం దేమో కాని ఈప్రపంచంలోనే అంతమయ్యే ఇప్పటి మానవ మానసికజీవులు అమరత్వాన్ని ఆశించనూలేరు; దానివలన సుఖమూ, ఆనం దమూ పొందనూలేరు.

మొదటిలో విదేశీయులదాడికి అవకాశంలేని దేశంలో, సహజనైసర్గికసంపద గల దేశంలో జీవితాన్నిగురించి తీవ్రంగా ఆలోచించడం సహజంగానే వుంది. మనకు ప్రాచీన విఖ్యాతి 'Glorious past' వుంటే అది ఒక భూగోళ మహిమ (Geographical virtue). దానికోసం మనం బుజాలు పొంగించుకోవలసిన అవసరం లేదు. అయితే ఋషులు అందరూ ఆలోచించి ఆలోచించి అనలు ఈ భౌతిక సుఖాలను మించిన అనంతమయిన సుఖాలను పొందుదామనే ఆశతో, కామంతో వీటిని త్యజించారు. ఉపవాసాలూ నిరాడంబరత్వమూ, కామాలను త్యజించడమూ, ఇవన్నీ కూడ ఆత్మహత్య సుళువుగా చేసికోడానికి సరియైన మందు (Medical prescription), దొరకక చేసిన పనులులాగు తోస్తాయి. అభిచారము (Hyponitism), మానసిక-అపస్మారము (Mental-coma) అనే వ్యాధికి గురియైన ఋషులకు ఆధ్యాత్మికానందం కల్గిందేమోకాని అలాంటి మానసిక రోగాలు తెచ్చుకోలేని ఇప్పటి ఆరోగ్యమయిన మనస్సులకు ఆధ్యాత్మికానందం దొరకకుండా వుంది. అందుచేత ఆధ్యాత్మికానందాన్ని నమ్మకుండా భౌతికసుఖాలను అనుభవించడం చాలా ఔచిత్యంగా కనపడుతోంది. భౌతికసుఖాలను ఏదో గుడ్డిగా, విధిబలీయంగా, ఏడుస్తూ చెయ్యకుండా, జీవితానికి భౌతికసుఖాలే పరమావధిగా ఎంచుకొని జీవితాన్ని అనుభవించడమే చాలాసబబుగా అగపడుతోంది. "ప్రపంచముయొక్క ఐక్యత దానియొక్క అస్తిత్వములో లేదు ... ప్రపంచముయొక్క నిజమయిన ఐక్యత దానియొక్క భౌతికత్వములోనేఉన్నది." (Vide 'ఆంటీ డహరింగ్ ఏంజల్సు).

ఆనందం ఎట్లా కలుగుతుంది? సౌఖ్యం ఎట్లా పొందుతాము? ఏమి టీ ఆనందం? రూ-అ-పై ఇస్తే వస్తుందా? లేకపోతే ఇది ఒకవిధమయిన కవిత్వపుఅబద్ధమా? ఆనందం

అనేది కేవలం నరాలగుండా మనస్సులో కగ్గే ప్రతిక్రియా ప్రవృత్తి (Psychological reaction). (అసలు మనస్సు అనే పదార్థము (Entity) లేనే లేదని వాదించే స్వభావ వాదులకు (Behaviourist) కొంచెం వ్యతిరేకం యిది). అందమూ, ఆనందమూ కల్గించేకార్యములూ, తన ప్రత్యేకమనస్సుకు నచ్చిన ఆలోచనలూ, దాని ఆచరణలూ, ఎంతో ఆనందం కల్గిస్తాయి. ఆ ఆనందంకోసం పడేబాధా, యాతనా, శ్రమా అంతా ఆనందాన్నే కల్గచేస్తోంది. ప్రోటానులో ఏమిటి ఉంటుందనో, విశ్వముయొక్క ఆకారము యెలాగు వుంటుందనో, బుర్రనుకాల్చే ఆలోచనలు చేసే శాస్త్రవేత్తపడే శ్రమలోనూ, కీర్తి ధనమూ ఇవ్వకపోయినా ఉన్నతమయిన ఆలోచనలూ, ఆనందాన్ని కల్గించే కవిత్వము చేసే వాఙ్మయకారి అనుభవించే దారిద్ర్యములోనూ ఆనందస్వరూపమే కల్గుతున్నది. సమకాలికులచేత నిరసింపబడ్డ విప్లవకర వుద్దేశాలకోసం జీవితం ధ్వంసం చేసికొన్నవారికి అది ఒక కష్టంగా వుండదు. ప్రహ్లాదుడు, కబీరు, బమ్మెర పోతన్నగార్ల వలె తమ ఆదర్శాలకోసం లౌకికజీవితాన్ని త్యజించి జీవితం ధ్వంసం చేసుకోడంలోనే వారికి ఆనందం కనపడుతుంది. నలుగురి నోళ్లల్లో పడదామనే అహంకారము లేకుండా ఈ దేశాన్ని వుద్ధరిద్దామనే ఆదర్శంతో బాంబుపేల్చి శిరశ్ఛేదనము చేయించుకొన్న వలంటీరుకు వానిత్యాగంలోనేగొప్పఆనందం కల్గుతుంది. 'ప్రకాశం' ఈపని చేసి పేరు ఆర్జించుకొన్నాడు, నేనూ అలాగే చేస్తే పేరు రాదా ? అని తర్కించేసికొని 'పేరు'కోసం ప్రత్యేకం తన మనస్సుకు నచ్చిన సౌఖ్యాలనూ, కామాలనూ వర్జించడం ఆత్మహత్య చేసికోవడమే.

ధనమూ, అవకాశమూ, బుద్ధీ వుండీ కూడా జీవితాన్ని ఆనందంగా ఉండంగా చేసికోలేనివాళ్లు ఎంతమంది లేరు? ఆర్థిక దుస్థితి, మానసికదౌర్బల్యముతో కూడు కొన్న మాధ్యమికతరగతి కుటుంబీకులకు జీవితం ఎప్పుడూ దుర్ఘటంగానే వున్నది. వాళ్లు కొంతసేపూ అల్లా డాక్టరు రమణయ్యలాగు ఒక్క దైనిక సన్నివేశంతో బూర్జువావర్గానికి చెందిపోదామనే ఆశతప్ప మరేమీ వుండవు. వెంకయ్యపంతులున్నాడు: అతను చైర్మెనుపనికూడా చేశాడు. రెండులక్షల వరకూ ఆర్జించాడు. ఆయనకు దూరదేశ ప్రయాణాలు కాని సంగీతంకాని, మంచి కవిత్వం కాని, మధురమయిన ఆహారంకాని, కొనకు సొగసయినబట్టలుకాని ఆతనిమనస్సుకు ఆనందాన్ని ఇయ్యలేకపోయాయి. కొనకి భార్యనైనా ప్రేమించలేకపోయాడు. కవిత్వంకోసం కవిత్వం చేసేవానివలె ఆయన డబ్బుకోసం డబ్బు ఆర్జించాడు. కవికి అందమయిన ప్రకృతిలాగు అతనికి రూపాయిల దొంతులు ఆనందాన్ని యిచ్చేయి. ఇంట్లో దాసీదానిమీదా, బాగా పశవర్తులైన కొడుకుల మీదా, యాచనకోసం వచ్చే బ్రాహ్మణుల మీదా రోడ్డుమీద పోయే కూలీలమీదా అధారిటీ చూపెట్టడంలోనే అతని కానందం కనపడ్డది. అలాంటివాళ్లను చూసి జాలిపడడంకన్న ఏంచెయ్యగలను?

పిల్లలపెళ్లిళ్లూ, యిల్లు కొనడమూ తన సంతానం తనకంటె ఏలాగూ బుద్ధిలేనివాళ్లవుతారు కాబట్టి వాళ్లందరికోసమూ డబ్బు ఆర్జించి నిలవచెయ్యడంతోనే చాలా జీవి

కలుగుతూ వుంటే, పరిణామంలో ఆధునిక జీవరాశి అయిన మానవుడు సుఖంగా వుండ డానికి ప్రయత్నించడం ఒక మౌలిక సహజ గుణము (Fundamental instinct) గా వుంటుంది. అనంతకాలంలో మనజీవితం అల్ప మయిందని వైరాగ్యం పొందవలసిన అవసరం లేదు. రోజూ బట్టకట్టుకోవడమూ, తీసికోవడమూ ఈవిధంగా ౩౬౫౦౦ (శత జీవికిమాత్రం) రోజులు రొడ్డకొట్టుగా చెయ్యడం చాలా కష్టమే. శాస్త్రవేత్తలు ఒకప్పుడు మనిషికి అమరత్వాన్ని యిచ్చే మార్గాన్ని కనిపెట్టినా ఈ ప్రపంచంలో ఒక నూరువత్సరాల కన్న ఎవ్వరూ వుండ లేదు. అప్పటికే చాలా విసుగుదలగా వుంటుంది. ఈ రొడ్డకొట్టు ప్రపంచంనుండి మళ్లా యే చంద్రలోకానికో సులభంగా వెళ్లకలగే మార్గం వుంటేనేతప్ప అమరత్వాన్ని ఏ మానసికజీవి కోర దేమో? విశ్వములో వుండే ఈ ప్రపంచా లన్నిటికీ సంబంధ బాంధవ్యా లుండే ఆతమాషారోజులలో మానవుడికి అమరత్వము ఆరోగ్యంగా వుంటుం దేమో కాని ఈప్రపంచంలోనే అంతమయ్యే ఇప్పటి మానవ మానసికజీవులు అమరత్వాన్ని ఆశించనూలేరు; దానివలన సుఖమూ, ఆనం దమూ పొందనూలేరు.

మొదటిలో విదేశీయులదాడికి అవ కాశంలేని దేశంలో, సహజనైసర్గికసంపద గల దేశంలో జీవితాన్నిగురించి తీవ్రంగా ఆలోచించడం సహజంగానే వుంది. మనకు ప్రాచీన విఖ్యాతి 'Glorious past' వుంటే అది ఒక భూగోళ మహిమ (Geographical virtue). దానికోసం మనం బుజాలు పొంగిం చుకోవలసిన అవసరం లేదు. అయితే ఋషులు అందరూ ఆలోచించి ఆలోచించి అసలు ఈ భౌతిక సుఖాలను మించిన అనంతమయిన సుఖాలను పొందుదా మనే ఆశతో, కామంతో వీటిని త్యజిం చారు. ఉపవాసాలూ నిరాడంబరత్వ మూ, కామాలను త్యజించడమూ, ఇవన్నీ కూడ ఆత్మహత్య సుళువుగా చేసికోడానికి సరియైన మందు (Medical prescription), దొరకక చేసిన పనులులాగు తోస్తాయి. అభిచారము (Hyponitism), మానసిక-అపస్మారము (Mental-coma) అనే వ్యాధికి గురియైన ఋషులకు ఆధ్యాత్మికా నందం కల్గిందేమోకాని అలాంటి మానసిక రోగాలు తెచ్చుకోలేని ఇప్పటి ఆరోగ్య మయిన మనస్సులకు ఆధ్యాత్మికానందం దొరకకుండా వుంది. అందుచేత ఆధ్యాత్మి కానందాన్ని నమ్మకుండా భౌతికసుఖాలను అనుభవించడం చాలా ఔచిత్యంగా కనపడు తోంది. భౌతికసుఖాలను ఏదో గుడ్డిగా, విధిబలీయంగా, ఏడుస్తూ చెయ్యకుండా, జీవితానికి భౌతికసుఖాలే పరమావధిగా ఎంచుకొని జీవితాన్ని అనుభవించడమే చాలాసబబుగా అగపడుతోంది. "ప్రపం చముయొక్క ఐక్యత దానియొక్క అస్తి త్వములో లేదు ... ప్రపంచముయొక్క నిజ మయిన ఐక్యత దానియొక్క భౌతికత్వము లోనేఉన్నది." (Vide 'ఆంటీ డహరింగ్' ఏంజల్సు).

ఆనందం ఎట్లా కలుగుతుంది? సౌఖ్యం ఎట్లా పొందుతాము? ఏమిటీ ఆనందం? రూ-అ-పై ఇస్తే వస్తుందా? లేకపోతే ఇది ఒకవిధమయిన కవిత్వపుఅబద్ధమా? ఆనందం

తాలు నశిస్తున్నాయి. కీట్సు ఈవ్ ఆఫ్ సెంట్ ఎగ్నెస్ (The Eve of St. Agnes) ను కాలేజీలో హార్ది గా కంగా బోధ) పరచే ఇంగ్లీషులెక్చరరు ప్రామిసరీనోటులు, బ్యాంకువడ్డీలు, కొడుకులకు పెళ్లిళ్లు చేసి కట్నాలు సంపాదించడమూ, 'చిత్తం' 'చిత్తం' అని కుక్కలలాగు అధికారులదగ్గర వుండడమూ, ఏవిధంగా చేస్తాడో చాలా జాలికరమయిన విషయం. 'చింతామణివ్యాకరణం' లో ఆంధ్రసారస్వతమూ, సర్వకళలూ వున్నాయని భ్రమపడే తెనుగుపండితుడూ, దొరగారి తాకీదులలో యేవేనా కోపసూచనలున్నాయేమో యని కలలు కనే తాసిల్దారూ, మానసికనీచత్వంమీదా మానవుల కేసులమీదా జీవించే ప్లీడరూ, పదిగ్రామాలు గల ఒకఫిర్కాతో విశ్వం అంతమయిందని 'కాగితం-కలం సిరాబుడ్డీ'తో జీవనం జీర్ణమనుకునే తాణాగుమాస్తా, యూనివర్సిటీ ఆజ్ఞానుసారంగా పుస్తకాలు తిని పరీక్షలు ప్యాసయి 'తెలివితేటల' తోనూ సంస్కారశ్రీగల్భాల (Cultural pretensions) తోనూ గర్వపడే కాలేజీవిద్యార్థులను—వీరందర్నీ చూస్తే జాలివేస్తుంది. పాపం జీవితాన్నీ, యీ కాలాన్నీ, సుందరమయిన అవకాశాన్నీ, వెన్నెలప్రపంచాన్నీ, ఆరాటమూ చికాకులూ లేని చైతన్యంతో కూడుకొన్న ప్రకృతి సౌందర్యాన్నీ, మనిషికీ మనిషికీ పెనవేసుకొంటూవున్న యీ మానసికప్రేమ ఔన్నత్యాన్నీ అనుభవించలేకపోతున్నారే! చిరునవ్వులూ, యౌవనంలో ఆవేశమూ, స్నేహమూ, అందమూ, సంగీతమూ... అనుభవించలేకుండా జీవితాన్ని ఎంతమంది పోగొట్టుకొంటున్నారోకదా!

మధురమయిన సంగీతం సహజంగా ఆనందం ఇస్తుంది. కాని సంగీతసభలలో అల్లప్రామిసరీనోటు కాలదోషం పడుతుందనో, యింట్లో కూర లేదనో, ఆలోచించుతూ సంగీతం విన్నట్లు నటించేవాళ్లూ వుంటారు. సంగీతం గ్రహించలేనివాళ్లు దుష్టు లవుతారని షేక్స్పియరు చెప్పాడని చదువుకున్న కాలేజీమాస్టరు విధి బలీయంగా గ్రహిస్తూ వుంటాడు సంగీతం అంటే 'సరిగమప' లతో కుస్తీపట్లు అనుకునే శాస్త్రజ్ఞుడు బుర్ర వూపుతూ అనుభవిస్తాడు. తనకు తెలియని ఆవేశంతో పరవశ మయ్యే రసికుడూ వుంటాడు. భౌతిక దేహాన్నీ, దేశకాలములనూ మరచి అనంతమయిన సౌఖ్యాన్ని పొందే ఆధ్యాత్మికుడూ వుంటాడు.

మనపూర్వులు తలచినట్లు మానవ ప్రవృత్తి, ప్రపంచనాటకం, సనాతనంగా వాచీలాగ ఒకతీరకంగా యుగయుగాలూ సంభవించదు. పక్షులు కిలకిల లేచి మధురంగా అరచి సూర్యోదయం అయినక్షణంలో మనప్రపంచానికి ఒక నవీనత్వమూ కల్గుతున్నది. పృథివియందు ఏనాడో ఉద్భవించిన ఈ అతిపురాతనదినము ప్రతి ప్రభాతమునందునూ, నూతనజన్మనూ, నవీనత్వమునూ బొందుతున్నది. ఈ చిరనవీనత్వమే మనజీవితాలకు ప్రోద్బలంగావుంది మనం పూర్వులకన్న నాగరికుల మని అభిప్రాయపడేవారికి ఆధునికశాస్త్రజ్ఞుల యత్నము అంతా బూడిదలోపోసిన పన్నీరుకాదని, తెలిసికొంటారు. ౧౯-వ శతాబ్దపు ప్రత్యక్ష జ్ఞానవాదులు (Positivist) రమారమీ మాయావాదానికీ, మిథ్యావాదానికీ దారితీసినా ఇరవయివ శతాబ్దపుఫ్రూడీ, ఈన్స్టన్, ప్లాంకూ, భౌతిక

జగత్తు నీడలాంటిది కాదని పదార్థంయొక్క భౌతికత్వాన్ని నిరూపించారు. కాలమూ, ఆకాశమూ ఎట్లు అనంతమో మానవబుద్ధికూడ అనంతము. నీసిజీచెప్పిన శాశ్వతపునరావృత్తి సిద్ధాంతాన్ని ఎవరూ అంగీకరించలేరు. 'నడిసముద్రపునావరీతిగ' సైన్సు ఇలాగు ప్రయాణం చెయ్యడంలోనే దాని ఆధిక్యత. మనమార్గం రాజమార్గంగా ఉన్నప్పుడు అదెక్కడికి వెళ్లుతుందో అనే తొందర ఎందుకు? నిజానికి గమ్యస్థానం మనం చేరుకోవలసిన అవసరం లేదు. సత్యాన్ని గబుక్కున తెలిసికొని సిగరెట్టుపెట్టెలాగ జేబులో దాచుకోడం లేదు. సత్యంయొక్క - ఆధిక్యత - దాన్ని తెలిసికోడానికి శ్రమిస్తూ విజయాలు పొందే ఆసాధనలోనే వుంది మానవాత్మకు సౌఖ్యమూ, మోక్షమూ.

భౌతికశాస్త్రం, మానసికశాస్త్రం, ఇలాగు ఒకదాని తర్వాత మరొకటి విసర్జిస్తూ కొత్త సిద్ధాంతాలను తీసికొనిరావడమేనా? ఎప్పటికయినా ఒకస్థిరమైనసత్యాన్ని కనిపెట్టగల స్థితికి వస్తుందా? ఊసరవెల్లి (కెమీలియను)లాగు ఇలాగు గడియగడియకు రంగులు మారుస్తూ సైన్సువుండడమేనా? స్థిరత్వమూ, సత్యమూ, లేని సిద్ధాంతాలకోసం ఈయాతనా, బుద్ధినరాలను ఛేదించడమూ ఎందులకు? మానవుడు జన్మించి ఇప్పటికి ముప్పదికోట్ల సంవత్సరాలయినా స్థిరమయిన జీవితవేదాంతాన్ని తెలిసికొన్నాడా? అనిపిస్తుంది. సిద్ధాంతములు తప్పయితే నేటి నాగరికత అంతా ఎట్లు కల్గింది? అసలు విజ్ఞమేమిటంటే మానవబుద్ధికీ, మనస్సుకూ, 'చలియలికట్ట' అంటూ ఒకటిలేదు. పరివర్తన మొక్కటే నిత్యవస్తువన్నాడు ఏంజెల్సు. ఇదే జీవితసత్యం!

ఈ దేశీయుల జీవితాన్ని ఇంత నిస్సారంగా, రుచిలేకుండా చేయడానికి మానసికంగా గట్టిపునాది వేసినది ఆరువందల సంవత్సరాలక్రిందటి మాయావాది శంకరుడు. ఈ దేశంలో విజ్ఞానం, శాస్త్రములూ, కళలూ, సర్వమూ వృద్ధి, లేకుండా జీవితంలో వున్న తమాషా, హాస్యమూ, నవ్వూ, ప్రతిభను మూలచ్ఛేదం చేసింది ఆమానసికరోగి—శంకరుడు. అతడిప్రతిభ ఎల్లా ఉన్నా జీవమూ, తేజస్సూ లేని మన దైన్యజాతి నిర్భాగ్యానికీ, దారిద్ర్యానికీ, బానిసత్వానికీ అతడే అతడే కారకుడు. 'ఆధ్యాత్మికఔన్నత్యంలో' శరీరాన్ని, మానవప్రతిభను, ప్రకృతిని, నిర్లక్ష్యంచేశాము. దానిఫలితం అనుభవిస్తున్నాము. ఇంకా కొన్నివందల యేళ్లు అనుభవిస్తాము. అది నిజం! శంకరుడి మాయావాదాన్ని దిద్దబోయినవారు లేకపోలేదు. రామానుజుడూ, వల్లభ, మాధవులూ భారతదేశానికి కల్గిన యీ 'మాయావాదపు' వ్రణంలో గల బాధనే తగ్గించకల్గారుకాని, వ్రణాన్ని కోసి చికిత్సచెయ్యలేకపోయారు. శంకరుడి 'మాయావాదం' జీవితమాధుర్యాన్ని పాలలో మజ్జిగబొట్టులాగు విరిచివేసింది. కుములుతూ, మూల్గుతూ జీవితంలో ఏఆనందమూ, ఆదర్శమూ, సౌందర్యమూ, త్యాగమూ లేక, వుండి వుండి కొవ్వువత్తులలాగు మనవారు తెలియకుండా ఆరిపోతున్నారు.

విశ్వంలో మనం ఉన్న యీభూమి ఉనికి ఒక ఘటినాఘటితం. విశ్వపరిణామంలో భూమి చాలా చిన్నవయస్సుది. విశ్వంలో

ఒక గొప్ప సంచలనం కలిగినపుడు, విప్లవం కలిగినపుడు, ఈ భూమీ, జీవరాసులూ వుద్భవించాయి. ఈ తమాషా, నవ్వూ హాసమూ, అందమూతో ఉన్న ఇలాతలం ఎంతకాలం వరకు నిలుస్తుందో? ఆధునిక శాస్త్రాలయినా ఇదంతా ఏలాగో చెపుతాయి. 'ఎందుకు' అంటే ఎవరికీ తెలిసినట్లుగా కనపడదు. కపీమని ఈశాంతీ, నవ్వులూ, ప్రకృతినిశ్చలత్వమూ పోయి యథాప్రకారంగా వుంటుందేమో? ఒక్కమాటు యీప్రపంచం అంతా శూన్యము (Vacuum) అయిపోతేనో? ఒకభూకంపం వచ్చి తిరగల్లా పడిపోతేనో?... అని భయం వేస్తుంది. ఆరుదిక్కుల మధ్యను నివసిస్తూ వున్న ఈ జీవరాసులూ, మృత్యువుయొక్క నీడలాంటి ఈ నిద్రా, ఏమిటో?

'ఎందుకలాగు తిరుగుతారు?... మీకీ భావయోగం (Mysticism) ఇంకా పోలేదు. విజ్ఞానం ఆధునిక జగత్తు (Science and Modern world) ను చదవండి. భావకవుల్లాగు నిర్వేదవాదు (Pessimist) లు అవుతున్నారు..." అంటాడు సుందర్రావు స్నేహితుడు. "మానవజీవి ప్రపంచంలో ఉద్భవించి కోట్లకొలదిసంవత్సరా లయింది. అయినా ఇంకా భోజనమూ, బట్టకట్టుకోడం తోనే చాలా జీవితాలు నశిస్తున్నాయి. ఈర్ష్యా, దంభమూ, నీచత్వమూ, మానవ హృదయాలనుండి పోలేదు...." అనిపిస్తుంది.

ఎందుకీప్రయాసం? 'గిరీశం' లాగు లోకాన్ని మరమ్మతు చేద్దామనే వుద్దేశంతో వున్నానా?...అనుకొంటుంది శ్రమపడ్డఆత్మ.

'మూర్తి'లాగు ఏదో పనిచేసికొంటూ, బ్యాంకులో డబ్బు దాచుకొంటూ, పిల్లలను కనుక్కొని వాళ్లని బాగుచేసికొని 'సంసారపక్షం'గావుండకూడదూ? — అంతేనా? ఆ చెదపురుగులలాగు, నిదురపోతులాగు వుండవలసిందేనా?. ... ఛా! ఛా! ఆత్మహత్య అంతకంటె మేలు—ఎవడికి తట్టిందో ఈ 'ఆత్మహత్య' వుద్దేశం మొట్టమొదటిసారి ఇలాతలంలో! చాలా ప్రతిభావంతు డయి వుంటాలి.



వ్యాధి

శ్రీ ఆదిభట్ల రామమూర్తి

గాఢ సంతాప వల్మీక గహ్వరమున
బార లెగరోజుకొని, కళావలయములను
గాయపరచెడు విషదంష్ట్రికలచు బుస్స
కొట్టుచుంటివె? ఓ నల్ల కోడెత్రాచ!

విస్మృతి తమస్సులో విలపించి, యెపుడో
కరిగిపోయిన కాలమ్ము పొరలనెల్ల
వెలుగు దరికీడ్చు భావనా బలము చూఁచి,
కండ్ల జీడేల? ప్రబల రుగ్మత విషాహి!

నాల్క కొనలను అగ్ని ఖండాల నేరి,
బూమిక సందుల విషమును పుక్కిలింతె?
ఎందుకింతటి ఈర్ష్య? మరంద భావ
కోరకితమైన హృన్నవాంకురములందు.

పాలపొంగుల యౌవన ప్రాభవమ్ము
కాల్చి వేసిన నీకేమి కడుపు నిండు?
నీరసించిన శుష్క శోణితకణాల
ఆశ్రయించితి; అమృతమున్నదియె, యందు?

వెలికినుబికెడు ఆనందవీచికలను
ఆర్ద్రిమొనరించుకొనెడు హృదంతరాళ
మందు తొణికెడు జీవనిష్యంది నెల్ల
కఠినబాధాగ్ని విస్ఫులింగములు కురిసి,
ఇంకఁ జేతువె? నీ బుద్ధి క్రుంకిపోను!

రక్తమోడ్చెడు కాళరాత్రమ్ములందు
బ్రదుకు చమురును పీల్చు నిరాశదీపి
కలవెలుంగున నా గుండెకాయ నదిమి
పట్టికబళింపఁ జూతువే పాడువ్యాధి!

చలువ వెన్నెల నిప్పతున్కలను రాల్చు
మృత్యు కైశిక కాళిమ శ్రీలమంద
హాసరేఖలఁ బిండగలట్టినన్ను
చెనక జూతువె? రోగమా! సిగ్గుమాలి.

గాలి పింజల వలపుదు కూలములను
పొరలు స్వప్నంపు జిల్గు క్రొందెరలలోన
నిదురమడతలమైకమ్ము వదలు ప్రేయ
సీ నవప్రేమనాద సంధానమున్న
పడగవాల్చెదె? ఆ మయవ్యాళరాజ!

రోగ కారాగృహాంతిక భాగమందు
కుములు చున్నట్టినా పేదగుండెఁ జూచి,
విషపు నవ్వుల లోకమ్ము విరిసి, హేళ
నా ఫలమ్ముల రాల్చుకొనంగ నిమ్ము.

నీలిరక్తంపు నూలు కండెలను నేయు
వెతల వలువను నాటి జాగ్రత యొనర్తు;
శిశిర యౌవన మధురవంశీరవమ్ము
అణువు అణువున కరుడు గట్టిన వసంత
భావశోభార్ణవతరంగ పంక్తిఁ దోగు
హృదయగోళమ్మున తుపాను రేగనిమ్ము.

జాడ్యమా! సౌఖ్య తీరప్రశాంతిఁ జేర్చు
కలము చిందుల తెప్పను గట్టుకొందు;
కీరితీ! నీకు నాకెంత దూరమున్న
దోకదా! ఎండమావుల బూకరించు
నీకొఱకు కష్టమునఁ బ్రయాణించునాడు
ఉల్లిపొర జీవితపు చేల మెల్లఁ దెవులు
చిమ్మట హరింపసాగె; కానిమ్ము కాల
మృత్యువను డోలినెక్కి నిన్నెన్నడేని,
విస్మృతి పథమ్మునకై వాయువేగమునను
కలియకుందునె? కాల చక్రమ్ము ద్రిప్పి
మృత్యు దేవత నీ యన్ను భృత్యవంచు
కలదుగర్వమ్ము-ఉండనీ-కాలవాహి
నులకు నెదురీది, తుంగముస్తెల విధాన
నాటుకొని కీర్తికోణమ్మునన్, విలాస
దర్పమెడలింతు, ఆత్మాంకురార్పణాన.

సోవియట్ రష్యా పారిశ్రామికపద్ధతి

శ్రీ ఆకుండి వెంకటేశ్వరరావు

దేశం ఎంత సస్యసమృద్ధితో తులతూగుతున్నా, పారిశ్రామికాభివృద్ధి లేనిదే సర్వతోముఖాభివృద్ధి కాని, ఇతర దేశాలలో ఆ దేశానికి గౌరవ ప్రతిపత్తులు కాని కలుగటాని కవకాశాలు లేవు. మనదేశపు ప్రస్తుత పరిస్థితులే దాని కుదాహరణ. సస్యసంపదలో మనదేశం ప్రపంచంలో, అగ్రస్థాన మలంకరించినా పాశ్చాత్య దేశాలలో మిగిలిన విషయాలలో ఏచిన్న పాశ్చాత్యదేశానికున్న స్థానంకూడా లేదు. ఇంచుమించు పాశ్చాత్యదేశా లన్నీకూడా, తమ పారిశ్రామికాభివృద్ధివల్లనే కొన్ని వ్యావసాయిక దేశాలనుకూడా లోబరుచుకొని రాజ్యాధికారం చెలాయిస్తున్నాయి. ఆలోచించి చూస్తే ఇంగ్లండు, జర్మనీ, ఇటలీ, రష్యా మొదలైన దేశాలన్నింటి ఔన్నత్యానికీ ఆయా దేశాల పారిశ్రామికసంపదయే కారణం అని తెలుస్తుంది.

ఈ పారిశ్రామికసూత్రా న్ననుసరించి అభివృద్ధి పొంది, ప్రస్తుతం ప్రపంచం అంతటికీ అధిష్ఠాన దేవతయై కూర్చున్నది రష్యాదేశం. అట్టి రష్యాయొక్క పారిశ్రామికాభివృద్ధినిగూర్చి తెలుసుకోటం, అభివృద్ధి నాసించే అన్నిదేశాలకూ అవసరం.

రష్యాలో విప్లవ మంత మొందగానే నూత్న ప్రభుత్వం తన సర్వశక్తులను వినియోగించి, సాధ్యమైనంత త్వరలో, దేశము నన్నిరంగాలలో అభివృద్ధి చెయ్యాలని నిశ్చయించుకుంది. కాని వీరి ప్రయత్నాలను భంగపరిచి వీరి కనేకచిక్కులను కల్పించటమే ప్రధానోద్దేశ్యంగా పెట్టుకొన్నవారు కూడా వుండటం వల్ల వారికోరిక అనుకున్నంత త్వరలో ఫలించలేదు. విప్లవ మంత మొందినవెంటనే, నూతన పారిశ్రామిక ప్రభుత్వం, దేశంలో పనిశ్రమలను, వ్యవసాయాన్ని ఎక్కువ అభివృద్ధి చెయ్యాలని ప్రారంభించింది. కాని దేశంలోని శత్రుపక్షములవారు, ధనికవర్గంవారు ప్రభుత్వ ప్రయత్నాలను భంగపరచటాని కనేక ప్రయత్నాలు చేశారు. వీరికి చుట్టుప్రక్కలవున్న ధనిక రాజ్యాలవా రమితంగా సహాయంచేశారు. కనుక ఈ ఆటంకా లన్నిటినీ నివారణ చేసుకోటానికి అప్పుడు తమ స్వాధీనంలో వున్నకొద్ది ఆర్థిక సైనికబలాన్ని వినియోగించవలసి వచ్చింది. వీని సహాయార్థం అప్పుడు దేశంలో వున్న కొద్దిపాటి పరిశ్రమల ఉత్పత్తి ప్రభుత్వోపయోగానికే సరిపోయేదికాదు. అదైనా అప్పుడు వుత్పత్తిలో ప్రభుత్వాని కుపయోగమైనదానిని వారి కూరికే ఈయవలసి వుండేది. దేశంలో వుత్పత్తియైన వస్తుసముదాయాన్నంతా వూరికే ప్రభుత్వాని కర్పించవలసి వచ్చుటచేత, ఆ పరిశ్రమ లభివృద్ధి కవకాశం లేకపోవటమే కాక, క్రమక్రమంగా క్షీణించ ప్రారంభించాయి. దీని ఫలితంగా విప్లవానంతరం, విప్లవానికి పూర్వంవున్న ఉత్పత్తిలో 3-వ వంతు తగ్గిపోయింది.

దేశాభివృద్ధికి పరిశ్రమాభివృద్ధియే మూలమని నమ్మిన, నూత్న ప్రభుత్వాని కిది చాల అరిష్టదాయకంగా కనుపించింది. కనుక యీ ఉపద్రవాన్నుంచి దేశాన్ని రక్షించటానికి, మార్చి ౧౯౨౧ లో జరిగిన ౧౦-వ కాంగ్రెసులో నూతన కమ్యూనిస్టుపార్టీ ప్రభుత్వంవారు సమావేశమయి ఆలోచించారు. ఆ సమావేశంలో దేశం అభివృద్ధిచెందాలంటే యుద్ధకమ్యూనిజపు (War Communism) పద్ధతు లన్నింటినీ విరమించుకోవాలని నిశ్చయించుకున్నారు. దీని ననుసరించి ౧౯౨౧ ఆగస్టునెలలో ప్రభుత్వంవా రొక డిక్రీ చేశారు. తత్ఫలితంగా దేశంలోని పరిశ్రమ లనేకం ప్రభుత్వపరం చేయబడ్డాయి. ఇల్లా చేయబడిన పరిశ్రమలకు పూర్తి స్వాతంత్ర్య మియ్యబడింది. ప్రభుత్వం వారికూరికే వస్తువులను సప్లయిచేసే పద్ధతిపోయింది. పరిశ్రమకు కావల

సిన ముడిపదార్థములను, బొగ్గు మొదలైనవాటిని, యంత్ర సామగ్రిని తాము స్వయముగా నిలవ చేసుకోవచ్చును. పరిశ్రమాగారములలో తయారైన వస్తుసామగ్రిని మార్కెట్లలో తగు ధరలకు అమ్ముకోవచ్చును. ఇంకా ఇటువంటి ప్రరిశ్రమల కుపయోగమైన పద్ధతు లనేకం ఏర్పాటు చేయబడ్డాయి.

న్యాయం ఆలోచిస్తే ఈ డిక్రీపద్ధతులు కొంత వరకు, కమ్యూనిస్టుపార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకం. ఎందుచేతనంటే, దీనివలన ధనికవర్గ విజృంభణానికి కూడా కొంత అవకాశం కలుగుతోంది. కాని యిది నిజంగా ప్రభుత్వాని కిష్టం లేకపోయినా, ఆక్లిష్ట పరిస్థితులనుండి తప్పించుకొని, శాశ్వత క్షేమమార్గాన్ని అవలంబించి ముందుకు పోవటానికే అట్లా ఒకఅడుగు వెనక్కు వెయ్యవలసి వచ్చింది. అప్పుడైనా, దేశంలో ముఖ్యావసరమైన బ్యాంకింగుపద్ధతి, అంతర్జాతీయ వ్యాపారం, ఎలక్ట్రిక్ పవరు యంత్రాలను, రాకపోకల సాధనాలను, ఆయుధ సామగ్రిని, తదితర ముఖ్యమైన యంత్రసామగ్రిని తయారుచేయు పరిశ్రమాగారాలన్నింటినీ ప్రభుత్వం తనచేతుల్లోనే వుంచుకొని, మిగిలిన చిన్నచిన్న పరిశ్రమదారులను మాత్రం విచ్చలవిడిగా వదిలివేశింది. వీరికెంత స్వాతంత్ర్యం ఇచ్చినా, వారి పరిశ్రమలకు కావలసిన ముడిసరకులకు, యంత్ర సామగ్రికి, ప్రభుత్వ వశంలోవున్న పెద్దకర్మాగారాల మీదనే ఆధారపడవలసి వుంది. అందుచేత దేశములోని చిన్నచిన్న పరిశ్రమా గారాలెన్ని ధనికవర్గాధిపత్యంలో పనిచేసినా ప్రభుత్వ ఆర్థిక విధానానికే విఘమైన లోపం కలుగలేదు. అదిగాక యీ పద్ధతివలన గ్రామములోని చిన్నచిన్న పరిశ్రమదారులు, వ్యవసాయదారులు, తమ తమ వ్యాపారములను అభివృద్ధి చెయ్యాలనే వుద్దేశ్యంతో, ఎక్కువ ఉత్సాహం చూపిస్తారు. దీనివలన పట్టణాలలో ప్రభుత్వాధికారంలో వున్న పెద్దపెద్ద పరిశ్రమలకు, ఈ పల్లెలకు ఎక్కువ సంబంధ బాంధవ్యము లేర్పడి, తద్వారా సోషలిస్టు ప్రభుత్వార్థిక విధానాని కెక్కువ సహాయపడుతుంది. పట్టణాలలోనున్న పెద్ద పారిశ్రామికులకు, పల్లెలనుండి ముడిసరుకు లనేకం రావాలి. పల్లెల ముడిపదార్థాల వ్యవసాయం తీవ్రంగా జరగాలంటే, పట్టణాలనుంచి వారికి తగిన సాధనసామగ్రి రావాలి. కనుక యీ విధంగా ఇరు వర్గాలవారికీ ఒకవిధమైన సన్నిహిత సంబంధం ఏర్పడుతుంది. ఇటువంటి సంబంధమే సోషలిస్టు ఆర్థిక విధానానికి ముఖ్యావసరం. ఈ సంబంధం ఏర్పరుచుకోటానికి, పైచెప్పినట్లుగా, ప్రభుత్వం ఒక్కఅడుగు వెనక్కు వెయ్యక తప్పిందికాదు. అందువలన ౧౯౨౪ సం॥లో దేశంలో అసంఖ్యాకములైన చిన్నచిన్న పరిశ్రమాలయాలను స్థాపించి, ధనికవర్గంవారు, కొంత వరకు, అప్పటి ఆర్థికవిధానాన్ని తమహస్తగతం చేసుకున్నారు. తత్కారణంగా ౧౯౨౩-౨౪ సం॥లో పరిశ్రమల్లోను, వ్యాపారంలోను సగంభాగం, యీచిన్న ధనికవర్గాల చేతుల్లోనే నడిచింది. ౧౯౨౫-వ సం॥లో సోషలిస్టుప్రభుత్వం, పరిశ్రమలపైని పెట్టిన పెట్టుబడి ౨౨౬౮ కోట్లు రూబుల్సు. అయితే, చిన్నపరిశ్రమదార్ల పెట్టుబడి ౨౦౮౯ కోట్లరూబుల్సు అనగా మొత్తం పరిశ్రమల్లో ౪౫% వారి చేతుల్లో వుండే దన్నమాట.

కనుక ఇటువంటి క్లిష్టపరిస్థితుల్లో, ప్రభుత్వం వారీనూతన ఆర్థికవిధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానాన్ని ప్రవేశపెట్టిన కొద్దికాలానికే చాలా విజయవంతంగా పనిచేసింది. యుద్ధానికి పూర్వం ౧౯౨౦ లో మొత్తం ఉత్పత్తిలో ౨౦% తగ్గిపోయింది. కాని యీ నూతనవిధానంవల్ల ౧౯౨౬ సం॥నికి పారిశ్రామిక వుత్పత్తి ౯౯% హెచ్చింది. పూర్వం పరిశ్రమలన్నీ, ప్రభుత్వంచేత నియమింపబడిన సుప్రీమ్ ఎకనమిక్ కౌన్సిలు అనే ఒకసంఘంచేత నడిపింపబడుతుండేవి. వారి యాజమాన్యంలో వున్న పరిశ్రమలుకూడా నూతన విధానంవలన ౪% హెచ్చు వుత్పత్తి చేయకలిగాయి. ౧౯౧౩ లో కంటే ౨౮ లో ఉక్కు ౪౨%, బొగ్గు ౧౧౩%, ప్రత్తి ౧౦౬%, యంత్రాలు ౧౩౫%, ఇనుము ౮౧%, రోల్డు అయిరన్ ((Rolled iron) ౮౩%, చొప్పున అభివృద్ధి పొందాయి. ౧౯౨౪ సం॥లో మొత్తం పరిశ్రమల విలువ ౩౪ కోట్లరూబుల్సు అయితే, ౧౯౨౮ సం॥లో అది ౪౦ కోట్లురూబుల్సుకు హెచ్చింది. వీనితోపాటు వర్తకవ్యాపారాలు, రాకపోకలు, తదితరమైన సాంఘికజీవన సౌకర్యాలుకూడా, చాలా అభివృద్ధి పొందాయి.

ఈ నూతనార్థికవిధానం ప్రకారం సొంత వ్యవసాయం, సొంతవ్యాపారాలను చేసుకోటానికవకాశం వుండటంచేత, ప్రతివారికీ సొంత వ్యాపారాలను చేసుకొని ధనార్జన చెయ్యాలనే ఆశ ఎక్కువైంది. దానికొరకు అనేక మార్గాలను, తంత్రాలనుకూడా అవలంబించటం ఆరంభించారు. పరిశ్రమలు, వ్యాపారం ఉత్పత్తి అధికమైనప్పటికీ, ధనాశాపీడితుల సంఖ్య అంతకంటె ఎక్కువై పోయింది. అందుచేత పెట్టుబడిదారులు, ధనికులు మాత్రమే ధనరాసులను కూడబెట్టుకొని తులుతున్నారు. కాని, సామాన్యజనులు తిండితిప్పలకుకూడా కరువుపడవలసి వచ్చింది. ఇటువంటి పరిస్థితులలోనే, సామాన్యజనులక్షేమంకోసం ప్రభుత్వంవారు సమష్టి వ్యవసాయపద్ధతిని ప్రవేశపెట్టారు. (ఈ విషయాన్ని గూర్చి విపులంగా వెనుకటి సంచికలో వ్రాయబడింది.) ఈ పద్ధతిని జయప్రదంగా సాగించటానికి యంత్రసహాయం ముఖ్యావసరమైంది. యంత్రసహాయం లేనిదే సమష్టివ్యవసాయపద్ధతి కొనసాగదని ప్రభుత్వానికీ, ప్రజలకూకూడా స్పష్టపడింది. కాని అప్పుడు దేశంలో యంత్రాలను తయారుచేసే పరిశ్రమలు లేవు. కనుక యంత్రాలకోసం ఇతర దేశాలమీద ఆధారపడవలసి వచ్చింది. ఇతర దేశాలనుంచి యంత్రాలను తెచ్చుకుంటే తమ దేశంలోని ముడిపదార్థాలను, ఆదేశాలకు సప్లయి చెయ్యాలి. అల్లా చేసినట్లైతే దేశంలో సప్లయి తక్కువై, ప్రజలు కష్టపడవలసివస్తుంది. పైగా చుట్టుపట్లరాజ్యాలనేకం రష్యానెల్లాగైనా తమ మార్కెట్టుగా చేసుకొని దోచుకోవాలని చూస్తున్నాయి. ఈ విషయాలన్నీ ఆలోచించి సోషలిస్టుప్రభుత్వం, పారిశ్రామికాభివృద్ధి ముఖ్యంగా యంత్రపారిశ్రామికాభివృద్ధి చేస్తేనేగాని, తమకు ప్రపంచంలో నిలువ నీడలేదని గ్రహించి, సమష్టివ్యవసాయపద్ధతితోపాటు యంత్రపరిశ్రమలనుకూడా కేవలం ప్రభుత్వయాజమాన్యంగా అభివృద్ధిచేసుకోవాలని నిశ్చయించుకుంది. కాని దేశంలో సొంత పారిశ్రామికుల, వ్యవసాయదార్ల ఆర్థికవిధానం (Kulak Economy) చెలరేగుతున్నంతకాలం తమ ప్రయత్నం సఫలం కాజాలదని గ్రహించి, దేశంలోని సొంత వ్యవసాయాన్నీ, పరిశ్రమలనూ పూర్తిగా అరికట్టి, సర్వంకూడా తన స్వాధీనంచేసుకొని సమష్టిపద్ధతిలో నడిపించాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. దీనినైనా ఒక్కసారిగా చేస్తే చాలా ప్రమాదం సంభవిస్తుందని, దానికొక క్రమపద్ధతిలో నెరవేర్చటానికొక ప్రణాళికను తయారుచేశారు. అదే పంచవర్ష ప్రణాళిక.

ఈ ప్రణాళిక ప్రవేశపెట్టబడిన కొద్దికాలానికే దేశంలో అనేకవిధాలుగా అభివృద్ధి కనబడింది. ప్రభుత్వవశంలో వున్న పరిశ్రమ లెక్కువ అభివృద్ధి పొందటానికనేక అవకాశా లేర్పడ్డాయి. ఈ కర్మాగారాలలో తయారయ్యేవుత్పత్తి అనేకరెట్లు అధికం కావటంవలన సొంత పెట్టుబడిదారుల పరిశ్రమలు, వ్యవసాయం అడుగంటిపోయాయి. ప్రణాళిక ప్రారంభంలో అనగా ౧౯౨౮ లో మొత్తం ఉత్పత్తికి ౧౫౭ కోట్లు రూబుల్సు విలువ అయితే ౧౯౩౨ లో ౩౪౩ కోట్ల రూబుల్సు విలువగల ఉత్పత్తి తయారయింది. అంటే ఈ ౫ సం॥రాలలో ౨౮౪% హెచ్చింది. ప్రభుత్వంచేసే ప్రతి ప్రయత్నానికీ ఇతర దేశీయుల ప్రోత్సాహబలంతో ప్రతికక్షులనేక ఆటంకాలను కల్పిస్తూనే వచ్చారు. సోషలిస్టు ఆర్థికవిధానాన్ని కూలద్రోయటానికనేకకుట్రలు కూడా జరిగాయి. ౧౯౩౦ లో ౮ మంది ఇంజనీర్లు కుట్రచేసి పట్టుపడ్డారు. ౧౯౩౧ లో ౧౪ గురు ప్రొఫెసర్లు, ప్రభుత్వాధికార్లు అనేకులు అనేకకుట్రలు పన్ని పట్టుపడి శిక్షింపబడ్డారు. కాని అన్నింటినీ ప్రతిఘటించి ప్రణాళికను, అనుకున్నప్రకారం ౫ సంవత్సరాలలో కాక, ౪¼ సం॥లోనే పూర్తిచేయటం చాలా ప్రశంసనీయం. ఈ ప్రణాళికతో సాధింపబడినవి. ముఖ్యమైనవి రెండు. (౧) సమష్టి వ్యవసాయం. (౨) సమష్టి పారిశ్రామిక నిర్మాణం. మొదటి దానివలన దేశంలోని సర్వజనాళికి హెచ్చుతగ్గులు లేకుండా కడుపునిండా తిండిదొరికే అవకాశం ఏర్పడింది. రెండవ దానివలన, దేశానికంతకూ సర్వసమృద్ధిగా సరిపోయే వ్యవసాయాని కుపయోగించే యంత్రసామగ్రి నంతను, ఇతర దేశాధారం లేకుండా

స్వయంగా నిర్మించుకో గలిగింది. మొత్తానికి రెండు విధానాలుకూడా ఒకదానిమీద ఒకటి పూర్తిగా ఆధారపడివున్నాయి. అందుచేత పట్టణానికీ పల్లెకూ ఒకవిధమైన అవినాభావసంబంధం ఏర్పడింది. పల్లెటూరివారు కూడా ఈ సంబంధంవలన ఎక్కువ విజ్ఞానవంతులై, కమ్యూనిజంయొక్క పూర్తి అర్థాన్ని గ్రహించి, ఆ సిద్ధాంతాల ననుసరించి లాభం పొందారు. యంత్రసహాయంయొక్క లాభాన్ని గ్రహించి ఆ యంత్రవిధానాన్ని (Mechanisati n) తమ వ్యవసాయంలో వుపయోగించుకున్నారు. ఈవిధంగా యీ పంచవర్ష ప్రణాళిక పూర్తి అయ్యేసరికి దేశంలో నిరుద్యోగ సమస్య, కరువులు, ఆకలిమంటలు పూర్తిగా నశించి సర్వజనానికి సౌఖ్యజీవితం ఏర్పడింది. ఏదేశానికైనా ఇంతకంటె ఏమికావాలి?

మొదటి పంచవర్ష ప్రణాళికను జయప్రదం చేయటానికి ప్రజ లమిత ఉత్సాహంతో పనిచేశారు. వీరి ఉత్సాహఫలంగా ప్రజలందరు క్రమపద్ధతిగల ఒక ఉద్యమాన్ని స్థాపించారు. ఇదే షాక్ బ్రిగేడ్ ఉద్యమం. సోషలిస్టు సిద్ధాంతాలను, ప్రణాళిక ప్రధానోద్దేశ్యాలను ప్రజలకు బోధించి తీవ్రప్రచారంచేసి ఉత్పత్తిని అభివృద్ధిచేసి జాతీయజీవిత వికాసాన్ని కలిగించే మార్గాలను బోధించడమే వీరిపని. క్రమంగా ఇదే రెండవ పంచవర్ష ప్రణాళికలో స్టాఖనోవ్ ఉద్యమంగా మారింది. పరిశ్రమలలో ఎక్కువ శ్రద్ధవహించి, మంచిపనితనమును సంపాదించి, ఉత్పత్తి నధికంగా, అభివృద్ధిచేసేలాగు ప్రజల కుత్సాహశక్తులను ప్రబోధించటమే ఈ ఉద్యమాభిప్రాయం.

ఈవిధంగా మొదటి పంచవర్ష ప్రణాళికలో ప్రజలు చూపించిన అమితోత్సాహవిజయములే, ప్రభుత్వాన్ని రెండవ పంచవర్ష ప్రణాళికను ప్రవేశపెట్టుటకు ప్రోత్సాహించినవి. పైగా మొదటిప్రణాళికాంతానికి వ్యవసాయము, దానికుపయుక్తమైన యంత్రపరిశ్రమలు అభివృద్ధిపొందినప్పటికీ సమాజంలో వర్గభేదాలునశించి, జాతీయార్థికసంపత్తి పూర్తిగా వృద్ధిగాంచలేదు. ఇది కాక ఉన్నదానిని విదేశీయ, దేశీయకుట్రదారులనుంచి రక్షించుకోవలసిన బాధ్యతకలిగింది. దానికొరకు సైనికాభివృద్ధి, వానికి కావలసిన యంత్రాయుధ సాధన సామగ్రి యత్యవసరం. పారిశ్రామికంగాకూడా ప్రజల దైనందినజీవితాని కుపయుక్తమయ్యే చిల్లరసరుకుల ఉత్పత్తి వృద్ధిచేయవలసిన అవసరం చాలావుంది. కనుక వీటినన్నింటిని పూర్తిచెయ్యటానికి ౧౯౩౩ లో రెండవ పంచవర్ష ప్రణాళికను ప్రవేశపెట్టారు. సమాజంలో వర్గభేదాలను పూర్తిగ నాశనంచేసి, సంపూర్ణమైన సోషలిస్టుసమాజాన్ని నెలకొల్పుట, సర్వసమృద్ధిగా దేశంలోని సమస్తపరిశ్రమలను అభివృద్ధిచేసి, ప్రజాజీవితానికి శాశ్వత శాంతిభద్రతలను చేకూర్చుట, యీ ప్రణాళికయొక్క ముఖ్యాశయాలు.

మొదట ప్రభుత్వదృష్టి యంత్రకర్మాగారాలమీద పడింది. అందులోనూ వ్యవసాయాని కుపయోగించే యంత్రపరిశ్రమల కెక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. దీనికి తోడు దేశంలోని సాగుబడిభూమి నంతను అంగుళంకూడా మిగల్చకుండా, సమష్టి వ్యవసాయపద్ధతిలో చేర్చి, ఆభూములను యంత్రసహాయంతోనే సాగుచెయ్యాలని నిర్ణయించారు. అందుకొరకు తత్సంబంధమైన ట్రాక్టర్లు, కంబైన్లు మొదలైన యంత్రాలు విరివిగా కావలసివచ్చాయి. వీటి సప్లయికొరకు ౧౯౩౩ లో ౨౪౪౬ ట్రాక్టరు స్టేషన్లు (ఆయంత్ర కర్మాగారాలు) వుంటే, అవి ౧౯౩౭-వ సం॥నికి ౫౬౧౭-కి హెచ్చినవి. ౧౯౩౦ లో మొత్తం భూమిలో ౧% మాత్రమే యంత్రసహాయంతో సాగు చేయబడితే, ౧౯౩౭ లో ౭౦ % లు భూమియంత్రసహాయంతో సాగు చేయబడింది. ట్రాక్టరు కర్మాగారాల్లో చెల్యాబిన్స్క్ కర్మాగారం (Chelyabinsk Tractor Plant) ప్రపంచమంతటిలోనూ పెద్దది. ఇది ౧౯౩౩ జూన్ ౧-వ తేదీని నిర్మింపబడింది. ఇప్పటి కప్పుడే ఇందులో అనేకవేల ట్రాక్టర్లు తయారయ్యాయి. దీనిలో వుపయోగింపబడే ఇనుము, బొగ్గుమొదలైనవి, రోజు ౧౦ రైళ్లమీద వస్తాయట. *దీనిలో ౧౯౩౩ లో ౧౬౫౦ ట్రాక్టర్లును, ౧౯౩౮ లో ౨౧౦౦౦ ను తయారయ్యాయి. ఇదేవిధంగా ఖార్కోవ్, స్టాలిన్ గ్రాడ్ మొదలైన కర్మాగారాలలో ప్రతిసంవత్సరం

అనేకయంత్రాలు తయారవుతుంటాయి. ఈ యంత్రాగారాల్లో పనిచేసేవారికి వారివారి బుద్ధికుశలతలనుబట్టి, వారికి ప్రభుత్వంవారు మోటార్లు మొదలైనవి బహుమతులిస్తారు. పెట్టుబడిదారీదేశాలలో కార్మికు లెంత గొప్పవారై నేర్పు చూపించినా వారికి పైవిధమైన ఆదరణ లేకపోవుటయేకాక, వారిచే బలవంతంగా పనిచేయించి, ధనికులుమాత్రమే లాభాలు సంపాదిస్తారు. కాని నేటిరష్యాలో ప్రతివ్యక్తి వాని వాని శక్తిసామర్థ్యములనుబట్టి గొప్పతనం కలుగుతుందిగాని, వర్గాన్నిబట్టిలేదు. పైని చెప్పిన స్టాఖనోవ్ ఉద్యమం యొక్క ముఖ్యోద్దేశ్యం ఈ సిద్ధాంతాన్ని బోధించటమే. దీనివలన ప్రతివానికి ఎదురువారికంటె శక్తిసామర్థ్యాలను చూపించాలనే ఆసక్తి వుంటుంది. అందుచేత ప్రతివాడు గొప్పతనం సంపాదించాలనే ఆసక్తితో శ్రద్ధగా పనిచేస్తాడు. తద్వారా మొత్తం దేశంయొక్క ఉత్పత్తి, ఆర్థికసంపద అభివృద్ధి కాగలవు. ఇదే సోషలిష్టుసమాజ నిర్మాణచరిత్రలో ప్రధానసూత్రం.

ఇటువంటి సదుద్దేశ్యంతో నిర్మింపబడిన ఈ రెండవ ప్రణాళిక ఎంత విజయవంతంగా సాగిందో చూడండి—ప్రణాళిక అమలులోనికి వచ్చిన మొదటి సంవత్సరంలో, అనగా ౧౯౩౪ లో పారిశ్రామిక ఉత్పత్తి, ౧౧%, ౧౯౩౫ లో, ౧౬%, ౧౯౩౬ లో, ౨౧% ౧౯౩౮ లో ౪౩౦% చొ॥ క్రమక్రమాభివృద్ధిగా పెరిగిపోయింది. రెండవప్రణాళికాంతానికి చిన్నచిన్నపరిశ్రమ లన్నీకూడా ఎంత అభివృద్ధిపొందాయో చూడండి—

	౧౯౩౩ సం॥		౧౯౩౮ సం॥	
ఇనుము	౬౨	ల. టన్నులు	౧౬౦	ల. టన్నులు
ఉక్కు	౫౯ ,,	,,	౧౮౦ ,,	,,
కిరసనాయిలు	౪౨ ,,	,,	౬౦ ,,	,,
బొగ్గు	౬౪౩ ,,	,,	౧౫౨౫ ,,	,,
మాంగనీసు	౧౯ ,,	,,	౨౮ ,,	,,
ట్రాక్టర్లు మొ॥	౯౬౪	వేలు	౨౯౯౦	వేలు
మోటార్లు	౨౪	,,	౨౦౦	,,
సైకిళ్లు	౧౨౯	,,	౫౮౫	,,
రేడియో	౨౯	,,	౫౦౦	,,
బూట్లు	౬౫౬	లక్షలు	౧౦౦౦	లక్షలు
కాగితము	౪౮౧	వేల టన్నులు	౮౪౦	వేలు
సబ్బులు	౩౫౮	,, ,,	౧౦౦౦	,, ,,
టీ	౧౩	,, ,,	౪౫	,, ,,
మాంసము	౧౮౬౯	,, ,,	౩౦౦౦	,, ,,
బట్టలు	౨౫౦	కోట్లు	౪౮౦	కోట్లు.

ఈ అంకెలను బట్టి చూస్తే, రెండవ ప్రణాళిక దేశాన్ని పూర్తిగా పారిశ్రామిక దేశముగా మార్చివేసినట్లు తెలుస్తుంది. ఈ స్వల్పకాలములో, ౧౯౨౬ నాటినుంచి సాంఘికార్థిక విధానముల లోపములను, రూపుమాపి పారిశ్రామికదేశముగా తయారు చేయ కలిగారు.

దీనినిబట్టి వ్యాపారంలోకూడా ఎక్కువ మార్పు సంభవించింది. సొంతవ్యాపారాలు పూర్తిగా అడుగంటి పోయాయి. వ్యాపారంలో ప్రభుత్వానికి ౧౯౩౨ లో వచ్చిన ౪౫౫౦ రూబుల్సు ఆదాయం, ౧౯౩౮ లో ౧౩౨౮౦ కి హెచ్చింది.

మొత్తంమీద యీ రెండు ప్రణాళికలవల్ల దేశంలో బ్రహ్మాండమైన మార్పు కలిగింది. మొదటి పంచవర్ష ప్రణాళిక దేశంలోని భూమి యావత్తు ప్రజలదే యని, పాటుపడి పనిచేసే ప్రతివానికీ దాని మీద సర్వాధికారం కలదనే భావాన్ని కలిగించి, దేశాన్నంతను సమష్టి వ్యవసాయక్షేత్రంగా మార్చి, సమస్త ప్రజలకు కడుపునిండా కూడు పెట్టింది. రెండవ పంచవర్ష ప్రణాళిక, సమష్టి వ్యవసాయానికి, ప్రజలకు ప్రభుత్వానికి, కావలసిన సర్వ సాధన యంత్ర పరికరాలను చేకూర్చి, ఇతర దేశముల మీద ఆధారపడ నక్కరలేకుండా చేసి, పనిలేని ప్రతివానికి పని చూపి, దేశాన్ని సర్వతోముఖంగా అభివృద్ధి చేసింది. ఈ స్వల్పకాలంలో ౧౯౨౪ నాటి పాత రాజ్యాంగాన్ని రూపుమాపి, ౧౯౩౮ నాటికి పూర్తియైన సోషలిస్టుసిద్ధాంతాలతో కూడిన సోవియట్ రాజ్యాంగాన్ని నిర్మించకలిగారు. నేడా దేశంలో వర్గ బేధాలు లేవు. బీద, గొప్ప అని కాని, కార్మికుడు, కర్షకుడు అని కాని, తారతమ్యం లేకుండా, కేవలం శక్తిసామర్థ్యాలే హెచ్చు తగ్గులుగా కలిగి, సర్వజనులు సమానహక్కు స్వాతంత్ర్యాలతో అన్న వస్త్రాలకు లోటు లేకుండా, గుండెలపై చెయ్యి వేసకొని, హాయిగా సంతతానందసౌఖ్యములతో జీవితయాత్ర గడుపుతున్నారు.

ఘనరాగ గీతములు

శ్రీ చేతపూడి వెంకటశివరావు.

1. అఠాణారాగము - త్రిశ్రజాతిరూపకము

సా స ని స - రి స స ని స - స ని రి స ని -

హే పరమ - పురుష యదు - కులతిలక -

ప ధ ప మ ప - గా మ పా - పా స ని ప -

కరివరద - పాహి మాం - పాపభయ -

ధా ప మ ప - గా రి రి స - రి మ ప ని -

వార్ణ నర - మారమణ - భక్త పరి -

పా స ని స - ని స గా రి - స ని రి ని స -

పాల శ్రిత - సుత శీల - వనజభవ -

స ని రి స ని దా - రి ని స దా - ని ధ ప దా -

స . న్నుత పదా - బ్జ మురదా - నవవిదా -

స ని స దా - స ని ప దా - ప మ ప గా మ ప ని ||

రణ సదా - శుభ విధా - యక ముకుంద జయ ||

2. శహనారాగము - చతుశ్రజాతిరూపకము

స ని స రి సా - రి స ని స దా - రి స నీ ధ ప -

పరమదయా - కర కృపయా - కరిరక్షక -

రి గ మ పా - రి గ మ ప మ ప - గా మ రి సా -

కృష్ణ హరె - పరమ పురుష - పాలయమాం -

స ని ధ రి సా - రి స ని స ధా - ని ధ ప మ ధా -

కురు సతతం - పరమ హితం - వరద విదా -

ని స ని రి సా || ప మా ద ధా - ధ ని స ని సా -

రయ దురితం - నిరంతరం - చరణయుగం -

ని సా రి రీ - రి గ మా ప మ - గా మ రి రి స -

స్మరామి తే - వర దాయక - మార జనక -

దా ని స రి స - దా ని ధ పా - రి గ మ ప రి -

మానిత గుణ - పారయమాం - భవ జలధిం -

గ మ ప ధ ప మ - గా మ రి స ||

గరుడగమన - గా న లో స ||

3. సురటిరాగము - త్రిశ్రజాతిత్రిపుట

సా ని ధ ప మ గ - రీ , రి మ రి స |

దేహి వరద శ్రీ - యం మురహర |

సా స రి మ గ - రీ , సా , , |

దాహి పాపభ - యం మే |

రి మ రి మ ప - ని ధ ప మ గ రి స |

పాహి మాధవ - వనజభవనుత |

పా స ని ధ ప మ - పా ని సా సా |

కేశవ దురిత - నాశ క్లేశాణ |

నీ స రి మ రీ - సా రి స ని ధ ప |

నాశయ హృషీ - కేశ నగధర |

ని స రి సా ని ధ - మ ప ధ పా మ గ ||

విహసితానన - విహగవాహన |

ప మ ని ధ ప మ గ - రీ , మ రి సా ||

విహర మమ హృద - యే సతతం ||

4. కానడ రాగము - అది తాళము

ధ ని స స సా సా - ని స రి స - పా సా

భజ జగదీశం - త్యజ భవ - పాశం

స ని స రీ ప గా - గ మ రి స - ధ ని సా

స్మరదయానిధిం - తర భవ - జలధిం

ధా ధ మ ధ ని పా - ప ని పా మా ప ప

నశ్వర మఖిలం - విశ్వం మానస

సా రి స రి ప గా - గ మ రి స - ని ప సా

విశ్వసిహి హృషీ - కేశ్వరే ఽనిశం

రి సా రీ రి ప గా - గ మ రి స ధ ని సా ||

జహి హి దురితం - స్తుహి హరి చరితం ||

5. పూరికల్యాణిరాగము - రూపకతాళము

సా ని ధ ప మ - ధ ప మ గ రి గ -

పాలయగో . - పా . లమా . ం -

ధా మ గ రి గ - మ గ రి సా స -

బాలకృ . ష్ణ - నీ . ల వర్ణ -

స రి గ రి గా - ప మ గ రి రి స -

లీ . లా . మా - నుష వి . గ్రహ -

స రి స ని ధ స - ధ ధ సా స స -

శ్రీ . లో . ల . - శ్రిత పాల . -

గా మ ధ సా - స రి గ రి సా -

స్తౌమి సదా - తవ చరితం -

స ని ధా ప మ - గ మ గ రి సా ||

స్వామిన్ జహి - మమ దురితం ||

కర్ణుని జననము

శ్రీ మల్లెల శ్రీరామమూర్తి

మహాభారతమున ముఖ్యుడయిన కర్ణుని జననమునుగూర్చి అభిప్రాయభేదములున్నవి. కొంతమంది కర్ణుడు సద్యోగర్భమున జనించె ననియు, కొందరు కుంతి పదినెలలు మోసి కనె ననియు చెప్పుదురు. సద్యోగర్భమున పుట్టె ననుటకు నన్నయభట్టారకులు ఆదిపర్వమున తెనిగించినదాని నాధారముగ కొందరు చూపుచున్నారు. భారతమున కర్ణునిచరిత్ర ఆది అరణ్య ఆశ్రమవాసపర్వములలో వర్ణింపబడినది. దీనిని కవిత్రయము ఆది అరణ్య ఆశ్రమవాసపర్వములలో వరుసను నన్నయ, ఎఱ్ఱాప్రెగడ, తిక్కయజ్వగార్లు తెనిగించిరి. ఎఱ్ఱాప్రెగడ తిక్కనగార్లిద్దరును కుంతి గర్భము దాల్చి పదినెలలు మోసి కనినట్లు వ్రాసిరి. నన్నయగారుమాత్రము సద్యోగర్భమున జనించె నని తెనిగించిరి.

దీనినిబట్టి మూలమునకు బోకతప్పదు.

భారతము—మూలము—ఆదిపర్వమున-

తత్రవీర స్సమభవ త్సర్వశస్త్రభృతాంవరః,
ఆముక్తకవచ శ్శ్రీమా న్దేవగర్భశ్రియాన్వితః.
ప్రాదాచ్చ తస్యై కన్యాత్వం పునస్స పరమద్యుతిః,
దత్వాచ తపతాం శ్రేష్ఠో దివ మాచక్రమే తతః.

ఇత్యాదిశ్లోకములలో సహజ కవచకుండలములుకల కర్ణుడు కలిగె ననియు, కుంతికి కన్యాత్వవర మీయబడెననియు జెప్పబడినది గాని సద్యోగర్భమున జనించినట్లు చెప్పబడియుండలేదు. నన్నయగారు ఆదిపర్వమున సద్యోగర్భమున జనించె నని తెనిగించుటకు మూలమున యాధారము కనుపడదు. మూలమునకు విరుద్ధమైన అనువాదము ప్రధానము కాదుగదా - ఆదిపర్వమున సంక్షిప్తముగ చెప్పబడిన కర్ణుని జన్మవృత్తాంతము అరణ్యపర్వమున విపులముగ వర్ణింపబడినది —

అరణ్యపర్వము_మూలము.అధ్యా-౩౦౭లో.

సా బాంధవభయా ద్బాలా గర్భం తం వినిగూహతీ,
ధారయామాస సుశ్రోణీ నచైనాం బుబుధే జనః.
నహి తాం వేద నాప్యన్యా కాచి ద్ధాత్రేయికా మృతే,
కన్యాపురగతాం బాలాం నిపుణాం పరిరక్షిణీం
తతఃకాలేన సా గర్భం సుషువే వరవర్ణినీ,
కన్యైవ తస్య దేవస్య ప్రసాదాదమరప్రభం.

ఇత్యాదిశ్లోకములవలన కుంతి గర్భము దాల్చి లోకాచారముగ మోసి కనెనని స్పష్టపడుచున్నది. మరియు గర్భము దాల్చుట కర్ణుని గనుట ఒక అంతఃపురస్త్రీకి తప్ప ఇతరుల కెవ్వరికిని తెలియదనికూడ విపులముగ ఆరణ్యపర్వమున చెప్పబడియుండుటచే ఇక సద్యోగర్భమున పుట్టెననుట కాధారమే కనుపట్టదు. ఈపర్వమును తెనిగించిన ఎఱ్ఱాప్రెగడగారును కుంతి పదినెలలుమోసి కర్ణుని గనెనని ఆంధ్రీకరించియున్నారు. ఇక ఆశ్రమవాసపర్వమున జూతము —

మూలము. ఆశ్రమవాసపర్వము అ. ౩౦

తతోఽహ మంతర్భవనే పితుర్వృత్తాంతరక్షిణీ,
గూఢోత్పన్నంసుతం బాలం జలే కర్ణమవాసృజం.

నీకుఁ గన్యాత్వవికలత కాకయుండ
వరము నిచ్చితి ననుచు దివమున కరిగె,
జనకముఖబంధు చిత్తవంచనము నడపి
గూఢమందిరాంతరమునఁ గొడుకుఁగంటి.

—ఆశ్రమ. ద్వితీ. ౧౦౩ పద్యము.

ఇట్లు వివరముగ జెప్పియుండుటంబట్టి కర్ణుడు సద్యోగర్భమున జనించెనను వాదము నిరాధారమగుచున్నది. కనుకనే శ్రీతిరుపతి వేంకటకవులుగూడ తమ పాండవోద్యోగమున పదినెలలుమోసి నినుఁగన్న పడతికుంతి యని చెప్పియున్నారు.

గనుక కర్ణుడు సద్యోగర్భమున జనించలేదని, లోకాచారముగనే జనించెనని స్పష్టముగదా —

పండితోత్ప్రకాండు లీ విషయమై తమ యభిప్రాయ మిందులకు భిన్నమైనచో ప్రకటించి న్యాయము నిర్ణయించవేడెద.

శ్రీ సూర్యరాయాంధ్రనిఘంటువు

శ్రీ పిశుపాటి విశ్వేశ్వరశాస్త్రి

ప్రమాథి సంవత్సరాది సంచికలో వడ్లమూడి వెంకటరత్నంగారు పై శీర్షకముతో నొకవ్యాసము వ్రాసినారు. *దానిని ప్రమాథి భాద్రపదమాస భారతిలో నేను బరామర్శించినాను. దానికి వెంకటరత్నంగారు ప్రమాథి- పుష్య, మాఘ, ఫాల్గున, (విక్రమసం॥) చైత్రమాస. భారతులలో సమాధాన మిచ్చినారు.

ఈ సమాధానములో విమర్శకులు తమ వ్యాసము నుండి యెత్తి నేను జూపిన దోషములలోఁ గొన్నింటిని దోషములు కావని సమర్థించుకొనుటకై మిక్కిలి యత్నించినారు. ఈ యత్నములో వీ రెంతవఱకుఁ గృతార్థులైనారో విద్వాంసులే నిర్ణయింపఁగలరు. ఐనను విమర్శకుల సమాధానపద్ధతిని పాఠకులకుఁ జూపుటకై యొకటి రెండు విషయములను మాత్రము నా యీ వ్యాసమునఁ జర్చించి, తక్కినవిషయముల చర్చ పాఠకులకే వదలివైచెదను. అట్లు కాక యన్ని విషయములను మరలఁ జర్చించుట మొదలిడిన నేను గూడ నెన్ని భారతుల నింపవలసియుండునో!

౧. అగ్ర్యము

(౧) ఈ పదము లేదని యాక్షేపము. 'అగ్ర్యుఁడు' అను పదమును గ్రహించియుండఁగా దీనిని గ్రహింపలేదని యాక్షేపించుట సమంజసము గాదు. (౨) ఇట్టి విశేషణశబ్దములలో నపుం పుం స్త్రీ రూపములు మూఁడును గ్రహింపక యేదో నొకటియే గ్రహించుట నిఘంటుసంప్రదాయము. (ప్రమాథి భాద్రపద భారతిలో నేను వ్రాసిన పరామర్శములోనిది.)

దీనికి శ్రీ వెంకటరత్నంగారి సమాధానము.

(౧) భారతములో ప్రయుక్తమగు "అగ్ర్యము" అను నపుంసకలింగశబ్దము గ్రహింపఁబడలే దేమనఁగా "అగ్ర్యుఁడు" అను పుంలింగశబ్ద మున్నదనుట మిరియా లున్నవా? యని యడిగినపుడు మిరపకాయ లున్నవని చెప్పు ప్రత్యుత్తరమువంటిది.

(౨) సూర్య. ని. లో 'అగ్ర్యుడు' అన్న పదము దగ్గఱ "సం. అగ్రియుడు" అని వ్రాసియున్నారు. కొన్ని పదముల యొద్ద విశేష్యమో విశేషణమో తెలిపి, అంతములచే లింగములు సూచించి అర్థము వ్రాసియున్నారు. 'అగ్ర్యుడు' మొదలగు కొన్నిమాటల యొద్ద విశేషణ విశేష్యభేదముగాని, అంతములు లింగములుగాని వ్రాసియుండలేదు. ఆమాటల నేమనితలంపవలయును? విశేషణము లనియా? విశేష్యములనియా? మూడులింగములలో నుండవచ్చుననియా? ఏకలింగకమే యనియా? కొన్నిటికి లింగములు తెలుపనపుడు అది నియతలింగకమే యని తలంచుట కవకాశముకలదు గదా! 'అగ్ర్యుడు' అను పుంలింగశబ్దమునకు అంతములతో, లింగములు తెలుపకపోయినను 'అగ్ర్యము' అనునపుంసకలింగశబ్దమును గ్రహించినట్లే యగునా యేమి.?

ఇట్లు ప్రమాదముల కవకాశముకలుగునట్లు వ్రాయుటయే నిఘంటుసంప్రదాయమా యేమి? కొన్నిమాటలకంతములు చూపవలయు ననియు, మఱికొన్నిమాటలకంతములు చూపరా దనియు నా నిఘంటుసంప్రదాయము? అన్నిమాటలకు అంతములతో లింగములు

---

* ఆంధ్రసాహిత్య పరిషత్తువారు నియమించుటచే నే నీ పరామర్శమును వ్రాసినట్లు శ్రీ వెంకటరత్నంగారు తమ సమాధానములో వ్రాసినారు. కాని, యట్లు న న్నెవ్వరును నియమింపలేదు. కనుక వారి యూహ సత్యదూరము.

—పి. వి. శా.

సూచించినచో సంప్రదాయభంగ మొనర్చియుండెడి వారా రేమి? చేసిన ప్రమాదములనుండి తప్పించుకొనఁజూచుటకు ఈ సంప్రదాయ మొకతడక కాదా! లేక 'అగ్ర్యుడు' అను మాటనుబట్టి 'అగ్ర్యము' అనుమాట నూహించుకొనలేరా యందురా? ఇచ్చిన యన్నిపదముల నూహించుకొనలేరనియేనా యిచ్చినది? ఒక వ్యవస్థలేదా? (ప్రమాథి మాఘభారతి)

దీనికి నా ప్రత్యుత్తరము.

తత్సమ విశేషణ శబ్దములలో "సం. విణ. (అ. ఆ. అ.)" ఇత్యాదిగా వ్రాయుదురు. అది పుంలింగవిశేషణమైన 'అ' కారాంతముగాను, స్త్రీలింగ విశేషణమైన 'ఆ' కారాంతముగాను నపుంసకలింగ విశేషణమైన 'అ' కారాంతముగాను ఉండునని సూచించును. ఈ విషయము సంజ్ఞావివరణ పట్టికలో వివరింపఁబడినది.

ఆ విశేషణశబ్దములలో వ్రాసిన యర్థమును, తత్సమశబ్దములకు సాధారణముగాఁ దత్తల్లింగములలో వచ్చు 'డు, ము' ప్రభృతి ప్రత్యయములను, తత్తల్లింగముల కనుగుణముగా మార్చుకొనుటయే తక్క నెట్టి విశేషమును లేదనియును, అట్టివాని నూహించుకొనుట సులభమే కనుక మరల నన్నిలింగములతోను వేఱువేఱుగా గ్రహించి గ్రంథమును బెంచుట యుక్తము కాదనియును, శబ్దరత్నాకరము మున్నగునవి కూడ నిట్లే చేసినవనియును, ఆప్తేమున్నగువారు (M. F. N.) అనియును, వాచస్పతి ప్రభృతులు 'త్రి' అనియును వ్రాసినారుకాని యిట్టి శబ్దములను వేఱువేఱుగా నీయలేదనియును, సూచించునట్లు "అగ్రియుడు" అను పదమును గ్రహించియుండఁగా..." ఇత్యాదిగా నేను వ్రాసినాను. పండితుల కింతకన్న నీ విషయమునుగూర్చి వ్రాయ నక్కఱలేదని నా యభిప్రాయము. = ఈ గుర్తు నడుమనుంచిన పదములు అర్థమునను, లింగాదులలోను సమానములు. (ఈ విషయము సంజ్ఞావివరణ పట్టికలోఁ దెలుపఁబడినది) = ఈ గుర్తుకు ఎడమప్రక్కనున్న పదముల యర్థాదులు కుడిప్రక్కనున్న పదముల యొద్దఁ జూచికొన్న స్పష్టము కాఁగలవు.

ఉదా:— అంబునిధి. సం = అంబుధి. అంబుధి. సం. వి. ఇ. పుం. ౧. సముద్రము. ౨. (గణిత) నాలుగు. (సూర్యా. ని. ౫౨ పొరట.) అధఃకృతము. సం = అధరితము. అధరితము. సం. విణ. (అ. ఆ. అ.) ౧. క్రిందుపఱుపఁబడినది. ౨. తక్కువపఱుపఁబడినది (సూర్యా. ని. ౧౪౭ పొరట.)

అర్థమునమాత్రమే సమానములుగా నున్న శబ్దముల నడుమనుగూడ నీ గుర్తు (=) ఉపయోగింపఁబడినది. కాని, అప్పుడు లింగములలోను, అంతములలోను గల భేదము స్పష్టముగాఁ జూపి, పిమ్మటనే యీ గుర్తు ఉపయోగింపఁబడినది.

ఉదా:— అయాచితవ్రతము. సం. వి. అ. న = అయాచితవృత్తి.

అయాచితవృత్తి. సం. వి. ఇ. స్త్రీ. అడుగకయే వచ్చినదానితో జీవించుట. (౨౫౧ పొరట.)

అంగ సంస్కర్తృ. సం. విణ. (ఋ. స్త్రీ. ఋ.) = అంగసంస్కారుడు

అంగసంస్కారుఁడు. సం. విణ. (అ. ఈ. అ) అంగసంస్కారము చేయువాఁడు; దేహమును అలంకరించువాఁడు. (సూర్యా. ని. 15 పొరట.)

ఇట్లు గ్రంథవిస్తృతి తగ్గుటకై యాశ్రయించిన సంకేతాదులను సరిగా గ్రహింపక నిఘంటువును, పండితులను దూషింప వచ్చునా?

"అగ్ర్యుఁడు. సం = అగ్రియుఁడు" అనియును, "అగ్రియుఁడు. సం = అగ్రిముఁడు" అని యును వ్రాసి, "అగ్రిముఁడు" లో దానికి సంబంధించిన యర్థ లింగ విశేషణ విశేష్యాదులు స్పష్టముగా వ్రాసియున్నారు. కనుక 'అగ్ర్య' శబ్దముయొక్క యర్థాదులు 'అగ్రిమ' శబ్దములలోఁ జూచికొనినఁ దెలియఁగలవని సూర్యా. ని. తెలిపినట్లేగదా! ఈ మాత్రమైనఁ బరిశీలించుకొనకున్న నొక వ్యవస్థ కలదో లేదో యెట్లు తెలియును?

౨. అవసథము

ఈ పదమును సూర్యా-ని-లో గ్రహింప లేదని యాక్షేపము. ఇది కల దనుటకు దృఢతర ప్రమాణ

ములు లేకపోవుటచేతఁ బరిత్యజింపఁబడినది. (౧) అమరమున,

శ్లో॥ "ధిష్ణ్యమోకో నివసనం స్థానావసథ వాస్తుచ" అని కలదు. ఇది యధికపాఠమని వ్యాఖ్యాతలు వ్యాఖ్యానము చేయక వదలినారు. (౨) ఐనను

శ్లో॥ రమ్యమావసథం కృత్వా రమమాణా వనే త్రయః. రామాయణము. బాల ౧. ౩౦. లో "ఆవసథం= పర్ణశాలారూపం గృహమ్. ధిష్ణ్య మోకో నివసనం స్థానావసథవాస్తుచేత్యమరః." అని గోవిందరాజీయ వ్యాఖ్యలో "ఆవసథము"గా భేదింపఁబడియున్నది. (౩) ఇట్లే వైజయంతీనిఘంటువులోఁగూడఁ బ్రామాణికులచేత భేదింపఁబడియున్నది. (౪) మఱియు "సూ. ఉపసర్గే వసేః. ఆవసథో గృహమ్. సంవసథో గ్రామః. సిద్ధాంతకౌముది. ఉణాది. ౩.౧౧౬." అని పాణినీయమున 'ఆవసథ' శబ్దమే సాధింపఁబడినదిగాని 'అవసథ' శబ్ద మెక్కడను సాధింపఁబడలేదు. ఇట్టిబహుప్రమాణములను, ప్రామాణికప్రయోగములను బరిశీలించియే శ్రీ రంగాచార్యప్రభృతినిఘంటుకర్తలుగూడ 'అవసథ' శబ్దమును గ్రహింపక 'ఆవసథ' శబ్దమునే గ్రహించినారు. సూర్యరాయాంధ్రనిఘంటువుకూడ నీప్రామాణికమార్గమునే యనుసరించి 'అవసథము'ను గ్రహింపక 'ఆవసథము'నే గ్రహించినది. (ప్రమాథి భాద్రపదభారతిలో నేను వ్రాసిన పరామర్శములోనిది)

దీనికి శ్రీ వేంకటరత్నంగారి సమాధానము.

(౧) శాస్త్రిగారు చూపిన మొదటిహేతువు వారి రెండవ మూఁడవ కారణములవలన పరాస్తమగుచున్నది. అధికపాఠము ప్రమాణము కానిచో (౨) లో చెప్పిన గోవిందరాజును, (౩) లో చెప్పిన వైజయంతీకారుడును ఎట్లు గ్రహించి "ఆవసథము"గా భేదించియుందురు? కనుక అధికపాఠ మయినంతమాత్రమున ప్రమాణము గాదనుట అంగీకార్యము గాదు.... కనుక-సమగ్రనిఘంటువులుగా నుండఁ బ్రయత్నించునవి అమరవ్యాఖ్యాతల నటుంచి యధికపాఠముల నంగీకరించుటయే లెస్స. (౪) సిద్ధాంతకౌముది 'ఆవసథ'మును సాధించుటకు ప్రత్యేకసూత్రమును జెప్పుట నిశ్చయ మే గాని మఱియొకవిధముగా 'అవసథ'శబ్దము సిద్ధమగుచుండగా ప్రత్యేకసూత్ర మేల కావలయును? సూత్రములలో జెప్పబడిన శబ్దములు కాక యితర శబ్దములు సాధువులు కావా? అటులే యయినచో పాణినీయ గౌరవము సాబాలు పోక తప్పదు. కనుక ప్రత్యేకసూత్రము చెప్పనంతమాత్రమున 'అవసథ'శబ్దము సాధువు గాదనుట సముచితముగాదు. 'అవసథ'శబ్దము దుర్లభ మని పాణినీయమహిమకు కొఱత గల్గింపరా దని నా మనవి.

(౨, ౩, ౪.) కొందఱు 'ఆవసథ'శబ్దమును స్వీకరించినను 'అవసథ'శబ్దమునుగూడ పెక్కురు స్వీకరించినారు. చూడుడు.

"అవసథః. (పు) అవ+సో+కథన్. ౧. నిలయే. ౨. గ్రామేచ. అవస్యతి శాస్త్రం మత్ర— అవ+సో+కథన్. ౩. ఛాత్రనిలయే. మతే. హేమచంద్రః"అని వాచస్పత్యము ప్రక్రియతోగూడ సాధించి ఆ శబ్దమును గ్రహించియున్నది. 'ఆవసథ' శబ్దమును గూడ నది గ్రహించియున్నది. మఱియు 'అవసథ' శబ్దమునే గాక దానిపై నేర్పడిన 'అవసథ్య' శబ్దమును గూడ గ్రహించి

"అవసథ్యః. (పు) అవసథ. స్వార్థేయత్. అవసథశబ్దార్థే."అని వ్రాసియున్నది. ఆప్టే నిఘంటువు సయితము 'అవసథ' శబ్దమును వాచస్పత్యమువలెనే సాధించి గ్రహించియున్నది... మఱియు "విల్సను నిఘంటువునుండి సంగ్రహింపఁ బడిన పండిత రామజసనుగారి నిఘంటువు సయితము ఈ శబ్దము నిచ్చియున్నది. చూడుడు.

అవసథ (M) 1 Village. 2. College. 3. School (N) House. (E). అ. Nng. వస To dwell. and అథన్. Affix; Than which there is no other or better abode.

అవసథ్య. (M) A college, school. E. See the preceding అని వ్రాసియున్నది. బ్రౌణ్యము, శబ్దరత్నాకరము 'అవసథము'నే యిచ్చినవికాని 'ఆవసథము' నీయలేదు. ఆంధ్రవాచస్పత్యము రెండు రూపములను గ్రహించినది.

ప్రామాణికులచే 'ఆవసథము'గానే ఛేదింపబడిన దని (అవసథ మసాధువని) శాస్త్రిగారన్నారే వాచస్పత్యకారాదులు ప్రామాణికులు కారా? వాచస్పత్యాదు లప్రమాణములగుట యీ శబ్దమునొద్దనేనా? ఎచ్చటను బ్రమాణములు గావా? శాస్త్రిగారా వ్యాసములోనే "వాచస్పత్యాది సంస్కృత నిఘంటువులుగూడ ఈ మార్గమునే యనుసరించినవి" అని యొకచోట వాచస్పత్యమును ప్రమాణముగా నుదాహరించి యున్నారు. శాస్త్రిగారి మాటలలో నేది ప్రమాణము? వారికి వాచస్పత్యము ప్రమాణము కాదా? అయినచో నది యేల? కానిచో నిది యేల? దేని కది యేనా? తీర్థమునకు తీర్థము, ప్రసాదమునకు ప్రసాదమునా? ఈ శబ్దవిషయమున శాస్త్రిగారు తక్కిన నిఘంటువులు చూచినారా? చూడలేదా? చూచియే వాచస్పత్యాదుల నప్రమాణములుగా త్రోసివైచినారా? చూడలేదందురా ఆమాత్రమైన పరిశీలింపరాదా? దీనిని బట్టి 'అవసథ, ఆవసథ' శబ్దములు రెండును గ్రహించుట యుక్తమని తేలుచున్నదిగదా! ఇట్టులే 'అగారము, ఆగారము' అను శబ్దములు కలవు. అమరము "నిశాంతవస్త్యసదనభవనాగారమందిరమ్" అని చెప్పగా కొందఱగార మనియు, మఱికొంద ఱాగారమనియు వేఱొకకొందఱు రెండురూపములను గ్రహించినారు. ఆవిషయము మనకిప్పుడప్రస్తుతము గనుక వదలివైతము.

"అవసథ" మసాధు వనియే శాస్త్రిగారింకను పిడివాదము చేయుదురా? మాటవరుస కొకక్షణకాల మసాధు వనియే యంగీకరింతము. అయినను వాచస్పత్యాదులన్ని నిఘంటువు లిచ్చిన శబ్దమును సమగ్రాంధ్రనిఘంటువు ఇచ్చుట న్యాయ్యము గాదా! 'అంగమొల, అంగమొలవేల్పు, అంగమచ్చము, అంతరదామర' మొదలగు శబ్దములను సూర్య. ని. ఇచ్చియున్నదే! ఇవియన్నియు సాధువులేనా? సాధువులు కాకున్నను సుప్రసిద్ధకవిప్రయుక్తములను నిఘంటువు లిచ్చుట యుచితమే. అటులనే 'అవసథము'నుగూడ నిచ్చుట యుచితము. (ప్రమాథిమాఘ భారతి)

దీనికి నా ప్రత్యుత్తరము.

(౧) 'అవసథ'శబ్దము అమరమున నధికపాఠములో నున్నది కనుక గ్రహింపరాదని నేననలేదు. అమరములో 'ఆవసథము' అని ఛేదింపవలయునా? 'అవసథము' అని ఛేదింపవలయునా? యని నేనిక్కడఁ జర్చించినాను. దానికిని విమర్శకులవ్రాఁతకును సంబంధము లేదు.

(౨) వాచస్పతి తాను గ్రహించిన 'అవసథ' శబ్దమునకు హేమచంద్రుని బ్రమాణీకరించినాఁడు. కనుక హేమచంద్రనిఘంటువును జూచినచో నీశబ్దము కల దనుటకు దృఢతరప్రమాణము లున్నవో లేవో తేలఁగలదు. చూతుఁడు.

శ్లో. ... గేహేౙ, గృహావేశ్మనికేతనం. ... ధిష్ణ్యమావసథస్స్థానం పస్త్యం సంస్త్యాయ ఆశ్రయః, ఓకోనివస ఆవాసో వసతి శ్శరణం క్షయః॥

(హేమచంద్రుని అభిధానచింతామణి. ౪ కాం. ౧౮౯, ౧౯౧)

ఇక్కడ 'ఆవసథము' అనకున్న ఛందోభంగము కలుగును.

శ్లో. మఠావసథ్యావసథాస్స్యుశ్ఛాత్ర ప్రతివేశ్మని. (హేమచంద్రుని అభిధాన చింతామణి ౪కాం.౬౦.)

ఇక్కడ వాచస్పతి 'అవసథ్య + ఆవసథ'అని ఛేదించుటకు బదులుగా 'అవసథ్య + అవసథ' అని ఛేదించి యీ శబ్దములను గ్రహించి 'ఆవసథ్య, ఆవసథ శబ్దములకుఁగల యన్నియర్థములను వీనికిఁగూడఁ జెప్పినాఁడు. కాని వ్యాకరణమును, ఈ క్రింది ప్రయోగములును, 'ఆవసథ్య, ఆవసథ' శబ్దములకు నిర్ధారకములుగా నున్నవి. 'అవసథ, అవసథ్య' శబ్దములకు నిర్ధారక ప్రయోగాదు లేవియుఁ గనబడలేదు. కనుకఁ బైహేమచంద్రకోశమున "మఠ + ఆవసథ్య + ఆవసథ" అని ఛేదింపవలెను. వాచస్పతిచేసిన పదచ్ఛేదము సరియైనది గాదు. ఆ విషయమును బరిశీలింపకయే ఆక్షేపమున్నగువారు వాచస్పత్యమునుండి రెండు శబ్దములు స్వీకరించినారు. అది సరికాదు. శ్లో. స కౌత్సం శిష్య మంత్యమాశ్రితో నివసన్నావసథే పురాద్బహిః. రఘువంశము. ౫.౧౪ (ఇక్కడి 'ఆవసథ'శబ్దము మఠార్థకము. కనుకనే హేమచంద్రుఁడీ శబ్దమునకు మఠార్థకత్వముగూడఁ జెప్పినాఁడు.)

శ్లో. దూరాదావసథా న్మూత్రం, దూరాత్పాదావసేచనమ్. మనుస్మృతి. ౪. ౧౫౧. (ఇట్టివింకను జాల కలవు.)

మఱియొకమాట. "సూ. ఉపసర్గే వసేః" అని "ఆవసథ" శబ్దమును, సూ. అనన్తావసథేతిహ భేషజాఞ్ఞ్యః. అష్టా. ౫.౪.౨౩. అనంతాదభ్యస్స్వార్థే ఞ్యః ప్రత్యయో భవతి. అనంత ఏవ ఆనంత్యమ్. ఆవసథ ఏవ ఆవసథ్యమ్... కాశికావృత్తి." అని "ఆవసథ్య" శబ్దమును మాత్రమే వైయాకరణులు సాధించినారు. తదనుగుణముగానే కాళిదాసాది మహాకవి ప్రయోగములు కలవు.

వాచస్పతి 'కథన్' ప్రత్యయ మొకటి కల్పించి (ఈ ప్రత్యయము వ్యాకరణములోఁ జెప్పఁబడలేదు) 'అవ' పూర్వకమగు "షో=అంతకర్మణి" అను ధాతువుపై నర్థసంగతి సరిగా లేకున్నను 'అవసథ' శబ్దమును మాత్రము సాధించినాఁడు. పండిత రామజసన్ తనకీ ప్రక్రియ సరిగా నున్నట్లు తోఁపక 'అథన్' ప్రత్యయమునే యాశ్రయించి "వస" ధాతువుపైనే 'అనుత్తమ' శబ్దమునబోలె 'అవసథ' శబ్దమును సాధించినాఁడు. ఉపసర్గపూర్వకమైనప్పుడే 'అథన్' ప్రత్యయము పాణినీయమున విధింపఁబడుటచేత నా ప్రక్రియయు సరియైనది కాదు. ఏది యెట్లున్నను "అవసథ, అవసథ్య" శబ్దములు మహాకవిప్రయుక్తములైనచో నేదోనొక ప్రక్రియ నాశ్రయించి సాధింపవలసియుండును. అట్టిశబ్దములే కనఁబడనప్పుడవి కలవనకొని వానిని సాధించుటకై శ్రమపడుట సరిగాదు. కనుక హేమచంద్రనిఘంటువులోఁగూడ వ్యాకరణమును, ప్రయోగములను అనుసరించి, "ఆవసథ్య, ఆవసథ" అని పైని నేను ఛేదించినట్లు ఛేదించుటయే సాధువని యాలోచించియే "అవసథ-శబ్దము కలదనుటకు దృఢతరప్రమాణములు లేవు" అని నే నింతకుమున్న వ్రాసియున్నాను.

(౩) 'ఆగార' శబ్దము నెక్కడను దనగ్రంథమున గ్రహింపక యమరుఁడు "స్త్ర్యగారం భూభుజాం" అని స్థలాంతరమున 'అగార' శబ్దమును మాత్రమే గ్రహించుట, "భవనాగారమందిరమ్" అనుచోట "భవన+అగార" అను ఛేదమే యమరున కిష్టమని సూచించుచున్నది. కనుక 'అగార, ఆగార' శబ్దములను అమరమునుబట్టియే గ్రహించుటకన్న "విద్యాదగార మాగారమ్" అను శ్రీహర్షుని ద్విరూపకోశము మున్నగు వానినిబట్టి గ్రహించుట యుక్తము. అయినను మన కిప్పుడది యప్రస్తుతముగదా!

(౪) వాచస్పతి ప్రభృతినిఘంటుకర్తలు గ్రహించిరి గనక నపశబ్దములైనను 'అవసథము' మున్నగు వానినిగూడ నిఘంటువులిచ్చుట యుచితమని విమర్శకులు వ్రాసినమాట విద్వాంసు లాదరింపఁ దగినది కాదు.

వాచస్పత్యాది గ్రంథము లన్నియును బ్రమాణాంతరావిరుద్ధములుగా నున్నంతవఱకుఁ బ్రమాణములనియును, ప్రమాణాంతరవిరుద్ధములుగా నున్న ప్రమాణములు కావనియును విమర్శకులు గ్రహింతురు గాక.

ఈ శబ్దవిషయమున విమర్శకులుచేసిన విజృంభణ మెట్టిదో తక్కిన శబ్దములవిషయమున వారు చేసిన విజృంభణముకూడ నట్టిదే యని పాఠకులు గ్రహించియే యుందురు. కనుక నీ వ్యాసము నింతట ముగించుచున్నాను.

ఫొటోగ్రఫీ - పిల్లలు

శ్రీ కే. కృష్ణమూర్తి

పిల్లలను ఫొటో తియ్యాలంటే- ఎంత కష్టమో, చక్కగా తియ్యాలంటే ఇంకా ఎంత కష్టమో ఫొటోగ్రఫీని వృత్తిగా పెట్టుకుని జీవించేవారి నడిగితే చెబుతారు! బుద్ధి తెలిసిన పెద్దవారిని ఫొటో తియ్యటానికే వారు అంత తంటాలు పడుతున్నప్పుడు పిల్లల విషయంలో అవస్థ పడతా రంటే ఆశ్చర్య మేముంది? దీనికి కారణం పిల్లలుతిన్నగా కదలకుండా కూర్చోరు. పిల్లలు కదులుతున్నప్పటికీ ప్రస్తుతం ఎమెచ్యూర్స (ఫొటోగ్రఫీని వృత్తిగా పెట్టుకోనివారు) వుపయోగించే కెమేరాలతో చెడిపోకుండా తియ్యవచ్చు. కదలట మంటే తల అటూ ఇటూ తిప్పటమే కాకుండా ముందుకు వెనుకకుకూడ జరగటం జరుగుతుంది. దీనివల్ల ఫొటోగ్రాఫరు అంతా సిద్ధంచేసుకొని తీరాచట్టున మీట నొక్కపోయేసమయానికి కెమేరాకంటె తిసతగ్గ పదార్థం ఇంకోటి ఈ ప్రపంచంలో లేదన్నట్టుగా కెమేరా మీదికి అమాంతంగా దూకుతారుపిల్లలు! మనం అజాగ్రత్తగా వుంటిమా కెమేరా లాక్కొని నేలకేసి కూడ కొడతారుకూడాను. ఫొటోగ్రాఫరు ఎంత ప్రయత్నించినా ఒక్కొక్కప్పుడు ఏమీ లాభించదు.

కాబట్టి పిల్లలను ఫొటోలు తీసేవిషయంలో కొన్ని ముఖ్యమైనవిషయాలు గమనించేటట్టయితే అద్భుతమైన చిత్రాలు ఎక్కువప్రయాసం లేకుండా తియ్యవచ్చు. పిల్లలు నిద్రపోయేటప్పుడు తప్ప ఇంకెప్పుడూ కదలకుండాను, చప్పుడు చెయ్యకుండాను, మాట్లాడకుండాను వుండరు. ఎవ రేమిచేసినా వారి ఇష్టానికి అడ్డువుండదు. ఇది గమనించి ఫొటోగ్రాఫరు ఎంత శ్రమపడవలసి వచ్చినప్పటికీ చీకాకు చెంది నిరుత్సాహపడకూడదు. ఫొటోగ్రాఫరు తొందరపడ్డకొద్దీ రసాభాసం కావటం తప్ప ఇంకేమీ జరగదు. ఒక్కొక్కప్పుడు ఈ ఫొటోగ్రాఫరు ఆతురతనుచూచి వాళ్లు సత్యాగ్రహం ప్రారంభిస్తారు! అది మొదలుపెట్టగానే ఫొటోగ్రాఫరు కెమేరా మడిచి ఇంటికిపోవచ్చు. అది మొదలు కాకూడదు కాని మొదలయింతరువాత ఫొటోగ్రాఫరుకి సత్యాగ్రహంతప్ప ఫొటో తియ్యటానికి ఇంకేమీ దొరకదు! కాబట్టి పిల్లల ఫొటోలు తీసేవిషయంలో ఫొటోగ్రాఫరుకు భూదేవికి వున్నంత ఓర్పు వుండాలి.

మనుష్యుల ఫొటోలు తీసేటప్పుడు ఎప్పుడూ వెనుకటిప్రదేశం (Back ground) ను గమనించాలి. ఫొటోలలో పిల్లలు బాగుండీ ఆవెనుకటి ప్రదేశం అసహ్యంగానో లేక ప్రతికూలంగానో ఉంటే మొత్తం ఫొటో అంతా అసహ్యంగా వుండటం ఎప్పుడూ జరుగుతుంది.

బహిరంగంగా బయట పిల్లలకు ఫొటో తియ్యటంకంటె ఇంట్లోగదిలో తియ్యటం

శ్రేష్ఠం. ఫొటోగ్రఫీలో మంచి అభిరుచి వున్నవాడు ఇట్లానే తీస్తాడు.

ఆరుబయట అయితే, వెలుతురు సమానంగా వుంటుంది. కాచఫలకాల(Reflectors) వల్ల వెలుతురును కావలసినట్టు నిగ్రహం (Control) చెయ్యటానికి ప్రయత్నం చెయ్యవచ్చు కాని వెనుకటి ప్రదేశంకూడ నిగ్రహం చెయ్యవలసి వస్తుందికనక కుదరదు. ఇంట్లో ఇంత చిక్కు లేదు. ఇంట్లో బయటవున్నంత వెలుతురు వుండదు కనుకనూ వున్న రెండు మూడు కిటికీలు లేక వాకిళ్లలో వెలుతురు వచ్చుటకుగాను ఒకటి తప్ప మిగిలినవన్నీ మూసివేస్తే మంచి వెనుకటి ప్రదేశం (Back ground)కాని అంతట అదే తయారవుతుంది! తెరిచివుంచబడిన ద్వారంబయట ఎవరిచేతనన్నా తెల్లని తుండుగుడ్డపట్టించితే ఓ కావలసినంత వెలుతురు! కాని వెలుతు రంతా ఒక వైపు నించే వస్తూ వుండటంవల్ల ఫొటోతియ్యబడే వ్యక్తి ముఖమంతా వకవేపు వెలుతురుగాను,మరోవేపు చీకటిగాను వుండటం జరుగుతుంది. ఇది ఫొటోలు తీసేవాడు అత్యద్భుతమైన నేర్పరి అయితే తప్ప బాగుండదు. కాబట్టి ఏవైపునించి అయితే వెలుతురు వస్తున్నదో దానికి ఎదురుగుండా వున్న మరో వాకిలిగాని, కిటికీగాని తెరిస్తే కొంత వెలుతురు ఇటునుంచికూడ వచ్చి నిర్దిష్టవస్తువు (Subject)కు ఆకారం వస్తుంది. అదీకాక పూర్తిగా వెలుతురువచ్చే వేపే నిర్దిష్టవస్తువును కూచోపెడితే ఫొటో (Flat) బల్లపరపుగా వుంటుంది. వెలుతురు ఎప్పుడూ పక్కగుండా రావాలి. తగరంకాగితం ఏదన్నా అట్టమీద అంటించి కాచఫలకంగా వుపయోగించవచ్చు. కాని సూర్యరశ్మి పడ్డప్పుడు దీని వెలుతురు మరీ విపరీతంగా వుండి పెద్దవాళ్ల కళ్లకే ఇబ్బంది కలుగచేస్తుంది కాబట్టి పిల్లలకు బొత్తిగా పనికిరాదు. తగరంపైని తెల్లని వులిపిరికాగితం అంటిస్తే కొంతవరకు దాని జోరు తగ్గుతుంది. ఇవి అట్టే ఏమిటి అసలు డబ్బుఖర్చులేకుండా చెయ్యగలిగిన సూచనలు. ఇక ఎలట్రిక్ కాచఫలకముల (Ref lectors) తో వెలుతురును బాగా వశంచేసుకోవచ్చును. ఏదీకాకుండా కిటికీలు తలుపులు అన్నీ తెరచి మధ్యాన్నంవేళ గదిలో వ్యక్తిని కూచోపెట్టి ఇంక దేని సహాయంలేకుండా ఫొటోతీస్తే అద్భుతంగావుంటుంది! నల్లని వెనుకటి ప్రదేశం (Back ground) వుపయోగించే టప్పుడు వ్యక్తి జుట్టు దానిలో కలిసిపోగూడదు!

కెమేరావిషయంలో పిల్లల ఫొటోతియ్యటానికి పరావర్తకము (Reflex)కాని, ఇప్పుడు ఎక్కువ ప్రచారంలో వున్న ద్వికటకపరావర్తకము(Twin lens reflex)కాని వుత్తమమైనవి. ఇతరవాటితో తియ్యవచ్చును కాని వీటితో శ్రమతక్కువ. కారణం ఏమిటంటే పిల్లలు కదలుతున్నప్పుడు కేంద్రీకరణము (ఫోకసింగు) తీవ్రం(Sharp)గా వున్నదీ లేనిదీ ఈ రకాల కెమేరాలలో తప్ప తెలియదు. ఫొటో బాగుండాలంటే ఈతీవ్రత అవసరమని చెప్పటం అనవసరం. పిల్లలను ఫొటోతీసేటప్పుడు ఫిలింగాని, ప్లేట్లుగాని ఖర్చు అవుతయ్యి అని లోభించిన లాభంలేదు. అసలు లోభత్వానికి ఫొటోగ్రఫీలో తావులేదు!

పిల్లలను అటుచూడమనీ ఇటుచూడమనీ శ్రమపెట్టటంకంటే కెమేరాతో అన్నీ సిద్ధంచేసుకుని పరావర్తక దర్శని (Reflex finder)లో గమనిస్తూ వుండటం వుత్తమం.

శ్రేష్ఠం. ఫొటోగ్రఫిలో మంచి అభిరుచి వున్నవాడు ఇట్లానే తీస్తాడు.

ఆరుబయట అయితే, వెలుతురు సమానంగా వుంటుంది. కాచఫలకాల (Reflectors) వల్ల వెలుతురును కావలసినట్టు నిగ్రహం (Control) చెయ్యటానికి ప్రయత్నం చెయ్యవచ్చు కాని వెనుకటి ప్రదేశంకూడ నిగ్రహం చెయ్యవలసి వస్తుందికనక కుదరదు. ఇంట్లో ఇంత చిక్కులేదు. ఇంట్లో బయటవున్నంత వెలుతురు వుండదు కనుకనూ వున్న రెండు మూడు కిటికీలు లేక వాకిళ్లలో వెలుతురు వచ్చుటకుగాను ఒకటి తప్ప మిగిలినవన్నీ మూసివేస్తే మంచి వెనుకటి ప్రదేశం (Back ground)దాని అంతట అదే తయారవుతుంది! తెరిచివుంచబడిన ద్వారంబయట ఎవరిచేతనన్నా తెల్లని తుండుగుడ్డపట్టించితే ఓ కావలసినంత వెలుతురు! కాని వెలుతురంతా ఒకవైపు నించే వస్తూ వుండటంవల్ల ఫొటోతియ్యబడే వ్యక్తి ముఖమంతా వకవేపు వెలుతురుగాను,మరోవేపు చీకటిగాను వుండటం జరుగుతుంది. ఇది ఫొటోలు తీసేవాడు అత్యద్భుతమైన నేర్పరి అయితే తప్ప బాగుండదు. కాబట్టి ఏవైపునించి అయితే వెలుతురు వస్తున్నదో దానికి ఎదురుగుండా వున్న మరో వాకిలిగాని, కిటికీగాని తెరిస్తే కొంత వెలుతురు ఇటునుంచికూడ వచ్చి నిర్దిష్టవస్తువు (Subject)కు ఆకారం వస్తుంది. అదీకాక పూర్తిగా వెలుతురువచ్చే వేపే నిర్దిష్టవస్తువును కూచోపెడితే ఫొటో (Flat) బల్లపరపుగా వుంటుంది. వెలుతురు ఎప్పుడూ పక్కగుండా రావాలి. తగరంకాగితం ఏదన్నా అట్టమీద అంటించి కాచఫలకంగా వుపయోగించవచ్చు. కాని సూర్యరశ్మి పడ్డప్పుడు దీని వెలుతురు మరీ విపరీతంగా వుండి పెద్దవాళ్ల కళ్లకే ఇబ్బంది కలుగచేస్తుంది కాబట్టి పిల్లలకు బొత్తిగా పనికిరాదు. తగరంపైని తెల్లని వులిపిరికాగితం అంటిస్తే కొంతవరకు దాని జోరు తగ్గుతుంది. ఇవి అట్టే ఏమిటి అసలు డబ్బుఖర్చులేకుండా చెయ్యగలిగిన సూచనలు. ఇక ఎలక్ట్రిక్ కాచఫలకముల (Ref lectors) తో వెలుతురును బాగా వశంచేసుకోవచ్చును. ఏదీకాకుండా కిటికీలు తలుపులు అన్నీ తెరచి మధ్యాహ్నంవేళ గదిలో వ్యక్తిని కూచోపెట్టి ఇంక దేని సహాయంలేకుండా ఫొటోతీస్తే అద్భుతంగావుంటుంది! నల్లని వెనుకటి ప్రదేశం (Back ground) వుపయోగించే టప్పుడు వ్యక్తి జుట్టు దానిలో కలిసిపోగూడదు!

కెమేరావిషయంలో పిల్లల ఫొటోతియ్యటానికి పరావర్తకము (Reflex)కాని, ఇప్పుడు ఎక్కువ ప్రచారంలో వున్న ద్వికటకపరావర్తకము(Twin lens reflex)కాని వుత్తమమైనవి. ఇతరవాటితో తియ్యవచ్చును కాని వీటితో శ్రమతక్కువ. కారణం ఏమిటంటే పిల్లలు కదలుతున్నప్పుడు కేంద్రీకరణము (ఫోకసింగు) తీవ్రం(Sharp)గా వున్నదీ లేనిదీ ఈ రకాల కెమేరాలలో తప్ప తెలియదు. ఫొటో బాగుండాలంటే ఈతీవ్రత అవసరమని చెప్పటం అనవసరం. పిల్లలను ఫొటోతీసేటప్పుడు ఫిలింగాని, ప్లేట్లుగాని ఖర్చు అవుతయ్యి అని లోభించిన లాభంలేదు. అసలు లోభత్వానికి ఫొటోగ్రఫిలో తావులేదు!

పిల్లలను అటుచూడమనీ ఇటుచూడమనీ శ్రమపెట్టటంకంటే కెమేరాతో అన్నీ సిద్ధంచేసుకుని పరావర్తక దర్శని (Reflex finder)లో గమనిస్తూ వుండటం వుత్తమం.



శ్రీరాగం

అటూ ఇటూ కదిలితే వాళ్లని బలవంతపెట్టి కదలకుండా వుండమనకూడదు. చెప్పితే వినే తల్లులను తెచ్చి పిల్లలను ధోరణిలో పెట్టటం మంచిదే! పిల్లలను ఫోటోలు తీసేటప్పుడు నలుగురినీ బయటికి తరమటం చాల అవసరం! కారణం ఏమిటంటే సరిగ్గా పిల్ల కదలకుండా కూచోపొయ్యే సమయానికి వీళ్లు చప్పట్లు కొట్టి డబ్బాలు వాయించి పిల్లలను కదలకుండా వుండమని చెపుతారు! దాంతో సంగతి మొదటికొస్తుంది. అసలు సాధారణంగా కథ అడ్డంగా తిరుగుతుంది. ఇందులో ఆశ్చర్య మేమీ లేదు.

ఓర్పువహిస్తే పిల్లలుపెట్టే పోజులుతియ్యటానికి చివరకు ఫోటోగ్రాఫరుకే విసుగేస్తుంది. కల్మషం లేనిహృదయాలు కనక వాళ్లది ఏఫోటో అయినా బాగానే వుంటుంది!


ఫోటోలు అనగానే మనవాళ్లకు ముఖ్యంగా ఆడవాళ్లకు వెర్రి ఎత్తుతుంది. ఒకరోజు పెళ్లికి డజనుచీరెలు తీసికెళ్లే స్త్రీలకు ఈవిషయంలో వెర్రిఎత్తటంఅట్టే వింతసంగతి కాదు. నగలనీ, నాణాలనీ ఏవేవో తెచ్చిపెడతారు. తమదగ్గిర లేకపోతే ఇతరులవి తెస్తారు. అసలుఫోటోకు ముందర పిల్లను అరగంట ముస్తాబుచేస్తార్లు. ఇవన్నీ చాల అనవసరం. వీటితో ఫోటోలలో అసలుసంగతి మరుగు పడుతుంది. వుదాహరణంగా నగలుపెట్టుకున్న పిల్ల నవ్వుతున్నా లేక వూరికే



ముద్దు

కూచున్నా బాగుంటుంది; గాని ఆపిల్ల ఫోటోలో బాగుంటుందేమో ఆలోచించండి! వస్త్రాలు లేకుండా పిల్లలఫోటోలు మరీ బాగుంటయి! వాళ్లలోవున్న సహజత్వం, అమాయికత్వం అప్పుడు కాని బయటికి రావు.

పిల్లలు ఆరుబైట ఆడుకునేటప్పుడు గాని కొంటెపనులు చేస్తూ ఉన్నప్పుడుగాని ఫోటోలుతియ్యవచ్చు. బయట తీసేవాటికి



"ఎవ్వరూ చూడకుండా"

అట్టే శ్రమలేదు. కెమేరా సిద్ధంచేసుకోటం పిల్లలవెంట కొంచెము దూరాన నడవటం. వీళ్లు చేసే అల్లరిపనులు, వీళ్ల వ్యూహాలు, ఆటలు మొదలయినవి అన్నీ తలిదండ్రులకు ఆనందకరంగానే వుంటయి - కనీసం ఫొటోలలోనైనా!

అసలు ఇటువంటి ఫొటోలకు విలువ ఎప్పుడు వస్తుందంటే, వీళ్లు పెద్దవాళ్లయినప్పుడు. ఆఫొటోలు చూసుకుని వాళ్లు వాటిని తీయించినవారిని జన్మజన్మాలకు మరచి పోగలరా?

బాలానందం

నెలపొడుపు



సమస్య "చెల్లెలా! చూడవే"
(ఇదికూడా కొ. కృష్ణమూర్తిగారి వ్యాసమునకు
సంబంధించినదే)

నెలబాలు వొచ్చాడు నెలపొడుపు నేడు
చెల్లెలా చూడవే చినచంద్రవంక.
నీలిమబ్బుల చాందినీ చీరపైన
నూలుదారములాగు వేలాడుతాడు.
నూలుపోగూ తీసి గాలిలో వేస్తె
కొత్తబట్టలు నీకు కొనిపెట్టుతాడు.
మనసులో నీకున్న మాట తలపోసి
చేతులూ జోడించి జేజెమ్మ యనవె
మళ్లి నెలకే నీకు మంచి అవుతుంది
మనసులో నున్నట్టి మక్కువలు తీరు.
చూచినావా పాప చూరింటిమూల
దోబూచు లాడేటి దొంగబాలుణ్ణి
ఇట్టె కనిపిస్తాడు అట్టె పోతాడు
మాయ మవ్వకముందె మనము చూడాలి.
నెలపొడుపునాడు వెన్నెలరేక చూచి
చిరునవ్వు చిందేటి చిట్టి చూస్తేనూ
నెల అంత నవ్వుగా చెలగిపోతుంది
నెలపొడుపునవ్వులే నెల కంత మేలు.
చూపవే పాపాయి సొగసైన మొగము
ఇవ్వవే ఒకముద్దు నవ్వుబుగ్గలతో.
అన్నయ్య చూడరా ఆ చంద్రవంక
ఈ రెండు కొమ్ముల్లో ఏ కొమ్ము పెద్ద;
కుడికొమ్ము పొడుగైతె కొలతలో తరుగు
ఎడమకొమ్ముకు వృష్టి హెచ్చు వెల పెరుగు,
నెలవంక కొమ్ములకు వెలలు హెచ్చుటకు
సంబంధ మేమిటో సరి చెప్పగలవ ?
నెలబాలు వొచ్చాడు నెలపొడుపు నేడు
కళ్లార చూడండి పిల్ల లంతానూ,
చందమామకు నూలుబొందు లివ్వండి
చేతులూ జోడించి జే జే యనండి
పువ్వువలె మనసార నవ్వు నవ్వండి
కితకితలు పెట్టి వొక్కించి నవ్వించి
ముద్దులా పాపాయి మొగము చూడండి
అందరానందముగ హాయి పొందండి.

శ్రీవాత్సవ

పుస్తక సమీక్ష

గీతగోవిందము - ఆంధ్రాష్టపది

జయదేవమహాకవి రచించిన గీతగోవిందమును భావటీకతోను, ఆంధ్రాష్టపదులతోను, స్వాపదేశార్థవివరణముతోను, ఆయా అష్టపదులలోని భావములను స్ఫురింపజేసే ఇతర పద్యములతోను చిత్రములతోను, మేలైన కాగితములపైచక్కగా అచ్చువేయించి సొగసైన గ్రంథము ఆంధ్రలోకమునకు అందజేసిన శ్రీ ఉయ్యూరు జమీందార్, రాజా వేంకటాద్రి అప్పారావు బహద్దరు వారు ప్రశంసార్హులు.

ఒక భాషలో ప్రఖ్యాతి పొందిఉన్న కావ్యమును మరియొక భాషలోనికి పరివర్తనం చేయడం చాలా కష్టమైన పని. మూలంలో ఉన్న ఘనత ఒక్క భావమును బట్టే ఉండదు. భావంతోపాటు పదలాలిత్యము, శబ్దాలంకారము, రచనాచమత్కృతి మొదలయిన విషయములు సైతము మనోజ్ఞంగా ఉంటవి. ఇట్టి సుగుణము లన్నీ గలిగి ఎంతో ప్రఖ్యాతి పొంది రసజ్ఞులయిన కళోపాసకుల జిహ్వాగ్రమందు లేదా హృదయమందైనా తాండవమాడుతూ ఉండే జయదేవుని గీతగోవిందము - అష్టపదులు తెనిగించడం సామాన్యమైన పని కాదు. అందలి భావము పూర్తిగా తెలుగురచనలో అనువదించడమే కష్టము; దానితోపాటు అందలి పదలాలిత్యము, శబ్దాలంకారము, రచనాచమత్కృతి మొదలయిన మనోజ్ఞ విషయములు సైతము తెలుగు రచనలో ప్రదర్శించడము మరీ కష్టమైన పని. ఈ రెండు కష్టమైన పనులకు తోడు శ్రీ రాజావారు తమ ఆంధ్రాష్టపదులు గమనికలో సైతము సంస్కృతాష్టపదులను అనుకరించే విధమున రచించుటకు పూనుకొన్నారు. ఇది అనన్యసామాన్యమైన పని. ఇట్టిపని చేయుటకు పూనుకొన్న శ్రీరాజావారి సాహసము మెచ్చుకోవలసినదే; కాని, వీరి అనువాదము విమర్శించి చూడగా మాకు ఆశాభంగము కలిగినందుకు చక్కగా నగచినాము.

గ్రంథము విప్పి రెండు పుటలు త్రిప్పగానే స్వాపదేశార్థము అనే 'తలవ్రాలు' క్రింద నన్న మూడవపేరాలో "తేజోకళయా" అన్న ప్రయోగము కనబడినది: సంస్కృత భాషాలక్షణము ఏమాత్రము తెలిసినవారైనా చేయగూడని తప్పు గదా ఎట్లు ప్రయుక్తమైనదని విచారించినాము.

మరికొన్ని పుటలు తిప్పిచూడగా 28-వ పుటలో "కంసహంతకుని" అనే ప్రయోగము కనబడినది. "హన్తృ" శబ్దము తెలుగులో ప్రథమావిభక్తి - ఏకవచన రూపము హంత కావచ్చును గాని "హంతకుడు" కావడానికి అవకాశం లేదు. "హంతకుడు" అనే ప్రయోగం నేటి రచయితలు చాలామంది చేస్తున్నారు; తప్పు. అంతకహాతక శబ్దసాదృశ్యాన్ని బట్టి వచ్చిందికాబోలు. వ్యావహారిక భాషాసమ్మత మని తప్పుకోడానికి ఇద్ది లోకవ్యవహారమందు ఉండే ప్రయోగం కాదు గనుక వీలులేదు.

పు. 34. నాల్గవ అష్టపది. "హరిరిహ ముగ్ధవధూనికరే। విలాసిని విలసతి కేళిపరే ।" అనేది విలాసలాలసుడైన మురారిని చూపిస్తూ ఆళి రాధను సంబోధిస్తూ పాడినది. అందులో "విలాసిని" సంబోధనవాచకంగా, "ఓ విలాసినీ!" అని రాధను పిలిచే మాటగా ప్రయుక్తమైనది. అది చూడక, "విలాసిని = సుందరులా, ముగ్ధ = ముగ్ధలా, వధూనికరే = స్త్రీలగుంపులో" అని భావటీకలో వ్రాసినారు (చూ. పు. 34) ఆంధ్రాష్టపదిలో (చూ. పు 36.) "అలముగ్ధలతో నలరును అదే విలసిలు పలునాటల మాధవుడే" అని ఈ విలాసిని శబ్దార్థము ఎత్తుకోకుండా తెలిగించినారు. గనుక అక్కడ ఈ విచారమునకు అవకాశము లేకపోయినది. 'విలాసిని' సప్తమ్యర్థమందు 'ముగ్ధవధూనికరే' తో అన్వయింపరాదా అంటే 'కేళిపరే' అని ఉన్నది గనుక పునరుక్తి దోషం కలుగుతుంది. అందుచేత, 'విలాసిని' సంబోధనంగానే గ్రహించవలెను.

భావటీకలో తప్పులనేకముగా కనబడినవి. స్థాలీపులాకన్యాయంగా కొన్ని చూపిస్తున్నాము:

పు. 33. "దరవిదళిత మల్లీవల్లి చంచత్ పరాగప్రకటితపటవాసైర్వాసయన్ కాననాని"

చంచత్ అంటే సొంపా అని అర్థం వ్రాశారు. కదులుచున్న అని అర్థం చెప్పవలసియుండెను. ఆప్టె నిఘంటువులో ఈ అర్థమందు దీనినే ఉదాహరించినారు. (చూ. చంచ్. ఆప్టె).

పు. ౮౩. ఎనిమిదవ అష్టపదిలో ఏనిమిదవచరణం "శ్రీజయదేవ భణిత మిద మధికమ్ యది మనసా నటనీయమ్ । హరివిరహాకుల వల్లవయువతిసఖీవచనం పఠనీయమ్" ఇందులో "యది మనసా నటనీయమ్" — మనసా (మనస్సుచేతను) నటింపదగినది (ఆనందింపదగినది) అయితే (తర్హి) పఠనీయం - చదువదగినది అని అర్థము చెప్పవలసినది. భణితం అనునది సఖీవచనము నకు విశేషణం కావలెను. అట్లు చెప్పక "నటనీయం - పొందదగినది, యది - లేదా, పఠనీయం - చదువదగినది" అని టీక వ్రాసినారు. "యది" అంటే 'లేదా' అనే వైకల్పికార్థము లేదు. ౧౯-వ అష్టపదిలో "వదసి యది కించి దపి" అన్నప్పుడు ఇంచుకేని మాట్లాడునెడ" అని టీక వ్రాసినట్లే ఇక్కడ సైతము వ్రాయవలసియుండెను.

పు. ౮౯. శ్లో. ౩౦ — సారోమాంచతి అనే శ్లోకమునకు వ్రాసిన టీకలో అన్వయక్రమం తప్పినది; "అన్యథా హస్తకః త్యక్తః" అనే మాటలకు అర్థం చెడినది.

"హేస్వరై వ్యద్యప్రతిమ! ఏతావతి అతః జ్వరే తే రసాత్ (త్వం) ప్రసీదసి యది, వరతనుః న జీవేత్ కిం? అన్యథా హస్తకః త్యక్తః"—ఇది అన్వయక్రమము. 'నీవు నీమంచువల్ల దయచూపింతువేని ఆసుందరి ఎందుకు బతికేది కాదు? అట్లు కాకపోతే చేయివిడిచి పెట్టుకోవలసినదే' అని తాత్పర్యము. టీకలో 'న' అచ్చు పడకపోయినా "ప్రసీదసి యది — దయచూపకున్న" అనిన్ని 'కిం జీవేత్ —ఎట్లు బ్రతుకునుఅనిన్ని అర్థం వ్రాయడంవల్ల "న ప్రసీదసి యది, వరతనుః కిం జీవేత్" అని టీకాకారులు అర్థంచేసుకొన్నారని చెప్పవలెను. అందుచేత, అన్యథా హస్తకః త్యక్తః అంటే వారికి సరిగా అర్థంపొసగక 'ఇతరయత్నము వదలబడ్డది' అని వ్రాయవలసివచ్చినది. అన్యథా విశేషణంగా భావించి 'ఇతర' అని అర్థంచెప్పడం సమంజసం కాదు. హస్తకః అంటే యత్నము అని చెప్పడం సైతము సరిగా లేదు.

పుట. ౯౮ శ్లో. ౩౮ — మదన కదన క్లాంతః అంటే మన్మథుని యుద్ధమువల్లను అనగా సంభోగంచేత అలసటపొందినవాడని చెప్పవలెను. మదన కదన అంటే మరుబారిని అని వ్రాసినారు. కదనమంటే బారి అన్న అర్థము ఎట్లు చెప్పగలము?

పు. ౯౯ శ్లో. ౩౭ "అసౌర మ్యోఽభిసారక్షణః"—అభిసారే అసౌ క్షణః రమ్యః అని అన్వయక్రమము, మీ రేర్పరచుకొన్న సంకేతస్థలమందు (చేరుటకు) ఈక్షణమే రమ్యమయినది అని భావము. అభిసారక్షణఃఅనేసమస్తపాఠముకంటె అభిసారే క్షణః అనే వ్యస్తపాఠమే సరళమైనది. పూర్వముద్రణములో 'అభిసారేక్షణః' అనే పాఠ మున్నది. అభిసారక్షణ అంటే 'ఏర్పాటైన త్రుటి' అని అర్థం చెప్పడం సరిగా లేదు.

పు. ౧౩౫ ౧౬-వ అష్టపదిలో మూలమందు "అనిల తరల కువలయ నయనేన పతతి న సా కిసలయ శయనేన" అనిన్నీ, ఛాయాటీకలో "...కిసలయ శయనేన తపతి" అనిన్నీ పాఠము ద్వివిధంగా ప్రదర్శిస్తే పాఠకులు దేనిని అనుసరించగలరు? మూలంలో చూపించిన 'పతతి న' పాఠంకంటె టీకలో చూపించిన 'న తపతి' అనే పాఠమే సరియైనది. రెండుచోట్లను ఈ పాఠమే చూపించడం మంచిది. "కిసలయ శయనే" అని సప్తమీవిభక్తిలో ఉన్నట్లు చూపించి "గురుపాన్పున" అని అర్థం వ్రాశారు; సప్తమ్యంతమైతే ప్రక్రమభంగం; అర్థము సరిపడదు. అన్ని చరణాంతములున్ను తృతీయాంతములే.

పు. ౧౭౫. శ్లో. ౬౭ ఇది చాలా చమత్కారకారియైన శ్లోకము. ఇందు రెం డర్థము లున్నవి. మొదటి అర్థములో 'మదాలసే', 'ఇందుమతీ' ఇత్యాదులు తన్వియొక్క ఆయా అవయవములకు విశేషణములు; ప్రథమాంతములున్నూ; రెండవయర్థములో ఇవి మదాలస, ఇందుమతి మున్నగు దేవతాస్త్రీలను స్ఫురింపజేస్తవి. ఇట్టిస్థితిలో టీకాకారులు మొదటి అర్థమును వ్రాయక పూర్తిగా విడిచిపెట్టి రెండవ అర్థమునే—

అంశములోను ప్రథమలకు ద్వితీయార్థములను పొందిస్తూ వ్రాయడం చాలా వింతగా ఉన్నది. "విబుధయోషితం వహసి" అంటే దేవతాస్త్రీలను తాల్చెదవు అని అర్థం చెప్పినారు. పూర్వముద్రణములందును అర్థమిట్లే ఉన్నది. గాని, అర్థం పొసగదు. స్త్రీలను తాల్చడ మేమిటి? ఆప్టె నిఘంటువు చూడండి. ఈ పదమునకు గల రెండవ అర్థమునకు— అనగా "సుర సుందరీరూపం" అనే అర్థమునకు ఈ శ్లోకపాదమే ప్రమాణంగా ఎత్తుకొన్నాడు.

దీని తర్వాతి శ్లోకంలో 'నిరవసాదాం' అంటే 'తమకపడునదో' అని అర్థం వ్రాశారు. నిర్-అవసాదాం అంటే అవసాదంలేని, అనగా కృశించడంగాని, అలసిపోవడంగాని లేని అని చెప్పవలసియుండెను.

టీకలో సంస్కృత పదములకు సరియైన అర్థములు తెలియజేయు మాటలు విడిచి తాత్పర్యమును మాత్రమే సూచించు మాటలు ప్రదర్శించడం మంచిది కాదు. పు. ౧౮౩. శ్లో. ౭౦—విష్వక్ అంటే బాగా అనుటకంటే (ధ్వాంతమునకు విశేషణంగా) సర్వవ్యాప్తమైన అనిన్నీ, పు. ౧౯౩.— చిరంఅంటే చాలగా అనుటకంటె చాలాకాలముయి అనిన్నీ, వశంవద అంటే నిండుకొన్న అనుటకంటె స్వాధీనమైన అనిన్నీ, పు. ౧౯౫. చ. ౫,— పరిశీలన అంటే సేవకై అనుటకంటె స్పర్శకై అనిన్నీ, పు. ౧౯౯ శ్లో. ౭౬— తల్పాంతంఅంటే పడకమధ్యను అనుట కంటె శయ్యాసమీపమునకు అనిన్నీ, లజ్జాపి సలజ్జా ఇవ అంటే సిగ్గును సిగ్గుతో వలె అనుటకంటె సిగ్గుసైతము సిగ్గు పొందినదానివలెనే అనిన్నీ, పు. ౨౦౧. శ్లో. ౭౮ నిర్భర అంటే దాచలేని అనుటకంటె అధికమైన లేదా గాఢమైన అనిన్నీ, స్మితస్నపిత అంటే చిరునవ్వుచే నిండిన అనుటకంటె చిరునవ్వుచే తడుపబడిన అనిన్నీ, ఆకూత అంటే తెల్పుచు అనుటకంటె ఉద్దేశము, కోరిక అనిన్నీ సవరించడం మంచిది. ఇంకా ఇటువంటి లోపాలు ఛాయా టీకలో అనేకంగా ఉన్నవి.

ఇకను తెలిగిస్తూ రచించిన పద్యాలు, పాటలు ఎట్లున్నవో చూతాము. ముక్కను ముక్కగా తెలిగించలేదు గనుక పైని టీకలో కనబరచిన లోపాలు ఇందు కనబడడానికి అవకాశం లేదు. స్వేచ్ఛగా అనువదించడం మంచిదే కాని, మూలంలో ఉన్న భావం, రసం, చమత్కారం చెడకుండా చూడవలెను. విమర్శించి చూడగా పెక్కుచోట్ల మూలమునకు తాత్పర్యమే కాని భావముగాని, కవితాచమత్కృతి గాని పద్యములలో గానీ పాటలలో గానీ సరిగా వచ్చినదని చెప్పలేము. కొన్నిచోట్ల అన్వయక్రమము చూచుకోకుండా తెలిగించినారు; చూడండి:—

పు. ౭. శ్లో. ౩. ఇందులో 'యది' తో అన్వయిస్తూ మొదటి రెండు చరణాలలోను ఉన్న 'హరిస్మరణాసక్తి' 'కళాకుతూహలము' ఈరెండు మాత్రమే ఉద్దిష్టములు. మూడవ చరణమందలి "మధురకోమలకాంతపదావళీమ్" అనేది నాల్గవ చరణమందలి "జయదేవ సరస్వతీం" అనేదానికి విశేషణము. గనుక మూడవచరణము "నునుసొబగుమాట రుచి మాటంగొనెదరేని" అని మొదటి రెండు చరణములతో అన్వయించునట్లుగా తెలిగించడం సరిగాదు.

పు. ౮౧. శ్లో. ౧౮. సాధుత్వద్వదనం సుధామయం" అంటే "సుధయా హరి! వేణురవం" బని తెలిగించడం మూలమునకు విరుద్ధము. వేణురవము సుధామయమైతే వదనచుంబన మేల?

పు. ౭౯. శ్లో. ౩౧. దైవతవైద్యహృద్య! ఉపేంద్ర! స్మరాతురాం, త్వత్ - అంగసంగ-అమృతమాత్ర సాధ్యామ్, రాధాం విముక్తబాధాం న కురుషే (యది), (తర్హి) వజ్రాధికదారుణః అసి - ఇది అన్వయక్రమము.

దీనికి తెలిగింపు ఎట్లున్నదో చూడండి:—

"స్మరార్త నీ స్పర్శయొసంగ దక్కక్
హరింపగా బాధ దయార్ద్ర! రావో
వరాశ్వనీ తేజము వాడవా నిక్
ఎటుంగనో నింక నుపేంద్రవజ్రా"

శ్లోకంలో 'దైవత వైద్యహృద్య!' 'ఉపేంద్ర'—ఈరెండున్ను సాభిప్రాయ సంబోధనములు. అనువాదంలో శ్లేటిసొగసు చెడిపోయినది. 'ఉపేంద్రవజ్రా!' అనేది నిరర్థకము. సంగము లేదాస్పర్శ, దానియందు అమృత

త్వము ఆరోపించినగాని బాధాహారణము నుచెప్ప వీలు లేదు. అశ్వినీ దేవతలు సౌందర్యమునకు ఉపమాన భూతులుగాని తేజస్సునకు కారు. గనుక అనువాదము మూలమునకు దూరమైనది.

పు. ౨౨౫ శ్లో. ౯౩. ఇది చాలా చక్కని శ్లోకము. దీనిని తెలిగిస్తూ రచించిన సీసపద్యము పెద్దది గనుక చరణములు పూరించుటకుగాను మూలంలో లేని 'నలిగి సారము వీడగలవు చెఱకు', 'సమకూడి నీవైన సరిరామధువ' అనేభావములు తెచ్చిపెట్టుకొన్నారు. మూలంలో ఉన్న భావాలు ఎట్లు తెలుగులో అనువదించారో చూడండి:—

"మాధ్వీక! భవతః చింతా సాధ్వీనభవతి" దీనికి 'మాధ్వీక! నీచింత సాధ్వికాదు' అంటే సరిపోయేది. గాని వీరు వాఖ్యాతగా "జౌదుమాధుర్యమున సమంబనెడి చింత, పోలదిక నీకు నోయిప్పపూవుతేనె!" అని మూలంలోని భావం పేలవంగా బట్టబయలు చేశారు. "శర్కరే! కర్కశాసి" అంటే "కఠినమా. రూపంబు గద నీది కలకండ" అని తెలిగించారు రూపము కఠినమంటే ఏమి? కంటికి కనబడేది రూపము, స్పర్శకు గాని ఔపచారికంగా మనస్సుకుగాని తెలియగలది కఠినత్వము. ఈ రెంటికిని సందర్భము కుదరదు. ఇక్కడ ప్రసక్తమైనది రుచి గాని రూపము కాదు. "క్షీర! తే రసః నీరం" అని మూలంలో ఉన్నది. "నీరాదు నీవహో క్షీర రసమ!" అని తెలిగించారు. జయదేవః వి క్షీరము నుద్దేశించి క్షీ ర మా! నీ రసము నీర మేను అంటున్నాడు. అనువదించినవారు క్షీర రసమును సంబోధించి నీవు నీరాదువుఅంటున్నారు. "క్షీరమా! నీరౌను నీరసంబు" అంటే మంచిదేమో? "మాకంద! క్రంద" అంటే తియ్యమామిడిపండా ఏడ్వుము అని స్పష్టంగా అర్థం కనబడుతూఉన్నది. టీకలో సైతము ఈ అర్థమే గ్రహించారు; గాని "తెలిసి యేమందువో తియ్యమామిడిపండ" అని ఎందుకు తెలిగించారో తెలియదు.

ఇట్టి లోపములు కొన్ని ఉన్నాయి. ఇక్కడ స్థలం చాలదు గనుక ఏవో కొన్ని మాత్రమే చూపించినాము. అచ్చుతప్పులు చాలా ఉన్నవి.

చిత్రములు కొన్ని చక్కగానే ఉన్నవి గాని, కొన్నిమాత్రము శ్లోకములోని భావములకుగాని అష్టపదులలోని భావములకు గాని ఏమీ సంబంధము లేకుండా ఉన్నవి. అక్కడక్కడ ఇతర గ్రంథముల నుండి ఎత్తిచూపిన పద్యములలోని భావములకు సంబంధించి ఉన్నవి.

ఈ పై పద్యములకున్ను, గ్రంథమందలి శ్లోకములకును అష్టపదులకున్ను, కొన్నిచోట్ల భావములోగాని మాటలోగాని సాదృశ్యమేమీ కనబడదు.

ఎంతో కొండంత ఆశతో ఈగ్రంథమును చదువుటకు మొదలుపెట్టి ఆశాభంగము పొంది యుండుటచేత ఉన్నది ఉన్నట్లు చెప్పక తప్పినది కాదు. అయితే ఈవిమర్శము సద్భావముతో చేసినదే అని పాఠకులు గ్రహింతురుగాక.

ఎంతో ధనము వెచ్చించి ఈగ్రంథమును ప్రకటించిన శ్రీవారు తమ తెలుగుపద్యములు, పాటలు, టీక నిర్దుష్టముగా సవరించుకొని యుండిన బాగుండును. ఇప్పుడైనా తగినసవరణలు చేయించి మరల ముద్రింపించిన మంచిదని మా అభిప్రాయము. సీతాపతి.

గ్రంథస్వీకరణము

సమీక్ష — గ్రంథకర్త: శ్రీ విద్వాన్ విశ్వంగారు. ప్రకాశకులు: నవ్యసాహిత్యమాల; అనంతపురం. వెల రు ౦-౧౨-౦ లు.

మౌలానా అజద్ (జీవితచరిత్ర) — రచయిత: శ్రీ కొమాండూరి. శఠకోపాచార్యులుగారు. వకీలు. కాకినాడ. వెల రు ౦-౬-౦ లు.

ఏకావళి — గ్రంథకర్త: శ్రీ వేలూరి శివరామ శాస్త్రిగారు, సూరవరం, ఆత్కూరుపోస్టు, కృష్ణాజిల్లా. వెల రు ౦౬౧౨౦.

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty St., Madras. Editor:— S. Sambhu Prasad.

భారతి

సచిత్ర మాసపత్రిక

BHARATHI

(A TELUGU MONTHLY)

సంపాదకుడు:

శి. శంభుప్రసాద్

ఆంధ్రపత్రికా ముద్రాలయము,

మద్రాసు.

౧౯౪౦

సంపుటము ౧౭, సంచిక ౮

ప్రకటన

ఈక్రింది కనబరచిన నెంబర్లు వారికి ఈనెల భారతి (1940 సం. ఆగస్టు నెల)తో ఇదివరకు చెల్లించిన చందా పూర్తి యగుచున్నది. తిరిగి ఇంకొక సంవత్సరమున కగు చందా మాకు చేరునట్లు ఈనెలాఖరులోగా మనియార్డరు చేసినచో తెంపు లేకుండ పత్రికను పంపుచుందుము. అట్లు తమ యొద్దనుండి 30-వ తేది లోపుగ సొమ్మురానిచో సహజభాషాభిమానులగు తాము తిరిగి ఇంకొక సంవత్సరమువఱకు భారతి చందాదారులుగ నుందురను నమ్మకముతో 1940 సం. సెప్టెంబరు 10-వ తేదిని రూ 6—4—0 లకు వి. పి. పంపుచున్నాము. కావున తా మెప్పటివలెనే పత్రికయం దభిమాన ముంచి సొమ్ము చెల్లించి వి. పి. ని గైకొన బ్రార్థితులు. ఒకవేళ తమకీ పత్రిక ప్రస్తుత మనవసరముగ దోచినచో మాకావిషయము వెంటనే తెలియజేసిన యెడల వి. పి. పంపుట నాపుదుము.

A 9. H 28, 36, 37, 39, 40, 41. J 7. P 14, 15, 16. R 25, 26. S 10, 37, 41, 43, 45, 91, 103, 106, 109, 114. T 5.

వ్యాసవిలేఖకులకు మనవి

వ్యాసాలు ఎనిమిదిపుటలకు మించకుండా ఉండాలి. కాగితానికి ఒకవైపే వ్రాయాలి. శాస్త్రీయవిషయాలనుగురించిన వ్యాసాలుకూడా ఎక్కువ పరిభాషా, ఎక్కువ వివరాలూ లేకుండా సంగ్రహంగాను, సామాన్యపాఠకునికి విషయం బోధపడేటట్టు సులభంగాను, మనస్సును కథలా ఆకట్టేటట్టు ఆకర్షకంగాను ఉండాలి. శాసనవ్యాసాలు పదిపన్నెండు పుటలకు మించేయెడల రెండు సంచికలలో ప్రకటింపవలసివచ్చును. "బాలానందమున" కుచితమైన కథలు, పాటలు, సాధ్యమైనంతవరకు పిల్లలభాషలో రచించి పంపించవలసినదని కవులకు మనవి. విమర్శలకు గ్రంథములు పంపువారు రెండుప్రతులు పంపవలెను. ఇతరత్ర ప్రకటితమైన రచన లేవీ పంపవద్దు.

దేశాన్ని ఎక్కువగా కలవరపరుస్తున్న సాంఘిక, ఆర్థిక, రాజకీయాది విషయాలనుగురించీ, మనఆంధ్రుల ప్రత్యేకసమస్యలనుగురించీ ప్రత్యేకవ్యాసాలు కావాలి. సాధ్యమయినంతవరకు ఎత్తుకునే విషయంలోను, చూచే దృష్టిలోను, రచించే రచనలోను కొత్తదనంకావాలి. మన ఉద్యమాలు, మనదేశం, మనసంఘం, మనఆశయాలు భారతిల్లో ప్రతిఫలించేటట్టు చూడవలసిదని వ్యాసకర్తలకు మనవి.—భా. సం.

విషయసూచిక – Aug 1940

కనకదుర్గ ... ...
శ్రీ శివశంకరశాస్త్రిగారు ౧౩౭

సాహిత్యము : జీవితము ... ...
శ్రీ క్రొవ్విడి రామంగారు ౧౩౮

సుధాశ్రావణి ... ...
'హిమానీ' ౧౪౨

ముక్కు తిమ్మనార్య ముద్దుపలుకు ... ...
శ్రీ కె. నాగభూషణరావుగారు ౧౪౩

అద్దిరె స్వరాజ్యదేవతోద్యానవాటి ...
శ్రీ బులుసు సీతారామశాస్త్రిగారు ౧౪౭

పోతన వ్యక్తిత్వము ... ...
శ్రీ శిష్టా రామకృష్ణశాస్త్రిగారు ౧౪౯

స్వాగతము ... ...
శ్రీ కొండూరు వీరరాఘవాచార్యులుగారు ౧౫౬

హిందూభాషల పరిణామము ... ...
శ్రీ మండ నరసింహంగారు ౧౫౮

'తానుత్రవ్విన గోతిలోఁ దానెపడును' ...
శ్రీ కొత్త సత్యనారాయణ చౌదరిగారు ౧౬౪

శాతకర్ణి ... ...
శ్రీ మల్లాది అవధానిగారు ౧౬౭

కన్నులుగల కబోది ... ...
శ్రీ చిత్రావూరి కామేశ్వరరావుగారు ౧౭౨

అమరారామం ... ...
శ్రీ కవికొండల వేంకటరావుగారు ౧౭౩

ఏమి నీమహిమ ... ...
శ్రీ అనుముల వెంకటశేషకవిగారు ౧౭౮

కోనబుద్ధరాజు : రంగనాథరామాయణము ...
శ్రీ వావిలాల వెంకటేశ్వరశాస్త్రిగారు ౧౮౦

మేలుకొలుపు ... ...
శ్రీ భాగవతుల నరసింహమూర్తిగారు ౧౮౪

చిలకసముద్రం కలెక్టర్ ... ...
శ్రీ దిగవల్లి వేంకటశివరావుగారు ౧౮౫

ప్రేయసీ ... ...
శ్రీ పెండేం సూర్యనారాయణరావుగారు ౧౯౨

మాద్రి ... ...
శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రిగారు ౧౯౩

ఆంధ్రతేజము ... ...
శ్రీ ఉద్దయగిరి సన్యాసిరాజుగారు ౧౯౭

సముద్రమథనం ... ...
శ్రీ హనుమచ్ఛాస్త్రిగారు ౨౦౨

ప్రకృతిపాట ... ...
శ్రీ పురాణం కుమారరాఘవశాస్త్రిగారు ౨౦౯

ఔరంగజేబునకు శివాజీలేఖ ... ...
శ్రీ అయితం కాళీవరప్రసాదరాయ కవిగారు ౨౧౦

ఆషాఢ మేఘము ... ...
శ్రీ బొడ్డు బాపిరాజుగారు ౨౧౩

సంతానార్హత ఎవరికి ? ... ...
శ్రీ గౌరావఝుల వెంకటసుబ్బరామయ్యగారు ౨౧౫

వలదు ... ...
శ్రీ భట్టిప్రోలు కృష్ణమూర్తిగారు ౨౨౦

కర్ణుని జననము ... ...
శ్రీ బులుసు వేంకటేశ్వరులుగారు ౨౨౧

నీతిపద్యమాల ... ...
శ్రీ పురాణం సూర్యనారాయణ తీర్థులుగారు ౨౨౩

కన్యాశుల్కం సమీక్షణ (౩-వ భాగం) ...
శ్రీ సోమయాజుల వెంకటరామమూర్తిగారు ౨౨౫

జార్జెట్ చీర ... ...
శ్రీ పంగనామముల వెంకటేశ్వరప్రసాదరావుగారు ౨౩౩

భారతీ ప్రశంస ... ...
శ్రీమతి అబ్బెదొడ్డి సీతమ్మగారు ౨౩౮

విద్యుత్ సాధ్య సంవర్ధనము ... ...
శ్రీ దిగవల్లి శేషగిరిరావుగారు ౨౩౯

సమాధి ... ...
"సంపత్" ౨౪౬

కర్మజ్ఞాన సముచ్చయ వాదము ... ...
శ్రీ ఓగేటి వెంకటసుబ్బయ్యశాస్త్రిగారు ౨౪౭

చిన్నపిల్లల చిత్తవృత్తులు—శిశుశిక్షణము ...
శ్రీ గిడుగు వెంకటసీతాపతిగారు ౨౫౨

ఘనరాగము లేవి ? ... ...
శ్రీ పట్నాయుని నారాయణరావుగారు ౨౫౬

ఐరోపాఖండపరిస్థితులు-యుద్ధాలకు మూలకారణము
"భరద్వాజ" ౨౫౭

ఆంధ్రభారతి ... ...
శ్రీ అయ్యగారి విశ్వేశ్వరరావుగారు ౨౬౨

కీ. శే. ఆనందమోహనశాస్త్రి ... ...
శ్రీ గిడుగు సీతాపతిగారు ౨౬౪

బాలానందం ౨౬౬

త్రివర్ణచిత్రము : స్నానానంతరము. శ్రీ టి. భీమారావుగారు

'వీఁడు చెప్పిన చొప్పున తేఁడు రాజ్య
భారమును బూనె' నని ప్రజ పండితునకు
నున్న వ్యవహారముల నెల్ల విన్నవించి
లంచము లొసంగ ధన మట్టె లక్షలయ్యె.

చూపరులు చోద్య మందఁగ నాపురమున
సౌధముల నెన్నొ గట్టించి స్వల్పకాల
మునకు ధనియైన శాస్త్రిని పురనివాసి
యొకఁడుగాంచి యసూయచే వికలుఁడయ్యె.

అతఁడు రాజపురోహితుఁ డగుటవలనఁ
బండితునివృద్ధి కన్నులపాలఁ బడెను;
దానఁ దన్నాశనము చేయఁబూని యతఁడు
వేచియుండెను సమయంబు వేవిధముల.

ఇది యిటుండఁ బురోహితుఁ డుదయమునను
లేచి వాడుకచొప్పున నాచరింప
రాజగృహమున కరుగ నారాజు వాని
నడిగె 'సంగతు' లేమి? దేవా, యటంచు.

అదియె యదనని విప్రుఁడు మదిని దలఁచి
యనియె నీరీతి దేవర ! యాలకింపుఁ
డేమిసెప్పుదు మొన్న నె యీ పురమున
కరుగుదెంచెను బీదబ్రాహ్మణుఁ డొకండు.

అనతికాలంబునకె భవదాదరమున
నతఁడు గడియించె ధనరాశి నమితముగను,
దాన నాతఁడు గర్వియై తమదునేర
ములనె చాటుచునుండె నీపురమునందు.

తమదు పరిశుద్ధకర్ణరంధ్రములయందు
దుస్సహాదురంత దుర్గంధ దుర్గుణంబు
నెలవుగా నుండి నిచ్చలు కలుగఁజేయు
నేవ యింతింతగా దని యీసడించు.

మఱియు నీనాఁటినుండియు మాటలాడు
నపుడు తననాసికకు గుడ్డ నడ్డముగను
గట్టుకొనునఁట; వాఁ డెంతగర్వియగునొ!
కాంచఁగల రెంత వింతయుఁ గలుగ జేపు.

అనెడి విప్రునివాక్యంబు లాలకించు
జనవిభుం డెంతొ హృదిని సంశయము దోఁప
'సరి'యటంచును దలయూఁపెఁ, బరులకెపుడు
కీడు వాటిల్లఁ జూతురు కితవు లకట!

ఆదినంబున విద్వాంసు సౌధమునకు
నరిగి విప్రుండు క్షేమంబు లరయువాని
రీతి నటియించి పల్కె నీరీతి నార్య!
విన్నవించెద నొకమాట వినుఁ డటంచు.

అనుదినంబును మాటాడునవసరమున
నుద్భవించును దుర్గంధ మొకటి యంచు
మీదువిషయంబు చెప్పెసుమీ! విభుండు
దానఁ గష్టంబు తోఁచె నవ్వాని కకట!

కాన సంభాషణముసేయు కాలమునకు
వదన మాచ్ఛాదనము దేనివలననైన
నల్పుకొను టుత్తమం బంచు జనవిభుండు
తలఁచియున్నాఁడ నని నాకుఁ దెలిపె నేఁడు

చెప్పుటయె మీదుప్రకృతికి శ్రేయ మంచుఁ
దలఁచియుంటిని; జెప్పుట తగనియెడల
నన్ను క్షమియింపుఁ డని పల్కె నక్కవినయ
ములను జూపుచుఁ గుత్సితభూసురుండు.

పాప మామాయ నెఱుఁగని పండితుండు
విప్రవచనము నిజమని విశ్వసించె;
దైవమక్కట! యెటుచేయఁ దలఁచినాఁడొ!
కాని తెలియదు రాఁబోవు కర్మఫలము.

అంత మఱునటిదినమున నరిగి జేని
మ్రోలమాటాడుచును వస్త్రమును ముఖాన
నడ్డముగఁ బెట్టుకొన్న యా యనపరాధుఁ
గాంచి యంతయు నిజమని యెంచె విభుఁడు.

ఎంచి యంతట పచియించె నీవిధముగ
శాస్త్రిజీ, మీకు సాయంబు నలుప లేదు,
ఇంతదనుకను మ మ్మాశ్రయింతు రనుచు
స్వప్నమందైన భావింపఁ జాలనైతి.

ఇదిగో! లేఖను గైకొని యేఁగి నగరు
నందుఁ గోశాధిపతి కీయ నతఁడు పెక్కు-
బహుమతు లొసంగు నని యిచ్చె పార్థివుండు
ముద్రవైచిన యుత్తరమును రచించి.

అంతఁ బండితుఁ డుప్పొంగు సంతసమున
దానిఁ గైకొని రాజాజ్ఞపూని తన ని
వాసమున కేఁగి గృహమునఁ బనులు దీర్చి
కొనియు నరిగెద నామీఁద ననుచుఁ దలఁచె.

ఇట్టి సమయంబునను బురోహితుఁడు వచ్చి
జరిగిన యుదంత మంతయు నెఱిఁగి తనదు
పన్నుగడ ఫల మందకే పండితునకు
బహుమతు లొసంగె నని చాలఁ బరితపించె.

పరితపించి ముఖప్రీతి పఱపి యతఁడు
కొంతసే పుండి యరుగుచు నంత నచటి
భూవిభునిలేఖ నేకాంతముగ గ్రహించి
స్వీయ'పంచాంగమున' దాచి వెడలె నకట!

అధికమగు రాజసత్కార మందఁగోరి
యతిముదంబునఁ గోశాధిపతికి విభుని
లేఖ నొసగిన నతఁడు పరీక్షసేసి
వానినాసిక వాఁడిఖడ్గానఁ దఱిగె.

అంత హృదయంబు భేదిల్లునట్లు లతఁడు
గావుకేకలు వైచి నా 'కర్మ' మనుచు
మొత్తుకొని నెత్తి నోరును మోఁదుకొనుచు
నరిగె గేహంబునకు దైవమా! యటంచు.

అరిగి తనచేష్టలకు విస్మయంబు నొంది
యతఁడు భూపతియొద్దకు నరుగఁడాయె;
పండితుఁడుమాత్ర మటఁ బూర్వపద్ధతిగను
జేని దర్శించె మఱునాఁటిజేపకడను.

ఱేఁడు ధనపాలుఁ డది విచారించి తనదు
ప్రియపురోహితు భటులచేఁ బిలువనంపె;
నాతఁ డాత్మీయదురవస్థ నంతఁ బతికి
ఘోరముగ విన్నవించి గగ్గోలుపఱచె.

దాని వినినవిభుండు యథావిధిగను
శాస్త్రివర్యునిఁ బూజించె సంతసముగఁ
దాను ద్రవ్యినగోతిలోఁ దానె పడు న
టంచు నభియుక్తజనము వచించె నపుడు.

శాతకర్ణి

శ్రీ మల్లాది అవధాని

[గౌడదేశం. వసంతపురం. సంధ్యాసమయం. అంతఃపురం. రాజదుహిత మహాదేవి గవాక్షసమీపాన నిలుచుని ఉన్నది. పరిచారిక రజని దేవివంక చూస్తున్నది. మహాదేవి దీర్ఘాలోచనలో మునిగిపోయినది]

మహా — [నిట్టూర్చి] రేపు... ఈపాటికి...

రజని — ఏమవుతుందమ్మా?

మహా — [ఇటు తిరిగి] రజనీ!

రజని — అమ్మా!

మహా — నే నేమంటున్నాను?

రజని — దీర్ఘాలోచనలో...

మహా — కలవరిస్తున్నాను కాబోలు?

రజని — రేపీపాటికి అని యేమో అనబోయినారు.

మహా — [నవ్వి] రేపీపాటికి నేనా కౌనన విహారికి ధర్మపత్నిని కావలసిందేగదా!

రజని — తమ కిష్టమైతేనే!

మహా — లేకుంటే?

రజని — లేకుంటే యెలా జరుగుతుంది?

మహా — నాన్నగారు నిశ్చయించారు.

రజని — కాని మీరునిశ్చయం చేసుకోలేదే.

మహా — నా నిశ్చయంతో యేంపని.

రజని — జరగబొయ్యేది మీ వివాహం కాని మీ నాన్నగారిది కాదు.

మహా — కాదు. కాని నా వివాహానికి వరుని నిశ్చయం చేసేది నాన్నగారు. నే నేమేమి భోజనం చెయ్యాలో నిశ్చయంచేసేది నాన్నగారు, నే నేగ్రంథాలు చదవాలో, నేనే నీరు తాగాలో, ఎంత గాలిపీల్చాలో నిశ్చయం చేసేది నాన్నగారు. రజనీ! నేను నాన్నగారి బానిసను. వారిఆజ్ఞల్లో మెలగాలి. నేనేకాదు పవిత్రమైన యీ భారతదేశంలో కన్యక లంతా అంతేగద!

రజని — దేవీ! మీరు బానిస కాదు!

మహా — అవును. ముమ్మాటికీ అవును. నేనేగాదు, ఈ దేశంలో ప్రతి స్త్రీ పుట్టిన నాటి నుంచీ చచ్చేవరకూ బానిస. మొదట తండ్రికీ, తరవాత భర్తకూ, తరవాత కొడుకుక్కీ. బానిసగా పుట్టి బానిసగా, పెరిగి బానిసగా చచ్చే స్త్రీకి స్వాతంత్ర్యం యెక్కణ్ణుంచి వస్తుంది? అంతే నాన్నగారి ఆజ్ఞ అయిపోయింది. నేను రేపా విహారికి సహధర్మచారిణిని అవుతాను. చిన్నతనంనుంచీ ఏ వికారమూర్తిని, ఏ మూఢుని అసహ్యించుకుంటున్నానో అతన్ని రేపు నేనువరించాలి. ఆతని విగ్రహాన్ని పూజించాలి. ఆరాధించాలి. జన్మజన్మల్లో అతనికే భార్యను కావాలని కోరాలి.

రజని — మహాదేవీ! మీరు బానిస కారు.

మహా — ఇంకెవర్ని?

రజని — స్త్రీ బానిస కాదు.

మహా — ఇం కెవరు?

రజని — అందరు స్త్రీలూ బానిసలుకారు. అందరు పురుషులూ స్వాధీనులూ కారు. బానిసలుస్త్రీలలోనూ, పురుషుల్లోనూ చెరిసమానంగా ఉన్నారు. మీరు స్వాధీనలు. మీ యిష్టంలేనిదీ మీ వివాహం జరగదు.

హేమ — నాన్నగారు నిశ్చయం చేశారు. ఇంక నేనేం చేయగలను?

రజని — శాతకర్ణికి జాబు రాయండి.

మహా — వారు ధరణికోటలో వున్నారు. ఈ వసంతపురంనుంచి ధరణికోటకు వెళ్లడాని కెన్నాళ్లవుతుం దనుకున్నావ్ ?

రజని — మూడురోజులు చాలును.

మహా — రేపేగదా వివాహబలి.

రజని — [ఆలోచించి] లాభం లేదు. వెంటనే జరగాలి. ఏదో వొకటి యీ రాత్రే కావాలి. ఆశాతకర్ణి యీ రాత్రే వస్తే యెంత బాగా వుండును.

మహా — ఆయన కేం తెలుసు? తెలిసినా రాగలరా? ఆయన నాన్నగారికి మహాశత్రువే. వసంతపురంలో అడుగుపెట్టడం ఆయనకు మృత్యుపురంలో ప్రవేశమేకదా !

రజని — ఒకటేమార్గం !... ఇంకోదారి లేదు !... మీరు సాహసించాలి.

మహా — ఏం చెయ్యమన్నావు ?

[మహాదేవితండ్రి మాధవరాయ్ వచ్చాడు]

మాధవ — రజనీ !

రజని — మహాప్రభూ !

మాధవ — జాగర్తగా వుండాలి !

రజని — చిత్తం !

మాధవ — ఈవూరో గజదొంగ వొచ్చాడట.

రజని — ఎవరు?

మహా — ఏగజదొంగ నాన్నగారూ!

మాధవ — [కోపంతో] వాడమ్మా.. ఆశాతకర్ణి... ఆంధ్రదేశంనుంచి వచ్చాడట.

మహా — [తల వంచుకున్నది]

రజని — [కౌతుకంతో] యెప్పుడు వచ్చారు ?

మాధవ — ఆ సంగతి తెలియదు. కాని వచ్చివూళ్లోనే వున్నాడట. చారులీవార్త నీవాళనే తెచ్చారు. వాడు జిత్తులమారి చాలా జాగర్తగా వుండాలి.

రజని — ఆయ నేంచేస్తాడు ?

మాధవ — ఏంచేస్తాడా ? [నవ్వి] వాణ్ణి నువ్వెరగవ్ ! వాడు తండ్రిమాట ధిక్కరించి సముద్రాలుదాటి గ్రీసుపోయి వచ్చినవాడు. వాడు తనతండ్రి కంటె నీచాత్ముడు. అమ్మాయిని తస్కరించుకుని పోదామని యిక్కడికి వచ్చాడట. తండ్రి వాణ్ణి ప్రవాసిని చేశాడట జాగర్త! రజనీ జాగర్త! సైనికులు మందిరంచుట్టూ పహరా వున్నారు. త్రిమూర్తి అసహాయశూరుడులే. వాడున్నంతకాలం భరవాలేదు. ఈరాత్రి గడిస్తే చాలు, వుదయం వివాహమైపోతుంది. త్రిమూర్తీ !

త్రిమూ — మహాప్రభూ !

మాధవ — శాతకర్ణి అనే గజదొంగ యీవూరు వచ్చాడు. ఈరాత్రి నువ్వు బహుజాగ్రత్తగా వుండాలి.

త్రిమూ — (ప్రవేశించి) ఎవడు ప్రభూ ఆ దొంగ ?

మాధవ — ఆంధ్రదేశంనుంచి యీగౌడదేశంవచ్చాడు. వాడు మాకు కానివాడు. వాడు నాశత్రువు కొడుకు. త్రిమూర్తీ! మాట !

త్రిమూ — మహాప్రభూ !

మాధవ — [ఒక మొహిరీలసంచీ యిచ్చి] తీసుకో

త్రిమూ — [సంచీని కళ్లకు అద్దుకుని] మహాప్రసాదం !

మాధవ — ఈరాత్రి నువ్వా శాతకర్ణిని హత్యచెయ్యాలి.

[ఒక కైజారిచ్చి] దీనితోవాడిగుండెల్లో పొడిచి చంపాలి. ఏం ?

త్రిమూ — [కైజారందుకుని] చిత్తం!

మాధవ — వాడిగుండె నెత్తురుతో యీ కైజారును తడిపి చూపు. వాడు...నా కుమార్తెను...హరించుకు పోతాడట... ఈ మందిరం కాపాడేపూచీ నీదీ. ఏ మాత్రమైనా ఎక్కువ తక్కువ వస్తే—

త్రిమూ — [నవ్వి] నాతల ఎగిరిపోతుంది.

మాధవ — తెలుసుకదూ!

త్రిమూ — చిత్తం. ఈ రాత్రే ఆ శాతకర్ణిని చంపి తీరుతాను.

మాధవ — నీకంటె బలవంతు డీ పురంలో లేడు.

త్రిమూ — శాతకర్ణిగుండె ముక్కలు ముక్కలుచేస్తాను.

మహాదేవి— [తుళ్లిపడింది]

మాధవ — మంచిది! నీవు చెప్పవలసిన పనిలేదు. రేపు ఉదయం నీవు బహుమతి—

త్రిమూ — చిత్తం!

[మాధవరాయ్ వెళ్లి పోయినాడు. నిశ్శబ్దం. మహాదేవి పాన్పుపై పడిపోయినది]

రజని — త్రిమూర్తీ!

త్రిమూ — చిత్తం!

రజని — [ఒకవజ్రహారం యిచ్చి] తీసుకో!

త్రిమూ — ఎందుకు?

రజని — నీకు కానుక.

త్రిమూ — నా కెందుకు?

రజని — నువ్వొక వుపకారం చెయ్యాలి.

త్రిమూ — ఎవరికి?

రజని — మహాదేవికి.

త్రిమూ — చేస్తాను.

రజని — శాతకర్ణి బస కనుక్కో.

త్రిమూ — అది నాకు యిదివరకే తెలుసును.

రజని — అది మాకు చూపించు.

త్రిమూ — క్షమించండి.

రజని — ఏం ?

త్రిమూ — శాతకర్ణిపని యీ రాత్రితో సరి.

రజని — ఏంచేస్తావ్ ?

త్రిమూ — [కైజారు చూపి] ఖూనీ!

రజని — ఏమంటున్నావ్ ?

త్రిమూ — శాతకర్ణి మరిలేడు.

రజని — బహుమతీ...

త్రిమూ — నాకవసరంలేదు. [వజ్రహారం యిచ్చివేసి] ప్రభుశాసనం జవదాటను.

రజని — త్రిమూర్తీ! ఇదుగో—

త్రిమూ — క్షమించండి [వెళ్లిపోయినాడు]

రజని — త్రిమూర్తీ! మాట!

త్రిమూ — నే వినను [వెళ్లిపోయినాడు]

మహా — [దిగ్గునలేచి రజనిని కౌగలించుకుని] రజనీ! రజనీ! యేందారి?

రజని — యేందారి?...త్రిమూర్తి... వాడు పెద్ద పులి...శాతకర్ణిని చంపితీరుతాడు...

మహా — రజనీ...ఆయనను రక్షించలేవా ?

రజని — రక్షించగలను. ఒకటేమార్గం...

ద్వితీయ దృశ్యము

[అంతఃపురం. ద్వారప్రాంతం. రాత్రి. కాచగోళికలో దీపిక వెలుగుతున్నది. నీడలో త్రిమూర్తి నిలుచున్నాడు. వెలుతురులో కైజారు నుంచి దానివంక చూస్తున్నాడు. లోనుంచి రజని వచ్చినది.]

రజని — త్రిమూర్తీ!

త్రిమూ — [దిగ్గున యిటు తిరిగి] ఏమి రజని.

రజని — ఏంచేస్తున్నావు ?

త్రిమూ — కైజారువంక చూస్తున్నాను.

రజని — ఎందుకు ?

త్రిమూ — దీని రక్తదాహం తీర్చడానికి.

రజని — ఐతే శాతకర్ణిని నీకైజారుకు బలివెయ్య నిశ్చయించుకున్నట్టేనా ?

త్రిమూ — ఇదుగో యిప్పుడే బయలుదేరిపోతున్నాను.

రజని — ఎక్కడికి ?

త్రిమూ — శాతకర్ణి బసకు.

రజని — శాతకర్ణిని నువ్వు జయించగలవా ?

త్రిమూ — జయించడంకాదు హత్య చేస్తాను.

రజని — ఆయనను ఎదిరించగలవా ?

త్రిమూ — ఎదిరించను!

రజని — దొంగదెబ్బవేసి చంపుతావా ?

త్రిమూ — దొంగను దొంగదెబ్బతోనే దీకొనాలి.

రజని — దొంగ యెవరు ?

త్రిమూ — శాతకర్ణి.

రజని — కాదు నువ్వు.

త్రిమూ — [కొరకొరచూస్తూ] రజనీ!

రజని — నన్ను భయపెట్టడానికి చూడకు. నీ దగ్గిర నేనేం భయపడేదానను కాను.

త్రిమూ — నీదారిని నువ్వు వెళ్లు.

రజని — ముందు శాతకర్ణి యెవరో తెలుసుకో?

త్రిమూ — యెవరు వాడు?

రజని — మహాదేవివరుడు.

త్రిమూ — మహాదేవివరుడు కానవవిహారి.

రజని — విహారి మాధవరాయల వరుడు కాని మహా దేవివరుడు కాడు.

త్రిమూ — రేపేగదా మహాదేవి వివాహం.

రజని — అవును శాతకర్ణితో.

త్రిమూ — శాతకర్ణి కీ రాత్రే వివాహం.

రజని — నువ్వు సహాయం చేస్తే.

త్రిమూ — [నవ్వి] నా ఖైజారే సాయం చేస్తుంది.

రజని — నీకు బుద్ధి లేదు.

త్రిమూ — నా ఖైజారు కుండి.

రజని — త్రిమూర్తీ!

త్రిమూ — నీదారిని నువ్వు పో రజనీ! నేను శాతకర్ణి బసకు పోతున్నాను. వాడిపని సరి...[వెడుతున్నాడు]

రజని — [పయ్యెదలో దాచిన ఖైజారు తీసి చెంగున ముందుకు ఉరికి త్రిమూర్తి భుజంపైని బలంగా పొడిచి అతను నేలను పడిపోగా లోనికి చూస్తూ] దేవీ! ఇంక రండి!

[మహాదేవి లోనుంచి వచ్చి స్పృహతప్పి పడి ఉన్న త్రిమూర్తిని చూసి త్రుళ్లిపడినది]

మహా — ఇదేమిది?

రజని — మెల్లగా మాట్లాడండి. త్రిమూర్తికి ప్రాయశ్చిత్తం చేశాను. అస్తబలుకు పదండి. అక్కడ గుర్రా లుంటాయ్.

తృతీయదృశ్యము

[అరాత్రే. గుడ్డివెన్నెలగా ఉన్నది. అస్తబల్ దగ్గర మహాదేవీ రజనీ నిలుచున్నారు. చెట్టునీడలో రెండుగుర్రాలు సిద్ధంగా ఉన్నవి.]

మహా — నువ్వు చేసిన పని నాకు నచ్చలేదు.

రజని — వాడి కదే తగినశాస్తి.

మహా — శుభంగా ధరణికోటకు మనం వెడుతున్నాం. ముందుగా నువ్వురక్తపాతం చేశావు.

రజని — వాడి పొగరుబోతుతనం చూశారా ?

మహా — రజనీ! వా రీవూర్లోనే వున్నారటనే. మనం ధరణికోట కెందుకు ?

రజని — ఈరా త్రిక్కడగాని వుంటే వుదయం మీకు విహారితో పెళ్లితప్పదు. శాతకర్ణి జాడ తెలియదు.

మహా — త్రిమూర్తికి తెలుసును.

రజని — కాని వాడీసరికి చచ్చి ఉంటాడు.

[చెట్టువెనకనుంచి త్రిమూర్తి వచ్చాడు]

త్రిమూ — చావలేదు బతికే వున్నాను.

రజని — [త్రుళ్లి పడి] త్రిమూర్తీ!

త్రిమూ — త్రిమూర్తిని హతమార్చడ మంతసులభమైన పని గాదు రజనీ!

రజని — నువ్వు మళ్లా యెందుకొచ్చావ్ ?

త్రిమూ — మీ రెక్కడికి పారిపోతారు ?

మహా — త్రిమూర్తీ! నీకు కనికరంలేదా ?

త్రిమూ — ఎవరిని కనికరించేది ?

రజని — నిన్నే నువ్వు ముందు కనికరించుకోవలసి వుంటుంది. తిన్నగా అవతలకి నడువ్ !

త్రిమూ — నా కంతా తెలుసు. మీరు ధరణికోటకు పారిపోతున్నారు.

మహా — రజనీ! ప్రయోజనం లేదు. అంతఃపురానికి పద!

రజని — ఉండండి చెబుతాను. [త్రిమూర్తితో] సరే పారిపోతున్నాం నువ్వేం చేస్తావ్ ?

త్రిమూ — నేను మిమ్మలను కదలనివ్వను.

రజని — కదలనివ్వక ?

త్రిమూ — మాధవరాయల కప్పగిస్తాను.

మహా — కాదు విహారికి.

త్రిమూ — విహారి కేంలోపం వచ్చింది?

రజని — నీకంత నచ్చితేపోయి విహారిని నువ్వే పెళ్లి చేసుకో.

త్రిమూ — విహారే ఆడదైతే ఆమాటే.

రజని — ఐతే వెళ్లి మీప్రభువువార్ని పిలుచుకురా.

త్రిమూ — శాతకర్ణికోసం యెందుకీ తాపత్రయం.

రజని — అనవసరప్రసంగం చెయ్యక వెళ్లు.

త్రిమూ — [నవ్వి] రజనీ! నేను మీకు హానిచెయ్యడానికి రాలేదు.

రజని — [ఆత్రంగా] సాయంచేస్తావా ?

త్రిమూ — మనఃపూర్తిగా.

రజని — ఐతే శాతకర్ణి ఎక్కడున్నదీ నీకు తెలుసు కాదూ ?

త్రిమూ — తెలుసును.

రజని — చెప్పు !

త్రిమూ — మహాదేవితో చెబుతా! నువ్వు అశ్వబలులో దాక్కో.

రజని — సరే. నీమే లెన్నటికీ మరవను.

[రజని అశ్వబలులోకి వెళ్లినది]

త్రిమూ — మహాదేవీ !

మహా — ఆయ నెక్కడున్నారు ?

త్రిమూ — ఈ వూళ్లోనే.

మహా — ఎక్కడ ?

త్రిమూ — ఈ ప్రాంతంలోనే.

మహా — ఎక్కడ ?

త్రిమూ — ఇక్కడే.

మహా — ఇక్కడేనా ?

త్రిమూ — నేనే !

మహా — ఏమిటీ !

శాతకర్ణి — నేనే.

మహా — మీరేనా ?

శాతకర్ణి — నేనే, నేనే.

మహా — [అతని ఉరస్థలంపైన బడి] మీరేనా? మీరేనా శాతకర్ణి ? ఐతే బానిసగా ఎందుకు వొచ్చారు ? త్రిమూర్తి అనే మారుపేరు ఎందుకూ ?

శాతకర్ణి — నీకోసం మహాదేవీ !...దేశంవదలి బానిస వేషంతో వచ్చాను. [కౌగలించుకున్నాడు]

మహా — ఐతే ! ... యింత ... మీరేనా ? ... మీరే...నా...నావరుడు ... మీరేగదూ?... ఎంతవారు!... [మహదానందంలో హఠాత్తుగా చనిపోయింది]

శాతకర్ణి — [గాభరాగా] దేవీ! దేవీ!... పలకవేం? హా!...రజనీ...ఓ రజనీ... తొరగా రా.

రజని — [పరిగెత్తుకు వచ్చి] ఏం?

శాతకర్ణి — నేనే శాతకర్ణిని.

రజని — మీరేనా?

శాతకర్ణి — ఆ సంగతి విని దేవి పలకదేం?

రజని — [ఆమెను తాకి] అమ్మా [తుల్లిపడి] అంతా అయిపోయింది!

శాతకర్ణి — ఏమయింది?

రజని — మహాదేవి చనిపోయింది.

శాతకర్ణి — లేదులేదు. మహాదేవీ ! పలకదేం ?

[కాగడాలు పట్టుకున్న బానిసలు దారిచూపగా మాధవరాయ్ వచ్చాడు]

మాధవ — [త్రిమూర్తి కౌగిలిలో కుమార్తెను చూసి] ఇదేమి టిది?

శాతకర్ణి — మహాదేవి చనిపోయింది.

మాధవ — [గాభరాగా] ఏమంటున్నావ్?

శాతకర్ణి — [గంభీరంగా] శాతకర్ణి మహాదేవిని చంపివేశాడు.

మాధవ — శాతకర్ణే! శాతకర్ణే !

శాతకర్ణి — ఆం. శాతకర్ణే!

రజని — శాతకర్ణి త్రిమూర్తిభుజం గాయపరిచాడు. కావలిస్తే రక్తం చూడండి. మహాదేవిని మెడ నులిపి చంపి పారిపోయినాడు శాతకర్ణి. త్రిమూర్తిని వైద్యాలయానికి పంపండి.

శాతకర్ణి — అంతా అబద్ధం. కల్పన. నేనే శాతకర్ణిని. ఇవుగో నా చేతులు, సంకెళ్లు తగిలించండి!

కన్నులుగల కబోది

శ్రీ చిర్రావూరి కామేశ్వరరావు

కలిమిజవరాలి కాపురస్థలము నైన
పట్టణం బొండుగలదు; వ్యాపారి యొకడు
నిజసతీపుత్రసహితుడై, సుజనబంధు
డై, సుఖముగ నవ్వీట నివాస ముండె.

కాలచోదితుడై కొంత కాలమునకు
ముసలికోమటి పరలోకమునకు జనియె,
అతనిపుత్రుడు విపులధనార్జనాభి
లాషి యద్దాల వ్యాపారలాలసు డయి,
అమ్మివేసెను సకలపిత్రార్జితములు;
కొనియె నమూల్యధనముతో గొన్ని చిత్ర
దర్పణములు; దర్పణరూపధారి యగుచు
భాగ్యదేవత అరుగుపై ప్రజ్వరిల్లె
అద్దములతట్ట కెదురుగా నధివసించి,
యంతకంతకు మఱచి బాహ్యాంతరములు
చాలదూరము భావనాసరణియందు
బరుగులెత్తెను కోమటివన్నెకాడు!

కన్ను లరమోడ్చి, దరహాసకాంతి చిగురు
మోవిపై చిందులాడ ప్రమోదకలిత
మానసము క్రేళ్లుదాట విజ్ఞానవిభవ
మెల్ల చూర్ణ విచూర్ణమై యెగసిపోవ
వెకలియై యిట్లు తలపోయుటకు గడంగె:
నేటిబేరము మూలము దాటిపోవు
రాజ్యమున మేటిరత్నవర్తకుడ నగుదు
ఇంటిపాపయై లక్ష్మివర్తించు నెపుడు
ఱంద రాశ్చర్యపడ స్వర్ణహర్మ్యమందు
రత్నపల్యంకమున సుఖప్రాభవాను
భవకుశలినై నిరంతరభాగ్యభోగ్య
ముల కధీశ్వరుండ నగుదు ముజ్జగముల.

సాటిలేని మహోన్నతస్థానమందు
వెలసిపోయెద గోటిసూర్యులకు లేని
కాంతి నిలువెల్ల దోలకాడ; కంతుడో జ
యంతుడో ఋతుకాంతుడో, యనంగజనులు
ధనబలపరాక్రమోపేతుడ నగు నన్ను
గనుగొని మహీతలేశుడు కరము మురిసి
పోయి, గాదిలికూతును, భువనమోహ
నాంగి నర్పింపరాదె పెండ్లాడు మనుచు!
లేనికోపము నెమ్మది నూని, వాని
కనుల యెదుటనె పెండ్లికూతును తృణీక
రించి నెత్తిపై దన్నెద నంచు, గర్వ
మతిశయింప దురభిమాన మభినయించె,
ఘల్లుమని యద్దములతట్ట త్రెళ్లిపడియె!
గగనలక్ష్మిని ముద్దాడు కనకసౌధ
మంతరించె; నాటకము సమాప్తమయ్యె;
భగ్నమయ్యెను కోమటిభాగ్యగరిమ.
భాగ్యదేవత నిష్పక్షపాతబుద్ధి
వస్తుసామగ్రి సమకూర్చు ప్రాణి కెపుడు,
పాదతలమున కలదాని వదలి, లేని
కలిమి కాశించు కన్నులు గల కబోది!

అ మ రా రా మ ం

శ్రీ కవికొండల వేంకటరావు

సర్వేసర్వత్రా ‘అమరావతి’ అని ప్రఖ్యాతి వడసిన అమృతస్థానమే ‘అమరారామం’. ఇప్పటివఱకు నేను జేసిన ప్రయాణాల్లో అనుకొన్నప్రకారము నెరవేరిన వాటిల్లో ‘అమరావతీ’ ప్రయాణం అగ్రస్థానం వహిస్తోం దనవచ్చు. క్రితంరాత్రి ౧౨ గంటలకు సరిగా రైలుబండి గోదావరి స్టేషన్‌లో ఎక్కా లనుకున్నాను, ఎక్కేశాను. మర్నాటి ఉదయం ౫-౩౦ కు బెజవాడలో దిగా లనుకున్నాను, దిగేశాను. మఱి ఆ ఉదయమే ౭-౩౦ గంటలకు గుంటూరు బస్సుస్టాండువద్ద ఉండా లనుకున్నాను, ఉండేశాను. ౯ గంటలకు బస్సు కదలాలని అనుకున్నాను, కదిలింది. దూరాన్నే నీలపుకొండలు, దగ్గరనా నల్లనేల, అక్కడక్కడ పైరు, ఎక్కడ చూచినా దారిప్రక్కల చిగురుపట్టిన చింతచెట్లసోరు కనబరుస్తూ, బస్సు అతివేగంగా ‘గోరంట’ ‘నిడుముక్కల’ ‘తాటికొండ’ మొదలైన ఊళ్లు దాటుకుంటూ ౧౦-౩౦ గంటలకు ‘అమరావతీ’ ఊరిమధ్య ఆగా లనుకున్నాను, ఆగింది.

ముందెక్కడో వోయిక్కభుక్తికి చెప్పుకొని మఱీ అమరావతీచరితామృత మాస్వాదిద్దాం అని వర్తమానవ్యవహారంగా “ఈ వూళ్లో అన్నంవేసే హోటళ్లున్నాయా?” అని అడిగాను. ‘లే’ వన్నారు. “పేదరాశి పెద్దమ్మయిల్లు?” అని పృచ్ఛించాను. “పేదరాశి పెద్దమ్మయింటి కర్మమేం? మహాదాన్నసత్రముంది. ఊరికే చీటీ యిస్తారు. వెళ్లండి” అని యొకానొక పౌరసత్తము డన్నాడు. “ఒ. కె.” అన్నాను.

* * * *

కృష్ణవేణీతరంగిణి ఆఋతువులో “సన్నగిల్లి సన్నగిల్లి రాళ్లమధ్యను అల్లిబిల్లిగా అల్లుకుపోతూ ఉన్నాను, అమృతవాహినినై; నన్నుచూడు! నా అందంచూడు! నీ ఆకలి మఱచిపో!” అని చెవిలో రహస్యంగా బిలబిలధ్వను లూత్తూ చేరబిలిచిన ట్లైంది. తిన్నగా రేవులోకి వెళ్లి స్నానం చేసుకొన్నాను. స్నానంచేస్తూ, వళ్లు తుడుచుకుంటూ, నదికేసి వొకశేచూపు!— తెల్లని యిసుకతిన్నెలు ఎండలో, రవలపొడి పరపులల్లే మిఱుమిట్లు గొలిపాయి. దూరపుకొండలు నీలాలుగా ఉండి, వానివెనకాతల ఏమీ లేనట్టుగా, అవే యీ యిహలోక నాటకరంగస్థలాన కాఖరు తెర లన్నట్టుగా కనిపించినాయి. చేరువలో మ్రోలనే విస్ఫుట స్ఫటికలింగ మొకటి ద్యోతకమై, కొండలమీది కెగబ్రాకే నాచూపును మళ్లీమళ్లీ తనవైపునకు త్రిప్పుకోసాగింది. నీరు నిర్మలంగా పాదరసంలాగు పరుగెడుతూవుంది.

“వర్షాకాలంలో దేవాలయాన్ని అంటి మెట్లుముంచి ఒరసి లోనికి ప్రవహించే నన్ను ఎంతగా ఇంకజేసినావు! ఎంతగా ఇంకజేసినావు పరాత్పరా! ” అని వేడినిట్టూర్పులు వదుల్తూ వుందా ఆనది అన్నట్టు కొలదికాల

దిగా వేడిగాడ్పు నాముక్కుకొనకు అందుకో సాగింది. నదితోపాటు నేనున్ను సానుభూతి నిట్టూర్పు నొకదాన్ని విడిచి నదికి ఇలా జవాబు చెబుతూ గుడిలో ప్రవేశించినాను. "అమరావతీ శిల్పము నీలో నీటి నీడలు చూచుకొంటూ ఇప్పటికిన్నీ నృత్యము చేస్తావున్నది, ఏడాది కోసారి యీనీ నన్నని జాల్వెల్లి నడకల. ఆ యుత్సవము చూడ్డానిగ్గాను నేను వచ్చియున్నాను. నన్ను మన్నించు! నన్ను మన్నించు! సెలవు! సెలవు! సెలవు!"

* * * *

అమరేశ్వరప్రవేశద్వారం ఒక ఎత్తైన గోపురం. ఆరు అంతస్థులుగా నుంది. ఆరు అంతస్తులకూ ఆరుగుమ్మాలూ అగపిస్తాయి. కాని పైకెక్కడానికి త్రోవ ఉన్నట్టు తోచదు. గోపుర మంతా వెల్ల వేయబడి, ఈ కాలపు రంగులు పూయబడి, అక్కడక్కడ బూతు బొమ్మలుకూడా వ్రాయబడి నాకు జుగుప్స కలిగించింది. "కళాప్రసిద్ధమైన ఈ దేవాలయాన్ని యీద్వారమమ్మటా ప్రవేశించడం?" అనేప్రశ్న వెంటనే తట్టింది: అయితే ఆ వెంటనే స్మృతికి వచ్చింది. "అమరావతి కళ అంతా గుడిఆవరణ అవతల, మంద బయలున ఇనుపకటకటాలనడుమ, మదరాసు ప్రదర్శనభవనమున, లండన్‌పురిని, చోరగ్రస్త మైనట్టు గొంపోబడి కూడబెట్టబడి యున్న" దని స్మృతికి వచ్చింది. "అటయితే గుడిలో చూచేదేమి?" అని శంక జనించింది. ఏమీ లేదన్నట్టు తొల్త గోపురం దాటగానే ఆకాశోపరి కనిపించింది. ప్రదక్షిణలో ఏవేవో ఉన్నట్టు ప్రణవేశ్వర, వీరభద్ర, సోమేశ్వర, విఘ్నేశ్వర, కుమార, అగస్త్యేశ్వరాది విగ్రహాలున్ను, రెండు నున్నని కొత్తందన మెప్పటి కప్పుడే చూరలాడుతూ ఉన్న, స్ఫటికలింగాకృతులున్ను, అన్నింటినీ మించి చక్కని మహిషాసుర మర్దనిరూపమున్ను గోచర మైనాయి. ఎటు చూచినా శివద్యోతకమే. అది హెచ్చు స్థాయిన గటించేటట్టు ఓరివిగా చిగురుపట్టి పిందెలతో ఒకానొక మారేడుచెట్టు లోగుడి లోనికి దారి చూప్తింది.

మారేడుదళం! శివునకు మిక్కిలి ప్రీతికరమైనది! అయినప్పటికిన్నీ దళసంచలనం విష్ణువుమీదకూ ప్రసరిస్తూనే వుంది అన్నట్టు వేణుగోపాలస్వామిగుడి మీదకు కొనలు సాగింది. వేణు గోపాలస్వామి! ఆ విగ్రహం అందంగానే ఉంది. మఱి నాలుగుమూలలూ తిలకించగా విఘ్నేశ్వర, కుమార, హనుమాన్, వీరభద్ర మహానాయకుల విగ్రహాలు వెలిసి వీరపూజ కాస్థాన మన్నట్టు చాటదొడగినాయి.

అసలు గుడి ప్రవేశించేలో వెంకటాద్రి యొక్క ఇత్తడివిగ్రహం అపురూప మనిపించింది. ఒకానొక నందివిగ్రహం? కొంత ఇత్తడిరేకుమయమై కొంత రాగిరేకు మయమైన సొబంగు వెల్గిగక్కుతూ కానవచ్చింది. అహో దాని సుముఖము! దాని మూపురము! దాని చట్టలు! దాని గిట్టలు!

తిన్నగా అమరేశ్వరుని అసలు గుడి లోనికి అత్యుత్సాహపూరితుణ్ణాయి ప్రవేశించినాను. ముందు నిలబడి ఉన్నాయి- అమరేశ్వరుని యొక్కయు బాల చాముంతికయొక్కయు ఉత్సవిగ్రహాలు! ఉత్తుంగములు! పిత్తళిహత్తింపులు! ఆవిగ్రహాలను వెన్నుదన్ని వెలసియుంది శ్రీ అమరేశ్వర స్ఫటిక

లింగం! అమేరేశ్వరాయ నమామి! నమామి! నమామి! ఆలింగస్వరూపమునకు వెండిరేకులతో విభూతిరేకలు వుంచినప్పుడు కళ విప్పారింది! లోనికింకా లోనికి వచ్చి చూడ వచ్చునన్నారు పూజార్లు. ఏమినాభాగ్యము! ఏమి నా భాగ్యము!

చిన్నికొండనెత్తమ్ములా వున్న లింగోన్నత్యోపరిభాగమున నొకానొక రంధ్రాన్ని చూపిస్తూ పుజారి అభిషేకము సేయుచొప్పు సూచించినాడు. అభిషేకోదకము ఎండకుండా ఆరంధ్రమట!

అక్కడకక్కడ ప్రదక్షిణ సేయుటకు చుట్టూ దారి లేదు. కాని మెట్లెక్కి లింగ మెత్తు దర్శింపవచ్చు. ఆమె ట్లెక్కుటకూడ కష్టమే. చీకటి అయినప్పటికిన్నీ నేను దీప సాహాయ్యమున చూచి ధన్యుడ నైనాను.

*　*　*

తిరిగి వచ్చులో బాలచాముంతిక గుడి వొకటి చూడతగ్గదే. మఱిన్నీ నవగ్రహాల విగ్రహాలు ఒక అరుగుమీదను కనిపిస్తాయి. వాటిని కూడా చూడతగ్గదే. మఱిన్నీ ఆ రోజున ప్రత్యేకించి సన్నాయి వాయిద్యం మ్రోగింది. "ఏమిటి విశేషం?" అని అడిగితే "పుట్టువెండ్రుకలు తీస్తామని మ్రొక్కుకొన్నవారొకళ్లు చిన్నపిల్లవానితో వచ్చియున్నారు" అని పూజారి చెప్పినాడు. తీయబోవు వెండ్రుకలు విశ్వస్తవి కానందుకు సంతోషిస్తూ గుడి వెలువడ్డాను. నెత్తిమీదున్నాడు సూర్యభగవానుడు! మండువేసగి! కాలిని జోడు లేదు. నెత్తిపై గొడుగు లేదు. తిన్నగ నేనోయింట ఎప్పుడు ప్రవేశించినానో నాకే తెలియదు. వెంటనే అనక తప్పినది కాదు "ఎంత చల్లగా ఉంది ఈ గృహము!" అని..

*　*　*　*

భోజనానంతర మొకింత శయనించి బడలికలు సుంతవాసి ఇంకనూ ఈ చెవులా ఆచెవులా వేడిగాడుపు వీచుతున్నప్పటికిన్నీ ఇలు వెడలి వింతవోట విశేషాలు కొత్తవి తెలిసికొందామని పయనమైనాను. చరిత్రాత్మకులు వ్రాశారుగా "దీపాలదిబ్బ" అని "ధరణికోట" అని.

దీపాలదిబ్బ! మండువేసగి పగలు మూడుగంటలప్పుడు దీపాలదిబ్బమీద దీపాల వెలుగేమి అగపించగలదూ అనేసంకోచం ఎడద పొడమనేలేదు. పైని వెలుగ్గావున్నా లోపల అంధకారబంధురంగా వుండిపోయింది నామనస్సు "ఆదీపాలదిబ్బ ఎక్కడ ఎక్కడ?" అని గొడ్లకాడవాళ్లను అడుగుతూ వడగొట్టుకొంటూ నే పోతూవుంటే. నీడకోసమైతేం; నాకాళ్లా కాడ కీడిస్తేనేం, అసంఖ్యాకములుగా వేపచెట్లు బలిసివున్న ఒకానొక పల్లంలోకి దిగాను. ఆ పల్లంలో ఆ చెట్లంత చెదరివున్న కొన్నిరాళ్లు, కొన్ని పెద్దరాతిస్తంబాల విశిష్ట నష్టశేషములు, భూమిమీద పాతవేయబడినవి అగపించినాయి. నాలో ఒకమెఱపు మెరసింది. చుట్టూ చూచాను. ఆడుకొంటూఉన్న గోపకులు పంగలకర్రలతో గులకరాళ్లు గురిపెట్టి పొన్నంగిపిట్టలను నేలపడకొడుతూ ఆపడినవాటిలో ఒకదాన్ని మళ్లీ బ్రదికిద్దామని ఆ పిట్టయొక్క తోకకింది ఎట్టరంగు భాగంలోనికి ఊదుపోస్తూ ఉన్నారు. బ్రతికింది ఆ పిట్ట! నా కాశ్చర్యంవేసింది పడగొట్టినవాడూ వాడే! ఊదుపోసి బ్రతికించిన వాడూ వాడే! పక్షి రంగురంగులపక్షి! అం

దంగా ఉంది! ఈవతుగానే కళమాత్రం పునరుజ్జీవింపబడకూడదా? అని ఒకవిధమైన ఆసాసంగో పడ్డాను. "ఇదేనా? ఈలోపల్లమేనా? దీపాలదిబ్బ?" అని అడిగాను.

"దిబ్బ? తిన్న! ఇదేగాని తిన్నెతవ్వగా దొరకినవాటి నన్నింటినీ ఆ ఇనుపకటకటాల నడుమ పేర్చినారు" అని చూపించినారో తావు నా కాబాలఖులు. ఉపద్రవమైన ఉత్సాహంతో పరుగెత్తాను ఆచోటికి. అక్కడే అదీని. కాని నేను ఆదాకా గమనించలేక పోయినాను.

కటకటాల నడుమ రేకుపెడ్డుక్రింద అమృతకళయొక్క పరాకాంష అవకాశాంతానకు ఇంకా చూపులు చూస్తూనే వుంది. బుద్ధుని నిలువువిగ్రహాలకున్న వస్త్రాచ్ఛాదనముయొక్క కుచ్చెళ్లవలెవాటు, బుద్ధుని ముఖమందగపించు శాంతి వర్ణనాతీతములు. ఎవేవో చుట్టూ పడియున్న చక్రాలు, చెట్లబొమ్మలు, చిల్లరమల్లర నగిషీలు, అవన్నీ ఇంకా ఒకదానితో ఒకటి కూడాబలుక్కుంటూ వున్నట్టు, సర్వసామాన్య భగ్నశిస్టాలే వాటి అన్యోన్యసానుతాపానకు కారణమన్నట్టు కనిపించినాయి.

అక్కడ కొంతకాలం వుండిపోతే నేను బసచేసేది ఎక్కడా అనేబుద్ధి మిక్కుటమైంది. చుట్టూ పరకాయించాను. అనతిదూరంలో ఒకట్రావలర్సుబంగాళా ఆధునికపుది పొడగట్టింది. ఇద్దరు మనుష్యులు సామాన్యపౌరులు పనిపాటలు చేసికొనేనా ల్లైవల్లో అక్కడి కళకు సంబంధించనట్టుగా ఒకతాడదో వెనేసుకొంటూ చెట్లనీడ నా బంగాళా చెంత చేష్టవెలుగు విరజిమ్మారు. వాళ్లను దరిశాను. "కోటెక్కడా కనిపించదేం ఈచుట్టుపట్ల?" అన్నాను. "ధరణికోటా?" అన్నారు వారు "అదిగో! అదిగో వూరు! ఆలా అడ్డమడి పోండి!" అన్నారు.

*　　　*　　　*

ధరణికోటా! నడచినడచి వెళ్లి చూచాను సాయంకాలం నాలుగైంది. నాలుగైనా గాడుపు జాస్తీగావున్న రోజులుకావడంచే వేడి హెచ్చుగానే వుంది. అయినా ఉత్తిగాలి కాదన్నట్టు దుమ్ము రేగింది. దుమ్ముకువిలవ యిస్తున్నానని విస్తుపోతూవున్నారా! పాఠకులారా! నే నేమట్టిమీద నిలుచునివున్నానో తిలకించండి! ధరణికోటయొక్క, సిసలైన ధరణికోటయొక్క, పురాతన చరిత్రాత్మకమైన ధరణికోటయొక్క మట్టిమీద. గోడలు పడిపోయినప్పటికిన్నీ ఇటుకలగపిస్తూ వున్నాయి. ఇళ్లుకట్టిన ప్రదేశాల, వీథుల, అంతటా ఇటుకలే. ధాన్యకటకము అనికూడా చరిత్రాత్మకులు కొనియాడతారు!

"ఒకప్పుడు బంగారుమయంకాదూ ఈ స్థలం?" అని — ఒకరైతక్కడ చెట్టుకింద విప్పి ఊరికేవున్న బండినానుకొని కనబడితే, వానితో యాదాలాపంగా అన్నాను. "కాకేమండీ! ఇప్పటికీ వర్షపువాలుకు బంగారు ఇసుక, బంగారుముక్కలు దొరుకుతూనే వుంటాయి" అన్నాడు. గాడుపున కెగజిమ్మిన దుమ్ములో నాకు తోచినవిలువ ఆబంగారాందే అని అనుకున్నాను — నే నొకపెద్దరస్తా చూచాను. దానమ్మటే నడచిపోగా తిన్నగా అమరావతిగుళ్లవద్దకు చేర్చింది.

గుడి కాదూ? గుళ్లా? అవును మూడు గుళ్లు అవి. అందమరేశ్వరునిగుడిగోడలో నాళసంకాని స్వయంవ్యక్తిత్వ మున్నది!

అనతిదూరంలో అమరావతికి చేరువ వైకుంఠపురమనే పుణ్యక్షేత్రమున్నట్టు బాటసారులు చెప్పగా ఆదెసచూస్తి. మెట్లచాయ నేడీ కొండ ఆ నాలుగున్నరసాయంకాలపు ఎండలో గోచరించింది. గుహావుందన్నారు. దేవునిపేరు వెంకటేశ్వరు డన్నారు. అక్కడ కృష్ణ ఉత్తరవాహినిగా ప్రవహించడంవల్ల బహూపవిత్రమైందని పురిగొల్పారు. కాని నామన స్సటుపోలేదు.

"ఈనాడు అమరావతీ ఆహ్వానమే! అమరావతీ ఆతిథ్యమే! మఱేమిన్నీ వలదు. మఱేమీ కోరరాదు." అని అనుకొంటూ నాడు భుజియించిన, శయనించిన బసలోకి తిరిగి ప్రవేశించినాను. మంచినీళ్లు తనివార త్రావినాను. బావు లున్నాయా అని అడిగినాను. నీళ్ల పొయిలోనికీ యూరజొన్నకట్టెలు కాకుండా అట్టిమాదిరిగా వుండే పొగపిత్తు మోడులా యుపయోగ మవశం అని తెలుసుకొన్నాను: చూపు పెరటిలో పెరిగిన ఓ వేప చెట్టుమీందకు ఓ బాదంచెట్టుమీందకు బరిపాను. సామాన్యగేస్తుని యిల్లు అది. అయినప్పటికిన్ని ఆగడప నాకాఘుడియ మహాదాన్నసత్రముకంటె నెక్కుడాతిథ్య మొసంగినది. ఇంటిగోడల వంక చూచినాను. గోడలమ్మట పురాతనపుగళ కొత్తకోడలి బంగారు వొడ్డాణపు పువ్వులా అన్నట్టు మిఱుమిట్లు గొలిపింది.

ఏ మి నీ మ హి మ ?

శ్రీ అనుముల వేంకటశేషకవి

పటుతర ధైర్యశాలి వయి బాపురె! ఱేపును-మాపుఁ గూడ, నీ
చిటికెన వ్రేలిపైఁ దిరుగఁ జేయుదు వీసకల ప్రపంచముం
ద్రుటియును తీరికన్ గనవు దూకెద వెప్పటి కప్పు డెంత దు
ర్ఘటములకైన, నీ మహిమ, గాంధిమహాత్మ! రవంత తెల్పవే.

బక్క జెట్టివి నీ దేహపటిమ యెంత!
ఎముకలే తప్ప వేఱొకఁ డేమిలేదె!
ఇట్టి నినుఁ జూచి యెల్లప్పు డీ విశాల
భరతఖండము గడగడ వడకు టేమి?

ఔర, ప్రేమప్రభావ! మెంతని నుతింతు?
సర్పములుఁగూడ నాట్యముల్ సలుపుఁ; బ్రాణ
శత్రువులు సకలాస్త్రశస్త్రములు వీడి
మైత్రిఁ దాల్తురు నీయాశ్రమమున నెపుడు.

అనృతమును సత్యమను నగ్నియందు వ్రేల్చి
వైరిశిలలను ప్రేమచేఁ బట్టి కఱఁగి
త్యాగసౌధంబులో శాంతి ననుభవించి
దేశమోక్షము నిటు ప్రసాదింపఁ దలఁతె?

" అనుమానంబుల కాటపట్టు, బహు చర్చాధీనసిద్ధాంతక
ల్పన కాధారము, విశ్వభారతమహీభారంబుఁ బాపంగఁ బు
ట్టిన ప్రత్యేక మతప్రవక్తలకుఁ బోటీదారుఁ డీతం !"—డటం
చును వేఱ్వేఱువిధంబులన్ జనులు నిన్ జూపింత్రు విభ్రాంతులై.

జైళ్ళలోఁబడి చిక్కి శల్యమయ్యును దేశబంధంబు లూడ్చు నీ బక్కజెట్టి!
ఉపవాసముల కోర్చి యుత్తమోత్తమ దేశబలము సాధించు నీ పిలకసామి!
ముతకబట్టలఁగట్టి ముణిసిపోవుచు దేశమోక్షంబుఁ గూర్చు నీముసలితాత!
రాట్నచక్రం బహోరాత్రముల్ త్రిప్పి దేశము నుద్ధరించు నీశాంతిదూత!

అనుచు నాశ్చర్యమున జను లభినుతింప
మాటమాటకు నీ బోసినోటినవ్వుఁ
జిలకరింపఁగఁ దనమేను పులకరించి,
దేశమాతయు నాశీర్వదింపకున్నె ?

జననముచేత వైశ్యుఁడును, సంతతసత్యముచేత బ్రాహ్మణుం
డును, పరిశుద్ధకర్మమయడోలనలన్ సరిక్రొత్తయుద్ధముల్
పెనఁగుటచేత క్షత్రియుఁడు బీదలఁ గాచుటచేత శూద్రుఁ డం
చును బలుకంగనౌఁ; దఱచిచూచిన నీకొకజాతి యున్నదే ?

హస్తవిక్షేపంబు సరసి ధార్మికకోటి యంతరంగముల ధైర్యము వహింప
నాదర్శముల రహస్యములు ప్రపంచమం దార్యులుసూచి యాశ్చర్య మొంద
నాత్మతత్వము నిర్ణయము సల్పుటకుఁజేతఁ గాక విజ్ఞులును కంగారుపడఁగ
భక్తివిశ్వాసతాత్పర్యులై హరిజను లుల్లాసమున గుడులెల్లఁ జొరవ

రాజనీతిజ్ఞు, లర్థశాస్త్ర ప్రవక్త
లును, స్వరాజ్యాశయులు, సర్వులును విరుద్ధ
దృష్టి నీక్షించి వేర్వేఱు దెసల నడువ
నీవు నవయుగసంధి వైనావె ? గాంధి !

దంభము దుఃఖ మీర్ష్యయుఁ బ్రధానములైన దరిద్రలోకసం
రంభములందు; రాజ్యములు, రాజ్యము లూరకకూలునాఁడు; వాక్
స్తంభనఁ జేసి, శాంతిమయగానముచే జగ ముద్ధరించువి
శ్వంభరమూర్తి! భారతతపఃఫలమా ! కొనుమా, ప్రణామముల్ !

కోన బుద్ధరాజు: రంగనాథ రామాయణము

శ్రీ వావిలాల వెంకటేశ్వరశాస్త్రి.

దీని కర్తృత్వమునుగూర్చి యింతవరకును ఇదమిత్థమని తేలలేదు. గ్రంథనామమునుబట్టి వాల్మీకిరామాయణము మొదలగువానివలె నిది రంగనాథవిరచిత మని యనుకొనవచ్చును. కాని ప్రతికాండాంతమున నిది కోన బుద్ధరాజు తనతండ్రియైన విఠలరాజు పేర దీనిని రచియించినట్లు చెప్పఁబడియున్నది. దీనినిబట్టి దీని రచయిత కోన బుద్ధరాజనియు తన తండ్రిపేర వెలయించెననియు తెలియుచున్నది.

రంగనాథరామాయణ మను పేరిని బట్టి దీనిరచయిత రంగనాథుఁడగును. ఈ ఊహకును కాండాంతమున చెప్పఁబడినట్లు దీనిరచయిత కోన బుద్ధరాజను మాటకును మిక్కిలి వ్యత్యాస ముండుటచే విమర్శకులు నేటివరకును దీనిని గూర్చి యిదమిత్థమని నిర్ణయింపలేకున్నారు. రంగనాథుఁడు కోన బుద్ధరాజునకు ఆస్థానకవియైయుండి గ్రంథమును తన పేర వెలయించి యుండెనని కొంద అనుచున్నారు.

రంగనాథు డను పండితుఁడు వాల్మీకి రామాయణమును చెప్పుచుండగా దాని యర్థమును విని కోనరాజు ఈ గ్రంథమును వ్రాసియుండుటచే దీనికీపేరు వచ్చెనని కొంద అనుచున్నారు. ఈవిషయమును నిర్ణయించు సందర్భమున బలువురు పలుపోకడల పోవుచున్నారు. కాని ఈక్రింది అభిప్రాయము సమంజసము, వాస్తవమునై యుండవచ్చును. దీనిని రచియించినవాడు బుద్ధరాజే. ఇతని తండ్రిపేరు చారిత్రకముగ పరిశీలించినచో విఠలరాజు. తల్లితండ్రులు పెట్టినపేరు పాండురంగ విఠలేశ్వరుఁడై యుండవలయును. ఈ పేరిలో విఠల్‌రాజు ఎట్లేకదేశమో రంగనాథుఁడును అట్లే ఏకదేశము. పతంజలియొక్క "నామైకదేశే నామగ్రహణం" అను న్యాయమునుబట్టి తన తండ్రిపేరిలో హృద్యముగనున్న "రంగనాథ" యను భాగమును తీసికొని గ్రంథమునకు రంగనాథరామాయణ మని నామకరణము చేసియుండవచ్చును.

కాలము

ఇతఁడు డించుమించుగ పాల్కురికి సోమనాథుని సమకాలికుఁడు. మొదటి ప్రతాపరుద్రుని కాలములో నితఁడొక సంస్థానాధిపతియై సామంతుఁడై యుండినట్లు చరిత్రకారులు నిర్ణయించిరి. ఈ బుద్ధరాజు కూతురు కుప్పమాంబ. ఈమె ౧౨౭౬ సం॥న బూదపూర్ గ్రామమున లింగప్రతిష్ఠచేసి అనేకభూదానములు చేసినట్లు ఒకశాసనాధారము గలదు. మృతుఁడైన భర్తపేర ఈమె ఈపనిచేసినది. అందుచే నితఁడీ గ్రంథమును షుమారు

౧౨౩౦ ప్రాంతమున వ్రాసియుండు నని ఊహింప వచ్చును.

ఇతఁడు పాల్కురికి సోమనాథుని బసవపురాణమును జూచి గుణస్పర్ధచే నతని జయింపవలెనని యీగ్రంథమును రచించెను. పాల్కురికి సోమనాథుఁడు తనగ్రంథములలో తనతండ్రిపేరు స్మరించుటకూడా మానెను. ఇది యొక గొప్పదురాచారము. బుద్ధరాజు తన గ్రంథమును తండ్రిపేర వెలయించెను.

(౨) ఆతఁడు ప్రాచీన లక్షణవిరుద్ధముగా వాడిన ప్రాసయతుల నితఁడు ద్విపదలలో వాడియుండలేదు. పాల్కురికి సోమనాథుని బసవపురాణవస్తు వాశ్లేయము కాకపోవుటచే బుద్ధరాజీగ్రంథమును వ్రాసెను.

పాండురంగ విఠల్‌నాథుఁ డనుపేరు వైష్ణవులలో కాని యుండదు. దీనినిబట్టి బుద్ధరాజు విష్ణుభక్తుఁ డని చెప్పవచ్చును. అందుచే మత విషయమున పైని మీయిరువురికిని స్పర్ధగల దని యూహింపవచ్చును. ఆస్పర్ధసాధించుటకై బుద్ధరాజీ గ్రంథమును వ్రాసెను. ఇతనికి పేరు వచ్చెను. సోమనాథునికి రాలేదు.

రామాయణము తెలిగించిన కవు లందఱిలో నితఁడు పరమార్థమున మూలమునకు చాల సన్నిహితుఁడు. వాల్మీకిరామాయణము తంత్రీలయ సమన్వితమై స్వరయుక్తమై గేయముగాను పాఠ్యముగాను ఉద్దేశింపఁబడినది.

> పాఠ్యే గేయే చ మధురం ప్రమాణైః త్రిభి రన్వితమ్
> జాతిభి స్సప్త భి ర్బద్ధం తంత్రీలయ సమన్వితమ్.

మూలమును పాఠ్యమును, గేయమునుకూడ రంగనాథరామాయణ మొకటే ఈ పథమార్గమును నెరవేర్చుచున్నది. ఏలయన నిది గేయముగను పాఠ్యముగను నయిత ముపయోగింపఁబడుచున్నది. తోలుబొమ్మలవారిప్పటికీ ఈరామాయణమునే పాడుచుందురు. ఈ కవి యాఱుకాండల మాత్రము వ్రాసెను. ఏడవకాండమును ఏలకో వ్రాసియుండలేదు.

మూలాతిక్రమణములు:

౧. బాలకాండములో దశరథుని పుత్రకామేష్టికి ఋశ్యశృంగుని తెచ్చు సందర్భమున నిందు మూలములో లేని హాస్యవర్ణనము కలదు. ఋషులవలెగాక లౌకికులు పరిహాసప్రియులగుటయే యీమార్పునకుఁ గారణము.

౨. అహల్యాశాపవిమోచన ఘట్టమున నహల్యరాయిగా పడియుండెనను కథమూలములో లేదు. (గోవిందరాయ వ్యాఖ్యకూడ నీవిషయమును దృఢపఱచుచున్నది.) పద్మపురాణమున కథాసందర్భమున అహల్యరాయి యయి యున్నట్లు వర్ణింపఁబడినది. అందుచే నీవృత్తము లోకమందుఁ బ్రబలి యుండుటజూచి బుద్ధరాజుకూడఁ దనగ్రంథమున నెక్కించియుండును.

3. మూలమున లేని గౌతమాశ్రమ వర్ణన మిందు గలదు.

౪. మిథిలానగరమున శతానందుఁడు రామాదులకు ఆతిథ్యమొసంగుసందర్భమున వాల్మీకి శతానందు కృతజ్ఞతను మహోద్భుతముగ వర్ణించెను. ఈ ఘట్టము కవి కవితాప్రదర్శనకు సుక్షేత్రమైనది. బుద్ధరాజీ యవకాశము నుపయోగించుకొనలేదు. ఏలయన నత డీభాగమును నతిమాత్రముగ భాషాంతరీకరించెను.

౫. శతానందుఁడు విశ్వామిత్రునికథను రామునితో చెప్పుసందర్భమున మూలమున

గల యౌచిత్యము రంగనాథరామాయణమునఁ గనబడదు.

౬. రాముఁడు ధనుర్భంగము సేయు ఘట్టమున నితఁడు మూలాతిక్రమమైన వర్ణనను జాలవరకు పెంచెను.

౭. సీతారాముల వివాహఘట్టమున నితని వర్ణనాకుతూహలము పారము ముట్టినది. వాల్మీకి మూలమున వివాహసంస్కారముయొక్క వైదికత్వమును నొక్కి చెప్పెను. ఇతఁడు లౌకిక భావమును నుద్ఘాటించెను.

౮. అయోధ్యాకాండలో మంథర రామునిపట్టాభిషేక భంగ మొనర్చుటకు నొక్క కైకేయిపక్షపాతముదక్క మూలమున మఱొక కారణము వ్యంజితమయియుండలేదు. కాని రంగనాథరామాయణమున మంథర "పనివడి రాముండు బాల్యంబునందు తన కాలు విరిచినతప్పు సాధింపనట్లు పట్టాభిషేక భంగ మొనరించి" యుండెనని యామె యసూయకు కారణము చెప్పబడియున్నది. పాఠకులు తన సంవిధానములో నూతనత్వ మూహింతురేమో యనుశంకచే నితడీవృత్తమును లోకమునుండి గ్రహించియుండును.

౯. అరణ్యకాండములో లక్ష్మణుడు మాయలేడివెంట వెళ్ళిన రాముని రక్షించుటకై పోవుచు "యెవ్వడే సీబరుల్ వెసదాటి వచ్చు, నవ్వీరవరుతల లవియు నాక్షణమె" అని యేడుగీతలను గీచి యాగీతలను దాటవలదని సీతతో చెప్పిపోయినట్లు రంగనాథ రామాయణమున గలదు. కాని యిది మూలమున లేదు.

౧౦. అకంపనుని మాటమీద రావణుడు తాను బయలుదేరివచ్చుచు త్రోవలో మారీచుని యుపదేశము విని వెనుకకు మరలినట్లును పిమ్మట శూర్పణఖ మాటలనుబట్టి మరల నుద్యుక్తుడైనట్లును మూలమున గలదు. రంగనాథరామాయణమున ప్రేరకత్వమెక్కువగా శూర్పణఖమీదనే కలదు. ఈమార్పు మిక్కిలి సరసముగా నున్నది. ఇత డకంపనుని సంగతి పూర్తిగా నెట్టి పారవైచెను.

మూలమునందలి సుందరాకాండలోని ప్రథమాధ్యాయమున హనుమంతుఁడు సముద్రోల్లంఘనమునకుఁ జేయు ప్రయత్నమిందు కిష్కింధకాండాంతమున జేర్పఁబడినది.

౧౩. ఇతని సుందరాకాండము వారిధిలంఘనముతో నారంభించును. రాబోవు యుద్ధకాండలోని యుద్ధవర్ణనాశక్తిచే కాబోలు. ఇతఁడీ కాండమును సంక్షేపించుటకు వీలైనంతవఱకు సంక్షేపించెను.

౧౩. యుద్ధకాండమున నితఁడు మూలములో లేని సులోచనావృత్తాంతమునుఁ గ్రొత్తగా చేర్చెను. ఇచ్చట సులోచనయొక్క పతిభక్తియు రామభక్తియు మిక్కిలి రసవంతముగా వర్ణింపఁబడినవి. ఈకవి మిక్కిలి వర్ణనాప్రియుడును, పరిహాసప్రియుడును. స్వయముగా నితడు రాజగుటచే స్త్రీలలో సహితము రాజోచితము లైన ధైర్యసాహసములను కొనియాడు స్వభావము కలవాడు. వాల్మీకిరామాయణమునకు భిన్నము లయి ప్రజలలో సజీవములైన వృత్తాంతములను సహిత మితఁడు గ్రంథమున వర్ణించియున్నాడు. అందుచే నీతడు ప్రజలయం దెక్కుడు ఆదరముగల రాజనియు వారితో కలసిమెలసి యుండెడివాడనియు తెలియుచున్నది. సుందరకాండమును సంక్షేపించి యుద్ధకాండము నంతవిరివిగా వర్ణించుటజూడ నీతని యుద్ధప్రియత్వము వెల్లడగుచున్నది. మూల

మున రాముని భగవత్వమంతగా చెప్పఁబడి యుండలేదు. అతడొక లక్ష్యభూతుడయిన రాజపుత్రుడుగా చిత్రింపఁబడెను. రంగనాథ రామాయణమున అతని దేవతాంశము మిక్కిలి ఎత్తి చెప్పఁబడినది. వాల్మీకివలె నితఁడు భావితాంతఃకరణుడై ఋషి కాకుండుటయే దీనికి కారణము. ఇతడా యాభాగములలో దన యపారమైన రామభక్తిని వెల్లడించి యున్నాడు.

భాష

ఇతనిభాష ప్రసన్నమైనది. పాల్కురికి సోమనాథుని భాషయందువలె నితని భాషలో మాటలప్రాతదనము లేదు. మారుమూల పదముల నితడు వాడుట యరుదు. ఇతనికి భవ్యమైన కవితావేశము కలదు కాని సోమనాథునివలెగాక యితడు దానిని చాలవఱకు నిగ్రహించుకొనగలడు. సోమనాథుని గ్రంథములు లోకాదరణ పాత్రములు కాకపోవుటకందలి ప్రత్యేకమతమును, భాషాస్వాతంత్ర్యమును కారణములు. ఇతని గ్రంథములలో నట్టివేవియు లేకుండుటచేతను, ఇందలి కథ హిందువులకందఱికి పవిత్రమైన దగుటచేతను, ఇతనిభాష మిక్కిలి ప్రసన్నమైన దగుటచేతను, ఈతనిగ్రంథమునకు విశ్వజనీనత ప్రాప్తించినది. ఇందు ఛందోయ యత్యతిక్రమణములుకాని, భాషాదోషములుకాని లేవు. ఇంత యుద్గ్రంథమున నొక్కటేపంక్తి గలదు. ఏగుణస్పర్థచే నితడీరామాయణమును రచింప మొదలిడెనో ఆగుణసంపాదనచే నితఁడు సోమనాథునికంటె నెక్కుడు ఖ్యాతి సంపాదించెను.

మృత్యుంజయులు

అత్యుష్ణ దేశాలలో మలేరియా తరతరాల నుంచీ వున్నది. ఇండియాలో ఏటా 30 లక్షల మంది మలేరియావల్ల మరణిస్తారు. దానికి కారణాలు తెలుసుకున్నారు. కాని హాత మార్పు లేకుండా వున్నారు.

ఈ వ్యాధికి కారణం కనిపెట్టింది ఇద్దరు మహనీయులు, లూయీలావెరన్ అనే ఫరాసు దేశస్థుడు, సర్ రొనాల్డు రాస్ అనే ఆంగ్ల దేశీయుడు. ఆ ఫరాసు దేశస్థుడు మలేరియా వ్యాధిపీడితుని రక్తంలో క్రిములుంటాయని తొలిసారి 1880 లో కనిపెట్టినపుడు ఆయన్ని చూసి నవ్వినారట. కాని వెంటనే కొందరు ఇటాలియన్ డాక్టర్లు కూడా అదే నిర్ణయానికి రావటం వల్ల నమ్మవలసి వచ్చింది.

తరువాత సమస్య, ఈ క్రిమి రక్తంలో ఎలా ప్రవేశిస్తుంది అని? ఈ విషయంలో ఇండియన్ మెడికల్ శాఖలో పనిచేస్తున్న సర్ రొనాల్డు రాస్ దోమ వెనుక దోమను పరీక్షించి ఆఖరుకి అనో ఫిలీస్ అనే దోమలో ఈ క్రిములు పెరుగుతాయని కనిపెట్టినాడు.

నేటివరకు కూడా బ్రిటిష్ సామ్రాజ్యానికి గొప్ప హాని కల్గిస్తున్నదదే క్రిమి. అందరి మానవులకు అది పరమ శత్రువు, జాతి సమితివారి మలేరియా కమిషనువారు జ్వరపు ఋతువులో జ్వరం రాకుండుటకు గాను రోజూ 6 గ్రైనుల క్వైనైనున్నూ, జ్వరమున్నచో తగ్గిపోవుటకు 5 లేక 7 రోజులవరకు రోజు 15 నుండి 20 గ్రైనుల క్వైనైనున్న పుచ్చుకుంటే మంచిదని తెల్పియున్నారు. ఆ కమిషనువారు తమ 1938 సం॥ నివేదికలోని 124-వ పేజిలో క్వైనైను చాల నిరపాయకరమైనదనియు, అందుచేత వైద్యుల సలహా అక్కర్లే కుండానే దానిని వాడవచ్చుననియు తెల్పిరి.

మలేరియా విషయంలో మూడు దేశముసివారు మూడు స్థలాల్లో ప్రత్యేకంగా కృషిచేలనప్పటికి వారి కృషియొక్క ఫలితాలు మాత్రం మానవ జాతికి చాల ఉపయోగవంతమైనాయి. వారు నిజముగా మృత్యుంజయులు. M. 233

మేలుకొలుపు

శ్రీ భాగవతుల నరసింహమూర్తి

ఏ దేశంబున కృష్ణరాయ కృప సాహిత్యంబు వర్ధిల్లెనో
యే దేశంబున పెద్దనార్యకృతి పృథ్వీశస్తుతిన్ బొందెనో
యే దేశంబున త్యాగరాయని యశస్సేనాటికిన్ తగ్గదో
యా దేశంబును మాతృభూమి యని యో యాంధ్రుండ! పూజింపవే?

తెలుఁగునఁ బల్కుమీ; కరము తీయని తేనెలఁ బైకిఁ జిమ్ము వ్రాఁ
తలను రచింపుమీ; తెలుఁగుతల్లికి పూజలు సల్పుమీ; సదా
తెలుఁగును వృద్ధి చేసి కడు తీయని యాంధ్రసుధారసంబునే
యలయక గ్రోలుమీ; నిలుపు మాంధ్రునిసత్త్వము నాంధ్రసోదరా!

ఆంధ్రుఁడ నాంధ్రుఁడం చనినయంతనె యాంధ్రుఁడ వౌదువాక్కొ నీ
వాంధ్రమునందు నొక్కక్షణ మైనను బల్కఁగలేవె హూణభా
షాంధ్రముతోడ మిశ్రణము సల్పక; దుఃఖకరమ్ముఁ గాదె; నీ
యాంధ్రసరస్వతీ యశ మహర్నిశమున్ వెలుగొందఁ జేయుమీ!

అరవంబో మహారాష్ట్రమో దురకమో ఆంగ్లంబో బంగాళమో
సరదాకో మరి దేనికో చదువుకో సాధించుకో గాని సో
దరుఁడా! ఆంధ్రుఁడ నంచు చెప్పికొనుచున్ ధర్మంబు పాటింపవే
మరువన్ పాడియె మాతృభాష? యది సంభాషింపఁగా రాదొకో.

ఆంధ్రభోజుఁడైన ఆకృష్ణరాయలు
దేశభాషలందు తెలుఁగు లెస్స
అనుచు చాటి పలుక వినలేదె ఆంధ్రుఁడా
మేలుకొనుము నీవు మేలుకొనుము.

చిలకసముద్రం కలెక్టర్

శ్రీ దిగవల్లి వేంకటశివరావు

[ఇది కల్పితకథకాదు. నూరు సంవత్సరాలకు పూర్వం నిజంగా జరిగినకథ. ఈకథ గంజాంజిల్లాలో ఇప్పటికీ ముసలివాళ్లు చెప్పుకుంటారు. అనేకమందిపాశ్చాత్య గ్రంథకర్తలు దీనిని తమపుస్తకాలలోకి యెక్కించారు. సర్ ఛార్లస్ లాసన్ గారు "మెమోరీస్ ఆఫ్ మెడ్రాస్" అనే పుస్తకంలో దీనినిగురించి ఒక ప్రకరణం వ్రాశారు. నేను వ్రాస్తూవున్న సంగతులలో చాలాభాగం వారి గ్రంథానికి అనువాదం.] — వ్యా. క.

గంజాం జిల్లాలో చిలకసముద్రంఅనే మహాసరస్సు ఒకటివున్నది. ఇది ౨౨ మైళ్లు పొడుగున బంగాళా ఖాతానికి ఆనుకుని వున్నది. సముద్రానికీ దీనికీ ౨౦౦ గజాలు వెడల్పుగల ఇసుకపర్రమాత్రమే అడ్డం. ఇది సముద్రభాగమే అని చెప్పవచ్చును. డిశంబరునుంచి జూనువరకూ నీళ్లు ఉప్పగా ఉంటాయి. వర్షాకాలంలో మాత్రం తియ్యగా వుంటాయి. ఈసరస్సుయొక్క లోతు మూడుమొదలు ఐదుఅడుగులు వుంటుంది. ఎక్కడా ఆరుఅడుగులు దాటదు. దీనికి దక్షిణాన పడమర, చిన్నచిన్న రాతికొండలు నీటిలోకి చొచ్చుకొని లంకల్లాగు వుంటాయి. అలాంటి ప్రదేశాలలో ఒకదానికి బ్రేక్ ఫాస్టు ఐలెండు (**Break fast Island**) అని పేరు. ఈసరస్సుమధ్య కల్లికోటరాజాగారి భవనం ఒకటి వున్నది. ఇండియా దేశానికి వైస్రాయిగా వుండిన కర్జనుప్రభువు యిక్కడికి వచ్చినప్పుడు "ఈచోటునుంచి కనబడే దృశ్యం భారతదేశంలో కల్లా సుందరమైనదిగా నాకు తోస్తూంది" అని అన్నాడట! మనకథ ఈ ప్రదేశానికి సంబంధించినదే!

మనకథానాయకుడిపేరు తామస్ స్నాడ్ గ్రాస్. ఇతను గేబ్రిల్ స్నాడ్ గ్రాసు కొడుకు. ఇతడు ౧౭౫౯ లో జన్మించాడు. తండ్రి ఇండియాలో కుంపిణీ వారి కొలువులో పనిచేశాడు. అతని ప్రాపకంవల్ల తామసుకుకూడ ౧౭౭౭ లో చెన్నపట్నం సెంట్ జార్జికోట పరిపాలనక్రింద ఒకరైటరు గిరీ (**Writer-ship**) యిచ్చారు. ౧౭౮౨ లో ఈ కుర్రవాడికి ఫ్యాక్టరు (**Factor**)గా ప్రమోషను యిచ్చారు. ౧౭౯౦ లో ఇతడు సీనియరు మర్చెంటు హోదాను గంజాము అసిస్టెంటు రెసిడెంటుపదవిని పొందినాడు. భారతదేశంలో ఎక్కడ చూసినా వరహాల చెట్లు వుండినరోజులు—అవి. ఆచెట్లను ఆశ్రయించుకొని దులిపినకొద్దీ బంగారువర్షం కురిసేది. తక్కిన దొరలలాగునే ఈ స్నాడ్ గ్రాసుకూడా ఉద్యోగరీత్యా తనకు అబ్బిన అవకాశాన్ని వృథాపోనివ్వకుండా ఆవరహాలచెట్టును గట్టిగా పట్టుకొని దులపడం ప్రారంభించాడు. ఇతడు రెసిడెంటుగా వచ్చిన రెండుసంవత్సరాలలో గంజాంలో కఱవు వచ్చింది. ఈ కఱవులో ఇతడు తెలివిగా పని చేశాడు. జమీందార్లను అదుపులో వుంచాడు. ఈ కాలంలో ఇతడు తిండిలేక మాడుతూన్నవాళ్ల చేత పనులు చేయించి సర్కారు డబ్బులతో వారికి గంజి కూడు పెట్టించాడు. ఇతడు వాళ్లచేత కట్టించిన బిల్డింగులలో గంజాంపట్టణానికి పదిమైళ్లలోవున్న రంభలో చిలకసముద్రంయొక్క ఒడ్డును ఆనుకొని ఇరవైవేల నవరసులు పెట్టికట్టిన సుందరమైన భవంతి ఒకటి. ఇది అతనిసొంతం. ఈ భవనం అంటే అతనికి అతిప్రీతి. దానిలోనే ఇతడు కాపురం వుంటూవుండేవాడు. అది ఇప్పటికీ వున్నది. అప్పుడు చెన్నపట్నం గవర్నరు సర్ ఛార్లెస్ ఓక్లే కఱవుకోసం అని చెప్పి స్నాడ్ గ్రాసు ఖర్చుపెట్టినసొమ్ము చాలా ఎక్కువగా వున్నదని విమర్శించాడు. ఈ సంగతి ఏమిటో కనుక్కోవాలనిన్నీ, కుంపిణీవారి రివిన్యూ ఉద్యోగులందరూ చేయ

వలసినట్లు పార్లమెంటువారు నిర్ణయించిన ప్రమాణం ఇతనివల్ల తీసుకోగలందులకున్నూ ఇతన్ని చెన్నపట్నం రమ్మన్నారు.

ఇతడు గంజాంనుండి అవతలికి అడుగుపెట్టడం తోటే అక్కడి జమీందార్లు చాలామంది ఇతని ద్విభాషి అయిన గోపాలకృష్ణమ్మకు తాము దఫాలవారీగా చాలామొత్తాలు చెల్లించినామనిన్నీ, దానికి అతడు రశీదులు యివ్వలేదనిన్నీ ఫిర్యాదుచేశారు. ఇతని స్థానేవచ్చిన ఆక్టింగురెసిడెంటు దీనినిగురించి దర్యాప్తు చేశాడు. దీనివల్ల స్నాడ్‌గ్రాసు తన ద్విభాషీకి తగని చనవూ, అధికారమూ ఇచ్చాడనిన్నీ, అతడు అధికారం దుర్వినియోగంచేసి లాభం పొందినాడనిన్నీ బయలుపడింది. అంతట ఆద్విభాషీ మీద కేసుపెట్టి అతడు అపహరించిన సొమ్ము భర్తీచేయవలసిందని నిర్ధించాడు. అతడు మొదట తప్పించుకోచూచాడు గాని ఖయిదులోవుంచి కొంచెం బాధించేటప్పటికి మెత్తబడి, సొమ్ము కక్కివేశాడు. అతనిని వదిలివేయగా మళ్లీ ఎక్కడా కనబడకుండాపోయాడు. ఈ తవాయి వల్ల స్నాడ్‌గ్రాసుకు మళ్లీ పనియివ్వడానికి సందేహించారు. ౧౭౯౪ లో రెసిడెంటుపదవికి బదులు కలెక్టరుపదవి యేర్పాటుచేసి వాల్టర్ బాల్ఫర్ అనే అతనిని ఆపనికి నియోగించారు. (ఇతడు ౧౮౪౫ లో చనిపోయే టప్పటికి ౧౦ లక్షల పౌనులు సంపాదించినట్లు తేలింది) అయితే కొద్ది కాలంలోనే స్నాడ్ గ్రాస్ యొక్క అకృత్యాలు మరచిపోయి ౧౭౯౭ లో బాల్ఫర్ స్థానంలో మళ్లీ ఇతనిని కలెక్టరుగా నియమించారు. పనిలేకుండా వుండినఈ నాలుగు సంవత్సరాలలో స్నాడ్ గ్రాసు తన నడత మార్చుకునేటందుకు బదులుగా ఇంకా కొన్నిదురభ్యాసాలు కూడా అలవర్చుకొని చెడినందువల్ల ఇతనిహయాంలో గంజాం జిల్లా మాన్యూలు వ్రాసిన మాల్టుబి (**Maltby**) చెప్పినట్లుగా, గంజాం జిల్లా పరిపాలనలోని అన్ని శాఖలూ పుచ్చిపోయాయి. పాతదుబాషీ గోపాలకృష్ణమ్మమాయమైనాడు గాని అతనికి బదులు అలాంటివాడే జగన్నాథరావు అనేవాడు ఒకడు తయారైనాడు. స్నాడ్ గ్రాసు ఇతనిని దుబాషీగా నియమించి అతనికి సర్వాధికారాలు యిచ్చాడు దానితో సర్కారు దస్తు తరుగులూ మోసాలూ ప్రజాపీడనము సర్వసామాన్యమై పోయినాయి. గంజాం పట్నంలో ఈదుబాషీ తన దివాణం (కోర్టు) ఒకటి సాగించాడు. ఇతనిని మంచిచేసుకో దలచిన జమీందారులు ఇతరులు అక్కడకు వెళ్లి ఈయన దర్శనం చేయాలి. ఎవరూ వట్టి చేతులతో వెళ్లకూడదు. స్నాడ్ గ్రాస్ దొరగారికి ఇకేమీ పట్టలేదు. ఇతడు తన సిపాయిలతోటి, బంట్రోతులతోటి ఇతర పరివారంతోటి ఎప్పుడూ రంభలోనే దర్జాగా వుండేవాడు. తన మనస్సుకు నచ్చిన అందమైన భోగముదాన్ని ఒకతెను వుంచుకున్నాడు. ఇది చాలా తెలివైనది. అతన్ని తన వలలో వేసుకుని అనేక తంత్రాలు తమాషాలు చేస్తూ అమితవ్యయం చేయించేది. తన యిష్టం వచ్చినట్లల్లా ఆడించేది.

ఇలాగు కలెక్టరు ఉపేక్షవల్లా, దుబాషీ దుర్మార్గంవల్లా జిల్లా వ్యవహారం దుఃస్థితిలోకి దిగిపోయింది. సర్కారు శిస్తు వసూలు మందగించింది. అప్పుడు చెన్నపట్నం రాజధాని గవర్నరు క్లైవు ప్రభువు శిస్తులు ఎందువల్ల సరిగా వసూలు కావడం లేదని సంజాయిషీ అడిగాడు. వర్షాలు సకాలంలో కురవలేదనిన్నీ, అందువల్ల పంటలు బాగా పండలేదనిన్నీ, ప్రజలలో డబ్బు లేదనిన్నీ, జిల్లాలో జమీందార్లు చెప్పినమాట వినడం లేదనిన్నీ ఖోండు జాతివాళ్లు అల్లరి చేస్తున్నారనిన్నీ. శాంతి భద్రతలు నెలకొల్పడానికి శిస్తు వసూలుకు తగిన మిలిటరి బందోబస్తు సిబ్బందీ తనకు లేదనిన్నీ స్నాడ్‌గ్రాసు జవాబు చెప్పాడు. కాని చెన్నపట్నం రివిన్యూబోర్డువారు మోసపోయేవారుకారు. సర్కారు దస్తుఖాజలు (అపహారం) కేసు కప్పిపుచ్చడానికి ఇంత తెలివితేటలైన జవాబు ఇదివరలో ఏకలెక్టరూ చెప్పినదిలేదని అన్నారు. గవర్నమెంటువారుకూడా ఇలాగే అభిప్రాయపడి స్నాడ్‌గ్రాసును కలెక్టరు పదవినుంచి తొలగించి బ్రౌను అనే అతనిని కలెక్టరుగా నియమించారు. ఈ బ్రౌను గంజాం వచ్చేటప్పటికి కొంతకాలం పట్టింది. వచ్చిన తరువాత స్నాడ్‌గ్రాసును చార్జీ వప్పగించేటట్లు చేయగలిగేటప్పటికి ఇంకా కొంత కాలం పట్టింది. స్నాడ్ గ్రాసును రంభ దగ్గర నుంచి కదిలించే

టప్పటికి గవర్నమెంటు వారి తాతలు దిగి వచ్చారు. స్నాడ్ గ్రాసుస్థానే నియమింపబడిన కొత్త కలెక్టరు బ్రౌను గంజాం జిల్లా వ్యవహారాలన్నీ చక్కబెట్టడానికి ప్రయత్నించాడు. కాని అది సులభసాధ్యంకాలేదు. అవి అంత గందరగోళంలో వున్నాయి. మంచి అభివృద్ధిలో వుండిన జిల్లాపాడై పోయిందనిన్నీ, జనసంఖ్య కూడా క్షీణించిందనిన్నీ ఇతడు పైకి వ్రాశాడు. దుబాషీని అరెస్టు చేశారు కాని అత ఎంతసొమ్ము అపహరించిందీ సరిగా తెలుసుకోవడానికి వీలు కాలేదు. బయటపడిన రెండు పద్దులే ఒక లక్ష అరవై తొమ్మిది వేల రూపాయిలు దాకా తేలినాయి. ఈ ద్రవ్యాపహరణానికి అతనిమీద దస్తుఫాజుల్ కేసు పెట్టాడు. కాని దేశం అల్లకల్లోల స్థితిలో నుండుటవల్లా, గుంసూరులో తిరుగుబాటు జరిగినందువల్లా, ఈ కేసు విచారణ జయప్రదంగా నడపడానికి బ్రౌనుదొరకు అవకాశం లేకపోయింది. ౧౭౯౩కూ ౧౮౦౧ కి మధ్య యీ జిల్లా పరిపాలనను గురించిన తక్సీలు తెలుసుకోడానికి రికార్డులు ఏమీ లేవని జిల్లా మాన్యువలు వ్రాసిన మాల్టుబీ వ్రాసినాడు. ఈ రికార్డు లేమైనవని విచారించగా బ్రౌను దొరగారే వానిని తగల వేశారని స్మాటిస్ వుడ్ అనే కలెక్టరు వ్రాశాడు. కాని ఇది విశ్వసించ తగినట్లులేదు. ఈ జిల్లాలో దీనిని గురించి ఒకకథ చెప్పుకుంటారు. తనపైని సాక్ష్యం దొరకకుండా రివిన్యూ లెక్క పుస్తకాలన్నీ స్నాడ్ గ్రాసు చిలకసరస్సులో పారవేశాడట. "రంభ దగ్గరకు వచ్చే టట్లయితే ప్రాణం తీస్తా" నని బ్రౌనదొరను బెదిరించాడట!

రంభలో కూర్చుని స్నాడ్ గ్రాసు చేసిన విచిత్రాలను గురించీ, అతన్ని అక్కడనుండి కదిలించడం గవర్నమెంటుకు ఎంత కష్టసాధ్యమైనదో ఆ సంగతిని గురించీ ఇంకా కొన్నికథలు ప్రచారంలో వున్నాయి. వాటిని ఆంగ్లేయ గ్రంథకర్తలు తమ పుస్తకాలలోకి కూడా ఎక్కించారు.'

సండేస్టేట్సుమన్ (**Sunday Statesman**) అనే పత్రికలో ౧౯౩౮ సంవత్సరం అక్టోబరు, ౨౩-వ తేదీన (**C. B. C**) సి. బి. సీ అనే పొడి అక్షరాలతో ఈ స్నాడ్ గ్రాసును గురించిన కథ వ్రాయబడినది. దానిలో పైని చెప్పిన సంగతులుగాక ఇంకా కొన్ని విశేషాలు వ్రాయబడినాయి.

స్నాడ్ గ్రాసుకు ౧౭౯౧ లో గంజాం రెసిడెంటు ఉద్యోగం వచ్చినతరువాత గోపాలకృష్ణయ్యను తనకు సహాయుడు దుబాషీగా ఏర్పరచుకొని అతని సహాయంతో రివిన్యూలో నూటికి ౯౦ వంతులుమాత్రం సర్కారుకు జమకట్టి తక్కినది స్వంతానికోసం అట్టే పెట్టుకోవడం ప్రారంభించాడు. రంభలో కట్టించిన ఇంటికి ౨౦ వేలపౌనులు ఖర్చుఅయినదట. జమీందారులు ఎందుకు బకాయి పెడుతున్నారో తెలుసుకోవలసిందని ౧౭౯౮లో చెన్నపట్నాన్నుంచి ఒకఉద్యోగిని పంపగా వాళ్లందరూ తమ పేష్కషు నదివరకే ఇచ్చివేశారని తేలింది. తప్పుడు లెక్కలు వ్రాయవలసిందని స్నాడుగ్రాసు తనను నిర్బంధించాడని గోపాలకృష్ణయ్య ప్రమాణంచేశాడు. నేనలాంటిపని చేయమనలేదని స్నాడుగ్రాసు అన్నాడు. స్నాడుగ్రాసుకూడా దీనిలో భాగస్వామే అని, తేలినా సరియైనరుజువు దొరకనందువల్ల అతడు తాను చేయవలసినపని తిన్నగా నిర్వహింపక ఉపేక్ష చేసినాడని సస్పెండు చేశారు. గోపాలకృష్ణయ్యను జైలులో పడవేసిసొమ్ము కక్కేవరకు నిర్బంధించి వుంచారు. శిస్తురసీదు కవుంటరు ఫాయిలు కాగితాలు లెక్కలతో సరిగా వున్నాయా లేవా అని చూడడం మాత్రమే తనపని అనిన్నీ, అవి సరిగానే వున్నాయనిన్నీ, కవుంటరు ఫాయిలులో వసూలు చేసిన దానికన్న గోపాలకృష్ణయ్య తక్కువమొత్తాలు వేసినట్లైతే తానేమిచేయగలననిన్నీ స్నాడ్ గ్రాసు చెప్పి తాను నిర్దోషినని వాదించాడు. ౧౭౯౬ లో ఇతనికి మళ్లీ పనియిచ్చారు.

రెండవమారు ౧౮౦౦ నాటికే మళ్లీ ఇతనిపైని ఫిర్యాదులు చెలరేగాయి. ఇతని సంజాయిషీకి రివిన్యూ బోర్డువారూ గవర్నమెంటు హర్షించలేదు. ఇతనిని ఛార్జి వప్పగించవలసిందని బ్రౌను అనే దొరను పంపించారు. ఈ బ్రౌను వచ్చేటప్పటికి తన ఆఫీసుదగ్గరకు తుపాకీ బారుమేరదూరంలోకి వస్తే కాల్చివేస్తానని బెదిరించి అతనిఎదటనే లెక్కపుస్తకాలూ రికార్డులూ చిలకసరస్సులో పారవేశాడు. తన పీకమీదికి తేగల

సాక్షి సాధనాలన్నింటినీ అలా మాఫుచేసి జిల్లాలో తనకుగల వ్యవహారాలన్నీ మెల్లగా చక్క బెట్టుకొని ఆఖరుకు చెన్నపట్నం వెళ్లాడు.

'జాన్‌లా' అనే ఆయన ౧౯౦౮ లో “గ్లింప్సెస్ ఆఫ్ హిడెన్ ఇండియా” అనే పుస్తకంలో ఈ క్రింది విధంగా వ్రాశాడు.

“స్మాడ్ గ్రాసు రంభలో కట్టించిన దివ్యభవనాన్ని ఎంతో చక్కగా అలంకరించాడు. తనసాలలలో మంచి గుఱ్ఱాలనూ, ఏనుగులనూ కట్టించి వుంచాడు. పెద్దనవాబు లాగు జీవించేవాడు. రంభమారు మూలగావున్నది. చెన్న పట్నంనుంచి కలకత్తా వెళ్లేవారలు సముద్రం మీదనే సరాసరి వెడతారుకాని ఇలాగు రారు. ఎవరైనావస్తే మాత్రం ఇతడు వాళ్లను వదిలిపెట్టేవాడుకాదు. వాళ్లకు విందులుచేసి వేటలు ఏర్పాటుచేసి, ఆదరించేవాడు. ఇతడు కాపురంఉన్న ఇంటికి ఎదురుగా చిలకసముద్రంలో రెండుమైళ్లదూరంలో పదిహేను అడుగుల చతురంగల ఒక చిన్నలంకవున్నది. దానికి బ్రేక్ ఫాస్టు ఐలెండు అని పేరు. తనపనికి ఎవరూ అంతరాయం కలిగించకుండా ప్రశాంతంగా పనిచేసుకోడానికని ఆలంక మీద ఒక్క ఱేగది కట్టించి అది తనఆఫీసు అన్నాడు. ఆగదిపైన స్థూపీబురుజులాగు గోపురం ఒకటి కట్టించాడు. ఆబురుజులో ఒకదీపం వెల్గాడగట్టేవాడు. దీనిని దీపస్తంభం అనేవాడు. తన రివిన్యూలెక్కలూ, రికార్డులూ అన్నీ ఈ గదిలో పెట్టించాడు.

ఈ జిల్లాపరిస్థితులు బాగాలేవని మద్రాసు గవర్నమెంటు పంపినతాఖీదును ఇతడు చిత్తుకాగితాలబుట్టలో పడవేశాడు. లెక్కపుస్తకాలన్నీ చెన్నపట్నం పట్టుకు రావలసిందని మళ్లీ తాఖీదువచ్చింది. దానికి సరియైన సమాధానం వ్రాయలేదు. వర్షాకాలంలో పూరీరేవులోకి ఓడలు సరిగా రాలేవని ఇతడు ఎరుగును. ఇలాగు రెండేళ్లు గడిచినతరువాత అధికారులు కలెక్టరేటును వశంచేసుకొని స్మాడ్ గ్రాసును అతని పుస్తకాలను చెన్నపట్నం తీసుకొని రావడానికి కొంతమంది సోల్జర్లను పంపడానికి నిశ్చయించారని ఇతనికి తెలిసింది. వీళ్లు ఇక్కడికి రావడానికి ఆరునెలలు పడుతుందని ఇతడెరుగును. వాళ్లు వచ్చే జాడలు ముందుగా తనకు తెలియచేయడానికి వేగులవాళ్లను పెట్టి వాళ్లు వారం రోజుల దూరంలో వున్నారని తెలియగానే ఇతడు లెక్క పుస్తకాలన్నీ ఒక పడవలో పెట్టించి ఒడ్డుకుపట్టుమన్నాడు. పడవ బ్రేక్ ఫాస్టు లంకకు తీరానికి మధ్యకురాగానే పడవ చీల ఒకటి ఎలాగో వూడి వచ్చింది. ఆపడవ, దానితో పుస్తకాలూ మునిగిపోయాయి. పడవవాళ్లు మాత్రం ఈదుకుంటూ ఒడ్డుకు వచ్చారు. సోల్జర్లు వచ్చినాక స్మాడ్ గ్రాసు ఈసంగతి ఆ చిన్న దళాధిపతికి చెప్పాడు. అతడు ఏం చేస్తాడు? స్మాడ్ గ్రాసును చెన్నపట్నం తీసుకొని వెళ్లాడు. *

ఇక బ్రౌను దొర ఏంచేస్తున్నాడో చూద్దాము. ఎలాగైతేనేమి బ్రౌను ఎంతో తంటాలుపడి చాలా సంగతులు బయటికి లాగాడు. వీటినిబట్టి స్మాడ్ గ్రాసు పైని కేసు పెడదామని మద్రాసు గవర్నమెంటువారు ఆలోచించారు కాని ఇలాంటి కేసు విచారించడానికి చెన్నపట్నం సుప్రీము కోర్టువారికి అధికారం వున్నదా అని అనుమానం కలిగినందువల్ల ఇది మానుకున్నారు. ౧౮౦౦ సంవత్సరం మొదలు ౧౮౦౮ వరకు ఏమీ పని లేకుండా స్మాడ్ గ్రాసును చెన్నపట్నంలోనే వుండనిచ్చారు. విలియం బెంటిక్ గవర్నరుగా వుండగా ప్రభుత్వంవారు ౧౮౦౮ లో ఇతని పని తీసివేశారు. అంతట స్మాడ్ గ్రాసు తన డబ్బాదవాలి సర్దుకుని సామానులు తీసికొని ఇంగ్లాండుకు ఓడ ఎక్కాడు. ఇతడు ౨౮ సంవత్సరాలు కంపెనీవారి కొలువులో పని చేసి జీతం కొద్దిపాటిదైనా పెద్దసంపద ఆర్జించాడు. ఇతడు తనసంపదతోపాటు ఇంగ్లాండుకు పరువు ప్రతిష్ఠలు తెచ్చుకోనందువల్ల తూర్పు ఇండియాకంపెనీడైరక్టర్లు తమ ఉద్యోగుల కిచ్చే ,పింఛను ఇతనికి ఇవ్వడానికి నిరాకరించారు. దీనికి ఉపాయమేమిటని ఇతడు ఆలోచించాడు. తనహక్కు నిలబెట్టుకోవాలనీ, కక్ష సాధించాలనీ ఇతనికి బుద్ధిపుట్టింది. తనకు న్యాయం చేయకపోతే తమకూ

---

* (Glimpses of Hidden India - John Law 1908 pp. 91-93)

కష్టం కలిగేటట్లు ప్రవర్తించవలసి వస్తుందని ముందుగా డైరెక్టర్లను ఇతడు హెచ్చరించాడు. ఈ బెదిరింపులకు వారు ఏమీజవాబు చెప్పక ఉపేక్షించారు. కొన్నాళ్లు గడవనిచ్చి ఇతడు కార్యాచరణకు పూనుకున్నాడు. చిరిగిపోయిన పాతదుస్తులు పాకీవాళ్లు వీధులూడిచే చీపురు కట్టా కొని, ఆ పాతదుస్తులు వేసుకొని చీపురుతో లీడెన్‌హాలు వీధిలో తూర్పుఇండియా కంపెనీవారి దివ్యభవనం ఎదుటనిలిచి రోడ్డు ఊడ్చడం ప్రారంభించాడు. తాను ఎవరో ఇతరులకు తెలియకుండా ప్రచ్ఛన్నంగాగాక, బహిరంగంగా వచ్చిపోయేవారితో కంపెనీవారికి ఇండియాలో వున్న మంచి ధనవంతమైన రాష్ట్రంలో తాను ఒకజిల్లాకు కలెక్టరుగా పనిచేసినా ననిన్నీ వారికింద తాను ఇన్ని సంవత్సరాలు కష్టపడి నమ్మకంగా పనిచేసినప్పటికీ తన అవసానకాలంలో ఏమీ యివ్వకుండా తినడానికికూడు లేకుండా వీధులలో ముష్టియెత్తుకొని బ్రతకమని వదిలివేశారనిన్నీ తనకథ చిత్రవిచిత్రముగా వర్ణిస్తూ అతిదీనంగా చెప్పకొ సాగినాడు. ఇప్పటివలెనే ఆరోజులలోకూడా లీడెన్‌హాలువీధి లండనులో వచ్చిపోయేవారితోనిండి కిటకిటలాడే రాజవీధి. తూర్పుదేశపు సంపదలకు ఇంగ్లాండుకుగల పరస్పర సంబంధానికి బాహ్యచిహ్నంగా ఆవీధిలో కంపెనీవారి దివ్యభవనం అందరికీ కనబడుతూ వుండేది. తూర్పుదేశంలో సంపదలార్జించి వచ్చిన దొరలను నవాబులని చెప్పకునేవారు. వీళ్లు లెక్కలేనంతఘన మార్జించి ఆఘన కనకవస్తువాహనాలలో దొర్లుతూ ఒళ్లుపైని తెలియక సౌఖ్యాలు అనుభవిస్తూ నీతినియమాలులేక కళ్లు నెత్తినిపెట్టుకొని ప్రవర్తించడాన్ని గురించిన్నీ ప్రజలు ప్రత్యక్షంగా చూస్తూ కథలలోవింటూ నాటకాలలో దర్శిస్తూవుండేవారు. ఇట్టిస్థితిలో ఆ ఇండియాలో పనిచేసివచ్చిన నిర్భాగ్యుడైన ఈ ఉద్యోగి ఈ వీధిలోనే ఇలాగ పాకీపని చేస్తూవుండడంచూసి అనేకమంది ఇది ఏమిటని ఆలోచించడం ప్రారంభించారు. లండన్ నగరంలో గొప్పవారు నివసించే పడమటిభాగంలో దీనిని గురించిన గుసగుసలు బయలుదేరాయి. స్కాడ్‌గ్రాసు కూడా తానువేసిన వేగానికి అనుగుణ్యంగానే ప్రవర్తించేవాడు. పాపం, అన్యాయం జరిగిన కంపెనీ ఉద్యోగి అనిచెప్పి ఎవరైనా పెన్నీలు (సీమదేశపు నాణెం నాలుగుడబ్బులు) యిస్తే కృతజ్ఞతతో పుచ్చుకొని జేబులో వేసుకొనేవాడు. ఇతడీ కంపెనీభవనం ఎదుట ఇలావుండడం చూసేటప్పటికి కంపెనీ డైరెక్టర్లకు తలవంపుగా తోచింది. అందులో ముఖ్యంగా ఇతడు చీపురుపెట్టివూడ్చే పెద్దమెట్లపైనివున్న పెద్ద సింహద్వారందగ్గరనే ఈ డైరక్టర్లు తమ గుఱ్ఱపు సార్టు బండ్లలోదిగి లోపలికి వెళ్లవలసివచ్చేది. ఈ దివ్యభవనానికి వెనక ఒక చిన్న సందులోనుండి లోపలికి పోవడానికి ఇంకోదారివున్నమాట నిజమేకాని అది నౌకర్లకోసం ఏర్పడినదారి. ఈ పాపిష్టిముండాకొడుకు మొఖం కనపడకుండానూ అక్కడ ఈ చిత్రం చూస్తూ నిలబడినవాళ్ల లేవిడీలు తప్పించుకోడానికిన్నీ అలాగు సందులోనుంచి లోపలికిదూరడం వారికి చాలాపరువు తక్కువగాతోచింది. పోనీ. ఒక పోలీసువాడినిపిలిచి ఈ "న్యూసెన్సు" మాన్పిద్దామనుకుంటే ఇతడేమినేరం చేశాడని పిర్యాదుచేయగలరు? స్కాడ్‌గ్రాసు తన చర్యలవల్ల ఎలాంటినేరమూ చేయడంలేదు. మునిసిపాలిటీనిబంధనలలో దేనినీ మీరడంలేదు. పైగాఅతడు చేసేపని పరోపకారంగాకూడావున్నది. ముఖ్యంగా వర్షంకురిసి బురదగా వున్నరోజున మహోపకారంగానూ వున్నది. అదిగాక అతనిపట్ల ప్రజలందరికీ అమితమైన జాలి కలుగుతూ వున్నది.

ఈ కంపెనీ డైరక్టర్ల కోర్టువారికి హిందూదేశంపైని అమితమైన అధికారా లున్నాయి. అక్కడ తమ నిరంకుశాధికారాలను చలాయించడంలో వీరు ఏమాత్రమూ వెనుదీయరు; ఎంత క్రూరంగా నైనా ప్రవర్తిస్తారు; కాని తమ కార్యాలయం సమ్ముఖం ఎదుటనే తమ కిందపూర్వం పనిచేసిన తాబేదారు ఒకడు తమ అధికారాన్ని ధిక్కరించి నవ్వుబాటుచేస్తువుంటే వీరు దీనికే ప్రతిక్రియ చేయలేక పోతున్నారు. ఇది చూచి ఇతరులుకూడా ఇలాటి పెంకితనాలు మొదలు పెడతారేమో! అందువల్ల డైరెక్టర్ల కోర్టువారు మొదట కోపంతో మండిపడినా వీధిలో ఈ అప్రతిష్ఠ మాన్పుకోడానికి ఏదో ఒక మార్గం యోచించక తప్పినదికాదు. స్కాడ్‌గ్రాసుతో రాజీ చేసుకోవడమే ఉత్తమ మార్గంగా కనబడింది. ముందుగా అతడు చేస్తూవున్న

చర్య మానివేస్తే అతని వ్యవహారం మళ్లీ ఆలోచిస్తామని కబురంపారు. ఆతడు చాల మర్యాదగా తనతోపాటు ఉద్యోగం చేసినవారికి న్యాయంగా వచ్చే పింఛను తన పని తొలిగించిన తేదీ లగాయతూ తనకు కూడా మంజూరు చేసేవరకు తన చర్య విరమించనని మళ్లీ కబురంపాడు. డైరెక్టర్లున్నూ వారి చైర్మెనుగారున్నూ బింకాలు మానివేసి స్మాడ్ గ్రాసు కోరికలను వెల్లడిచేస్తూ తీర్మానాలు చేశారు. అంతట ఆ మర్నాడు స్మాడ్ గ్రాసు మంచి కొత్త సూటు దొరటోపీ వేసుకొని జోడు గుర్రాలబండి యెక్కి* డైరెక్టర్ల కోర్టువారికి వందనాలర్పించడానికి వచ్చి అయ్యా ఇప్పుడు మీరు నా ఆదాయం సాలుకు ౫ వేల పౌనులు అయ్యేటట్టు చేసినారని అన్నాడట! ఈ మాట వినేటప్పటికి వాళ్లందరూ తెల్లపోయారు ఈ దృశ్యం సరిగా వర్ణించడానికి ఎవరితరము?

స్మాడ్ గ్రాసు చిలక సరస్సు దగ్గర రుచి మరగిన సౌఖ్యాల నన్నిటినీ మళ్లీ స్వేచ్ఛగా అనుభవించడానికి మళ్లీ అతనికి అవకాశం కలిగింది? అతడు మళ్లీ తలయెత్తాడు.

ఇప్పటిలాగే ఆ రోజులలో షోకీళా లందరూ నివసించే మే ఫెయిరులో చెస్టరు ఫీల్డువీధిలో ఒకదివ్య భవనాన్ని ఇతడు తీసుకున్నాడు. దానిని చక్కగా అలంకరించాడు. కొన్నాళ్లు అయ్యేటప్పటికి ఉద్యోగ రీత్యా అతనికి తటస్థించినలోటు పాటులు అందరూ మరిచిపోయారో. లేక ఇలాంటిలోపాలు అందరికీ వుంటాయని సరిపెట్టుకున్నారో. కాని అందరూ అతనిని మర్యాదచేసేవారు. తన కాలంలో ఇండియానుండి వచ్చిన ప్రముఖులైన వారిలో ఒకడైనాడు. ఇలాగు అతడు నలుగురిలో గౌరవంగా వుంటూ ౧౮౨౪లో ఓరియంటల్ క్లబ్బు స్థాపించడానికి కారకుడైనాడు. దానిలో ఇండియాలో గవర్నర్లుగాను సేనానులుగాను పనిచేసిన డ్యూక్ ఆఫ్ వెల్లింగ్టన్, విలియం బెంటింకు. సర్ జాన్ మాల్కలం సర్ తామస్ హిస్లప్ మొదలగువారు ఇతనితోపాటు సభికులైనారు. ఇతడు మెరైన్ సొసైటీలో ౧౫ సంవత్సరాలు సభికుడుగా వుండినాడు. వి మెన్సు ఆస్పిటలుకుకూడా ఇతడు పోషకుడుగా వుండినాడు ఇలాగు లండనులో పేరెన్నికపొందిన వారిలో ఒకడుగా నుంటూ ఇతడు ౧౮౩౪-వ సంవత్సరం ఆగస్టునెల ౨౯-వ తేదిన దివంగతుడైనాడు. చనిపోవడానికి మూడేండ్ల క్రిందనే ఒకవిల్లు వ్రాశాడు. ఇతడు రసెల్ అనేవితంతుపుత్రియొక్క పెళ్లిగాని పెద్దకుమార్తె ఎలిజాకు ఒకలక్ష ౨౫ వేలపౌనులు చెంద చేసెనన్నీ, దీనికి కారణం ఆమెతండ్రి తన పట్ల దయగా వుండడమే నన్నీ జంటిల్మెన్సు మాగజీనులో ప్రకటించారు. కాని ఇది సరికాదనిన్నీ, ఆవిల్లు తాను చూచితిననిన్నీ ఇండియాలో చిలకసరస్సుతీరం దగ్గర తనకువున్న ఇంటినీ, భూమినీ తనస్నేహితుడైన ఫౌండ్లింగు ఆసుపత్రిలోవున్న గేబ్రిలుగెల్బర్టుకు చెంద చేసినాడనిన్నీ, తన స్నేహితులకూ స్నేహితురాండ్రకూ యీక్రింది విధంగా చెంద చేసెననీ చార్లెస్ లాసేక్గారూ మెమొరీస్ ఆఫ్ మద్రాస్ (**Memories of Madras**) అని తాను రచించిన పుస్తకంలో వ్రాశారు. చూడుడు పుటలు ౧౯౧-౨౦౪. స్మాడ్ గ్రాసు వ్రాసిన మరణశాసనము ప్రకారము అతడు చెందచేసిన ఆస్తిచాలా వున్నది:—

అప్పర్ గిల్డు స్ట్రీటు ఫౌండ్లింగ్ ఆస్పిటలులో గేబ్రేల్ గిల్లెటుకు, రంభలో చిలక సరస్సుఒడ్డున వున్న ఇల్లు, భూమి, గడచిన 30 సం॥లనుంచి ఖాళీగావుండి కంపెనీవారి తాలూకూ ౨౫౦౦ పౌనుల బాండుకింద వుంటూవున్న దానిని ఇచ్చినాడు.

పౌ. ౪౦౦౦-౦-౦. ఎలిజారస్సెల్ను, గిల్లెటును, హ్యూ ఎడ్వర్డ్సును, మేజర్ జాన్ స్మిత్తును ఎగ్జిక్యూ

---

*ఈకథ కొన్ని సంవత్సరాలకిందట పయొనీరుపత్రిక వ్రాసింది. బెయిలీగారు కూడా మళ్లీ వ్రాశారు. అతడు నాలుగు గుర్రాల బండిలో వెళ్లాడని పాఠాంతరము.

టర్లుగా నియమించి వారికి చెరివక వేయిపౌనులు మొత్తం ౪౦౦౦-౦-౦ లు యిచ్చాడు.

పౌనులు. ౧౦౦౦-౦-౦ ఎలిజబెత్తు గిల్లెటుకూ, మిసెస్ కవర్డుకూ దానిపైని అయివేజు యివ్వగలందులకూ.

పౌ. ౧౦౦౦-౦-౦ ఆనీజెఫ్రీకి
,, ౧౦౦౦-౦-౦ చార్లటీ హంప్ స్టెడ్ కు
,, ౪౦౦-౦-౦ తామస్ ఫ్లెక్ కు
,, ౨౦౦-౦-౦ హెన్రీబాసన్ కు
,, ౨౦౦-౦-౦ రెబెకాపాట్రిడ్జికి
,, ౧౦౦-౦-౦ సారాస్లిన్ సన్ కు
,, ౧౦౦౦-౦-౦ మెరైన్ సొసైటీ ట్రస్టీలకూ
,, ౧౦౦౦-౦-౦ సీమెన్సు ఆసుపత్రికి.

౫౦౦౦-౦-౦ తనసోదరికి దానిపైన అయివజు యిచ్చుటకు, ఇదిగాక తనకు సాలుకు ౧౨౦౦ పౌనులు ఆదాయము వచ్చేరొఖ్ఖం ౪౦ వేలపౌనుల విలువకల పదిలకులప్రాంకులు ప్యారిసులో పత్రములువున్నవనిన్నీ, ఈ పత్రములున్నూ ఛష్టరుఫీల్డు వీధిలోవున్న ౧౦ నెంబరుయిల్లు అందులోవుండే సామానులున్నూ గుఱ్ఱపుబండి ఇతరచరాస్తిన్ని మరణశాసనంలో చెప్పకుండా విడిచిన ఆస్తియావత్తున్నూ ఎలిజారస్సెల్ కన్యకు చెందచేయుచున్నాననిన్నీ, మరణశాసనం ప్రకారం మిగిలినఆస్తి తన ఎగ్జిక్యూటర్లకు చెందవలెననిన్నీ శాసించాడు. రంభిలోవున్న స్నాడ్ గ్రాసు తోటూకు భవనం యిప్పుడు కల్లికోటరాజాగారి ఆధీనంలోవున్నది.

ప్రేయసీ

శ్రీ పెండెం సూర్యనారాయణరావు

జాబిల్లి వెలుగుచే
జాలువారెడు మోము
నీలాభ్రపటలిచే
మాటుపడియేనా ?
లేకున్న ప్రేయసీ
గాంచగాలేనా ?

పసిడినే నిరసించు
పర పంపు మైచాయ
సంధ్యాతపంబులో
సమసిపోయేనా ?
లేకున్న ప్రేయసీ
నిను గాంచలేనా ?

కలువరేకులసౌరు
దిలకించు కనుగవల్
రేరాజు రాకచే
ముకుళితం బయ్యేనా ?
లేకున్న ప్రేయసీ
గాంచగా రావా ?

చిరుమొగ్గలను మీటు
తంత్రీస్వనంబులు
మందానిలంబులో
మరగిపోయేనా ?
లేకున్న ప్రేయసీ
నే వినగలేనా ?

శ్రుతిపుటంబుల కెక్కి
మది గరంచెడుపాట
కోకిలారవములో
కూడిపోయేనా ?
లేకున్న ప్రేయసీ
వినిపింపలేవా ?

మాద్రి

శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రి

౧

'నేనేం చేతునే మాతల్లీ! కన్నకడుపు అని అయినా జాలిలేకుండా ఇంత కటికవాడైనాడేమే నీతండ్రి!'

'అదేమిటి అమ్మమ్మా - నాన్న నా కోసమే ... నేను సుఖపడాలనే కాదూ ... చేసే యీ నిర్వాహకం!'

'హామ్మో! నిర్భాగ్యురాలా ... నల్లనివన్నీ నీళ్లూ, తెల్లనివన్నీ పాలూ నీకంటికి... ఏలా బ్రతికి బట్టకడతావే.'

'ఇక, కట్టేవన్నీ బనారసుచీరలే! పెట్టిన నగపెట్టకుండా, తొడిగిన రవిక తొడగకుండా ... ఓఁ ... మహారాణి నౌతాను, నాకేం ... తీపెళ్లిందా? ... ఎంత వైభవం?'

'...భళ్లున తెల్లవారినట్టే ఉంది!'

'సందె పడేటప్పటికి గూట దీపం పెట్టేవారు లేరనేనా ... పాపం ... ఆతడు ఇంత తొందరపడుతూంది; మరేం, అంత ఊసు తప్పయితే, మగవాడికి కూడా విధవరికం మనశాస్త్రాల్లో వ్రాసిపెట్టించకపోయినారూ? ఆపిల్లదానికి భూమ్మీద అన్నోదకాలు కరవై ... అది పోయిందికదా అని ... ఇవతల ఈతడు అఘోరించుతూ కూర్చుండ వలసినంత అవసరం ఏం వచ్చింది ? తెల్లవారితే అప్పుడే నాలుగామెనా...యీవారం ఏలాగో కళ్లుమూసుకుంటే మైలస్నానం... మంగళస్నానం...రెండూ ఓమారే...'

'ఏమోలే, నీ కర్మానికి ... ఎవరు కర్తలు...'

'నా అదృష్టదేవతలు! ...నోయాలసిన నోములకుఫలం...అప్పుడే అడ్వాన్సుగా నాకు దక్కుతూంటే ... చూసి చంకలు కొట్టుకుంటూ సంబర పడటానికి బదులు, ఏమిటి నిండిన యింట్లో కూర్చుని...ఇలా ఆగాయిత్యం'...

'చాల్లే... నాతోబాటు సంతోషించాలి కాని... బిక్కమొగం వేసుకుని లేనిపోని చిక్కు తెచ్చిపెట్టక ... ఇంకా వ్యవధిఉందా...యీలోపుగా మళ్లా తలుపుదగ్గిర పాటలూ ... తలుపు గడియ పడకముందు పాడాలిసిన పాటలూ...అప్పుడు నట్టుపడకుండా...ఓమారు వల్లించుకో...'

... ...

'కృష్ణా—

నిన్ను ఇంత చనువుగా పేరుపెట్టి పిలవలేదు...సిగ్గు విడిచి నీయెదటపడి మాట్లాడలేదు.'

'ఇప్పుడు...సిగ్గుపడి లాభంలేదు.'

'నా మనసులో ఏమున్నదో నీకు అంతు చిక్కించకపోయినా ... నీమనసులో కోరికలు ... ఎప్పటికప్పుడు, నీవు కిటికీదగ్గర నిలుచున్నప్పుడల్లా, నీచూపులు నాకు తెలుపుతూనే ఉన్నవి...

'కాని, ప్రయోజనం లేదు ... అందని ద్రాక్షపండు... అది ఎవరి దోసిలిలో రాలితే ... మనకు ఒరిగేది ఏముంది ... అని మన సును వెన్నగా మళ్లించుకో...'

'నీకు అంత యిష్టమైతే ... అవసర మైతే...నన్ను జ్ఞాపకం ఉంచుకో!'

... ...

'తాతయ్యా! ...నవలల్లో చదువుతాం చూడు...పెద్దకోపం వచ్చినప్పుడు అందులో వీరుడు ఏంచేస్తాడు?-

'పళ్లు పటపటలాడించి జుట్టుపీక్కుంటూ'

'పాపం నీకాయోగం లేదుకదా ... ఈ వార్ధక్యంలో ... ఇదే ఇంకో పాతికేళ్ల క్రింద నైతేనా...'

'కాదులే... అప్పుడైనా నీ కాభాగ్యం వచ్చేదికాదులే...యీ సినిమాలు ముదిరిన తరువాత నేగా ... నాలాంటి వెర్రిపిల్లలు కళ్లు తెరిచింది...'

'కంట నీరుపెట్టావో ... నామనసు చివుక్కుమంటుంది...నడుంకట్టుకుని పెత్తనం చేయవలసినవాడవు...జబ్బలు సవరించుకో.'

... ...

౨

'గృహిణి వచ్చి గూట దీపం పెట్ట గానే...'

'మీకు-గుండె గుభీలుమనేలా గుంది అత్తా!...తెలిసినవారు, ఏలానడవాలో తీర్చి దిద్దుకోండి...'

'తెలిసింది...నాతెలివి తెల్లవారమట్టే హాయ్యో భగవంతుడా! మావాడిబ్రతుకు చివరకు ఇలా అఘోరించిందేమా అని ... నడవాలో కంట ఒత్తివేసుకుని పడగాపులు పడి...ఆలకిస్తున్నా...వాడిప్రాణానికి...'

'నేను దాపురించింది...ఆయన సుఖంగా ఉండటానికే కాదండీ...'

'ఈ శ్రీరంగనీతులు కేం...సందెపడ గానే ... ఇప్పుడున్నబుద్ధి ... వాడు చెప్ప లేక...చెప్ప లేక...పిచ్చపాడగట్టు...నాదగ్గిర బావురు మన్నాడు...సరి, చూద్దునుగదా... నీవాలకం...ఆడజన్మ ఎత్తింది...అణగి మణ గిపడి ఉండటానికా ... మగవాడిని రాచి రంపానపెట్టడానికా...అక్కర లేనిదానవు... అక్కర లేనట్టుగానే ఉండలేకపోయావూ? లేక...ఏరాజ్యాలన్నా ఏలుదా మనా ... యీదిలాసా ?'

'వారూ మీరూ ... ఏరీ కోరీ కట్ట బెట్టింది...యీ రాజ్యాన్నేకదా, ఏలడానికి! ఇంతకన్నా ఎక్కువ ... ఎక్కడమాత్రం దొరుకుతుందా?'

'అజ్ఞానం ఉంటేనా ... ఏలుకునేవాడు ఎంత పరితపించిపోతూన్నాడో అని కనికరం నీకు ఉంటేనా?...'

'—అమ్మా!

నా జన్మకు ఇహా సుఖపడేయోగం లేదేమోనమ్మా ... పెళ్లినాడు మెడనుపడ్డ జంధ్యం ... పెద్దదానితోనే పెరిగిపోయిం దమ్మా...ఎన్నిముడులు వేసినాఏంలాభం...'

'అయ్యో, నాతండ్రీ! ... చూసి చూసి నీ కీరొమ్ములకుంపటి ఎత్తానేమిగా? ఈ శిఖండితో ఏలా వేగుతావయ్యా!'

'ఏనాడు కష్టంతోస్తే... 'జా పరమేశ్వ రా!' అని ఏకాకో లేచిపోతాను. నాపీడ

విరగడ అయిపోతుంది ... పెళ్లాం ఉన్నా... సన్యాసినే...'

'నా బొందిలో ఊపిరుండగా ... నీకు వచ్చిన ఫరవా ఏమీ లేదురా, నాయనా నీవాకిలి ఊడ్చటానికి వచ్చిన బానిస కూతురు ... నీచెప్పుచేతల్లో పడి ఉండక ఏ చెరువుసీళ్లు తాగుతుందో చూస్తాను గా ... మొండికి మొండే ప్రతి ... నీవు లాలించినకొద్దీ దాని ఆగడం ఇలాగే రెచ్చిపోతుంది. నాలుగుచరిచి అన్నా లొంగదీసుకోవాలి కాని... చెట్టైవంగనిది ... ఇకముందు నీపాట్లు అడిగావూ... ఎద్దు నడిగి గంత కడతారటరా...ఎక్కడన్నా ఉందా ఇది...నీ యిష్టం ఇక ... అంతా నీచేతులో ఉంది...'

... ...

'మంచినీళ్లు కావాలి !'

'మీ అమ్మగారిని అడగండి'

'ఎంతమాట అన్నావూ! మానాభిమానాలు ఏకోర్జానా లేవుగదా... అమ్మని అడగాలా అంట!...అయితే మరి, బొమ్మవు నీ వెందుకూ...తినిపెట్టడానికా...'

'కాదు ... కనిపెంచడానికి తల ఒగ్గక పోతే...తినే ముద్దకూ కరువు వస్తుంది.'

'ఆమాట ఎత్తితే...నీకు ఎక్కడలేని తలనొప్పీ... వేయిపుట్లు జ్వరమూ ముంచుకు వస్తుంది...'

'అవును ... నాముఖానే ప్రొద్దుపొడిచింది... నేనూ ఓమనిషినే...'

'నేను ... మ్రాకును...అదేనా నీవనేది... మూడు రోజులనుంచీ వళ్లు సలసలా కాగుతూంది ... ఆర్చేదిక్కు ఉంటేనా...'

'అన్నింటికీ మీకు దొరికింది...అదే వంక ... ఇలా అనుక్షణం పట్టి పల్లార్చుతూంటే ... ఎవతె బ్రతుకుతుంది ... మీ చేతుల్లో... ఈ కడగండ్లుగడిచి... పోయిందే అదృష్టవంతురా లనుకుంటే ... దానికి ప్రతిగా మళ్లా నేను వెలశాను ... వంటింట్లోకుందేలు ... మన్ని తప్పించుకుపోలేదు కదా అనేకాదూ మీ చెలగాటం...'

'ఆలా దోవకు రా...'

'మీకు ... ప్రాణంమీదనన్నా ఆశ లేదూ?'

'ప్రాణంమీదకన్నా కూడా...'

'అంతేనా...'

'ఆహా ... బ్రతికిన నాలుగుగడియలూ సుఖపడకపోతే...'

'నేను ఎంత చెప్పినా... వినరు; మొర పెట్టుకున్నా ఆలకించరూ ... ఇక మనకూ ...పశువులకూ ఏమిటి తేడా...'

'పదిమాట్లకు ... వేయిమాట్లకు నేను పశువునే...నిన్ను చేసుకున్న తరువాత... నాకు అభిమానం ఎందుకూ? ఎంత వదరినా ఇప్పుడు నిన్ను వదిలేది లేదు... చూద్దాం... నీతాత ఎవరు అడ్డం వస్తాడో...పద...'

'తాతజోలి ఎందుకులెండి ... ఆ కీర్తి నేనే దక్కించుకుంటాను...'

3

నాలుగు గడియల్లో ఎంతముంచుకు వచ్చిందే...నా బంగారుతండ్రిని నీ పొట్టను పెట్టుకుంటావటే మహామారీ! ... తొడ కాదు... దీన్ని నిలువునా చీల్చండయ్యా

విరగడ అయిపోతుంది ... పెళ్లాం ఉన్నా... సన్యాసినే...'

'నా బొందిలో ఊపిరుండగా ... నీకు వచ్చిన ఫరవా ఏమీ లేదురా, నాయనా నీవాకిలి ఊడ్చటానికి వచ్చిన బానిస కూతురు ... నీ చెప్పుచేతల్లో పడి ఉండక ఏ చెరువునీళ్లు తాగుతుందో చూస్తాను గా ... మొండికి మొండే ప్రతి ... నీవు లాలించినకొద్దీ దాని ఆగడం ఇలాగే రెచ్చిపోతుంది. నాలుగుచరిచి అన్నా లొంగదీసుకోవాలి. కాని ... చెట్టువంగనిది ... ఇకముందు నీపాట్లు అడిగావూ ... ఎద్దు నడిగి గంత కడతారటరా ... ఎక్కడన్నా ఉందా ఇది ... నీ యిష్టం ఇక ... అంతా నీ చేతులో ఉంది...'

... ...

'మంచినీళ్లు కావాలి !'

'మీ అమ్మగారిని అడగండి'

'ఎంతమాట అన్నావు! మానాభిమానాలు ఏకోశానా లేవుగదా ... అమ్మని అడగాలా అంట! ... అయితే మరి, బొమ్మవు నీ వెందుకూ ... తినిపెట్టడానికా...'

'కాదు ... కనిపెంచడానికి తల ఒగ్గకపోతే ... తినే ముద్దకూ కరువు వస్తుంది.'

'ఆమాట ఎత్తితే ... నీకు ఎక్కడలేని తలనొప్పీ ... వేయిపుట్లు జ్వరమూ ముంచుకు వస్తుంది...'

'అవును ... నాముఖానే ప్రొద్దుపొడిచింది ... నేనూ ఓమనిషినే...'

'నేను ... మాకును ... అదేనా నీవనేది ... మూడు రోజులనుంచీ వళ్లు సలసలా కాగుతూంది ... ఆ శ్రద్ధేదిక్కు ఉంటేనా...'

'అన్నింటికీ మీకు దొరికింది ... అదే వంక ... ఇలా అనుక్షణం పట్టి పల్లార్చుతూంటే ... ఎవతె బ్రతుకుతుంది ... మీ చేతుల్లో ... ఈ కడగండ్లుగడిచి ... పోయిందే అదృష్టవంతురా లనుకుంటే ... దానికి ప్రతిగా మళ్లా నేను వెలశాను ... వంటింట్లోకుం దేలు ... మన్ని తప్పించుకుపోలేదు కదా అనేకాదూ మీ చెలగాటం...'

'అలా దోవకు రా...'

'మీకు ... ప్రాణంమీదన్నా ఆశ లేదూ?'

'ప్రాణంమీదకన్నా కూడా...'

'అంతేనా...'

'ఆహా ... బ్రతికిన నాలుగుగడియలూ సుఖపడకపోతే...'

'నేను ఎంత చెప్పినా ... వినరు; మొర పెట్టుకున్నా ఆలకించరూ ... ఇక మనకూ ... పశువులకూ ఏమిటి తేడా...'

'పదిమాట్లకు ... వేయిమాట్లకు నేను పశువునే ... నిన్ను చేసుకున్న తరువాత ... నాకు అభిమానం ఎందుకూ? ఎంత వదరినా ఇప్పుడు నిన్ను వదిలేదిలేదు ... చూద్దాం ... నీతాత ఎవరు అడ్డం వస్తాడో ... పద...'

'తాతజోలి ఎందుకులెండి ... ఆ కీర్తి నేనే దక్కించుకుంటాను...'

3

నాలుగు గడియల్లో ఎంతోముంచుకు వచ్చింది ... నా బంగారుతండ్రిని నీ పొట్టను పెట్టుకుంటావటే మహామారీ! ... తోడ కాదు ... దీన్ని నిలువునా చీల్చండయ్యా

ఆంధ్రతేజము

శ్రీ ఉదయగిరి సన్యాసిరాజు

మనుమసిద్ధి నెల్లూరుపురమును బాలించుచుండెను. 'తిక్కన' కవి అతని మంత్రి రాజ్యభారమును వహించుచుండెను. తిక్కన నిర్వచనోత్తర రామాయణమును రచించి ప్రభువగు మనుమసిద్ధికిఁ గృతియిచ్చెను.

మన్మసిద్ధి కాకాలమున జుట్టుప్రక్కలనున్న రాజులెల్లరు శత్రువులే. మనుమసిద్ధి బలహీనతను గుర్తించి, వారు సైన్యములను గూర్చుకొని, యుద్ధమునకు సంసిద్ధులైరి. వారికి 'కంచి' పరిపాలించుచున్న (పాండ్యరాజు) జటవర్మపాండ్యరాజు నాయకుఁ డయ్యెను. మనుమసిద్ధి వారితో యుద్ధముచేసెను. జయము సంశయాస్పదమని తలంచి మన్మసిద్ధి 'కందుకూరిసీమ'కుఁ బారిపోయి డాగుకొనెను.

ఓరుగల్లును గణపతిదేవుడు పరిపాలించుచుండెను. ఆంధ్రదేశమునందలి 'రేనాఁడు' 'గండికోట' మున్నగు చిన్నిచిన్ని రాజ్యములను జయించి యతఁడు ముందునకు సాగుచుండెను. కవితిక్కన యతనికి మనుమసిద్ధి దురవస్థ జెప్పెను. నెల్లూరునుండి పాండ్యరాజును వెడలఁగొట్టి మమ్ము రక్షింపుమని యతఁడు గణపతిదేవునిఁ బ్రార్థించెను.

గణపతిదేవుఁ డందుల కియ్యకొని పాండ్యరాజునకు సంధిరాయబార మంపెను.

పాండ్యరాజు సంధి కిష్టపడలేదు. గణపతిదేవునకు జటవర్మ పాండ్యరాజునకు 'నెల్లూరు'లో యుద్ధముజరిగెను. పాండ్యరాజోడి పారిపోయెను. మనుమసిద్ధి మరల సింహాసనాసీనుఁడై గణపతిదేవునికి తన కృతజ్ఞతను వెల్లడించెను. గణపతిదేవునిఁ జిన్ననాఁట జైత్రపాలుఁడను యాదవరాజు పరిభవించెను. గణపతిదేవుఁడెపుడైన పగసాధింప దలపోయుచుండెను. ఇప్పుడు తగిన సహాయము లభించెను. కావున గణపతిదేవుఁడు మన్మసిద్ధితో గూడుకొని శౌణపురరాజగు జైత్రపాలునిపై దండెత్తెను.

జైత్రపాలునకును, గణపతిదేవునికిని ఘోరయుద్ధము జరిగెను. జైత్రపాలుఁడు వీరస్వర్గ మందెను. గణపతి సంపూర్ణవిజయ మందెను. 'గణపతి' జైత్రపాలుని కొడుకుల నాదరించి శౌణరాజ్యమునుఁ బంచియిచ్చెను. సామంతరాజులు 'భళి' యనునట్లు — ఆంధ్రదేశమునకు రాజధానియైన ఓరుగల్లులో "గణపతి దేవుఁడు" పట్టాభిషిక్తుఁడై ప్రజల గన్నబిడ్డలవోలె బాలించుచుండెను. 'కవితిక్కన' ఆంధ్ర చక్రవర్తిలోనున్న 'ఆంధ్రతేజము'ను గుర్తించి యద్భుతమందెను.

౧

పూలఁ జెన్నొందు తేనియ గ్రోలునపుడు   చిలుకలెంతయు వింతగా బలుకుచుండ
కొదమతేటులు గాన మింపొదవఁ జేయ   నేటినీట మునింగి నీరాటలాడి
బసిడిరంగారుఫలముల మెసవునపుడు   మెల్ల మెల్లన సౌరభ మెల్లగొనుచుఁ

జాల మందంబుగాఁ బిల్లగాలి వీవఁ
గిలకిలమటంచు సకలపక్షులు గులుకగ
వింత చెలువు వహించు వసంత వేళ
మేటిపూఁదోట నెల్లూరుపేటికోట.

ఆ. పువుఁదోటఁ జానలు ని
జాస్యవినిర్గతహాసచంద్రికల్
మాపును తేపు నింపగ మ
నంబున నొండొకచింత దక్క భూ
మీపరిపాలనం బొకని
మేషము జేయక మన్మసిద్ధి భూ
మీపతి యొప్పుచుండె నుప
మింపగ రాని సిరుల్ రహించుచున్.

సకలశాస్త్రపురాణవిజ్ఞానఘనుఁడు
చతురమతి కవితిక్కనక్ష్మాసురుండు
మనుమభూపతిమంత్రి యామండలమ్ము
హాయిగా నేలుచుండెఁ బ్రజాళి పొగడ.

జననాథుం డొకనాఁడు వేడుక నిజా
స్థానంబునం దుండి ప
ల్కెను గంభీరముగా "నెవం డిపుడు మ
త్కీర్తిన్ బ్రతిష్ఠించు నూ
తన కావ్యంబు రచించి మా కొసగు నా
ధన్యాత్ముఁ జేమేమి కో
రిన నిత్తున్ గవివర్యులార ! మనుభా
త్రిన్ ధన్యు గావింప రే.

తెలుఁగుప్రజల్ నిజంబుగ స్వ
దేహములన్ దొలినెత్తు రున్న బొం
సల దలమానికంబయిన
చక్కని తేటతెనుంగు మాని యా
త్మలఁ బరభాష లెన్నరు స్వ
మాత లొసంగెడుపాలు రోసి య
న్యాలలన లిచ్చుపాలకయి
యాశ వహింతురె పాపలేనియున్!

తెలుఁగుంబలుకుల చేడియ
జిలిబిలిపల్కులను వినగఁ జిత్తము పుట్టున్
సలలితముగ నొక కబ్బముఁ
దెలుఁగున రచియించి యీరె దృతగతి మాకున్."

ఇక్కరణిఁ బలుక సభ్యులు
"తిక్కనకవి యొకఁడ తీర్చు దేవరకోర్కెల్
తక్కినవారలు పూనినఁ
దక్కదుమాట"యనినారు ధైర్యముతోడన్.

చిరునగవు మోముదమ్మికిఁ జెలువొసంగ
మన్మభూపతి పలికెను "మంత్రిమామ !
"పలుకుల మిటారి నాకుఁ బెండిలి యొనర్చి
యల్లునిగ గారవించుట చెల్లు నీకు!"

ఆ నుడు లాలకించి కవు
లందఱు మౌనము బూనియుండ బ్ర
జ్ఞానిధి మంత్రితిక్కన ని
జప్రభుఁ బల్కె "సమర్థులయ్యు నన్
బూని కృతార్థుఁ జేయఁ దల
పోసి కవీంద్రులు భారమెల్ల నా
పైనిడినారు, మేలు నర
పాలక! పూనెదఁ గార్యభారముః."

మనుమసిద్ధిరాజు మనమున నుప్పొంగి
కప్పురంపువిడెముఁ గవి కొసంగె
రాజునాజ్ఞఁ గవియు రామచరిత్రమ్ము
హృద్యపద్యముల రచింపఁదొడఁగె.

వెడవెడ తొక్కుమాటలఁ దేనెఁ జిలుకుచు
నాడుబాలురఁ గూడి యాడు నొకట,
సౌధంబు లందుండు జాయాపతులఁగూడి
ప్రేమతత్త్వము విమర్శించు నొకట,
ప్రమదావనంబులఁ బరితపించెడునట్టి
యింతులతోడఁ దపించు నొకట,
ఉడుకునెత్తురు గ్రోల నుంకించు మగలతో
యుద్ధరంగంబున నుఱుకు నొకట,
వెలుఁగెఱుంగని తలముల వింత చెలువ
మరసి యచ్చెరువందుచు నలరు నొకట
దేవదేవుని భక్తిఁ గీర్తించు నొకట
గవిశిరోమణియైన తిక్కనమనీషి.

గాయకులు పండితులు మహాకవులు ఘనులు
వినఁగ రాజసభామధ్యమున బఠింపఁ
దిక్కనకవీశ్వరుండు సత్కృతి నశేష
మోదమున మన్మసిద్ధి యుప్పొంగుచుండ.

"రజతభూమీధరాభసారయశ మీవు
గూర్చి నా పేబుణం బెల్లు తీర్చికొందు"
నని కవీశ్వరుఁ డడిగిన యర్థ మిచ్చెఁ
దన్మహాత్వ మెఱింగిన ధరణిధవుఁడు.

౨

భూరమణుండు శాంతముగఁ
బ్రొద్దులు పుచ్చుచునుండగా మహా
వీరులు వానివైరు "లిది
వేళ; మదంబునఁ గన్ను గానఁడీ
పిఱికిడి రాజు యుద్ధమున
వీని జయించి వహింత మీధరా
భార" మటంచు నెంచుచు న
పారబలంబులఁ గూర్చి రుద్ధతిన్.

అందు 'జటవర్మపాండ్యరాజ'నగఁబరగు
రక్కసుఁడు నాయకుఁడుగాఁగ రాజశత్రు
సైన్యవాహిని గ్రక్కున సాగి యపుడు
ముట్టడించెను నెల్లూరుపురవరంబు.

మన్మసిద్ధిరాజు మనమునఁ గలగి యా
శత్రుకోటితోడ సంధిసేయ
బనిచె నొక్కరాయబారిని శీఘ్రము
వాఁడు పాండ్యుఁగాంచి పలుకదొడఁగె.

"ఏను దూతను మన్మభూమీశ్వరుండు
బంప వచ్చితి జటవర్మపాండ్యరాజ!
వినుము మాఱేనిపలుకులు వినుతు దూత
గాన నామీద మీకు నాగ్రహము జనదు.

పాండ్యభూపాల! నీవు మాబందుగుడవె
లేదు నీధన మిచ్చుట లేశమైన—
కారణములేని కలహ మేకటికవాఁడు
కోరఁ డీ వెట్లు కోరితి? ఘోర మ్మనక.

మంచిది, నీవు యుద్ధమున
మమ్ము జయించి ధరిత్రి నేల నూ
హించితివొక్కొ! సత్యము గ్ర
హింపగ రాజ్యము వీరభోజ్యమే
యంచు వచింతు రార్యులు, మ
హా రణరంగమునన్. బిరాన నీ
క్షించెదు కాక మద్బలము,
చెప్పగ నేటికి రిత్తగొప్పలన్!"

అనిన సుందరపాండ్యరా జాగ్రహించి
కన్ను లెఱుపెక్కఁబల్కె "మాకన్నఘనుఁడె
మన్మభూపతి? రణమున మమ్ము నోర్చి
యేలుఁగాకేమి యీనేల యెల్లఁ దాన!

పట్టణము వీడి యడవులఁబట్టి పొమ్ము
కానిచో సిద్ధపడుము సంగ్రామమునకు
చెత్తమాటలు వేయేల? ముత్తికొలకుఁ
గత్తిచేఁ బూను మిదియ ప్రత్యుత్తరంబు."

రాయబారము వృథయాట రాజెఱింగి
చతురమతియగు తిక్కనసచివుతోడఁ
దగ విచారించి యనికి సిద్ధపడి యుద్ధ
భేరి వేయించె నెల్లూరుపేటలందు.

మరునాఁ డుదయగిరిన్ భా
స్కరుఁడు వెలుఁగునప్డు వేడ్క ఖడ్గాదివిభీ
కరరణసాధనశోభిత
కరులయ్యిరు తెగలభటులు గడగిరి పోరన్.

పోరు ఘోరమయ్యె ప్రొద్దు నభోమధ్య
పథముఁ జేరె నపుడు పాండ్యరాజు
మగతనంబు మెఱయ మన్మసిద్ధినిఁ దాకి
పలుకఁజొచ్చె నిచ్చ వచ్చినట్లు.

"చలువల వెదజల్లు చంద్రికఁ బవళించి
యబలతో సరసమ్ములాడవచ్చు,
జవ్వనులం గూడి పువ్వులతోటలోఁ
బలుతెఱంగులఁ గ్రీడ సలుపవచ్చు,
ముసలియేనుగు నెక్కి మూడువేళలయందుఁ
బుర మెల్ల మనసారఁ దిరుగవచ్చు,
పదుగురు ముదుసలిబంటులు వెంట రా
నడవిలో లేళ్ల వేటాడవచ్చు
గాని యేరీతి ఘోరసంగ్రామమందు
విజితశాత్రవవీరాధివీరవరుని
నన్ను నోడించి కీరితియన్ను మిన్న
బడసి సుకపడవచ్చును పార్థివేంద్ర!"

అనినన్ మన్మవిభుండు కోపమున "న
య్యా! పోటుమాటల్ వృథా
మును నే'రక్కసగంగనిన్'గెలువనే
ముమ్మారు లీ వెంత? యొ
క్కనిమేషంబున గెల్తు ర" మ్మనుచు హుం
కారంబు గ్గావించి చ
య్యనఁ దాఁకెన్ జటవర్మపాండ్యు మగ లా
హా! యంచుఁ దన్మెచ్చగన్.

తనబలంబులు పాఱుటఁ గనియు సిద్ధి
రాజు వెఱవక యప్పాండ్యరాజుతోడఁ
బోరు సల్పుచునుండెను పోటుమగలు
నతనిధైర్యంబునకు విస్మయంబు నంద.

పడమరముద్దరాలు తన
వంకకు రాకెటయేనిఁ బ్రొద్దు పు
చ్చెడు నిజనాథుఁడైన సర
సీరుహబాంధవుతోడ నల్గి తా
నడరెడుకోపవేగమున
నక్షియుగంబును నెఱ్ఱచేసినన్
గడగడలాడి దాఁగుకొని
నాఁ డపరాద్రిని సూర్యుడత్తఱిన్.

విశ్రమింపుఁడు నేటికి వీరులార!
యనుచు జటవర్మపాండ్యరాజానతియు
శత్రుబలములు వెనుకకు సాగి తమకు
టేరములఁ జేరుకొనిరి నాఁటియని ముగిసె.

మనుమభూపతి యేకాంతమున వసించి
తిక్కనన్ బిలిపించి "భూదేవ! నీవ
దేవుఁడ వుపాయ మెఱిఁగింపఁగా వలయును
జయము మనకు లభించుట సందియమ్ము.

మిన్నేటఁ జెన్నారు మేల్మిఁ బంగరువన్నె
 తామరపూవుల గోము గూర్చి,
తళతళ కాంతులు తరఁగల సీనుచుఁ
 బరుగిడు సెలయేటి మురువు గూర్చి,
మించులు గదిసి నిర్మించిన బొమ్మయ
 ట్లగపడు పగలాడి సొగసు గూర్చి,
ప్రాఁజదువులును జర్చలుచేసి యెఱుఁగని
 పరమేశ్వరుని ప్రభావంబు గూర్చి,
లలితఁపుంబల్కులనుఁ జెప్పఁగలుగువాఁడు
చెప్పి మైమరపింపఁగఁ జేయువాఁడు
సర్వశక్తియుతుండు భూజననుతుండు
కవియ: మఱివానికన్నను ఘనులు గలరె !

రవి గాంచరాని వస్తువుఁ
గవి గాంచఁగలాఁడటంచుఁ గాదే విబుధ
ప్రవరులు వచింత్రు తిక్కన
కవివర ! నీ కెఱుఁగరాని కార్యము గలదే ?

పాండ్యుఁ డొక్కఁడ నన్ను విపన్నుఁ జేసె
నుక్కుమీఱిన మగలట నున్నవారు
సంధియా? యుద్ధమా? యేది సముచితంబు
తెలుపు" మనిన వచించెను తిక్కశర్మ.

"జనవర! యిట్టివేళఁ దగు
 సంధియ ; రాజ్యమునందు భాగ మి
చ్చిన నది సాధ్యమే యగు ర
 చించునొ ? నీకు రుచింపకుండునో
యనునది సందియమ్ము కల
 దయ్య యుపాయము కందుకూరికిం
జని యట నుండు మెట్లయిన
 శత్రుని త్రుళ్లడగింపఁ జూచెదన్.

ఇది యసాధ్యకార్య మిత డేడ ? వా రేడ ?
యుద్ధ మేడ ? జయము నొందు టేడ ?
యని విచారపడకు మది సహాయబలమ్ము
పేర్మి జరుగఁగలదు పెక్కు లేల ?"

(సశేషం.)

సముద్రమథనం

శ్రీ హనుమచ్ఛాస్త్రి

౧

వేసంగి సెలవులు—వెన్నెల రాత్రులు—కాల్చే ఒంటరితనం—బలే తమాషాగా వుందిగదూ!

రోడ్డు కవతల దూరంనుంచి—సన్నని స్త్రీకంఠం నొక్కులహోయితో 'జయంత శ్రీ' లేతగాలి కెరటాలమీద తేలి విన పడుతోంది జాజిపూలమత్తుసువాసనలాగు.

పెరట్లో చిలకలు, అంటుమామిడి మొక్కల దోరబంగ్లను ప్రియురాలి మెత్తని పెదవుల్లాగు నొక్కుతున్నాయి.

అభాగ్యుని తలలోని అనంతవాంఛల్లాగు ఆకాశంనిండా నక్షత్రాలు—

పరమశివుడు ఉద్ధతానంద నాట్యంలో ఒకనాడు పకాలున నవ్విన ధవళాట్టహాసం ప్రపంచమంతా కమ్మి కరిగికరిగి చివరకు ఈ వైశాఖమాసపు వెన్నెలరాత్రిగా నిలిచి పోయిందేమో అనిపిస్తుంది.

ఎంత వుత్సాహాన్ని—ఉద్రేకాన్ని పురిగొల్పే రాత్రి ఇది!

ఇన్నాళ్లూ, సిరాబుడ్లల్లో—చిత్తు కాగితాల్లో—నలిగి చావగా మిగిలిన ఏదో నా అంతస్సుందరచైతన్యం-ప్రచండకాంక్షలు—మేలుకుని నాచుట్టూ తిరుగుతున్నాయి.

"మురళి పాటకు రగిలి మరుగు నీ వెన్నెలలు, సాగయు నాయెద కేలతగని సౌఖ్యజ్వాల" సరిగ్గా అట్లాగే వుంది నా అవస్థ—

మరణించానో—ఊపిరివిడుస్తున్నానో నిద్రించానో-మేలుకున్నానో నాకు జ్ఞాపకం లేదు.

నా మెదడు ఘూర్ణిల్లి తన సంకుచితపు హద్దులను కొట్టుకొని విస్తరించి ఒక కాంతిమయ దేవభూమిగా మారిపోయింది. ఒచ్చింది—

ఒక జగన్మంగళమూర్తి—లావణ్య పరమావధి—

వెండి శెమ్మామీద నుంచి రకరకాల భంగిమలతో సాగే సుగంధనిర్మలధూమరేఖ లాగు నాయెదుట కదలుతూ "లోకమంతా అలసి చల్లని వెన్నెల ఒడిలో విశ్రమిస్తూ ఉండగా—నీ ఉన్మిషన్నేత్రాలకు కనుమోడుపే కరువయిందా నాయనా" అంది.

ఉలికిపడి కళ్లు తెరచి చూశాను.

ఓహో!! ఎవరీ మహోజ్జ్వలమూర్తి? వేజోక నునుమంచు తెరలమీద, అలక్తకారుణ మృదుపదలాస్యంతో దర్శన మిచ్చే ఉషస్సుందరిలాగు వెలుగుతోంది.

తలనిండా కోటిపూలు... అవి నందన నవనీత పారిజాతకుసుమాలో—చైత్రరథ ప్రఫుల్ల హరిచందన పుష్పాలో—మానస సరస్సమానీత స్వర్ణకమలాలో—కాని,

ప్రాంత భూమినీ-నన్నూ - ఆమెనూ అపూర్వ పరిమళంలో ముంచెత్తుతున్నాయి. చూర్ణ కుంతలాల్లో రంగురంగుల గడ్డిపూలను తురుముకుంది.

సృష్టిలోని అంత చిన్న అందపు కదలికను గూడా విడువలేక శిరసావహించే ఆ అందాల రాణి యెవరో ?

ఆ దివ్య దర్శనంతో నా కళ్లకు క్రొత్త ప్రాణం ఒచ్చింది. నామాటల్లో వింత తీపి కలిసింది—మహోత్సాహంతో అన్నాను. అమ్మా, ఎవరు నువ్వు ?

కాళిదాస మహాకవి సుందరభావనా జగత్తునకూ — అసాధారణ స్వప్న సీమలకూ రాని విశిష్ట కావ్య కల్యాణివా ?

అమరావతీ జగదేకశిల్పి ఊహలకూ— ఉలికీ- దొరకని శిల్పసీమంతినివా ?

రామారావు మెత్తని కుంచెలకైనా తగలక వింత వన్నెల మెలకువతో విహరించే దుర్లభ చిత్రరేఖవా ?.

సైగాల్ అమృత కంఠనాళాల్లో సైతం ఒదగలేక మలయమారుత భంగాల్లో ఎగసి వచ్చిన అద్భుత సంగీత సంగతివా ?

కళాతపస్వి నిశ్చల ధ్యానముద్రలో తళుక్కున మెరిసే కళాదేవివా ?

నవ్వింది—

"ఎందుకమ్మా, దురదృష్ట నేత్రాలకీ ఆమరజ్యోతి ?

నన్ను నిరాశలో కుమిలి పోనీ— నా ఎడారి జీవితం హఠాత్తుగా నీ అనుగ్రహ జ్యోత్స్నా శాంతిని ఎట్లా భరించగలదు?"

దైన్యంలో నాకంఠం రుద్ధమైపోయింది.

కన్నులు చెమ్మగిల్లగా ఆమె జాలిగా నవ్వి చందనలతా శిశిరమైన తన చేతితో నా తల నిమురుతూ అంది.

"ఎందుకట్లా నీరస నిరాశలో కుంగి పోతావు—అసాధారణంగా నీ కిచ్చిన హృదయాన్ని అర్థం చేసుకో- ఇంకా నీ తపన పూర్తి కాలేదు. యోగసిద్ధి పూర్తి కానిదే అల్పయోగపరిచయంవల్ల గారిడీపనులు చేసి లోకంమెప్పులకు లొంగే యోగపతితుడులాగు సత్కళాసిద్ధి కలుగకమునుపే అక్షరరమ్యతకు అలరి తెలివితక్కువవాళ్లంతా 'కవిశిరోభూషణా' అంటే నిజమే అనుకుని మోసపోయావు—లోకం అవివేకశీలాన్ని ఇప్పుడు గ్రహించి దిగులుపడుతున్నావు. లే—ప్రకృతికావ్యాన్ని తరచు. ఈ సీతాకోకచిలకలు — పసివాళ్ల పాల నవ్వులు—కలువకన్నుల కన్యలు- మేఘాలు— మెరపులు— కన్నీళ్లు — ప్రణయాలు — విరహాలు— అదిగో ఒకొక దానివెనుక— ఎన్ని వినపడని సందేశాలు — కనపడని అందాలు—ఎన్ని చిత్ర సన్నివేశాలు !

కన్ను తెరువు—క్షుద్ర హృదయ దౌర్బల్యాన్ని దూరం చెయ్యి-"

ఆమాటలతో నాలో ఉత్సాహం జ్వలించడానికి బదులుగా, ఉద్రేకం రగిలి అన్నాను.

"అమ్మా, చాలు- కొత్త ఆశలు కల్పించి కొత్త అశాంతుల్లో నన్ను తొయ్యకు —చుట్టూ తిరిగే నలుగురు జడుల్లాగు దొరికిన సేనాధికారంతో—పాత రాగిచెంబునీతితో— కోతిభార్యతో గర్విస్తూ 'తగు

మనిషి' గా తిరగనివ్వక బ్రదుకంతటినీ తరిమి కాల్చే ఈ సౌందర్య జ్ఞానాన్నిచ్చి ఎందుకు తీరని అపకారం చేశావు?

కారడవికి శరచ్చంద్రికలాగు— కంటక వృక్షానికి అడవిమల్లెతీగెలాగు — హృదయం లేని దున్నపోతుకు ఊర్వశి నిచ్చి, రసికత్వం చమత్కారం లేని కొయ్యబొమ్మను ప్రేమించమని నా కిచ్చావుగదూ—

మృదులమానవహృదయాలను నిష్కరుణంగా కత్తిమొనతో కెలికి చిత్రవధ చేసే వైద్యుణ్ణి- చెయ్యకపోయావు?

నిజం అబద్ధంగానూ, అబద్ధం నిజంగానూ మార్చడమే జీవనవృత్తిగా గల 'న్యాయవాది' గా పుట్టించకపోయావూ?

తన మిడిమిడిజ్ఞానాన్ని విజ్ఞానసర్వస్వంగా చూపి కుర్రకుంకలదగ్గిర సర్వజ్ఞుడుగా మాట్లాడే ఉపాధ్యాయుణ్ణిగా సృష్టించితే ఎంత బాగుండిపోను?

దేశసేవ అని చెప్పుకుని దాని చాటున తన తుచ్ఛస్వార్థాలను- కక్కుర్తులను తీర్చుకుంటూ మర్యాదగా తిరిగే 'స్వదేశభక్తుణ్ణి'గానైనా చెయ్యకపోయావూ?

తియ్యని ప్రతి గానలేశానికీ— చక్కని ప్రతిచిత్రరేఖకూ— కమ్మని ప్రతి కావ్యాంశానికీ పరవశంగా చలించే సున్నితమైన మనస్సు నిచ్చి ఆరనివేదనను అనుగ్రహించావుగదూ—

ఆకాశపు నీలంలో రంగురెక్కలు ఊపుతూ పావురాలు పరుగెత్తితే నాకేం?

మార్గశిర ప్రభాత వృక్షాగ్రాల లేత ఎఱ్ఱని చివుళ్లమీద మంచుబొట్లు ఉదయారుణకాంతిలో మెరిస్తే నా కెందుకూ?

సమాజం ఇనపకాలికింద నలిగే పడుచు వితంతువు నీటిమేఘపు కళ్లలోనుంచి దుఃఖం కురిస్తే నాగుండె కొట్టుకోవడం ఎందుకూ?

దేశం నిస్సారమై— జాతి నిర్వీర్యమై మనుష్యులు నడిచే పీనుగులై నిశ్చింతగా తిరుగుతూంటే, దురభిమానంతో నేను తల్లడిల్లడం ఎందుకూ?

అమ్మా, ప్రపంచాన్ని చూసినకొద్దీ- ఏదో ఎలుగెత్తి చెప్పవలెననీ— ఏదో పాడవలెననీ- ఏదో రచించాలనీ- నిరంతర ప్రసవవేదనతో నా మస్తిష్కం బద్దలవుతూంది.

పడుచుపిల్లల విఫలప్రేమ రాల్చే వెచ్చని కన్నీళ్లలోని అగాధ సందేశాన్ని — క్షుత్పీడిత నిర్భాగ్యభిక్షుకుని యాచ్ఞాదైన్యంలోని అగ్నిజ్వాల చురుకునూ— లోకానికి వ్యభిచారమై, తనకు పవిత్రరతిఫలమై, దొరికిన పసిపాపను వక్షాని కదుముకునే పతితురాలి మాతృహృదయపు గిలగిలనూ—అందని సుందరభావనాలోకంలోని అద్భుతానుభవాలను తనరచనలో సంపూర్ణంగా ముద్రించాలని తన్నుకునే కవికుమారుని భావబాధనూ- ఏభాషలో చెప్పగలను? ఏ మాటలు వివరించగలను? ఏ ఛందస్సు పాడగలదు?

నాచచ్చుభాషా— నీరసవాక్కూ- ఏం చెయ్యగలవు?" వెక్కి-వెక్కి- ఏడ్చాను.

దీనత్వాన్ని— దౌర్బల్యాన్ని దహించే విజ్ఞానజ్యోతులవంటి కళ్లతో నావైపు ఒకసారి తేరిచూసి నిశ్చల నిశ్చయంతో ఆమె పలికింది —

"అన్నా, నాకు తెలుసు— ఈ హృదయ దుర్బలత్వంతోనే నువ్వు మూఢుడవవుతున్నావు—

విశ్వకోశాన్ని చూస్తున్నావు— కాని పుటలు తిప్పితిప్పి పుస్తకం అర్థం కాక విసిగి విసిగి మూసివేసిన వ్యర్థుడివయావు—అంతరార్థం గ్రహించడానికి ప్రయత్నించలేదు. ఇంక నీ కంటికి వెలుగు కలిగేదెట్లా ?

నీ యాత్రలో అందబోయే ప్రతి ఆనుభూత్యాన్నీ—సంతృప్తినీ— నీచేతికి దొరకకుండా చేతులారా నేనే లాగివేశాను.

నీకే ఊర్వశిని ప్రేయసిగా— అఖిల తృప్తినీ కరతలామలకంగా— చేస్తే నీకు వేదనామాధుర్యం బోధపడేదెట్లా ?

వీణతీగలవంటి నీసుకుమారహృదయం, లెక్కలేని సంఘర్షణలనూ— ఘాతాలనూ తినకపోతే యుగయుగాల్లో ప్రతిధ్వనించే కావ్యగానం లోకానికెట్లా లభిస్తుంది ?

అప్సరస్సౌందర్యం నీ గుమ్మం లో ప్రేలాడదీస్తే సుదూర అంతరాంతర సౌందర్య రహస్యాలకోసం తహతహతో వెదకేదెవరు ?

ప్రపంచయాత్రాఖిన్నులనూ — సంసారదుఃఖితులనూ — స్వాదువాక్పరితోషంలో తేర్చడానికి నిన్ను వరప్రసాదంగా అర్పించాను.

ఎండలలో మాడి తనమధుర ఫలాలను ప్రజలకు దానంచేసే రసాలశాఖివి—

తన స్వచ్ఛ సుగంధిలపుష్పాలను విలాసినీ కబరీభరాల్లో అలంకరించి మిగిలిన ఫుల్లి కావల్లికవు—

నిగూఢమైన అంతశ్శక్తినీ — అనంత ప్రయోజనాన్నీ మరచి విచారించకు—

నిజమైన కళాతపోగ్నిలో తపించు— నీకంటికి తపనీయ దుర్నిరీక్ష్య తేజస్సువస్తుంది. దానితో స్థూలరూపప్రతిబంధకాలను దూసుకునిపోయిసత్యశివసుందరసూక్ష్మరూపాన్ని దర్శించగలుగుతావు— అప్పుడు ఈ ప్రపంచపు నీతులూ—ధర్మాలూ— సూత్రాలూ— నీకంటికి పరమాణువులు —

కళాసిద్ధుడవు కాక — రంగుకాగితపు ముక్కల్లాంటి మూలమూలల మాటలను పోగుచేసి— పిచ్చితలల సమాసాలకు పెనగులాడి— బుద్ధిహీనుల చప్పట్లకూ— వెర్రి పూల దండలకూ—బిరుదాలకూ — తల ఒగ్గితివా భ్రష్టుడవై పోతావు- జాగ్రత్త!

రససిద్ధుడవై ఒక్క సహృదయుని మనస్సు ద్రవించే రచన చేసితివా ధన్యుడవు— వెళ్ళిపోయింది —

౨

వెంటనే ఇంకోవ్యక్తి నా ఎదుట ప్రత్యక్షం— సన్నని వెన్నెలపోగను స్తనవల్కలంగా—పరిధానంగా—చుట్టుకొని హిమవత్పర్వత శ్వేతసానువులపై విహరించే నగ్న దేవకన్యకలా వుంది.

"స్ఫురన్మూర్తీ ! నీ వెవ్వరు ?" అని అడిగాను. పక్కున నవ్వింది—

శరద్రాత్రి గోదావరి ఒడ్డున లక్షలు కెల్లుపొదలు వికసించిన ట్లయింది.

తలను వింతఒయ్యారంతో ఎత్తి కను గొనల్లోంచి ప్రౌఢంగా చూస్తూ అంది —

"నాకోసం ఏడ్చి కలలు కన్నా నన్నా వు— బతుకంతా నీకే అంకితమన్నావు— నన్నే గుర్తించలేకుండా వున్నావా?"

ఆమాట కశాఘాతంలా తగిలింది. ఎంత తియ్యని ఉపాలంభనం!

"ఏమిటీ—నిరంతరం నా జీవనశాంతిని ఒణికించే ప్రేమమూర్తివా? రా— ఇంకా దగ్గిరగా రా—నీ కర్పూర మసృణ శీతల బాహువులతో నాకంఠాన్ని ఊపిరాడకుండా నొక్కి వెయ్యి. నీ వినీలకుంతల కాలపాశం తో నాప్రాణసారాన్ని లాక్కొనిపో. నీపరమ వంచకమోహినీనేత్రాలతో నన్నింకా ఎన్నాళ్లు పరిభ్రమింపజేస్తావు? నీ మృదుల పాదమంజీరధ్వనులకోసం ఎన్నిరాత్రులు గుండెనాపి ప్రతీక్షించగలను? స్త్రీహృదయం కృపాకోమలం అంటారే-నీ మనస్సుమాత్రం ఇనుపముక్కలతో కట్టారా?

ఏ శ్రావణ శుక్రవారపు సుప్రభాతం లోనో—చెట్టుసంపంగికొమ్మల చాటునుంచి, రాధామనోహారం తీగల వెనక నుంచి నేను చూడకుండా వచ్చి నాలో ప్రవేశిం చావు. నా మనోఽవకాశాన్నంతటినీ పరిమ ళించే అగరువత్తుల పొగలాగు ఆక్రమించావు. నాటినుంచి నన్నావేశించి పలికే పలుకులో- పాడే పాటలో—విషమనాట్యాన్నీ — అప స్వరసంగీతాన్నీ మోగించావు.

నేను చివరి ఊపిరి విడిచేటప్పుడైనా నీ అనలపరిరంభాన్ని అనుగ్రహిస్తావా?" ......అట్లాగే మాట్లాడివేస్తున్నాను.

మధ్యగా అందుకుంది—

"ఉన్మత్తభావశాలీ! ఉద్రేకంలో ఎందు కట్లా నాకు దూరంగా జరిగిపోతున్నావు — నీవంటి అగ్ని ప్రేమికుడికోసం— అఖాత ప్రణయమగ్నునికోసం— నే నెంత పరితపించి పరుగులెత్తుతా నని— కాని చేతికి దొరికినదా న్నల్లా విసరికొట్టి— అందనివాటి కోసం పడిచచ్చే మానవజాతికి చెందినవాడ వన్న సంగతి మరచిపోలేను. నువ్వు నా కోసం తహతహాష్టడి కృశించి ఆశాప్రతీ క్షల్లో కాలి దురపిల్లకుండా నేను నీ కౌగి లింతలో వచ్చిపడితే నామీద నీకేం గౌర వంగా వుంటుంది?

అనీకాక— నీ ప్రచండ సౌందర్య దాహాన్ని చూస్తే నేను భయంతో కంపించి పోతాను.

ఎన్ని లావణ్యాలు—విలాసాలు— చక్క దనాలు ప్రపంచ మంతటా చూశావు — ఎక్కడనైనా ఆగి నీ మనస్సు సంతృప్తితో ఊరట చెందిందా? లేదు- నేతినేతి వాక్యా లతో బుతువులు- లోకాలు- కాలాలు- దేశాలు, భూమి- ఆకాశం - అంతరాళం- అంతటా ఆరని తృష్ణతో భ్రమించే ఉద్రిక్త మధువ్రతుడవు- నీతో ఎవరు సుఖించగలరు? నిన్ను ఎవరు భరించగలరు?

నీ తీవ్రపరిభ్రమణంలోనుంచి ఒక్క సారి ఆగి నిదానంగా ముందు విరాట్ప్రేమను బోధపరుచుకో—

క్షుద్రులను, బహిష్కృతులను, కురూ పులను, విషణ్ణహృదయులను, విరోధులను, అజ్ఞానులను — దీనులను, కీటకాలను సైతం మనస్ఫూరా నిష్కామంగా ప్రేమించడం నేర్చుకో—

అప్పుడు నీఆత్మ ఎన్నిరెట్లు సంతుష్టిని- ఎంత ఔన్నత్యాన్ని- అనుభవిస్తుందో

చూడు. నువ్వు నిరీక్షించ నక్కరలేదు- అప్పుడు నేనే నీకోసం వెతుక్కుంటూ వస్తాను.

నువ్వు అనుకోని త్రోవవెంట వచ్చి నిన్ను నా మెత్తని పక్షానికి అదుముకొని, పూలదారుల్లో నడిపించి నా గంధర్వసౌధానికి అతిథిని చేస్తాను. ఉత్తమసాధన చెయ్యి." నిష్క్రమణ—

3

అనుపదంలోనే మరోవ్యక్తి—

క్షమాసత్యాలు కళ్లల్లోంచి ప్రవహించే 'పరిపాండుదుర్బలకపోల' జానకీదేవిలాగు వుంది.

లోకమాత ఉదారమాతృత్వం- విశుద్ధ సౌశీల్యం. పచ్చని ఆమె రూపధేయంలో స్పష్టంగా వెలుగుతున్నాయి.

ఆప్తులను చూచినప్పుడులాగు ఆమెను చూడగానే అనుభూతదుఃఖాలు ఉబికి పైకి రాబోతున్నాయి.

ఆపుకుని అన్నాను.

"శిథిలహృదయుల మలిన బాష్పాలు తుడిచి గుండెలో ఆదరించే కరుణాసుందరివా అమ్మా" అంతకంటె మాటలు లేవు.

శీతల మృణాలములవంటి చేతులను నావైపు చాపి అంది-

"పిచ్చితండ్రీ! ఇట్లా రా- నా ఒడిలో విశ్రమించు- లోకయాత్రలో ఎంత నలిగిపోయావు నాయనా—ఒకేఒక్కనాడు తన్మయ సుషుప్తిని ఎరగవుగదా......"

నా దీనముఖాన్ని చూచి ఓర్వలేక నన్ను దగ్గరగా తీసుకుని కౌగలించుకునే మాఅమ్మ జ్ఞాపకం వచ్చింది.

ఆమె నిర్వ్యాజ వాత్సల్యానికి వివశుడనై ఆమెవక్షంలో తల దూర్చి ఒకటే ఉష్ణాశ్రుధారను విడుస్తున్నాను.

కేతకీ గర్భపత్రంవంటి చేతితో నా ముఖాన్ని తుడుస్తూ ఆమె మాటాడుతోంది-

"లోపల వెయ్యిటన్నులమాలిన్యాన్ని దాచుకుని తీపిగా బుజంమీద చెయ్యివేసిన మిత్రుల ద్రోహంలో పడి లేవలేక బాధపడ్డావు—దొంగ అనురాగాన్నీ కృత్రిమ సౌజన్యాన్నీ నటించలేక అప్రయోజకుడవై తల ఒంచుకున్నావు.

లౌక్యం తెలియక నేటి సమాజంలో- సన్యాసుల్లో- మతోపన్యాసాల్లో- దైవభక్తిలో వున్న కుళ్లును స్వార్థాన్ని చూచి సహించలేక తోచిన నిజం మాటాడబోయిన 'మర్యాదస్థుల మంద'లో చోటు లేకుండా చేసుకున్నావు-

దబాయించి మాటాడేవాడిని విద్వాంసు డనీ- తడుముకోకుండా వాగేవాణ్ణల్లా ప్రవక్త అనీ, ప్రతికూతా పద్యంలో కుయ్యగలిగిన వాణ్ణల్లా మహాకవి అనీ భజించి వారి అవలేప ధిక్కారాలకు బలిఅయిపోయావు.

ఈ ప్రపంచంలో చేతగానివాడ వనీ- తిరస్కృతుడ వనీ- నిలవడానికి నీడ లేనివాడ వనీ మనస్సంతా గాయం చేసుకుని కుంచుకుపోతున్నావుగదూ- బిడ్డా! తపించకు—

కార్చిచ్చువంటి నీ అంతరాత్మకు నేను శాంతిని కల్పిస్తాను. వాడిన నీ ముఖానికి నేను వికాసం ఇస్తాను.

ఒక్క రహస్యం విను-

'మొక్కనక్కొస్తే కాలితో తొక్కే గుణం వుంది ఈ లోకానికి.' గర్వంతో-ఆధిక్యంతో నిన్ను తృణీకరించినవాణ్ణి ఎదిరించు-చీల్చు—

'సర్వథా వ్యవహర్తవ్యం కుతో హ్యవచనీయతా' అంతర్థాన మయింది.

౪

కొన్ని నిమిషాలు నిశ్శబ్దం—

హఠాత్తుగా చిక్కని చీకట్లతో నా ప్రదేశ మంతా మునిగిపోతోంది. గుహల్లోనుంచి వెలువడ్డ క్రూరజంతువుల్లా గగనం నిండా కారుమేఘాలు మూగుతున్నాయి.

"మహిషపు లోహఘంటలు మబ్బుచాటున ఖణేల్ మన్నాయి" అనేపాట ఎందుకో అకస్మాత్తుగా జ్ఞాపకం వచ్చింది.

త్రుటిలో — నిజంగానే రెండు బలిష్ఠ మహిషాలు లాగే భయంకరరథం ఒకటివచ్చి టక్కున నా యెదుట ఆగింది. నిలిచిన మహిషాల మాంసలకంధరాలు కదిలినప్పుడల్లా వాటిలోని ఉక్కుగంటలు భయపడ్డ పెద్దప్రాణాల్లాగు ఖంగున మ్రోగుతున్నాయి.

స్నేహానికీ—దయకూ—చిరునవ్వుకూ అతీతమైన భీకరమూర్తి ఒకడు దానినుంచి దిగాడు. సౌజన్యం ఎరగని అధికారి కుటిల శాసనం అతని నుదుటిమీద వేలాడుతోంది.

కారునల్లని జైనవిగ్రహం మాట్లాడుతూంది అమావాస్యరాత్రి దట్టమైన వెదురుటడవి గాలి పోసుకుని బీభత్సపుహోరు పెడుతున్నట్టు.

కెవ్వున కేకవేసి కళ్లు మూసుకున్నాను. హేళనగా నవ్వి అన్నాడు—

"పిరికివాడా, చిన్న అవమానానికి — ఆశాభంగానికీ—ఆందోళనకూ తట్టుకోలేక మృత్యువును ప్రార్థించేవాడవుకదూ! రా— అట్లా అధైర్యంతో ముడుచుకుపోతా వెందుకూ?

ఈ దరిద్రప్రపంచంలో — నిర్భాగ్య మనుష్యజీవితంలో — ఏమి అనుభవించాలని నన్ను చూసి దిగులుపడి అట్లా వెనక్కు పోతావు—నామాట విను—నాతో రా—

కళ్లు తెరవకుండా ఒణుకుతూన్న గొంతులోనుంచే అన్నాను.

"అప్పుడే—ప్రాణాలకంటె తియ్యని నా ఆశలను—స్వప్నాలను తుడిచి తెరవెనక్కు లాక్కుపోవడానికి వచ్చిన మృత్యుస్వామివా ప్రభూ?"

"పిచ్చివాడా, కల్పించుకొన్న గాలిమేడల్లో దిగ్భ్రమ చెందుతున్నావు—ఇంతవరకు గడపిన నీ బ్రదుకులో ఏమి సంతుష్టి నీకు దక్కింది?

ఒక్క సౌందర్యలేశంకోసం- సజ్జనసానుభూతికోసం రెండుఎండుచేతులూ చాపి చాపి, గోరువెచ్చని కన్నీళ్లతో దోసిలి నింపుకున్నావు. కటికచీకటిలోకి ప్రదీపం తెచ్చిన అపరాధానికి ఉరిశిక్ష అనుభవించావు. నాకు తెలుసు - ఝంపపుకోతవంటి ఈ నిర్జీవయాత్రలో నీకు సుఖం లేదు. నీ ఊపి రాడినంతసేపూ నీ ఆశలు ఫలించవు. పాపం! నీ సమాధిమీద మాత్రం దీపాలు వెలిగి-పూలు పడతాయి.

నా రథంలోకి చూడు - ఎందరు - వీరు లు - త్యాగులు - తీవ్రభావదగ్ధులు - ఉత్త మాశయ సంతప్తులు - నిరంతరాందోళనా క్లిష్టజీవులు - నీవంటి యువకులు-వ్యాధులు, బాధలు, ఆదర్శాలు, ఆవేశాలు, అన్నీ విడచి ఎంత నిర్విచారంగా ఉన్నారో చూడు! నా సన్నిధిని నీకు తిరగని తరగని శీతల సుషుప్తిని ప్రసాదిస్తాను.

రా—ఆలోచించకు - రథం ఎక్కు - బంధువులు - మిత్రులు - కోరికలు - భవి ష్యత్తులు ఏవీ నిన్ను బాధించవు - లే - తరు వాత విచారిస్తావు"

డగ్గుత్తికతో ప్రాణోత్క్రమణ సమ యంలో వలె తొట్రుపడే మాటలతో అన్నాను.

"వద్దు ప్రభూ - ఇంతలోనే నన్ను చం పెయ్యకు - రాను - అనుగ్రహించు—

నా గొంతులో తీపి చావనంతవరకూ కంఠం పగిలేలాగు పాడనీ — నాకళ్లు చూడ గలిగినంతవరకూ ప్రతి సౌందర్యాన్నీ తిరిగి తిరిగి చూడనీ — నామెదడు పని చేసినంత వరకూ నాకు స్ఫురించే దిగంబర సత్యాన్ని చాటనీ —

క్షుద్రలోకంలోనుంచి వచ్చే ఏదూష ణం - భూషణం - తిరస్కారం — పురస్కా రం నన్ను తాకకుండా దుర్గమస్వేచ్ఛాపరి ధులను నిర్మించుకుంటాను—నన్ను విడిచిపెట్టు "రాజాల నోప్రభూ రాజాల నిపుడేను ఈసుందరప్రపంచము విడువగాలేను"

కన్ను తెరిచాను.

ఏముంది ?

ప్రకృతిపాట

శ్రీ పురాణం కుమారరాఘవశాస్త్రి

ఇది యమృతగానవీచిక, ఈయనంత
మైన ప్రకృతిగర్భాంతరాళాన మ్రోగు
చున్నది; క్షణక్షణము క్రొత్తసొగసు కలదు-
దాని వినగోరువారు బంధములు త్రెంచు
కొని పరుగులిడి రండు; గగనపథముల,
తోయదవిశాలశీతలచ్ఛాయల, అల
తారకల వెల్గుచాలుల, మీరు కూడ
రెక్కలం గట్టుకొని విహరింత్రుగాని—
అచటి రంగులలో, గాలి యలలలో ఖి
లీనులై రాగరసము గ్రోలెదరుగాని—
లెండు స్వేచ్ఛాపిపాస వర్ధిల్లువారు!

ఔరంగజేబునకు శివాజీలేఖ*

శ్రీ అయితం కాళీవరప్రసాదరాయకవి

ఆలమ్‌గీర్ చక్రవర్తికి:—

నిత్యము భవదీయ శ్రేయోఽభిలాషి యగు శివాజీ సూర్యునివలె విస్పష్టమగుచున్న భగవత్కారుణకును, చక్రవర్తి కృపకును నచంచల హృదయముతో వందనము లాచరించి వ్రాయులేఖ:—

భవచ్ఛ్రేయోఽభిలాషి నగు నేను, నాదురదృష్టకర్మవశంబున యుష్మన్మహనీయ సాన్నిధ్యమునుండి యాజ్ఞఁగైకొనక వెడలితిని, నేఁటికినీ నాకెంత శక్తికలదో యంత పరిమితివఱకు న్యాయార్హమైన సేవలఁ గృతజ్ఞతతోఁ జేయ నిరంతరము సంసిద్ధుఁడనుగా నున్నాఁడనని మనవి చేయుచున్నాఁడను.

నాతోడి యుద్ధకారణమున నీ ధనమంతయు వెచ్చించి, ధనాగారమును శూన్యమొనర్చికొని, నీవు జిజియానామమున హిందువులనుండి పన్నుగ్రహింపవలసినదిగా నీవారి నాజ్ఞాపించినటులఁ గతిపయదినములకుఁ బూర్వమే నాకర్ణపథమునఁ బడినది. ఘనతవహించిన చక్రవర్తీ! ఇయ్యదినీకు రుచించునా? ఈసామ్రాజ్యభవన నిర్మాణచణుఁడగు నక్బరుపాదుషా, సంపూర్ణాధికారముతోనే, బదిరెండేండ్లు పరిపాలన మొనర్చెను. ఆతఁడు క్రైస్తవులు, యూదులు, మహమ్మదీయులు, దాదా యనుచరులు, ననాత్మవాదులు (Materialists) నాస్తికులు, బ్రాహ్మణులు, జైనబోధకులు మొదలగు వివిధజాతి సంబంధముగలిగి సర్వప్రపంచ మనోహరమగు స్తుత్యరాజనీతి తంత్రజ్ఞమార్గము ననుసరించెను. సర్వప్రజారక్షణమే, అఖిలదేశరంజనమే, యతని ఉదారహృదయ ప్రధానోద్దేశ్యమై యుండెను. ఆకారణమున నతఁడు ప్రపంచమునకు 'ఆత్మమార్గదర్శి' అను నర్థమిచ్చు జగద్గురుబిరుదమున విఖ్యాతిగడించెను.

అనంతరము నురుద్దీను జహాంగీరు ప్రపంచ శిరోపరిభాగస్థానమునుండి ఇరువదిరెండేండ్లు తన మనోహరచ్ఛాయ వ్యాపింపఁజేసి, తనహృదయమును మిత్రవశ మొనర్చి, హస్తమును కర్తవ్యమునకై యొసంగి యభిమతముల సిద్ధింపఁజేసికొనెను. చక్రవర్తి షాజహాను లోకమూర్ధమున స్తుత్యమగు తన నీడను ముప్పదిరెండేండ్లు వ్యాపింపఁజేసి, యుత్తమత్వమునకును,నుత్తమకీర్తికినిఁబర్యాయపదమైన యాముష్మిక జీవనఫలము నేకరించెను. అయ్యది లోకమున తన సౌఖ్యకాల ఫలితము.

ఎవఁడు సన్నుతయశముతో నెపుడుఁ గడపు
కాల మతఁడు శాశ్వతలక్ష్మి గడనఁజేయు;
వాఁడు మృతినొందినను గూడ వానిపనులు
జనము స్మరియించుటఁ దదాఖ్యశాశ్వతంబు.

---

* మద్రాంధ్రీకృతమగు శ్రీయదునాథ సర్కారు శివాజీ చరిత్రమునుండి గైకొనఁబడినది. ఈ లేఖను శివాజీ నీలాప్రభువుచే పర్షియన్ భాషలో వ్రాయించెను.

ఈ యత్కృష్టస్వభావముయొక్క మహ నీయఫలితమే అక్బరుయొక్క ఉన్నత మనోరథదృష్టిని వినమ్ర మొనర్చెను. తత్కా రణమున విజయాభివృద్ధులు మార్గాభిముఖ ములై యాతని నాహ్వానించెను. ఆతని పరి పాలనమునసే, యాతని భుజాబలమునసే, యనేక రాజ్యములు, దుర్గములు జయింపఁ బడెను. ఆలమ్‌గీర్ పాదుషా వగు నీవు, వారి రాజ్యనీతిక్రమమును కేవల మనుసరించు యత్నమున నే విఫలుఁడ వగుట యను సత్య విషయమువలన నే, యాచక్రవర్తుల యున్న తియు, నధికారమును సులభగ్రాహ్యము లగు చున్నవి. వారికిఁగూడ జిజియాపన్ను సంగ్ర హించు నధికార ముండెను. అయినను వారు తమ హృదయములయందు స్వపక్షదురభి మానమునకు స్థానమీయు లేదు. ఏమన, వారు హీనా హీన సర్వప్రజాసంఘములు కూడ జీవించియున్న నానావిధజాతుల స్వభావతత్త్వోదాహరణకుఁగా భగవంతు నిచే సృజింపఁబడెనని తలఁచిరి. ఈ యౌదా ర్యము వారి కీర్తికి శాశ్వతచిహ్నముగ కాల పుటాంతరమున లిఖింపఁబడినది. ఇట్టి రీతి గనే యాపవిత్రాంత రాత్మత్రయమునకై స్తుతి ప్రార్థనములు గూడ సర్వమానవ జాతిరస నాంచలములను, హృదయాంతరములను శాశ్వతముగ మెలఁగుచున్నవి. ప్రతివ్యక్తి ఇచకు ఫలిత మభివృద్ధి. ఈ కారణమున వారల యదృష్ట మభివృద్ధిఁ జెందెను. ఏమన, భగవదారాధకులు తమ పరిపాలనమున భద్రతా సౌఖ్యము లను నూవెల లందు నెమ్మదిఁగ నుందురు. వారి యత్నములు విజయవంతము లగును.

అయినను నీ పరిపాలనమున నియ్యవి విపరీతములు. అనేక దుర్గములును, పరగణా లును నీ స్వాధీనమునుండి సడలినవి. శేషిం చినవి గూడ త్వరలో పోనున్నవి. ఏమన, వానిని విధ్వంస మొనరించుటయందు, దోఁచు కొనుటయందు నేను మాంద్యము వహించి యుండుట లేదు. నీ రైతు లధఃపతితు లుగా ద్రొక్కఁబడిరి. ప్రతిగ్రామాదాయము తగ్గినది. లక్షరూప్యము లాదాయము లభించుచోట సహస్రరూప్యములును, వేయిరూపికలు వచ్చుస్థలమునఁ బదియు మాత్రమే యత్యంత కష్టముతో గ్రహింపబడుచున్నవి. దారిద్ర్య భూతమును, భిక్షుకత్వమును చక్రవర్తియు రాజులయు దుర్గసీమలఁ బ్రవేశించినప్పుడు, ప్రభువులయు నుద్యోగులయు బరిస్థితులు సులభముగా నూహింపవచ్చును. నీ యీ పాలనమున సైన్యము లుప్పొంగి చెలరేఁగు చున్నవి. వర్తకు లార్తనాదము సేయు చున్నారు. ముసల్మానులు రోదించు చున్నారు. హైందవులు విధ్వంస మొనరింపఁ బడిరి అనేకులు నిశాసమయములు నాహారము లేక, యుదయావసరముల తమఁ జెక్కులఁ గొట్టికొనుచు నిన్ను శపించు చువానియందగ్ని రగుల్కొల్పుచున్నారు. ఈ విచారకర పరి స్థితులయందు జిజియాప న్నెడు మఱియొక కష్టము నాపాదింపఁజేయుటకుఁ జక్రవర్తి హృదయ మె ట్లనుమతియిచ్చెను? నీ యీ యపకీర్తి యతిశీఘ్రగామియై పశ్చిమదిశా తటమునుండి ప్రాగ్దిశాగ్రమువఱకు వ్యాపించి, చారిత్రక గ్రంథములయం దుత్తర హిందూ స్థానచక్రవర్తి భిక్షుకుల భిక్షాపాత్రముల నాశించెననియు, బ్రాహ్మణులనుండియు, జైన సన్న్యాసులనుండియు, యోగులనుండియు,

బైరాగులనుండియు, దరిద్రనారాయణుల నుండియుఁ, బరివ్రాజకులనుండియుఁ,బతితుల నుండియు, క్షామబాధితులనుండియు జిజియా పన్నును గైకొనెననియు నాతని పరాక్రమము భిక్షుకుల జోలెల నెదిర్చెననియు, నతఁడు తైమూరు వంశస్థుల కీర్తిగౌరవముల మట్టి పాలు చేసిననియు లిఖింపబడఁగలదు.

ఘనతవహించిన యో చక్రవర్తీ! నీవు నిజమగు దైవగ్రంథమును, దైవవాక్కును నగు కురానునందు విశ్వాసము కలిగియుండి నచో నందు దేవుఁడు సర్వమానవప్రభుఁవగు 'రబ్ ఉల్ ఆలమిన్'గ లిఖింపబడియుండెనే కాని, కేవలము మహమ్మదీయప్రభువను నర్థమును స్ఫురింపఁజేయు 'రబ్ ఉల్ ముసల్మాన్' అను నామమునఁ జిత్రింపఁబడలేదనియుఁ దెలిసికొనఁగలవు. ఇస్లాము మతమును, హైందవమతమును నిశ్చయముగా పర్యాయపదభేధము లైయున్నవి. అది మసీదగునెడల నందలి ప్రార్థన భగవంతుని స్మరణకై యున్నది. అది దేవాలయమగుచో, నందలి ఘంటిక దైవము నపేక్షించియే ప్రయోగింపఁబడుచున్నది. స్వపక్షదురభిమానమును, నట్టియాచరణములును, పవిత్రదైవగ్రంథవాక్యముల తాఱుమారుచేయుటతో సమానములు. ఆచిత్రమున (ముసల్మాను హైందవమతములను వర్ణములతో మానవజాతి స్వరూపమగు దైవాకృతిగా చిత్రితమైన భగవచ్చిత్రకార కల్పితచిత్రము) నూతన రేఖావళి రచించుట చిత్రకారుని లోపము వెదకుట యగును.

న్యాయరీతిని నిశ్చయముగ జిజియాపన్నెంతమాత్రము ధర్మయుక్తము గాదు. రాజకీయదృష్టితో చూచినను, నతిలోకరమణీయ యగు రమణీమణి సువర్ణాలంకరణశోభితయై ఒకపరగణానుండి మఱియొక పరగణాకు నిర్భీతితో నెట్టి యవమానమునకుఁ బాల్పడక పోవఁజాలు నప్పుడే యయ్యది గ్రహింపఁదగియున్నది. అయినను గొప్ప పట్టణములే దోఁచుకొనఁబడుచుండిన యీ కాలమున, నరతుకమును, బహిరంగమును నగు దేశవిషయమున నేనేమి చెప్పఁగలను? అట్టి యీ యన్యాయముతో బాటు జిజియా సంగ్రహణము క్రొత్తదియు నయుక్తమైనదియు నగు నొత్తిడిగా హిందూదేశమున నున్నది.

ప్రజల నణఁగఁ ద్రొక్కుటయందును, హైందవుల భయోద్రిక్తులఁ జేయుటయందును, ధర్మనిష్ఠాపరత యంతర్భూతమై యున్నదని నీవు నీయూహాప్రపంచమున బొడగాంచఁగలిగినచో, దొలుదొల్త హైందవనాయకుఁడగు రాణారాజసింగునుండి జిజియా పన్నును గ్రహింపవలసియున్నది. అప్పుడు నావంటివానినుండి దానిని పొందుట కష్టము కాదు. ఏమన నేను నీసేవకైయుంటిని. ఇట్టి యెడఁ జీమలను దోమలను నణఁగఁ ద్రొక్కుట పరాక్రమమునకు, నుత్సాహమునకు దూరమగు కార్యముగా నున్నది.

విషయపరిస్థితుల యథార్థస్వరూపము నీకు నిరూపింపక, కేవల తృణపరంపరచే ప్రజ్వలితాగ్నిని గప్పఁ జూచుచున్న నీ యుద్యోగుల విపరీతవిశ్వాసమున కాశ్చర్యస్తంభితుఁడ నగుచున్నాను.

నీచక్రవర్తిత్వ మను సూర్యభగవానుఁ డున్నతత్వ మనెడు దిఙ్మండలోపరిభాగమున భాసిల్లుచుండుఁగాక!

ఆషాఢమేఘము

శ్రీ బొడ్డు బాపిరాజు

ఓ యాషాఢ నవాగతాంబుధరబంధూ ! స్వాగతం బిచ్చి, త్వ
చ్ఛాయాదర్శనమాత్ర శీతలము విశ్వస్వాంతమాత్మాంజలిన్
సాయంప్రస్ఫుట మల్లికాకుసుమగుచ్ఛంబుల్ నివేదించు, రా
వోయీ ! చల్లనిజల్లుతో మొగలిపువ్వుందావు లూరించుచున్.

అలి నీలాలక పింఛముల్ చెదర నాట్యంబాడు కృష్ణయ్య సొం
పులు వంపుల్ హావణించు నీ యొడుపు తీవుల్, వాని బంగారుగ
జ్జెలమ్రోతల్ వినిపించు శ్రావ్యములు గర్జింపుల్—సుధాస్వప్న వీ
థులలో భావపరంపరల్ పరుగులెత్తుఁ రెక్క లల్లార్చుచున్.

శ్రమలం బైపయి జోపు శీతల మరుత్సంచారముల్ నీ సమా
గమముల్ ముందుగ నూదిపోవగ, బలాకశ్రేణి ప్రత్యగ్రభా
సము లంభోరుహతోరణస్రజములై శ్యామాంబరద్వారబం
ధము కై సేయు నహో ! నవప్రకృతిసౌందర్యోత్సవాలంకృతుల్ !

పొలమున్ దున్నినకాపు నీకొరకు రేపున్ మాపు మిన్నెల్ల క
న్నులె గాగా పరికించు చాకుమడిలో నున్నాడు; ఈమైన వే
ళలు దాటింపక నీ సుధారసము చిల్కన్ బిందు వొక్కొక్క ము
త్తుల కెత్తౌ మొహరీలతో - అతని కెందున్ లోటు రానీకుమా.

నిలువన్ రాని నిదాఘవహ్నిశిఖలన్ నిట్టూర్పులన్ దోగి బీ
టలు వారన్ హృదయమ్ము శోషపడుచుండన్ పిల్చిన ట్లీధరా
స్థలు లార్ద్రిమ్ములుగా జగాగరికపచ్చల్ పాదులెత్తించు ని
స్తుల మౌదార్యము నీకె చెల్లినదిగాదో వారివాహప్రభూ !

అడుగంటన్ జదలేటి తుంపురుల ముత్యాల్ దెచ్చి దోసిళ్లతో
నోడి నింపించుచు నర్థిచాతకచయం బుప్పొంగ, వర్షాశనం
బిడు నీరాకయె రాకగా తలచు ప్రాణేశప్రవాసవ్యథా
భరసమ్మర్దకృశాంగులఁ బతుల గూర్పఁ నీక పుణ్యమ్ము పో.

నీ మధురాసితద్యుతులు నిల్చు హృదంతరసీమలందు, మా
శ్రీమతి సంజలేవెలుగు చింద, తడీపొడిమైన పయ్యెళి
శ్యామలవేణికాభరము లార్పుట, గుర్తుకు దెత్తువోయి మి
త్రా! మునిమాపు గాలి పొరలందు తరంగయుయోల లూగుచున్.

ఒక నా డీ శుభవేళనేగద వియోగోద్యోగివైయున్న య-
క్షకుమార ప్రియవార్తమోసికొనిపోగా నొప్పుకొన్నావు, చె
ల్మికి నిన్నే తొలి లెక్కపెట్టవలె, నిల్చెన్ నీదు పేర్వాసి మా
సుకవీంద్రోక్తుల, నింతనే పటులె వించున్ నిల్చియున్నావటే!

సంతానార్హత ఎవరికి?

శ్రీ గౌరావఝుల వెంకటసుబ్బరామయ్య

"మాతృదేవోభవ, పితృదేవోభవ" అని తలిదండ్రులకు శ్రుతి-స్మృతు లిచ్చిన ఆ గొప్పపదవి నేడు అజ్ఞులైన మాతాపితరులవల్ల ఎంత అవమానింపబడుచున్నదో చూచి వ్యక్తిత్వం కలిగిన ప్రతివాని హృదయానికి దెబ్బ తగులక మానదు. నేడు కేవలం దానికి వ్యతిరేక యుగం. మాతాపితరులు తమ కర్తవ్యము నుండి విముఖులైనందువల్ల వారిని ఆదర సూచక శబ్దాలతో సంబోధించేటప్పుడు సిగ్గ చెందవలసి వస్తున్నది. అనేకమంది తలిదండ్రులు-క్షమించాలి-దేవతలకు బదులు దానవులుగానూ, మానవులకు బదులు పశువులుగానూ అవుతున్నారు. వాస్తవంలో సంతానోత్పత్తికి వీరి కేలాటి అధికారం లేదు; వీ రసలు తగరుకూడాను. పశుపక్ష్యాదులు సైతం నైసర్గిక నియమాలను చక్కగా పాటిస్తున్నాయి! కాని మనుజశరీరధారి ఎంత స్వతంత్రుడు! ప్రాకృతిక నియమాలను పాటించడం కూడా అగౌరవమనీ, పరతంత్రతనీ భావిస్తున్నాడు.

మీరు నిత్యం చూస్తుంటారు. అజ్ఞానులని భావింపబడే పశుపక్ష్యాదులు తమ జాతి వృద్ధికొరకు ఎంత సంయమంగా ఉంటాయో, బ్రహ్మచర్యాన్నెలాపాటిస్తున్నాయో, కొంచం పరికించండి! మొగది ఆడదాని మీద ఏమాత్రం అత్యాచారం చెయ్యదు. అసమయంలో కామక్రీడకు రమ్మని బలవంతం చెయ్యదు. ఒకవేళ బలవంతం చేశినా ఆడది దాని కోరికను పూర్తి చేయదు.అవి కేవలం సంతానంకొరకే యౌన సంబంధం జరుపుతాయి. హీనంగా చూడబడే పశుపక్ష్యాదులు సైతం ఈ విధంగా ప్రాకృతికనియమాలను పాటిస్తున్నాయి. కాని ప్రపంచంలో కల్లా శ్రేష్ఠప్రాణినని విర్రవీగేవాడు, బుద్ధిశక్తిగల యీబొమ్మకు ఒక నియమంలేదు. ఒక నియంత్రణలేదు. ఒక భయంలేదు.

మానవుడు బుద్ధిశక్తిలో అజేయుడు. భూమ్యాకాశాలను కొల్చేశాడు. నదులూ పర్వతాలమీద విహరిస్తున్నాడు. అదృశ్య వస్తువులనుకూడా కల్పించి ఆకాశ పాతాళాలను ఏకంచేశాడు. స్వర్గం పేరువింటే చంకలెగరేస్తాడు; నరకం పేరు వినేవరకు రోమాంచం కలుగుతుంది. శరీరం కంపిస్తుంది. ధర్మాన్ని సృష్టించాడు. మతాన్ని కల్పించాడు. వాటికి పుస్తకాల్లో బంగారు నీరుపోశాడు. కాని ధర్మ — మత — ఈశ్వర నరకభయాలుకూడా మానవుడి ఆచరణను మార్చలేక పోయినాయి భయమెరుగని పశుపక్ష్యాదులంతకూడా. భయోత్పాదకములైన కల్పనలే మానవుడెంత స్వచ్ఛందుడో, అవిచారో, ఎంత అజ్ఞానుడో అనేదానికి సాక్షీభూతాలు. నియమాలను సృష్టించకపూర్వమెంత స్వతంత్రుడో—ఇప్పుడూ అంతే. మాటమాటకు ధర్మం—మతం—భగవంతుడు. పనులు చూడండి ఎంత హీనమైనవో! నిజంలో పైస్వర్గ నరకాదికల్పనలే మానవుని అవిచారునిగా చేశినయి. వీటిమరుగున ఏం జరుగుతున్నదో!

వివాహాన్నే తీసుకోండి.దీన్నికూడా ధర్మంగా ఎంచుతున్నారు. ధర్మంయొక్క మూలార్థంలో వివాహం చేరుతున్నది. కాని నేడు దేనినైతే ధర్మమని తలుస్తున్నారో దానికీ వివాహానికీ ఏ సంబంధమూ లేదు. యువతీయువకులు వంశవృద్ధికై మైథునాసక్తులైతే దీన్నికూడా ధర్మంలోచేర్చవలసిన అవసర మేముంది? పశుపక్ష్యాదులను చూడండి. వాటికేం జాతకాలు లేవు. ముహూర్తాలు లేవు. నాడీ పొంతనాలులేవు. నవగ్రహ జపాలూ, శాంతులూ, హోమాలూ లేవు పెండ్లికి తర్లిపోవటాలూ కట్నాలూ కానుకలూ ఉత్సవాలు లేవు...వాటి పిల్లలను చూడండి. ఎంత బలిష్టమైనవో, ఎంతదీర్ఘ జీవులో! కాని ఊదిఊది పాదం పెట్టే వాండ్ల అడుగడుక్కూ ధర్మాన్ని జపిస్తుండే వాండ్ల పిల్లలను చూడండి. తారతమ్యం గ్రహించండి. నేను ధర్మాన్ని విమర్శించ బూనటంలేదు; ధర్మాడంబరాన్ని చూపటమే నా ఉద్దేశం.

"బలిష్ట నరనారీ సంయోగంవల్ల బలిష్ట సంతానం కలుగుతుంది" ఇది ప్రకృతి యొక్క అచల నియమం. దీనికీ ధర్మానికీ, మతానికీ సంబంధ మేముంది? దీన్ని చాటు చేసుకొని ధర్మాచార్యులు మానవజాతికి ఎంతహాని, భారత దేశానికి ఎంత కళంకం తీసుకొస్తున్నారో కొంచం ఆలోచించారా? ధర్మానికి వివాహానికి ముడి పెట్టడంవల్ల అయోగ్యులైన తలిదండ్రుల సంఘం భారతదేశంలో తయారైంది. మీరుకూడా ఆ సంఘానికి సభ్యులైతే, కోప్పడవాకండి–క్షమించండి–ఏకాంతంలో కూచోని దీన్నిగురించి లోతుగా ఆలోచించండి, మీరు యీ ధర్మానికి గురి కాకుండా ఉంటే ఎక్కువ సుఖపడేవారో లేక ఇప్పుడో. ఈ ధర్మంవల్ల వివాహంలో అనేక దోషా లేర్పడ్డాయి. (౧) ధర్మం పేరుతో చిన్న చిన్న అజ్ఞానులైనపిల్లలను 'వివాహం' అనే బోనులో పడెయ్యటం (౨) పిల్లా–పిల్లవాడి ప్రత్యేక గుణ దోషాలు చూడకుండా బ్రాహ్మణులు గ్రహాలను– గణాలను కలపటం. (3) పిల్లా–పిల్లవాడు తనజాతి అనే కొద్ది క్షేత్రంలోనే వివాహం చేసుకోటం. అందులోకూడా ప్రాంతీయత అడ్డం రావటం. (ర)తమ పిల్లల పెండ్లి చెయ్యటం తలిదండ్రుల ధర్మం. అందులో పిల్ల ౧౨, ౧3 ఏండ్లకు ఎంతమాత్రం మించకూడదు. మించిందా– ఆ తలి దండ్రుల అవస్థ వర్ణనాతీతం. పాపం వారికి–ధర్మలోప భయంవల్ల అన్నంనీళ్లూ రుచించవు. తుదకు కన్న కుమార్తెను ఏ రోగిష్టికో, మూర్ఖునికో, అంగహీనునికో ఇచ్చి అంట గడుతారు. ధర్మాన్ని ఈ రూపకంగా కాపాడుకుంటారు. ఇటువంటివి ఎన్నో నిత్యం ధర్మం పేరుతో జరుగుతుంటాయి. ధర్మంయొక్క ఈ పెనుగులాటలో దేశస్థితి ఎలా బాగుంటుంది? సమాజ కళ్యాణానికీ–దేశ సౌభాగ్యానికీ యోగ్య మాతా పితరులు కావటం ముఖ్యావసరం.

పూర్వకాలంలో భారతీయులు నిజంగా తమ కర్తవ్యాన్ని గుర్తించేవారు. మీరు వారి పేర్లను పురాణాల్లో వినియుండవచ్చు. కనుకనే 'మాతృదేవోభవ, పితృదేవోభవ' అను ఆదర సూచక శబ్దాలు పుట్టాయి. మరినేడో? ఎంతమంది తమ తలి దండ్రులను దేవతలుగా పూజిస్తున్నారు? పూజించక పోవటంలో వారి లోప మేమీ కనబడదు. ఎందుకంటారా? ఆదరయోగ్య వ్యక్తిని శత్రువుకూడా గౌరవిస్తాడు. కన్న కుమారుడు పూజించక పోవటం విచారించ తగ్గదే. తలి - దండ్రులవటానికి యోగ్యత కలుగకముందే తలి–దండ్రులవుతున్నారు. వారికి పిల్లలను పోషించే దెలాగో, పిల్లలయందు తమ కర్తవ్య మేమిటో తెలియదు.

పిన్న వయసు దంపతులు వాసనకు లోబడి స్వయంగా తాము పిల్లలై నప్పటికీ, తమ తెలివి తక్కువవల్ల — మూర్ఖత్వ ఫలితంగా సమాజానికి దుర్బల – క్షీణకాయ సంతానాన్ని అర్పిస్తారు. వారు ఇంద్రియచాపల్యపు క్షణికశాంతికొరకే గాని సంతానోత్పత్తికి గాను మైథునాసక్తులైనవారు కారు. ప్రకృతిని బలవంత పెట్టారు. దానికి శిక్షగా ప్రకృతి ఇటువంటి ఫలితాన్నిచ్చింది. ఆ సంతానం పుట్టినప్పటినుంచీ మందులుతింటూ, తలిదండ్రులకు భారరూపమై ఇటు తనకూ – తన తలిదండ్రులకూ సౌఖ్యం లేకుండా చేస్తున్నవి. తాము స్వయంగా మూర్ఖులు, దుర్బలులు, రోగులు. అటువంటివాండ్లుపిల్లలనుపుట్టించే దేశానికి, సమాజానికి మహోపకారం చేస్తున్నారు. పైగా ఇంకో విషయం. ఆ చిన్న దంపతులకు సంతానం కలిగేందుకు కొంచం ఆలస్యమయేవరకు వారితలిదండ్రుల ఆరాటానికి అంతుండదు. పరితపిస్తారు. ఆ దంపతులచేత పూజలు చేయిస్తారు. చెట్లకూ, గుట్టలకూ, రాళ్లకూ, రప్పలకూ, అంకమ్మకూ, పోలేరమ్మకూ మొక్కిస్తారు. ముడుపులు కట్టిస్తారు. తీర్థాలు తీసుకుంటారు. నాగ ప్రతిష్ట చేయిస్తారు. రాగి చెట్టుకు ప్రదక్షిణాలు – బ్రాహ్మణ సంతర్పణలు చేస్తారు. గోసాయీలచేత తాయత్తులు కట్టిస్తారు. యంత్రాలకూ, తంత్రాలకూ, దయ్యాలు వదిలించేందుకూ, దిగతుడుపులకూ ఎంతో డబ్బుతగలేస్తారు. జాతకాలు చూపిస్తారు... ఇంకా ఇటువంటివి ఎన్నో! భార్యాభర్తల సంయోగంవల్ల సంతానం కలగాలి కాని పైపనులవల్లనా సంతానం కలిగేది? స్త్రీ పురుషులు ఆరోగ్యవంతులై యౌనసంబంధం కలిగినపుడు సంతానం ఎందుకు కలుగదు? వీరి గుడ్డినమ్మక మే గాని. ఇటువంటి పనులవల్ల దేశాని కెటువంటి తీరనినష్టం

కలుగుతున్నదో గమనించారా? నిన్నటివరకూ నపుంసకుడుగా ఎన్నబడుతుండేవాడు బలిష్ఠురాలైన స్త్రీని వివాహమాడి క్షణంలోకి తండ్రిననిపించుకుంటున్నాడు. ఇటువంటి తలిదండ్రులవల్ల దేశానికేంమేలు కలుగుతుంది? అందులో నిరుద్యోగసమస్య ప్రజలను పీల్చిపిప్పి చేస్తున్న ఈ కాలంలో అడుగనే వలదు. పౌష్టికపదార్థాలు చాలినంత లభించనందువల్ల తలిదండ్రులే శుష్కించి పోతుంటే తమ సంతానానికేంపౌష్టిక పదార్థాలివ్వగలరు? అందువల్ల అకాలమందే మృత్యువు పాలవుతున్నారు. ఒకవేళ బ్రతికినా చచ్చిందానికన్నా దీనస్థితిలో ఉంటున్నారు.

ప్రతిదేశమూ ఉత్తమసంతానాన్ని కోరుతుంది. దేశోన్నతీ-అవనతీ రెండూ ఈ సంతానంమీదే ఆధారపడి ఉంటాయి. ఉత్తమసంతానాన్ని కలిగించే దేశమే నేడు స్వాతంత్ర్యసౌఖ్యాన్ని అనుభవిస్తున్నది. మాదేశమే సర్వోత్కృష్టమైనదని అక్కడి ప్రజలు గర్విస్తున్నారు. దేశసేవకుల మొదటి కర్తవ్యం — తమ సౌభాగ్యాన్నీ — దేశస్వాతంత్ర్యాన్నీ శాశ్వతంగా నిలుపుకొనేందుకు అక్కడి సంతానాన్నీ గురించి శ్రద్ధ తీసుకోవాలి. దురదృష్టంవల్ల ఆ అదృష్టం ఇంతవరకు భారతదేశానికి కలుగలేదు. కొంతమంది దేశభక్తులు కర్మించాలక ఈ విషయమ్మైతేవరకు వీరినెదుర్కొటానికి ఓ సంఘం తయారు. ఈఎదుర్కొటం ధర్మంపేరుతో- ధర్మరక్షణ అనే ఆడంబరంతో.

శారదాబిల్లునే తీసుకోండి. బాల్య వివాహాలను అరికట్టటం దేశానికీ- సమాజానికీ మంచిదేకదా. "ధర్మం నశించింది, ధర్మం నశించింది" అని పెద్ద కోలాహలం జరిగింది ఆబిల్లును ప్రవేశపెట్టంగానే. గొప్ప శాస్త్రజ్ఞులమని విర్రవీగేవారు, ధర్మాచార్యులమని చాటుకొనేవారు, దేశహిత చింతకులమని సభల్లో గొంతెత్తి అరిచేవారు సైతం చేతనైనంతవరకు ఆ బిల్లును ఎసెంబ్లీలో పాసుకాకుండా ప్రతిఘటించారు. ౪౦ కోట్ల జనసంఖ్యగల ఈ దేశంలో 'సంఘ సంస్కరణ' మాట వినేవరకు కోట్లాదిగా వ్యతిరేకులు బైలుదేరి వస్తారు. అందువల్లనే ఎంత ప్రయత్నించినా- మనం గమ్యస్థానం చేరుకో లేక పోతున్నాం. తమ

మంచి చెడుగులు, దేశస్థితి- సమాజ సౌభాగ్యం గమనించని - కర్తవ్యాన్ని గుర్తెరుగని ఇటువంటి ధర్మాచార్యులవల్లనే దేశం ఈ స్థితికి వచ్చింది.

మనస్థితి ఇక్కడ ఇలా ఉంది. ఇక స్వతంత్ర రాష్ట్రాలమీదికి దృష్టి పోనిద్దాం. ఒకదాన్నొకటి మించి కబళించేందుకు సకల ప్రయత్నాలు చేస్తున్నాయి—ఏం చెయ్యటానికైనా సిద్ధపడుతున్నాయి. జర్మనీని చూడండి. తన దేశంలో నిరుపయోగమైనవాడు— బలహీనుడు ఒక్కడుకూడా ఉండకూడదని శాసించింది; రాజ్యపు పునాది దృఢంగా ఉండగలందులకు సంతానాన్ని వీరులుగా జేయ కంకణం కట్టుకున్నది. దానికై యోగ్య మాతాపితరులవల్ల ఉత్తమసంతానాన్ని కోరుతున్నది. దుర్బలులకు కలిగే సంతానం దేశానికి భారమని తలుస్తున్నది. కనుక ౧-వ జనవరి ౧౯౩౪ నుంచి జర్మనీలో ఒక కొత్తచట్టం పుట్టింది. దానివల్ల మొత్తం ౨౦—౩౦ లక్షలమంది సంతానానర్హులుగా ఎంచబడుతారు. కాని మొదట్లో ౩, ౪ లక్షలమందే సంతానానర్హులుగా చేయబడుతారు. అందులో ౨ లక్షలమంది పుట్టుకతోనే పిచ్చివాండ్లు. ౬౦ వేలమంది వాతరోగులు. ౧౬ వేలు చెవిటివాండ్లు. ౨౦ వేలు అంగహీనులు. ౧౦ వేలు త్రాగుబోతులు. ౪ వేలు జన్మాంధులు. సంతానానర్హులని దృఢపరిచేందుకు 'యుజనిక్ కోర్టులు' ౪౪ (**Eugenic Courts**) అపీలుకోర్టులు ౧౩ స్థాపించారు సంతానోత్పత్తికి, అధికారం లేకుండా చేయుటకు ప్రతిపురుషునికి ౧౩-౦-౦ ప్రతిస్త్రీకి ౩౭ రూపాయలు ఖర్చవుతాయి. పని ప్రారంభమైంది. ఈ చట్టం బలిష్ఠ సంతానానికిగాను యోగ్యదంపతులను తయారు చేసే సదుద్దేశంతో పుట్టింది. వారి కోరికేమంటే మూడుతరాల్లో అనగా ౭౦-౭౫ సంవత్సరాల్లో జర్మనీ కోరిన సంతానాన్ని పొందవచ్చునని. మనదేశంలో బాల్య వివాహాలనువద్దనటమే మహాపాపంగా- నీచంగా- అధర్మంగా ఎంచుతున్నారు. వేలకొలది అంటురోగపీడితులు-లక్షలమంది వంశక్రమంగా సంక్రమించే జబ్బులవాండ్లు, క్షీణకాయులు, దుర్బలులు, కుంటివాండ్లు, చెవిటివాండ్లు, గుడ్డివాండ్లు, త్రాగుబోతులు, బొల్లువాండ్లు, మూర్ఛరోగులు, వాతరోగులు, కుష్టువాండ్లు, క్షయరోగులు

క్షణంలో పిల్లలను పుట్టిస్తున్నారు. ఇటువంటి వాండ్ల సంతానంతోనేనా భారతదేశం సౌభాగ్యాన్ని పొందేది? అసంభవం.

ఈ సంతానంవల్ల కలిగిన ఫలితం మనకు ప్రత్యక్షంగా కనబడుతున్నది. వీరికి సమాజస్థితినిగురించిన జ్ఞానం లేదు. రాష్ట్రీయాభిమానం లేదు. కండ్లుండి కూడా గ్రుడ్డివారౌతున్నారు. నిజస్థితిని కనుగొనలేకుండా ఉన్నారు. నే చెప్పేదేమంటే 'యోగ్యదంపతులకు కలిగిన సంతానం చాలాకాలం బ్రతుకుతుం' దని. 'చంపటం బ్రతికించడం భగవంతుని చేతుల్లో ఉంది కాని మనచేతుల్లో ఉందా?' అని మీ రడుగవచ్చు. దానికి 'రామరాజ్యంలో. ఒక్క పిల్లవాడు కూడా చావలేదు. రామాయణంలో ఇలా ఉంది—

"న చస్మ వృద్ధా బాలానాం
ప్రేతకార్యాణి కుర్వతే"

ఏ వృద్ధుడు కూడా తన జీవితావస్థలో పిల్లల చావును చూడడు. మహాభారతంలో—

"న బాల ఏవ మ్రియతే
తదా కశ్చి జ్జనాధిప"

పిల్లలు మృత్యువుపాలుగారు అని. దానికి మీరు—'అది త్రేత – ద్వాపరయుగాలమాట. అప్పుడు ధర్మం నాలుగుపాళ్లు. ఇది కలియుగం. ధర్మం ఒకపాలే'నని అనవచ్చు. ఐతే కలియుగం మన కొక్కరికేనా లేక ప్రపంచ మంతటికా? ఇతర దేశాలవైపు దృష్టిని పోనివ్వండి. అక్కడ పిల్లలచావుసంఖ్య చాలాకొద్ది. ఆ కొద్దినికూడా లేకుండాచేయుటకు తమ శక్తినంతా వినియోగిస్తున్నారు. మన ధర్మాచార్యులు వారి పనులు చక్కబెట్టుకోటానికి కృతయుగాలను కలియుగాలను సృష్టించారు. కాని వాటిమర్మం మనకు విప్పిచెప్పలేదు. శాస్త్రాల్లోనే ఇలా ఉంది—

కలిః శయానో భవతి
సంజిహానస్తు ద్వాపరః
ఉత్తిష్ఠ స్త్రేతా భవతి
కృతం సంపద్యతే చరన్
"చరైవేతి చరైవేతి" —ఐతిరేయ బ్రా. ౭-౧౫.

అంటే అలసతే కలియుగం. కార్యదీక్ష, ప్రయత్నమే కృతయుగం. ఏ సమయంలోనైనా- ఎటువంటి పరిస్థితుల్లోనైనా. అలసత అనేది ఎరుగకుండుటే కృతయుగం, యుగనిర్మాణం మనచేతుల్లోనే ఉంది. యుగనిర్మాతలం మనమే. సత్యయుగమూ, కలియుగమూ మనమే సృష్టించాము. ఎక్కడివాండ్లు సోమరులో, అజ్ఞానాంధకారంలో నిద్రిస్తుంటారో, అక్కడే కలియుగవాసం.

ఇతర దేశాల్లో పిల్లల మృత్యుసంఖ్య చాలా కొద్ది. క్రింది పట్టికలో – భారతదేశంలో అయోగ్యులైన తలి దండ్రులవల్ల కలిగే పిల్లల భయంకరమృత్యుసంఖ్యను గమనించండి—

ప్రాంతము	ప్రతి వెయ్యికి
మద్రాసు	౧౯౯
బెంగాల్	౨౭౦
బీహార్-ఒరిస్సా	౩౦౪
పంజాబ్	౩౦౬
బొంబాయి	౩౨౦
బర్మ	౩౩౨
సంయుక్తప్రాంతాలు	౩౫౨

ఎంత భయంకరం! ఎంత ఘోరం! భారతదేశంలో ౪ గురికి ఒక పిల్లవాడు ఏడాది లోపలనే మట్టిలో కలిసిపోతున్నాడు. సుమారు ప్రతి సంవత్సరం ౧ కోటికి ౨౦ లక్షలమంది పిల్లలు మృత్యువుకు గ్రాసం ఔతున్నారు. తక్కిన ౮౦ లక్షలు బ్రతికినా జీవితమంతా యమయాతనను అనుభవిస్తుంటారు. విదేశాల్లోని పిల్లల మృత్యుసంఖ్యను చూడండి—

దేశం	ప్రతివెయ్యికి
న్యూజిలాండ్	౫౧
నార్వే	౬౮
స్వీడెన్	౭౨
ఆస్ట్రేలియా	౭౨
ఫ్రాంసు	౭౮
నెదర్లాండ్సు	౯౧
స్విజర్లాండ్	౯౪
డెన్మార్కు	౯౪

ఐర్‌లాండ్	౯౬
ఇంగ్లండ్ & వేల్సు	౯౮
స్కాట్‌లాండ్	౧౦౫

భారతదేశంకంటె ఎక్కువమంది పిల్లలు మరే దేశంలో కూడా చావరు. ఇక్కడ ఇంట్లో పిల్లవాడు పుట్టడం తోటే అశాంతి - చింత - భయం - రోగం పుడుతాయి. వాణ్ణి చూచి జనులు 'పూర్వ జన్మకర్మ ననుభవిస్తున్నాడు, దానికెవరేం చెయ్యగల' రని నొక్కి పలుకుతారు. దానికి నే చెప్పే దేమంటే- 'తలిదండ్రుల మూఢ్యం ఫలితదుఃఖాన్ని ఆ అజ్ఞాన శిశువు అనుభవిస్తున్నది' అని. నరకా న్ననుభవించేందు కేనా ఇక్కడ పుట్టేది? ఇది స్వర్గోపమ భారతదేశం కదా! తలిదండ్రుల ననుసరించే ఉంటుంది వారి సంతానం కూడా. దీనికి కర్మనీ - దురదృష్టమనీ - ప్రారబ్ధమనీ - పేరు పెట్టట మెందుకు? ఇది వాండ్ల మూర్ఖత్వాన్నే చాటుతుందికదా!

తలి-దండ్రుల పొరపాటుకు శిక్ష సంతానం అనుభవిస్తున్నది. ఈ శిక్ష బాల్యావస్థవరకేనా? కాదు - బ్రతికినంతకాలమూను. పుట్టుకే ఇంత దుఃఖకర మైనపుడు చావు సుఖప్రద మెలా ఔ తుంది? పవిత్ర భారతీయసంతానం తమ ఉత్పాద కుల అజ్ఞాన ఫలితాన్ని బాగా అనుభవిస్తున్నది' ప్రపంచంలో కల్లా భారతీయులే అల్పాయుష్కులు'

"పశ్యేమ శరదఃశతమ్-ప్రబ్రవామశరదః శతమ్- శృణుయామ శరదః శతమ్ — జీవేమ శరదఃశతమ్— అదీ నాఃస్యామ శరదఃశతమ్ — శతంభూయశ్చ శరదఃశతమ్" అని నిత్యమూ జపిస్తుండేవాండ్ల ఆయుువు సగటున ౨౨ సంవత్సరాలే! "శతమానం భవతి శతాయుః"అని ఆశీర్వ దిస్తూ ఆశీర్వదింపబడేవాండ్ల ఆయువు దానికి నాలుగో వంతైనా లేదే! ఎంత ఆశ్చర్యం! ఎంతహీనం! దీనికి కారణంమీ దేమయినా దృష్టి పోనిచ్చారా? భాగ్యం- ప్రారబ్ధం — కర్మం - అని దోష మంతా కాలంమీద చుట్టిచుట్టి పారవెయ్యటం తప్ప మరేమైనా నేర్చు కున్నారా? భాగ్యాన్ని నమ్ముకొనున్న భారతీయులు ఎన్నటికైనా ఉన్నతస్థితిని పొందగలరా? పొందగల రని ఆశైనా ఉందా? నిజంగా ఈ కథాపురాణాలే మనలను సోమరులనుగా చేశినాయి. వ్రాసినవాండ్లేమో గతించారు. తోటిమనలను కూడా గతింపజేశారు. కృత యుగంలో ఆయువు లక్షల ఏండ్లనీ, త్రేతాయుగంలో వేలయేండ్లనీ,ద్వాపరలో వందలఏండ్లనీ, కలిలో చాలా తక్కువని చెప్పారు. ఎవరినైనా అడగండి! ఇదేమాట చెప్పి తప్పకుంటాడు—'ఇది కలియుగం. ఇకముందు చాలా అల్పాయుష్కులు, చాలా చిన్నవాండ్లు పుడు తారు అని:" ఈ అంధవిశ్వాసమే మనలను తినేస్తుంది. ఇతరదేశాల ప్రతిమనిషి సగటు ఆయు వెంతో క్రింది పట్టికవల్ల తెలుస్తుంది—

దేశం	పురుషుడు	స్త్రీ
ఆస్ట్రేలియా	౫౫.౨౦	౫౮.౮౪
అమెరికా	౪౯.౩౧	౫౨.౫౪
ఇంగ్లండ్	౪౮.౫౩	౫౨.౩౮
హాలెండ్	౫౧.౦	౫౩.౪
జపాన్	౪౩.౬౯	౪౪.౮౫
ఇండియా	౨౨.౫౯	౨౩.౩౧

ఇక్కడ గమనించవలసిన దేమిటంటే, మన ఆయువు దినదినం క్షీణిస్తున్నది. పైదేశీయుల ఆయువు వృద్ధిపొందుతున్నది.

బాల్యవివాహాలు — వృద్ధవివాహాలు — బహు వివాహాలు- వ్యభిచారం మొదలైన ప్రకృతి విరుద్ధమైన పనులు చెయ్యటం మానంతూ— దోషఫలితా న్ననుభ వించటం ఇంకోరివంతునా? జల్లెడలో పాలుపోసి, గ్రహచారం అంటే ఏమన్నా లాభం ఉంటుందా? నేడు మనబుద్ధి — శారీరిక బలం— జీవితం క్షీణించిందంటే దానికి ఉత్తరవాదులు అయోగ్యులైన తలి దండ్రులే." తలిదండ్రులు కావటం సులభమే కాని తమ కర్తవ్యాన్ని పాలించడం కష్టం. సంతానం మనమే కాదు, సమస్త జీవులూ పుట్టిస్తు న్నాయి. అందులో పొగడదగిన విషయ మేమీ లేదు. ప్రకృతినియమమే అది. ఉత్తమ బలిష్ఠసంతానాన్ని కలిగించడమే గొప్ప. ఇది తలి దండ్రులు తమ కర్త వ్యాన్ని నర్తించినప్పుడే సంభవ మవుతుంది.

తలి దండ్రులు కాబోయేముందు దానికి తగిన యోగ్యత సంపాదించుకోవాలి. బ్రహ్మచర్యపాలనం

మొదటిది. వ్యాయామం రెండవది. కలుగబోయే సంతానంమీద తమ బాధ్యతను గుర్తించడం మూడవది.

బ్రహ్మచర్యాన్ని చక్కగా పాటిస్తూ ఋతుకాలం రాగానే వివాహం చేసుకోవాలి. వివాహం చేసుకోబోయేముందు మనమీద గొప్ప జబాబుదారి ఉందని గ్రహించాలి. సంతానం చెడుదైనా, మంచిదైనా, రోగిష్ఠిదైనా, బలిష్ఠిదైనా తలిదండ్రులే దానికి కారణభూతులు. తలిదండ్రుల మొదటి కర్తవ్యం తమ అయోగ్య అజ్ఞాన ఫలితాన్ని సమాజానికి అర్పింపకుందురుగాక!

శిశుపోషణ యోగ్యతాభావంవల్ల ప్రతి సంవత్సరం లక్షలాదిశిశువులు మట్టిలోకలిసిపోతున్నారు. ప్రపంచయుద్ధంలో కూడా ఇంతమంది ప్రజలు చావటం లేదు. మొట్టమొదటనే సావధానులై శిశుపోషణ చేస్తే ఈ మృత్యుసంఖ్య చాలామట్టుకు తగ్గుతుంది. సమాజానికీ, దేశానికీ ఔన్నత్యం కలుగుతుంది.

అక్కడ శిశువు రోగంతో అల్లాడుతున్నది. ఇక్కడ దిగతుడుపులూ, దిష్టిమంత్రాలూ, ముగ్గులు బాలగ్రహాలు. ముడుపులు గడుతుంటారు. తగినమందు వెయ్యరు. ఇలాంటప్పుడు ఆ బిడ్డ చావవలెనో, బ్రతుకవలెనో మీరే చెప్పండి! మూర్ఖులైన తలి దండ్రులు ఏవేవో పెట్టి రోగం తెప్పిస్తారు. తమ చేతులతోనే విషం పెడుతారు. కాని తమ పొరపాటు నేమాత్రం గుర్తించరు.

నవజాత శిశువు ఓమాంసపుముద్ద. రోగం తెప్పించినా, ఆరోగ్యం రక్షించినా, మీవంతే. దానికి ఉత్తరవాదులు తలి దండ్రులే, కనుక శిశుహత్యాదోషం తలి దండ్రుల నెత్తిమీదనుంచి ఎంతమాత్రం వదలదు. రాయివ్రుద్ది చెప్పగలను. వారు తమ తప్పును ఒప్పుకోనీ ఒప్పుకోకపోనీ, అదివేరు సంగతి. పిల్లలభోజనం స్వచ్ఛతననుసరించి శ్రద్ధతీసుకుంటే ఏ పిల్లవాడూ చంపందీ చావనే చావడు. తుదకు నే చెప్పేది— తలి దండ్రుల అజ్ఞానంవల్ల భారతదేశంలో పిల్లల మృత్యుసంఖ్య పెరిగింది. దీనివల్ల దేశానికీ— సమాజానికీ తీరని నష్టం కలుగుతున్నది.

"విశ్వమిత్ర"లో గణేశ్‌దత్తు గారివ్యాసము ననుసరించి—

వలదు

శ్రీ భట్టిప్రోలు కృష్ణమూర్తి

తేలిపోయెడు జలదరథాలనుండి
ఏటి కిటు లమృతముఁ గురిపింతువోయి ?
జాలి జూపించి వెడలుమో చందమామ !
చీఁకటులె నిండుకొననిమ్ము జీవితాన.

ఏను ప్రేమింతుఁ జీఁకటినే! మదీయ
హృదయకుహరముఁ జీఁకటులేలుకొనును
క్రమ్ముకొనియెడు కారుచీఁకటులలోన
నృత్యమొనరింతు నిట్టూర్పు లెగయఁబోసి.

ఏను కాంక్షింప నానంద మింతగూడ
వినపుగసటులఁ గ్రోలి జీవితగభీర
చరమసిద్ధికై ఎపుడు స్వేచ్ఛావిషాద
గీతికల నాలపింతు......

నా కేటికోయి
ఈ శరచ్చంద్రికాసుధాహాసధార
లీ మనోహర ప్రణయపరిమళాలు,
వలదు వలదోయి! నేటి నాబ్రదుకుబాట
నడువరాకోయి ! ఇటనుండి వెడలుమోయి.

కర్ణుని జననము

శ్రీ బులుసు వేంకటేశ్వరులు

క్రిందటి భారతిసంచికయందు కర్ణునిజననమునుగూర్చి యొకరొక నిరాధారవాదమును సాగించి, కర్ణుఁడు సద్యోగర్భమున జనించలేదనియు, లోకాచారముగనే జనించెననియుఁ దేల్చిరి. వారివాదమున కాధారముగా, ఆదిపర్వభాగమును విడిచిపుచ్చి, అరణ్యాశ్రమవాసపర్వములలో ఎఱ్ఱాప్రెగడ, తిక్కన లిరువురును గుంతి పదినెలలు మోసి కర్ణుని గన్నట్లు వ్రాసి రని తెల్పుచు, దీనికి మూలాధారము కూడ కలదని యుదాహరించిరి.

వీరు చూపిన యాధారములనే పరిశీలింతము. ఇనుఁడు కుంతికి సద్యోగర్భమిచ్చినట్లు, కుమారుఁ డప్పుడు యుదయించినట్లు నన్నయ ఆదిపర్వమున వ్రాసినట్లు వీరే యంగీకరించిరి. కాఁగా, ఎఱ్ఱాప్రెగడయుఁ దిక్కనసోమయాజియు దీనికి వ్యతిరేకముగా వ్రాయుచుఁ గుంతి గర్భముఁ దాల్చి, పదినెలలు మోసి పుత్రుని గన్నట్లు వ్రాసి రనిరి. ఇది, పరిశీలించి చూడఁగా, సత్యదూరముగాఁ గన్పట్టుచున్నది. ఏలన, ఆరణ్యపర్వమున నెఱ్ఱాప్రెగడ

"ఇట్లు వర్ధిల్లుచుం బదియగు మాసంబునఁ గుంతి కర్ణునిఁ గనియె."

ననియే వ్రాసియుండనోపు. కాని ప్రమాదవశమునఁ గాని, యజ్ఞానవశమునఁ గాని పరిష్కర్తలు "శంభుదాసుని భారతమునఁ" బరిష్కరించియుండవచ్చును. ఇచటఁ బదియగుమాస మన్నఁ జైత్రాదుల గణింపఁగా మాఘమాస మగును. కావున సూర్యుఁడు కుంతిఁ గలియుటయు, పుత్రుఁ డుదయించుటయు మాఘమాసప్రతిపద్దివసముననే జరగిన దన్న విషయము తేలుచున్నది. ఈ విషయమునే శ్రీ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి కవిసార్వభౌములు, "శంభుదాసుని భారతముననే కారణమున నీప్రమాదము పడినదో కాని మూలముననే ప్రతియందును పదిమాసములు సీరుమోసి కనినట్లు లే"దని తమ భారతముననే వ్రాసియున్నారు.

(చూ. అరణ్యపర్వము. పుట ౫౩౦–౫౩౧.)

పోనీ, యీ విషయమున మూలముఁ బరిశీలింతము :

తతోగర్భస్సమభవత్పృథాయాః పృథివీపతే!
శుక్లే దశోత్తరే పక్షే తారాపతి రివాంబరే.
సా బాంధవభయా ద్బాలా గర్భం తం వినిగూహతి
....

దీని విషయమే నీలకంఠాచార్యుల వారు తమ భారతభావదీపికయందు

"తతఇతి–దశోత్తరే ఏకాదశే శుక్లేపక్షే ప్రతిపదిచంద్ర ఇవజన్మేత్యర్థః" బాల ఉద్భూతః మాఘశుక్ల ప్రతిపది కర్ణనిషేక

అని వ్రాసి, దశోత్తరశబ్ద భావమును విశదీకరించి, సంశయనివారణము గావించిరి. కనుక సూర్యుఁడు మాఘశుద్ధ ప్రతిపద్దివసంబునఁ గుంతిం గూడె ననియు నానాఁడే గర్భమై కర్ణుఁడు పుట్టె ననియు స్పష్టము.

ఇదికాక, శ్రీ కృష్ణభారతారణ్యపర్వమున నీ భాగమున నిట్లున్నది :

"అంతఁ గుంతీదేవి మోహపరవశయై యుండి యోగంబునం జేసి తన్ను పొందిన భానుమంతుని తేజఃప్రభావంబునఁ జైత్రాది దశోత్తరంబైన మాసంబునం బాదిమదినంబున గర్భంబుఁ దాల్చె, నాగర్భం బంతలోనన శుక్లపక్షక్షపాకరుని చందంబునం బ్రవృద్ధి నొందుటయు దాని నొక్క ధాత్రేయికకుం దక్కఁ దక్కినవారెవ్వరికి నెఱుంగకుండునట్లుచేసె..."

ఇది కర్ణుని సద్యోగర్భజన్మమునే ధ్రువ పఱుచుచున్నది.

ఇంక నాశ్రమవాసపర్వమున సైతము కుంతి గర్భధారిణియై నవమాసములు మోసి నట్లు లేనేలేదు. సూర్యభగవానుఁడును గుంతి "కపుడ తనయుండు పుట్టెడు మనియె" ననియే" యున్నది.

"జనకముఖబంధుచిత్తవంచనను నడపి,
గూఢమందిరాంతరమునఁ గొడుకుఁ గంటి"

నన్నవాక్యము సద్యోగర్భము కాదని తెల్పుటలేదు; పైఁగా, తరువాత కుంతి

"కని యేటిలో నిడితిఁ గలఁ
గనినట్లయియుండెఁ దత్ప్రకారం"

బని యని యున్నది. నవమాసములు మోసి కనినచోఁ గలవలె నెట్లుండు? మఱియు, సామాన్యదృష్టిఁ బరికించినను గుంతి గర్భిణియై నవమాసములు మోసినచోఁ దల్లిదండ్రులకేనిఁ దెలియకుండునట్లు చేయు టసంభవము, నసంగతమును. ఏలన బాహ్యేంద్రియ పరివర్తనముచేతనైనను దెలియకపోదు. అందుచేత . నవమాసములు నీరుమోసియు దాఁచియుంచిన దన వీలులేదు.

తరువాత ఆదిపర్వమునఁగల
"తత్ర వీర స్సమభవ...మా చత్ర మే తతః"

అన్నచోటఁగాని, ఆరణ్యపర్వమున,
"సా బాంధవభయా ద్బాలా గర్భం తం వినిగూహతి"

యన్నప్రదేశమునఁగాని ఆశ్రమవాస పర్వమున.

"తతో౽హ మంతర్భవనే"

ఇత్యాది స్థలములఁగాని సద్యోగర్భమునఁ గర్ణుఁడు జన్మించెననుట కాధారము లేదన్న విమర్శకులకు నవమాసములు మోసినదన్న యర్థ మెచట నున్నది? నవమాసములు నీరుమోసినట్లు లేదని కవిసార్వభౌములు సైతము వ్రాసియుండిరే!

మొత్తముమీఁద నేయే విషయములఁ బరికించినను గర్ణుడు కుంతికి సద్యోగర్భముననే జనించినట్లు తేలుచున్నది.

కర్ణుని జననము గురించి ఇదివరకు కొందరు చర్చించారు. బ్రహ్మశ్రీ పెండ్యాల వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రిగారి 'మహాభారత చరిత్రము'ను విమర్శిస్తూ బ్రహ్మశ్రీ శిష్ట్లా సూర్యనారాయణ శాస్త్రిగారు రచించిన 'శ్రీ మహాభారత రహస్య' మనే గ్రంథములో పుట ౧౫౫–౧౫౬ లలో కర్ణుని జననముగురించి గల విషయము చూడదగినది. "మనశాస్త్రిగా రాదిపర్వమునందు కర్ణుడు సద్యోగర్భ జనితుం డైనట్లు గలదనియు, నారణ్య పర్వమునందు కుంతి పదినెలలు గర్భము ధరించియే కర్ణునిం గనెనని యున్నదనియు, నా కారణమువలన భారతము సందర్భ శుద్ధిగా లేదనియు వ్రాసియున్నారు.

"గ్రంథకర్త తన గ్రంథమునం దేయేవిషయములను ముఖ్యముగా వ్రాయవలసియుండునో యావిషయములను గ్రంథాదియందు సంక్షేపముగా వివరించి పిమ్మట నవసరప్రదేశములలో విపులముచేసి వ్రాయుచుండును. అట్లే భారత గ్రంథాదియందు తత్కథానాయకుల స్వరూపనిరూపణచేయుటలో కర్ణజననము గురించి యతడు సద్యోగర్భమువలన జన్మించెననియు నదియే యారణ్య పర్వాంతమందు...విపులముగా వ్రాయబడినది. . సద్యోగర్భమ్మనఁగా సంభోగానంతరమే పుత్రోత్పత్తి యయ్యెనని వ్యాసాభిప్రాయముకాదు. అట్లు పుత్రోత్పత్తియగుట కేవలమసంభవము. వ్యాసునభిప్రాయ మదియేయగుచో నతడారణ్యపర్వములో ప్రశ్నావసరమునందా విషయము నట్లే వ్రాసియుండును. అట్లుగాక కుంతి పదినెలలు గర్భముధరించియే కర్ణునింగనెనని స్పష్టముగా వ్రాసియున్నాడు. ఒక్కపర్యాయము భోగించినతోడనే గర్భధారణమగుటకు సద్యోగర్భమని యభిప్రాయము" ఈ అభిప్రాయమే సరియైనదని చెప్పవచ్చును.

—సీతాపతి.

నీతిపద్యమాల

శ్రీ పురాణం - సూర్యనారాయణతీర్థులు

శ్రీమదంబ యైన కామేశ్వరీ దేవి
ప్రేరణమునఁ జేసి నే రచించు
నీతిపద్యమాల నీ పేరఁ గూర్చెద
నమితభీమ విశ్వనాథరామ!

'చిత్తశుద్ధి' యైన ఉత్తరక్షణమందె
ఆటవెలఁదిరీతి నంటెఁ గైత
ఆటవెలఁది తేటమాటలమూటగా. న.

ఆటవెలఁదిరీతి ననువైన కైతయే
రసికజనుల మదికి రంగు వేయు
నాటవెలఁది యైన నందఱుఁ గందురా. న.

ఆలిమాటలు విని యనుజు విధేయుని
వేఱుపఱుచునట్టి వెలఁదిదాసు
లనుభవించుఫలము లనరాదు వినరాదు. న.

ధనము విద్య లేని మనుజుని బ్రదుకును
తల్లి చచ్చినట్టి పిల్ల బ్రదుకు
భార్య లేనివాని బ్రదుకు నరణ్యమా. న.

భార్యమాట వేదవాక్యముగా నమ్మి
సంచరించునట్టి చవటలకును
తక్కు బంధుజనులు నిక్కంపుశత్రులే! న.

ముందు సౌఖ్య మవుల మొనయును దుఃఖమ్ము
తొలుత దుఃఖ మవలఁ దోఁచు సుఖము
చక్రమట్లు తిరుగు సౌఖ్యదుఃఖమ్ములు. న.

మగఁడు గౌరవించుమగువను తక్కిన
వారుగూడ లెస్స గౌరవింత్రు
మగఁడు కొట్టెనేని మాధుకరియుఁ గొట్టు. న.

మగువపుట్టు పుట్టి మగవాఁడు కష్టించి
చేయవలయుపనులు చేయుచుండు
చండశాసనను శిఖండి యందురుసుమా! న.

ఒకరి నడుగఁబోక, ఒకరిచే నడిగించు
కోక దొరకుదానఁ గొనుచుఁ దృప్తి
బ్రతుకునతఁడెమంచిభాగ్యవంతుండయా! న.

అల్ల - ఊరు మంచిదా ? అంచు నితరుల
నడుగు టేల ? వారు నుడువు టేల ?
నోరు మంచి దైన నూరెల్ల మంచిదే! న.

ఈశ్వరుండు మనల హృదయమ్మునం దుండి
చెప్పినట్లు మనము చేయుచుందు
మీశ్వరేచ్ఛ లేక యేపనియును గాదు. న.

దేహ మాలయమ్ము దేవుఁడు జీవుండు
వాఁడె బ్రహ్మ మనుచుఁ బలుకు శ్రుతులు
జ్ఞానదృష్టి కతఁడు కానిపించును చూడు. న.

కఱకుతురక బండిఁ గట్టి కొట్టెడుబక్క
గుఱ్ఱ మెట్టు లట్లు కొంచె మయిన
హాయి విడుపు లేక యల్లాడు మనుజుండు. న.

తనది యుత్తమంబు, తండ్రిది మధ్యమం,
బన్నదమ్ములదియె యధమ మందు
రాఁడుదానివిత్త మధమాధమముగాదె ? న.

గోడు చెప్పుకోను కోడూరు పోతేను
ఏడుగోడు లచట నెదురుకొనియె.
కాశి కేఁగఁగాక కర్మంబు విడుచునా? న.

పెద్ద పుణ్యమేని పెద్ద పాపముగాని
ఇహమునందె ఫలము నిచ్చు నండ్రు
మూఁడునాళ్లు మొదలుమూఁడేండ్లలోపున న.

మారరూపుఁడును కుబేరధనుఁడునైనఁ
జదువు సంధ్య లేని జడుని బ్రదుకు
దివ్వె లేనికొంప తెఱఁగున నుండురా! న.

బాగు లేవటంచుఁ, బండ్లూడఁ బీకించు
కొనియెనంట! యొక్క కోమలాంగి
స్త్రీలు సొగసుకొఱకుఁ జేయరానిదియున్నె న.

కోరి తెచ్చినచెలి కోఁతిలాగున్న ను
ల్లమున కదియె రంభలాగు తోఁచు.
కోరి వచ్చినదియె కులహీనురాలయా! న.

చాటుచోటు లేక సమయాలు చిక్కక
తమ్ముఁ గోరువారు తారసిలక
నిలిచియుండు నండ్రు చెలులసతీత్వమ్ము. న.

ముదిత చేసికొనెడి ముస్తాబు లవి తోడి
యాఁడువారు చూతు రనియె కాని
భర్త సంతసింపవలె నని కాదుసూ! న.

కాకిలాగు పెద్దగాలమ్ము మనుకంటెఁ
గొలఁది బ్రదుకు మేలు కోవిలట్లు
పలువు రాదరించు బ్రతు కెంతయిన నేమి? న.

కాకి తిననిదియును కవి కాననిదియును
తరుణి చేయనిదియుఁ ద్రాగుఁబోతు
వదరనదియు లేదు వసుధాస్థలమ్మున. న.

ఎల్లి యేమి యగునో యెఱుఁగరానిది గాన
యెల్లి చేయఁదగిన యెల్లపనులు
నేఁడు చేయఁబూనువాఁడు నేర్పరిసుమా! న.

భూతదయకు స్నేహదాతృత్వములకును
మంచిమాటలకును మించునట్టి
వశ్యవిద్య లేదు వసుధాతలమ్మున. న.

లక్ష్మిఁ దార్చు మిత్త్రులను, బంధులను చేర్చు
బంధనమును గూర్చుఁ బ్రాణ మార్చు
నౌను. నాల్కవలనఁ గానిది యున్నదా? న.



కన్యాశుల్కం సమీక్షణ

[3-వ భాగము]

శ్రీ సోమయాజుల వెంకటరామమూర్తి

కాలపరిమితి ; కథల గమనము

ఈక్రింద వివరించిన పట్టీలో నేను కాలపరిమితి, కథలగమనము (Duration of action and movement of the plots) విశదీకరించాను — అటు కృష్ణారాయపురంలోనూ, ఇటు రామచంద్రపురంలోనూ, దృశ్యానికీ దృశ్యానికీ మధ్య ఎంత విరామము (Interval) ఉంటుందో సహేతుకముగా, కథావస్తువుపై ఆధారపడే నిరూపించాను. పట్టీలో ౧-వ గడియందు నాటకంలోని అంకము, రంగము యొక్క సంఖ్య, ౨-వ గడియందు ఆదృశ్యం నాటకారంభంనుంచి, ఎన్నవ దినం జరిగిందో, 3-వ గడియందు, ఆదృశ్యానికి పూర్వదృశ్యం ఏదో, దానినుంచి ప్రస్తుతాంశమైన దృశ్యానికెంత ఎడమో, ౪-వ గడిలో ఈ యెడం ఇవ్వడానికి కథావస్తువును బట్టి ఏది కారణంగా వుందో, ౫-వ గడిలో తదితర ఆధారాలు, అటుతరువాత ప్రస్తుతమైన దృశ్యంలో ముఖ్యసంఘటనలు, సంగ్రహంగా చూపించాను :—

అంకము, రంగము.	ఆదినుంచి దినసంఖ్య, (వేళ).	పూర్వదృశ్యం; దానినుంచి విరామము	ఈ విరామానికి నాటకవస్తువు చూపే కారణం	దినసంఖ్య నిర్ణయించడానికి మరికొన్ని ముఖ్యమైన ఆధారాలు ; ప్రస్తుత దృశ్యంలోని ముఖ్యసంగతులు.
౧(౧)	౧ (సాయంకాలం)	...	...	ఒకానొకసాయంకాలం. వెంకటేశానికి పరీక్షఫలితం చెప్పి కిసిమిస్ సెలవు లిచ్చారు. అందుచేత డిసెంబరు నెల — చలికాలం. వెంకటేశం పరీక్ష ఫెయిలయిపోయాడు గిరీశం వెంకటేశాన్ని ఓదార్చి, కృష్ణారాయపురం వెంకటేశంతో వెళ్లి, అక్కడ సెలవల్లో చదువుచెబుతా నంటాడు. ఫోటోగ్రాఫు బండ్రోతునుంచి తప్పించుకుంటాడు.
౧(౨)	౧ (రాత్రి)	...	...	గిరీశం మధురవాణియింటి కెళ్లి, రామప్పంతులు నెత్తిచరిచి మెట్లుదగ్గిర మిఠాయితిని, బండీయెక్కి కృష్ణారాయపురానికి ప్రయాణంసాగిస్తాడు, శిష్యుడు వెంకటేశంతో కూడా.
౨(౧)	౨ (ఉదయం)	౧	విజయనగరంనుంచి, కృష్ణారాయపురానికి, నాటున ఒకరాత్రి ప్రయాణం. ఈదృశ్యంలో, వెంకమ్మ, "నిన్నట్నుంచీ	వెంకటేశం, గిరీశం కృష్ణారాయపురం చేరుతారు. వెంకమ్మ కూర తరుగుతూంటుంది. బుచ్చమ్మ, గిరీశాన్ని 'చద్దివణ్ణం తింటారా?' అని అడుగుతుంది ; కాబట్టి, ఉదయం ౯ గంటలవేళ అనుకోవచ్చు. గిరీశానికి బుచ్చమ్మయొక్క ప్రథమ దర్శనం. సుబ్బిపెళ్లిమాటలు, పద్దెనిమిదివందలు కన్యాశుల్కం. ఇది విని గిరీశం

		కిస్ మిస్ పిలవలని పుర్రా డు ఉత్తరం రాశాడు" అంటూ వెంకటేశం రాక కెదురు చూస్తూ ఉంటుంది.	రాత్రి అగ్నిహోత్రావధాన్లుకు కన్యాశుల్కంమీద లెక్చరిచ్చి పెళ్లి తప్పిస్తానంటాడు.
౨(౨)	౨ ...	...	కరటకశాస్త్రి తనశిష్యుడైన మహేశంచేత ఆడవేషంవేయించి, రామచంద్రపురంలో లుబ్ధావధాన్లకిచ్చి పెళ్లి చేద్దామని తన ఉద్దేశంగా మహేశానికి చెబుతాడు. ఆరాత్రే కరటకశాస్త్రి మహేశాన్ని తీసుకుని తనపన్నాగం కొనసాగించడానికి, వెళ్లిపోతాడు.
౨(3)	3 (ఉదయం)	ఈదృశ్యంలో వెంకటేశం గిరీశాన్ని "రాత్రి కన్యాశుల్కంమీద లెక్చరిచ్చారా?" అని అడుగుతాడు. అంతేకాక, గిరీశం మాటలమధ్యన, "మొన్న మనంవొచ్చిన బండీవాడు" అంటాడు.	రాత్రిసంగతంతా చెబుతాడు గిరీశం. తరువాత గిరీశం అగ్నిహోత్రావధాన్లతో, అతడికి కావలసిన దావా కబుర్లూ, అవీ చెప్పి లోపేసేస్తాడు. వెంకటేశం కోరికపైతాను 'widow' మీద రాసిన 'poem' చదువుతాడు.
3(౧)	౪ ౨(౨) ౨ (ఉదయం)	మధురవాణి, రామప్పంతులుతో రామచంద్రపురం రావడం, అక్కడ అగ్రహారీకుల ద్వారా పంతులుపూర్వ జీవితం తెలుసుకోవడం; ఇటు, కరటకశాస్త్రి, మహేశం కృష్ణారాయపురంనుంచి రామచంద్రపురం రావడం, మహేశం ఆడవేషం వేసుకోవడం మొదలైన పనులకు అధమం ౪ రోజులుండాలి.	కథారంగము కృష్ణారాయపురంనుంచి రామచంద్రపురానికి మారుతుంది. రామప్పంతులు, మధురవాణికి తనయొక్క లౌక్యప్రజ్ఞంతా వెల్లడిచేస్తూ, లుబ్ధావధాన్లకు, వృద్ధాప్యంలో ఈపెళ్లి ప్రయత్నం ఎందుకో కారణం తెలుపుతాడు. అది ముసలాడి ధన లోభత్వం, జాతకంమీదవుండే నమ్మకం అని మనకు తెలుస్తుంది. రామప్పంతులు పైకి వెళ్తాడు, పనిమీద.
3(౨)	౪ ,,	...	కరటకశాస్త్రి మాయసుబ్బి వస్తారు. మారువేషాల్లో వున్నా మధురవాణి గురుతిస్తుంది. శాస్త్రి మధురవాణికి తన ఉద్దేశం మాయసుబ్బిని లుబ్ధావధాన్లకిచ్చి పెళ్లిచేసేసి తనమేనకోడలుపెళ్లి తప్పించడం అని చెప్పి మధురవాణిసహాయ్యం కోరుతాడు. అటు తరువాత కరటకశాస్త్రి, రామప్పంతులను కలుసుకొని, మాయసుబ్బిని లుబ్ధావధాన్లకు ౧౨౦౦ లకు అమ్మడానికు నిశ్చయించడం. అందులో ఐదోవంతు పంతులుకు కమీషనుకింద జమకట్టుకునేందుకు తీర్మానం జరుగుతుంది.

3(3)	౫	౨(3) ౨	గిరీశం బుచ్చమ్మపై తన శృంగార చేష్టలన్నీ ప్రయోగించడం, అవన్నీ వృధా కావడం — ప్రేమ కథలు ఆమె బుర్రకెక్కించి ground prepare చెయ్యడం- ఈ ప్రయత్నాలన్నిటికీ అధమం ౪ దినాలుండాలి.	గిరీశంయొక్క. స్వగతం. — మన్మథుణ్ణీ, అతగాడి బాణాలనూ తలుచుకొని, విధవావివాహం వల్ల లాభనష్టాలు బేరీజు వేసి చూచి, తుదకు విధవావివాహం చేసుకునేందుకు నిశ్చయిస్తాడు. వెంకటేశానికి సృష్టి మీద పాఠం చెబుతూ పాఠంలో విధవావివాహం మీద లెక్చరు. బుచ్చమ్మ వింటూంటుంది. ఈపాఠం వెంకటేశంకంటె బుచ్చమ్మకే ఎక్కువ ఉపకరిస్తుంది!
3(౪)	౫	,,	...	గిరీశం చాలా గొప్ప ప్రజ్ఞావంతుడని వెంకటేశం తన అక్క బుచ్చమ్మకు చెబుతాడు. గిరీశంకూడా "పానకపాలేటప్పుడేవుంది" అని మురిసిపోతూ, ప్రబంధధోరణిని "నదమా పాక్కాలి..." అన్న పద్యం బుచ్చమ్మపరంగా చదువుతాడు.
౪(౧)	౫ (ఉదయం)	3(౨) ౧	రామప్పంతులు లుబ్ధావధాన్లతో, "నిన్న నొచ్చాడే యూళ్ల, సుంటూరునుంచి ఒక బ్రాహ్మణుడా" అంటాడు.	లుబ్ధావధాన్లకు గిరీశం రాసిన పెద్ద ఉత్తరం అందుతుంది. అందులో పెళ్ళికూతురు (సుబ్బి) పెయ్యనాకుడుపిల్లనీ, అది వైధవ్య హేతువనీ సూచిస్తాడు. ఇంతలో రామప్పంతులు బనాయించిన మారుదస్కత్తు ఉత్తరంకూడా అందుతుంది- అగ్నిహోత్రావధాన్లకు సమ్మంధం అక్కర్లేదన్నట్టు. లుబ్ధావధాన్లకు గుంటూరుసంబంధం (మాయసుబ్బి) నిశ్చయమైపోతుంది. రామప్పంతులు ఆమర్నాటికే ముహూర్తం ఏర్పాటు చేసేస్తాడు. తరువాత డాబుగా తయారై బాజాల్తో లౌక్యులను పిలవడానికి పెద్దిపాలెం వెళ్తాడు.
౪(౨)	౫ (మధ్యాహ్నం)	...	...	కరటకశాస్త్రీ, లుబ్ధావధాన్లూ రామప్పంతులు లేనిసమయంలో మాట్లాడుకొని, ఆరాత్రే పెళ్లి ఏకరాత్రి వివాహంగా చేసేసుకునేందుకు ఏర్పాటుచేస్తారు.
౪(3)	౫ (రాత్రి)	...	...	పెళ్లిలగ్నం ఎనిమిదిఘడియలు ముందుకు లాగి, పంతు ల్లేకుండానే, తెల్లారేలోపున లగ్నం జరిగిపోతుంది. దీనికి సిద్ధాంతి (అచ్చన్న) సహాయభూతు డౌతాడు. గుంటూరుశాస్త్రి రూపాయలుచ్చుకొని, పరారీ అయిపోతాడు.
౪(౪)	౬ (ఉదయం)	౧	రామప్పంతులు పెద్దిపాలెం వెళ్లి తిరిగి వస్తాడు.	రామప్పంతులు లుబ్ధావధాన్లకు పెళ్లయిపోయిందని విని తెల్లబోతాడు. గుంటూరుశాస్తుల్లు తన్ను టోపీకొట్టి పారిపోయిన సంగతి తెలుసుకుంటాడు. కోపావేశంలో పెళ్లికూతురు (మాయసుబ్బి) 'రెండోపెళ్లిపిల్లో', లేక 'శూద్రపిల్లో' అని నొక్కి చెప్పి, లుబ్ధావధాన్లు మనస్సులో గట్టిగా ఒక గొప్ప అనుమాన బీజాన్ని నాటుతాడు.

౪(౫)	౬ ౩(౪) ౧	గిరీశం వెంకటేశాన్ని 'బావా' అనీ, ఇదివరకు 'వదినెగారూ' అంటూ వచ్చిన బుచ్చమ్మను 'వదినే' అనీ చనువుగా అనడానికి తగిన అవకాశం—. అదిగాక ౨(౨)లో కరకటకశాస్త్రి పెళ్లిమూర్తం చాలా వ్యవధి వుందంటాడు. ఇప్పుడు గిరీశం అప్పుడే పెళ్లి సందర్భంలో పందిళ్లూ, పాకలూ వేయిస్తూంటాడు.	గిరీశం వెంకటేశానికి మతంమీద లెక్చరిస్తాడు. పెళ్లిపనులు చాలా సందడిగా జరిగిపోతూంటాయి. బుచ్చమ్మ పప్పురుబ్బుతూ కంట నీరు పెడుతుంది— తన చెల్లెలికి పెళ్లి తప్పించకూడదా అన్న విచారంతో. గిరీశం బుచ్చమ్మతో ప్రసంగించి పెళ్లి తప్పిపోయే ఉపాయం బుచ్చమ్మ తనతో లేచిరావడం ఒక్కటేనని ప్రయాస మీద ఒప్పిస్తాడు. ఆరాత్రే ప్రయాణం. ప్రయాణం రెండుదినాలు— కృష్ణారాయపురానికీ, రామచంద్రపురానికి మధ్య — విజయనగరం ఒకమకాం. అక్కడ దివాంజీసాహేబువారి ఏనుగూ గుర్రాలు తెస్తాడు అగ్నిహోత్రుడు అతిదర్పాగా.
౫(౧)	౭ ౪(౪') ౧ (౧౦×౦౦ ఫ్రే)	లుబ్ధావధాన్ల భార్య రెండోపెళ్లి పిల్ల అన్న వదంతి గ్రామంఅంతటా ప్రాకడానికీ, అవధాన్లకుకూడా రాత్రినిద్రలో కలవచ్చి, పెళ్లికూతురి మొదటి మొగుడు కనుపించి పీక పిసికినంత వడానికి అవకాశం ౧ దినంచాలుఆగ్రామంలో.	రామప్పంతులు ధర్మమా అని మాయసుబ్బి రెండోపెళ్లి పిల్ల అని వూరంతటా అనుకుంటూంటారు. రాత్రి అవధాన్లు నిద్రపోతూంటే కలలో ఆపిల్ల మొదటిమొగుడు కనిపించి, అవధాన్ల పీకనొక్కినట్టవుతుంది. అరుస్తూ, భయంతో లేచి, 'రామనామ' జపంచేస్తాడు. మాయసుబ్బి మధురవాణియింటికి పారిపోతుంది కంటెతోకూడా.
౫(౨)	౭ ... (౧౦×౦౦ ఫ్రే)	...	మధురవాణి, పోలిశెట్టి, భుక్త, సిద్ధాంతి పేకాడుతూంటారు. పూజారిగవరయ్య ఆట చూస్తూంటాడు. మహేశం (మాయసుబ్బి) తలుపు కొడతాడు. రామప్పంతులు గొంతుకపెట్టి మధురవాణిని కూడా భ్రమింపజేస్తాడు. మధురవాణి మహేశాన్ని ఒక గదిలో వుంచి, దాసరివేషం వేయిస్తుంది. ఇంతలో రామప్పంతులు వస్తాడు. మహేశం, పంతులకంటబడకుండా వుండడానికి, కంటెమిష పెట్టి ఇంట్లో అడుగుబెట్టనివ్వకుండా అవతలనుంచే గెంటుతుంది. మధురవాణికంటె మహేశం మధురవాణి కిచ్చేస్తాడు.
౫(౩)	౭ ... (౧౦×౯౦ ఫ్రే)	...	మాయసుబ్బి పారిపోయినట్టు ఎవరికీ తెలియదు. పారిపోయే ముందు, భాగవతంపుస్తకం నూతులో ఎత్తేస్తుంది. ఆచప్పుడుకు అంతా నూతిలో పడిందేమో అనుకుంటారు. గవరయ్య నూతిలోదిగి గాలించి చూస్తాడు. భాగవతంమాత్రం దొరుకుతుంది. లుబ్ధావధాన్లు పోలీసువాళ్లభయంచేత బెంగెట్టుకుని ఏడుస్తూంటాడు. గవరయ్య—ఆపిల్ల బ్రహ్మరాక్షసి—అంటూ, దాన్ని సీసాలో బిగించానని కోతలు కోస్తూంటాడు. ఇంతలో రామప్పంతులు వచ్చి ముసలాణ్ణి కంటె తెమ్మంటాడు. అవధాన్లు 'నాకు తెలియదం'టాడు. పంతులు అవధాన్లమీద, భార్యను చంపినందుకు కూనీకేసు పెట్టిస్తానని బెదిరిస్తాడు.

౫(౪)	౭ ... (రాత్రి: ౧ గం.)	...	సారాదుకాణం – హెడ్ కనిస్టేబు అక్కడుంటాడు. రామప్పంతులు వచ్చి పెళ్లికూతురు పారిపోయిందని హెడ్డుకు చెప్పి, కనిష్టేబులను నాలుగుపైపులా పరిగెత్తించ మంటాడు. హెడ్డు వీల్లేదంటే పోనీ కూనీకేసని ముసల్దాణ్ణి బెదిరించి తనకం టెఖరీ దిప్పించమన్నైనా ప్రాధేయపడుతాడు. ఈ అబద్ధపు కూనీకేసుకు సాక్షుల కోసం సారాదుకాణంలో వెతుకుతారు. దుకాణదారు రామందాసు, బైరాగి, దొంగసాక్ష్యానికి తయారై పోతారు.
౫(౫)	౭ ... (రాత్రి: ౩ గం.)	...	హెడ్డు ముసల్దాణ్ణి బెదిరించి తను, అవధాన్లకు బాకీ ఉన్న తాలూకు నోటు లాగేస్తాడు. నోటు చింపేసి కాగితంముక్కలు అక్కడే పారేసి పోతాడు. హెడ్ గుప్ చుప్ గా పూరుకోడం చూసి రామప్పంతులుకు అనుమానంవేసి, ఆకాగితంముక్కలన్నీ యేరి భద్ర పరుస్తాడు. హెడ్డుమీదా, తాసిల్దారుమీదా ఆకాశరామన్నర్జీలు పంపడానికి నిశ్చయిస్తాడు.
౫(౬)	౭ ... (రాత్రి: ౪ గం.)	...	కంటె యింట్లో ఎక్కడైనా వుంటుందేమో చూడమనడానికి రామప్పంతులు రాత్రి మీనాక్షిని బతిమాలుకుంటాడు. చీకట్లో వాళ్ల సరససల్లాపాలు. నిద్దురపట్టక తెలిసేవున్న లుబ్ధావధాన్లు రామప్పంతులను కర్రతో కాలుమీద బజాయిస్తాడు. రామప్పంతులు పరిగెత్తుకుంటూ యింటికి పోతాడు. అంతకుముందూ మీనాక్షిని పెళ్లాడుతానని ప్రమాణం చేశాడు కాబట్టి, మీనాక్షి రామప్పంతులు వెంటపడుతుంది. రామప్పంతులు యింటియెదట: వీళ్లిద్దరినీ చూచి, మధురవాణి తలుపుతియ్యకుండానే మంగళారతి తేవడానికి లోనికి వెళ్తుంది. ఈబాధ తప్పించుకునేందుకు రామప్పంతులు చెరువుపైపు కాలకృత్యాలు తీర్చుకొనుటకు వెళ్లుతాడు. దాసరివేషంలో శిష్యుడు ఎదురౌతాడు.
౬(౧)	౯ ౪(౫) ౨ (ఉదయం: ౫ గం.)	విరామం ౨ దినాలు. అగ్నిహోత్రావధాన్లు, పెళ్లివారు, కృష్ణారాయపురంనుంచి రామచంద్రపురం రావడానికి. (రెండోనాటిరాత్రి గిరీశం, బుచ్చమ్మ బండి తప్పించి పారిపోతారు)	ముఖ్యపాత్రలన్నీ రామచంద్రపురంలో కలుస్తాయి: చెరువుగట్టు-రామప్పంతులు దంతధావనచేస్తూంటే అగ్నిహోత్రావధాన్లు, పెళ్లివారూ, ఏనుగూ, గుర్రాలూ మొదలైన పటాటోపంతో దిగుతారు. అగ్నిహోత్రావధాన్లకు రామప్పంతులుద్వారా లుబ్ధావధాన్లు గుంటూరుసమ్మంధం చూసుకుని పెళ్లాడినట్లు తెలుస్తుంది. అగ్నిహోత్రుడు కోపాగ్ని కురిపిస్తాడు. లుబ్ధావధాన్ల యింటికెళ్లి వాణ్ణి తంతా నంటాడు.
౬(౨)	౯ ... (ఉద: ౬ గం.)	...	అగ్నిహోత్రావధాన్లు, లుబ్ధావధాన్లను పడదెబ్బలు కొట్టి, తిరిగీ చెరువుగట్టుకు వస్తాడు. లుబ్ధావధాన్లమీద క్రిమినలుకేసు తేవడానికి అవకాశం వుందా అని రామప్పంతులుతో ఆలోచన చేస్తూంటాడు. పంతులు, సివిలుకూడా జోడించి సులభంగా, 3,4 వేలు డామేజస్ కింద లాగెయ్యొచ్చునని సలహా యిస్తాడు. బుచ్చమ్మ

		సరుకేదైనా తాకట్టు పెట్టి దావాఖర్చులకు సొమ్ము తెద్దామనుకుంటాడు, అవధాన్లు. ఇంతలో బుచ్చెమ్మ, గిరీశంతో లేచి చక్కాపోయినట్టు తెలుస్తుంది. అంతా నెత్తీ నోరూ కొట్టుకొంటారు.
౭(౩) ౧౦ ౭(౨) ౨	రామచంద్రపురం నుంచి అగ్నిహోత్రుడూ రామప్పంతులూ (మధురవాణితో సహా) విశాఖపట్నం ప్రయాణం అవుతారు— కేసుల నిమిత్తం. మొదట నాయుడు ప్లీడరును పెట్టడం-తరువాత అతడు మధురవాణి బసలోనుంచివస్తే అనుమానపడి రామప్పంతులు వాణ్ణి తప్పించడం—వీటన్నిటికీ ౨ దినాలు.	విశాఖపట్నంలో:—ఇటుపైని కథంతా కేసులరూపేణా సాగుతూంటుంది కాబట్టి, ముఖ్యపాత్రలన్నీ విశాఖపట్నంలోనే వుంటాయి. రామప్పంతులు తనవకాల్తీ తప్పించేసినందుకు నాయుడు ప్లీడరుకు కోపం వస్తుంది. అందుచేత కసితీర్చుకునేందుకు అతడు డిస్ట్రిక్టకలెక్టరుతో చెప్పి, అతనికి అగ్నిహోత్రావధాన్లమీద కోపం తెప్పించడానికి వెళ్లిపోతాడు.
౭(౪) ౧౩ ౭(౩) ౩ (శుక్రవారం)	లుబ్ధావధాన్లు విశాఖపట్నంలో తనపక్షాన్ని పనిచెయ్యడానికి సౌజన్యారావుగారికి వకాల్తీ యివ్వడం: అతడు గుంటూరుశాస్త్రివిషయమై గుంటూరు పోలీసువారికి ఉత్తరం వ్రాయడం, అలాంటిమనిషి లేడని గుంటూరునుంచి తిరిగి జవాబురావడం: వీటన్నిటికీ ౩ రోజులు.	విశాఖపట్నంలో లుబ్ధావధాన్ల బస. పాపం! ముసలాడు కూనీకేసులో ఇరుక్కుంటాడు. రామప్పంతులు ఇంకా వొదిలిపెట్టడు ముసలాణ్ణి. ఇన్స్పెక్టరుకూ, డిస్ట్రిక్టకలెక్టరుకూ రెండువేలు లంచం పొయ్యమంటాడు. ఇంతలో సౌజన్యారావుగారే అక్కడికి వస్తారు. రామప్పంతులను గెంటుతారు. తరువాత అవధాన్లతో సంప్రతించి, గుంటూరుశాస్త్రికి పరమటయాస లేదని తెలుసుకుంటారు.
౬(౫) ౧౩ ... (శుక్రవారం)	...	కరటకశాస్త్రి, శిష్యుడు మహేశం విశాఖపట్నం వస్తారు. మధురవాణి నడిగి కంటెతీసుకొని, ఆకంటె, ౧౨౦౦ రూపాయలు కూడా పోస్టులో లుబ్ధావధాన్లకు పంపించేస్తే కూనీకేసు పోతుందని యోచించి, అలాగు చెయ్యడానికి శాస్త్రి సంకల్పించుకుంటాడు.
౬(౬) ౧౩ ... (శుక్రవారం)	...	ఆవెంటనే శాస్త్రి, శిష్యుడు మధురవాణియింటికి వెళ్లుతారు. రామప్పంతులు లేడనితెలిసి, మధురవాణి కనికరించి కంటె యిస్తుంది. కరటకశాస్త్రిద్వారా సౌజన్యారావుగారి సౌజన్యతగురించి తెలుసుకుంటుంది. అప్పట్నుంచీ ఆమెజీవితంలో పవిత్రమైన ఒకవింత పరివర్తనం కలుగుతుంది.

౬(౭) ౧౩ ... ... (ఉదయం)

పైసంగతులు జరుగుతూంటే, సౌజన్యారావుగారు అగ్నిహోత్రావధాన్లను కబురంపించి, అతడితో బుచ్చమ్మ తాలూకు ఆస్తియావత్తూ ఆమెకు అందజెయ్యమని చెబుతాడు. అలాగు అగ్నిహోత్రావధాన్లు చేస్తే, లుబ్ధావధాన్లు అతడిమీద తెచ్చిన క్రిమినల్ కేసు (కొట్టినందుకు) తీసివేయిస్తానంటాడు.

౭(౧) ౧౩ ... ... (సాయంకాలం)

లుబ్ధావధాన్లు ఖూనీ చేస్తే, ఆఖూనీకేసు కామాపుచేశారని, హెడ్‌కనిస్టేబుమీదా, తాసీల్దారుమీదా పోలీసుఇన్స్పెక్టరు పితూరీ సాగిస్తున్నట్టు మనకు తెలుస్తుంది.

౭(౨) ౧౪ ... ... (పగలు: ౧౧ గం.)

డిస్ట్రిక్టుకలెక్టరు కచేరీ: అగ్నిహోత్రావధాన్లు, గిరీశంమీద చేసిన బుచ్చమ్మ నెత్తుకుపోయిన కేసు విచారణ కొస్తుంది. బుచ్చమ్మ మైనరని రుజువుచెయ్యడానికి, అగ్నిహోత్రావధాన్లు రామప్పంతులు కలిసి ఒకదొంగజాతకం బనాయించిన సంగతి మనకు తెలుస్తుంది. బుచ్చమ్మజననం ఆంగీరసలోననీ, అందుచేత ఆమెవయస్సు ౧౭ సంవత్సరాలనీ కూడా తెలుస్తుంది. కేసు ధ్వంసం అవుతుంది.

౭(౩) ౧౪ ... ... (సాయంకాలం)

సౌజన్యారావుగారు పోలిసెట్టికి కబురంపించి, లుబ్ధావధాన్ల పక్షం సాక్ష్యం పలకమని చెబుతారు—మొదట సెట్టి తా నాపిల్ల గోడ గెంతుతూంటే చూచినట్టు చెప్పబట్టి. ఇంతలో పోలీసుఇన్స్పెక్టరు సెట్టిని భయపెట్టి సాక్ష్యం పలకొద్దంటే సెట్టి చమత్కారంగా తప్పుకుంటాడు.

౭(౪) ౧౪ ... ... (సాయంకాలం)

విశాఖపట్నంలో ఒకవీధిలో అగ్నిహోత్రావధాన్లు, నాయుడు ప్లీడరు కలుస్తారు. గిరీశంగారిమీద కేస్సు మానుకోమని నాయుడు అవధాన్లకు సలహా చెబుతాడు; లేకపోతే జాతకం బనాయించినందుకు మహాప్రవేశ మవుతుం దంటాడు. గిరీశంకూడా విశాఖపట్నం వస్తాడు—బుచ్చమ్మను విధవాశ్రమంలో (రామవరంలో) వుంచి. గిరీశం సౌజన్యారావుగారి పరిచయం కలుగజేసుకుంటాడు లుబ్ధావధాన్ల మూలాన్ని.

౭(౫) ౧౫ ... ... (మధ్యాహ్నం)

గిరీశం లుబ్ధావధాన్లను దూరంచి తన్ను పెంచుకొమ్మంటాడు. అగమం ఒక అధికారపత్రం అయినా రాసిమ్మంటాడు. లుబ్ధావధాన్లపక్షంలో సాక్ష్యం పలకడానికి మొదట వొప్పుకున్న బైరాగి, అసిరిగాడు, పూజారిగవరయ్య — అంతా చల్లగా జారిపోతారు ఇన్స్పెక్టరు కుట్రచేత. అప్పుడే గిరీశం దొంగసాక్ష్యానికి దిగుతానంటాడు—కాని, సౌజన్యారావుగారి కామాట యింకా చెప్పొద్దంటాడు, పేద్దమ్మతో.

౮(౬)	౧౫ ...	...
మొత్తం	౧౫ ...	రోజులు

గిరీశం, సౌజన్యారావుగారూ మాట్లాడుతూంటారు. గిరీశం తనజీవితకాల మంతా సోషల్ రిఫారమ్ కింద వినియోగపరుద్దా మనుకుంటూన్నట్టూ, ఆకారణంచేతే రామయ్యపంతులుగారి లెఫ్టినెంటుగా ప్రవేశించినట్టూ, తాను బుచ్చమ్మను మనసారా ప్రేమించినట్టూ—మొదలైన సంగతులన్నీ సౌజన్యరావుగారికి చెబుతాడు. ఈ తుదిదృశ్యంలో నాటకంలోని రెండు ముఖ్య కథావస్తువులకు పర్యవసానం (విడిపోవడం) వస్తుంది. ఇది రెండింటిలోనూ మధురవాణికారణంవల్లనే జరుగుతుంది. గుంటూరుశాస్త్రి ఒకవేషమనీ, పెళ్లికూతురు ఆడవేషంలో నున్న కరటకశాస్త్రి శిష్యుడైన మహేశం అనీ రూఢిగా చెప్పేస్తుంది మధురవాణి. అటు గిరీశం యొక్క నిజస్థితి, పూర్వజీవితం, ప్రవర్తనా అన్నీ మధురవాణే సౌజన్యరావుగారికి తెలియజెప్పివేస్తుంది. గిరీశాన్ని సౌజన్యరావుగారు ఇంట్లోంచి గెంటివేస్తారు. మధురవాణివల్లనే అటు లుబ్ధావధాన్లు కూనీకేసులోనుంచి తప్పుకుంటాడు—ఇటు అమాయకమైన బుచ్చమ్మ గిరీశం బారినుండి రక్షింపబడుతుంది.

పై పట్టీ చూస్తే, నాటకకథంతా ౧౫ రోజులలో జరిగినట్టు తేల్తూంది. ముఖ్యంగా గమనించవలసిన మరొక్క విషయం ఏమిటీ అంటే:- ఈ ౧౫ రోజుల్లో సరిగా నడికాలానికి, అనగా సరిగా ఒకవారంరోజులు గడిచినాక, ౮-వ రోజు రాత్రే నాటకంలో climax-ఉత్కర్ష: నాటకంలో నే నిదివరకు చెప్పిన రెండుసంవిధానాలున్నూ ఉత్తీర్ణతకు వచ్చి ఈడేరుతవి, చూడండి:

(౧) అటు బుచ్చమ్మ గిరీశంతో లేచి వెళ్లిపోవడం ఈ రాత్రినే జరుగుతుంది.

(౨) ఇటు ఆడవేషంలో మాయసుబ్బిగావున్న మహేశం తనపని నెరవేర్చుకొని, లుబ్ధావధాన్ల యింటినుంచి పారిపోవడం ఈ రాత్రే జరుగుతుంది.

మరొక్క విషయంకూడా దయచేసి చూడండి- ఆ ౮-వ నాటి రాత్రికథ ఎంత మట్టుకు సాగిపోతుందో- ఎన్ని సంగతులు మనం చూస్తామో! రాత్రి అంతా ప్రతీగంటా, ఏదో ఒకవిషయం జరుగుతూనేవుంది, మన కళ్లయెదుట! ఇక, మన కళ్లయెదుట జరక్కపోయినా నిశ్చయంగా సూచింపబడింది:-బుచ్చమ్మ గిరీశంతో లేచి చక్కాపోవడం! — లుబ్ధావధాన్లకు దయ్యప్పకల, మాయసుబ్బి పారిపోయి కంటె మధురవాణి కివ్వడం, మహేశం ఆడవేషంనుంచి దాసరివేషానికి మారడం, రామప్పంతులు అవధాన్లను కూనీకేసని బెదరించడం, సారాదుకాణందగ్గర సాక్ష్యానికి వెతకడం, రామప్పంతులు, మీనాక్షీ చీకట్లో సరసం, అటు ప్రయాణంమధ్య గిరీశం బుచ్చమ్మను రామవరం లేవదీసుకుపోవడం — అద్భుతం, ఈ సంఘటనలన్నీ ఒక్క రాత్రి జరిగిన సంగతి మనం తలుచుకుంటే! చతుర్థ, పంచమాంకాలు నాటకానికంతకూ బలిష్ఠమైన వెన్నుకుప్పలాంటివి. మొదట బాల్యవివాహానికి గురియై, పిమ్మట యౌవనం వొచ్చిన ఒకవితంతువు ఒకయువకుని మాయల్లో పడి అతనితో పారిపోవడం ఒకటి, షష్టిపూర్తిఅయిన లుబ్ధావధాన్లు వృద్ధాప్యంలో పెళ్లాడ్డానికి ప్రయత్నించి ఎన్నో చిక్కులకు లోనుకావడం, రెండు—

ఈ రెండింటికీ కారణం: కన్యాశుల్కానికి ఆశపడి జరిగిన వివాహాలు—ఎటునుంచి వచ్చినా ముక్తాయింపు కన్యాశుల్కంమీదనే!—

ఇట్టి రచనాకౌశలంతోనూ, రసపుష్టితోనూ కూడుకున్న నాటకాన్ని సృష్టించి శ్రీ గురజాడ అప్పారావుగారు ఆంధ్రలోకాని కంతకూ అన్నివిధాలా ఆదర్శప్రాయులు కావడమే కాకుండా,సంఘసేవ, తోడ్తో భాషాసేవ చేసి ఆంధ్రసారస్వతప్రపంచంలో అత్యున్నతస్థానానికి అర్హులైనా రనడానికి ఎంతమాత్రం సందేహింప నక్కరలేదు.

జార్జెట్ చీర

శ్రీ పంగనామముల వెంకటేశ్వర ప్రసాదరావు

౧

"ఎప్పుడూ మీ గొడవేనా మా సంగతేమైన..." అంటూ గదిలోకి వచ్చింది పద్మ-చంకన పిల్ల నేసుకుని.

"ఏమిటే నీ పాడుగోల పొద్దస్తమానమూను... కాసేపు రాసుకోనివ్వవు గద. నాచాకిరికి తగిన ట్లే నీ దెప్పుడూను..."

అంటూ కలం బల్లమీద పెట్టాడు రావు పద్మ వైపు జూస్తూ.

"లేకపోతే ఏమిటండీ ఆపాడురాత. పెళ్లాంతో మాట్లాడటానికి గూడ తీరుబడి లేకపోయె. ఇంక చెప్పండి మనం, మనసంసారం మన దాంపత్యం అడుక్కుతిన్నట్లే ఉన్నది. అందరి సంసారాలు యిల్లాగే అఘోరిస్తున్నాయా ఏమిటి?"

అని చంకనున్న పిల్లను బల్లమీద కూర్చో పెట్టింది.

"బలేదానివి మొత్తానికి. పిల్లను తీసుకుపోరాదూ కాగితాలన్నీ చింపుతుంది. తర్వాత ఏమనుకున్నా ఏం లేదు. అందులో మరోటీ మరోటికూడా కావు. ఆఫీసు కాగితాలు."

"తీస్తాను కాని...మరి..."

"ఏమిటే నీ నస."

"జ్ఞాపకం లేదూ..."

"ఏమిటో చెప్పరాదు త్వరగా..."

"ఈనెల జీతంలో నాకు చీర తెస్తానన్న మాట ఏమయింది..."

"అదా... చంపావు మొత్తానికి.... ఎక్కడు జ్ఞాపకమే...."

"ఝాను జ్ఞాపక ముండదు మరీ......"

"ఇవ్వి బాగానే జ్ఞాపక ముంటాయి" అని మొహం అటు త్రిప్పుకున్నాడు.

"చెప్పరేం?" (కొంచెమాగి) "అహా...... జవాబురాదుగా! దీని కింక నోరు పడిపోతుంది, మా మూలేగా మీకు."

"ఏమిటామాటలు? ఎలా మాట్లాడాలనో తెలియదు గద! ఎన్ని ఏళ్లు నెత్తిన బడితే నేం? పందికి ఉన్నాయి నీకు ఉన్నాయి సంవత్సరాలు.

—అందుకనే చదువుకున్న పెళ్లాం కోసం తపించా. కాని ఏంలాభం. అన్యథా జరిగింది. ఇంతకూ ఇప్పుడనుకుంటే ఏముంది అంతా అయినాక.

—చెబితే, గ్రహించుకునే తెలివితేటలయినా ఉండాలి. లేక, తోచనయినా తోచాలి. రెండు లేక పోతేఎలా ?"

"వచ్చిన జీతం తిండికే జరగటం అంతంత మాత్రంగా ఉంటుంటే, ఎప్పటికప్పు డిలాగే అవుతుంటే యింక ఎప్పుడు చెప్పండి? మీరుకొనటం, నేను కట్టుకోవటం రెండూ నిజమే...ఇంకా నాబ్రతు కిలా తెల్లవారాల్సిందేకదా. ఇంతకూ దేని కయినా పెట్టిపుట్టాలి. ఇలాంటి మొగుడ్ని చేసుకున్నందుకు అన్నిటికీ..."

"ఏం ఏడుస్తావు లేవే...అవునుగాని వచ్చే నెలకు వాయిదా వేయరాదూ. ఈనెలలో యింటి పన్ను కట్టాలి పదహారు రూపాయలు."

"ఎప్పుడూ యిలాగే ఏదోఖర్చు వస్తుంది. అన్నట్లు మా అక్కయ్య పిల్లలు వస్తామన్నారు, రేపు పండుగకు. వాళ్లు వచ్చినా రాకపోయినా నాకు చీర తీసుకరావల్సిందే.

—నా కాశ్చర్య మేస్తుంది, పక్కింటివారమ్మాయి సుభద్ర ఎప్పుడూ ఏదో చీరకొంటునే ఉం

టుంది. నాకర్మం కాల ఏడాదికో చీర తెప్పించుకుందామన్నా యింతవరకు పడలేదు. పాడగాపాడగా గాని ఏవస్తువూ రాదు.

ఎందుకు...మనిషికి నీతి ఉండాలి. అది లేకపోయినాక ఎంత మొత్తుకుంటే మట్టుకు...ఏమిటో లెండి. అడిగడిగి నా ప్రాణం విసిగిపోతుందికాని మీకేం..."అని కన్నీళ్లు పెట్టింది. పాపం రావుకి జాలి వేసింది. హృదయంకటిగి స్రవించింది. ఒక్క నిట్టూర్పు నాసాపుటలనుంచి వెలువడింది.

కుర్చీమీదనుంచి లేచి పద్మమెడమీద చెయ్యి వేసి సోఫామీదకు తీసుకెళ్లాడు.

"రా, పద్మ కూర్చో"అని తాను కూర్చుని పద్మ చెయ్యిపట్టుకుని బలవంత పెట్టాడు.

"ఎందుకేం?...నామాట వినని..."

"చీర తెస్తాగా."

"నిజం"

"నిజంగా ముమ్మాటికీ"

"చేతిలో చెయ్యి వెయ్యండి"

"వేస్తా కూర్చోమరి..." అని పద్మను కూర్చో పెట్టాడు రావు.

"సరే గాని, నీవు చెప్పిన ఉప్పాడచీరలో ఏరకం? తెములు్చ వేగం."

"కాఫీరంగులో, ౧౨౦-వ నెంబరు. పమిట చెంగున జానెడు వెడల్పున జల్తారు గూడ ఉంటుంది" అని అంటూ అతని నేత్రద్వయం వైపు కొంటెగా జూచింది, తన కనుదమ్ములనుంచి ఆహ్వానాన్ని తొణికిస్తూ.

ముఖారవిందం మీద తెలినవ్వు దొంతరలు నృత్యం సల్పినాయి.

ఆశ్చర్యంగా "చంపావు ... అలాంటి చీర కట్టటానికి నీ మనసెలా అంగీకరిస్తుందే...ఉల్లిపొర లాంటి ఆచీర కట్టడానికి నీవేం సానిదానివా"

"ఐతే...వాళ్లకే నన్నమాట అర్హత...అంతేనా"

"అది కట్టుకుని వీథిలోకి వెళ్తావా" అన్నాడు. ఆశ్చర్యం, భయం, సంశయం మూర్తీభవించినాయి అతనిలో;

పద్మ కొంచెమాగి చిఱునవ్వు నవ్వుతూ

"ఏం వెళ్తే......"

"ఓసి నీ...అది కట్టుకుని బయటికి వెళ్తే నాకు అపర్దిష్ట ఫలాని ఆయన పెళ్లాం..."

"పోనీ లెండి, మీ కలాంటి అపర్దిష్ట పాలవటం ఎందుకు కాని నే నాచీరతో వీథిలోకి వెళ్లను లెండి. మీ కలాంటి భయ మనవసరం".

"ఆ చీరతో బయటికి పోయినట్లు నాకు తెలిస్తే మర్నాడు నే నాచీర చింపిపారేస్తా. తర్వాత ఏమనుకున్నా ఏం లాభంలేదు."

"సరే......యింకేం......"

"సాయంత్రం ఆఫీసు నుంచి వస్తూ తెస్తా... అవును గాని మరి నాకు ఒక... ము ...ద్దు." అని దగ్గరకు లాక్కున్నాడు.

"ఇప్పుడు గదు. సాయంత్రం చీరకట్టుకుని ముస్తాబయి అ...ప్పు...డు..." అని గిర్రున తిరిగిపాటిపోయింది.

౨

సాయంత్రం ౫ గంటలయింది. ఆఫీసునుంచి రావు బజారుకు వెళ్లాడు కొట్లన్నీ గాలించటానికి.

షుమారు, ౧౦, ౧౫ దుకాణాలు వెతికాడు. ప్రతిచోటా ౨౦, ౩౦ చీరలు పడేశారు. అన్నీ ఉల్లిపొర కాగితాల్లాగు ఉన్నాయి. చేతిలో పట్టుకుంటే చినిగిపోతా యేమో అన్న భయం కూడ కల్గింది. చిఱుగాలులకు రెపరెపలాడుతూ శరీరంమీద గుడ్డంతా ఒక్కమారు రివ్వున ఎగిరిపోయే టట్లున్నాయి.

చీరలు వివిధరంగులలోవి చూడగానే పొంగిపోర్లా పడ్డాడు. కాని ఒక్క క్షణం లోనే మరల అసహ్యం జనించింది. వాటిమీద. ఆ ముద్దినుసు చీరలు భార్య కట్టుకుంటె తనివి తీరజూచి ఆనంద పడాలని ఒకవైపూ, వేరొకవైపు అవి కట్టుకున్నపుడు యితరులేమైన జూచి అనుకొని పోతారేమో అన్నభయం—యీ రెంటిమధ్య బడితారుమా రయినాడు. ఈ డైలమా నుంచి తప్పించుకునేవిధ మేమిటా అని మనిషి గాభరా పడ్డాడు.

మనస్సు జంజాటనలో పడింది. ఏ షాపులోనూ ఎటూ తేల్చుకోలేకపోయినాడు. చాలా ఆర్భాట పడ్డది హృదయం. ఒక నిశ్చితాభిప్రాయానికి రాలేక పోయాడుత్వరగ. చీరలు తీసుకుపోతే ఒక అవస్థ. తీసుకు వెళ్లకపోతే మరో అవస్థ.

ఇద్దరు ముగ్గురు దుకాణాదారులు గూడ, ఇలాంటి చీరలు మీకు బాగుండ వన్నారు. ఈ ఉల్లిపొర కాగితం లాంటిచీరలు పైపై మెరుగే అనీ, ఇంతకన్న స్వల్పపు ఖరీదుకు కొత్తరకం చీరలు మంచి డాబైన రంగులతో, గ్యారంటి యిచ్చే రంగులలో వస్తూన్న వనీ, వాటినే ఎక్కువ మీ బ్రాహ్మణకుటుంబాలు వాడుతున్నా రనీ దుకాణా దారులు తెల్పారు.

అంతా అలా అంటుంటే తనకు హృదయం మారింది. మొదట్లో ఆమెతో పట్టుకొస్తా నని చెప్పి చివరకు వేరొకవిధంగా ప్రవర్తిస్తే యింక మూతి బిగించుకుని, అలిగి కూర్చుంటుందేమో నని తోచింది. అంతేగాదు మరో అఘాయిత్యపు పనికి గూడ ఉపక్ర మిస్తుందేమో! చీర తీసుకురానంత మాత్రం చేత యింక ఏడుపులు, పస్తులు, ఉపవాసాలు యిలాంటివి ఎన్ని, యింక చెప్పటానికి వీలులేదు. మరీ కోపిష్టి దైతే బావిలో పడతానని కూర్చుంటుంది.

ఐతే అలాంటి అధ్వాన్నపు బ్రతుకుమాత్రం కాదు. మన రావుది. అంత భయంకరరాక్షసిగాదు రావు భార్య. మొత్తంమీద, యితను మొదటినుంచి చనువివ్వ టంవల్ల నెత్తెక్కి కూర్చున్నదని మాత్రం చెప్పాలి. ఇతని మంచితనాన్ని దుర్వినియోగ పరచుకున్న వ్యక్తి. ఆవిడలో నిర్లక్ష్యత, కోపం, ఉన్నై. ఎన్నిసార్లు రావు మాటలతో మందలించినా తన అదిరిపాటుతనాన్ని సర్ది పుచ్చుకోలేదు. పశ్చాత్తాపపడటం అనేది ఎఱుగదా యిల్లాలు.

తన మనస్సు అంగీకరించకపోవటం వల్ల ఏచీరా లేకుండా ఉత్త చేతులతో వెళ్లితే యింక బుంగ మూతి పెట్టుకుని కూర్చుంటుందనుకొని, ఏ యితరచీరఅయినా తీసుకుపోవాలని నిశ్చయించాడు. ఏ యితర చీర అయినా అయితే నచ్చుతుందా? మళ్లీ కొట్టుకు తిరిగి రావల్సి వస్తుందేమో అని యీ రెండింటితో తర్జనభర్జన పడ్డాడు కానేపు.

ఎలాగయితేనేం మరోరకంచీరలు గాలించాడు. అంటే పెద్ద పెద్దగళ్ల అంచు చీరలు లుంగీ గళ్ల చీరలు. వందేమాతరం చీరలు లాంటివి. ఇవి కట్టుకుంటే తన నేత్ర ద్వయాని కందంగా కనిపించినవా రెంతమందో ఉన్నారు.

కాని ఆ గళ్లచీరలు కట్టుకుంటే తన భార్యలో బ్రాహ్మణత్వం పాడైపోతుందేమోనని తోచింది. వాటి ప్రమేయంగూడ విరమించాడు.

పోనీ యీ నెధవరంగు చీరలు గళ్లచీరలు కన్న శుభ్రంగా మల్లెపూవులాగు తెల్లగా ఉంటాయి; పైగా కొద్దిలో వస్తాయి అని గ్లాస్కో చీరలు గాలించాడు. పద్మ యిదివరకు అవన్నీ కట్టివిడిచేసినవే. కాని తనకు ఎఱ్ఱ అంచుమీద మోజు. తన భార్య గూడ అంగీక రిస్తుందని తెలుసు. కాని ఆ అంచువి ఏ కొట్లోను లభించలేదు. ఎప్పుడోకాని అవి రావనీ, వచ్చినా పదికట్టలలో ఏ ఒకటో రెండోఉంటాయనీ, అవి అప్పుడే ఖర్చవుతాయనీ కొట్లవాళ్లు తెల్పారు.

చివర కది అంతంత మాత్రమే అయింది. పాపం నిరాశాహతు డైనాడు. ఎటూ తోచలేదు. సాయంత్రం ౫ గంటల కొచ్చిన మనిషి దాదాపు ౯ దాటింది. అంతవరకు కొంప జేరలేదు. పెళ్లాం మీద మోజుకొద్దీ శ్రమపడ్డాడు.

వ్రాసుకోవలసిన ఆఫీసుకాగితాలు చాలా ఉన్నా యన్న సంగతి జ్ఞప్తికి వచ్చింది. రకానికి ౨ చీరలు చొప్పున ఒక పెద్దమూట కట్టించుకుని కొంప జేరాడు. వేరే రెండు చీరలు గూడ కట్టించు కున్నాడు.

పద్మ వాకిట్లో నిల్చున్నది పిల్లను చంకను పెట్టుకుని–శీతమయూఖుని మందలిస్తూ. తలంటిపోసుకున్న దీర్ఘశిరోజాల వేణీభరం లోని పాయలు నడుముమీద నృత్యం సల్పుతున్నాయి.

రావు ప్రత్యక్షం కావటంతోనే చిరునవ్వు దొంతరలు ఎఱ్ఱని గులాబి పెదవులపై తొణికిసలాడి నాయి అప్రయత్నంగా.

"ఈ మాటంతా నాకే" అని పట్టలేని ఆనందంతో గబగబ లాక్కుంది.

"ఆ! నీకే" అన్నాడు విసుగ్గా.

"ఎందుకండి అంతకోపం......

మీకష్టం వృథాపోదు లెండి ..." అనేసి ఆ మూట చేత్తో పట్టుకుని రివ్వున పాఱిపోయింది లోపలికి లేడిపిల్లలాగు—

* * *

3

మరుసటిదినం ఆదివారం. మధ్యాహ్నం భోజనాలయినాయి. పద్మ, రావు లిర్వురూ తమలపాకు కిళ్లీలు నముల్తూ తాపీగా కూర్చున్నారు.

అంతలో పద్మ రుసరుసలాడుతూ "ఏమిటండి! నా మొహం ఆచీరలూ, అడుక్కు తిన్నట్లున్నాయి... మీరు రసజ్ఞులేమో అనుకొన్నా. ఇంతేనా మీ రసజ్ఞత. మీమరద లేమో—ఊ—మెచ్చుకుంటుంది మీకు చీరల నాణ్యం బాగా తెలుసునని. ఇదేనా ఎన్నిక—

మరదలు పొగడనూ బావ పొంగిపోనూ క్రిందా మైనా బడి. ఇర్వురికి కలిసింది అంత. అదీ ముఖ్యమైన మాట. ఎంతసేపటికీ పొరుగింటి పుల్లకూర రుచి. దాని కెవరేం జేస్తారు? పెళ్లాం ఎంత అందంగా ఉన్నా నచ్చదు.

పోయి ఉండండి కులాసాగా మీ మరదలు దగ్గర. మీకు హాయి, నాకు హాయి.

పెళ్లాం కట్టుకుంటే జూచి సహించే ఘటం కావద్దూ ముందు. పెళ్లాం ఎంత రంభగా ఉంటే నేం."

"అబ్బ యిప్పుడు ఆ వెధవ సాదింపు లన్నీ దేనికి? ఆ చీరలు నచ్చకపోతే మరోటి తెస్తాను వెళ్లి"

"అమ్మయ్య! ఇప్పుడు నోరు పెకిలింది. ఎలాగయిన,మా ఆయన హృదయం......"

"మరి యింకెందుకు కుళ్లి చస్తావు..."

"కుళ్లీ చస్తే బాగానే ఉండును. అది లేకపోబట్టే. నాచావు ఎప్పుడు వస్తుందా అని మీరు చూస్తున్నారు. మీకన్న నాకు తొందరగానే ఉన్నది ఈ వెధవ సంసారం చేయలేక"

"అబ్బ! యిప్పుడా కుంటిమాట లన్నీ దేనికి. నీకీ చీరలు నచ్చలేదన్నావు ... అలా అయితే వెనుక నీవు కోరిన చీర కాదు గాని మరోటి తెస్తాను కట్టుకో".

"నాకు నచ్చుతుందా"

"ఆ. ముమ్మాటికి ... మరి వెనకటి వాగ్దానం ప్రకారం ఆ చీరతో బయటికి పోగూడదు."

"దీనికి కావాలి ఆ వాగ్దానం?"

"ఆ"

కాసేపు సణిగి ఊరుకుంది.

"నే చెప్పినట్లు చేస్తానంటె ఆచీర తెస్తా"

"ఏమిటో తేల్చండి వేగం"

"వాల్మీకి రామాయణం నెత్తిన పెట్టుకుని "ఈ చీరతో నేను వీథిలోకి వెళ్లను" అని చెప్పాలి."

"హు...ఏం మనిషండి మీరు ... మీ పాడు ముండ అనుమానమే మిమ్మలను యింత జేస్తున్నది. కాపరానికొచ్చి ౫ సంవత్సరా లయింది. ఇంకా మీకు నామీద..."

"ఆవిషయం వేరు. నీవు ఏ పని చేసినా, ఏ గుడ్డ కట్టినా నా ఆనందం కోసమేనా? నన్ను తృప్తిపరచటానికేనా? ఏమంటావు?"

ఒక్క నిట్టూర్పు విడిచి

"అవును అంతే" అన్నది పద్మ.

"అలాంటప్పుడు నే చెప్పినట్లు చేస్తా నని అనటానికి ఎందుకు నోరురాదు.

నా మర్యాద, నా ఆనందం, నా ఆత్మసంతోషం నీకు కావాలి. అంతేగాని పరపురుషులూ, పరస్త్రీలూ వీరి నిమిత్తం గాదు, నీవు ఏపని జేసినా భర్త హృదయానికనుగుణ్యంగా ప్రవర్తించటం, అతని ఇచ్ఛ ప్రకారం నడుచుకోవటం, అతన్ని పూజించటం— యివ్వీ మన హైందవస్త్రీధర్మాలు.

మన పవిత్రమైన ఆర్యసంప్రదాయాలకు విరుద్ధంగా ప్రవర్తించిన స్త్రీ ఎన్నటికి స్త్రీ కాదు.

ఆమె నేమనాలనో నాకు నోరురావటంలేదు."

అతని మాటల కడ్డువచ్చి పద్మ—

"ఇంక చాలిద్దురూ మీ పుణ్యమా అని" అన్నది.

"వెధవ చీర తెమ్మన్నానని ఎంత పెంట, పెట్టారండీ. నిజంగా మీరూ మగవాళ్లంటె. మీ కిష్టంలేని పని నే నెందుకు జేయాలి. మీరు చెప్పినట్లె నే నా చీరతో వాకిట్లోకి వెళ్లను. భగవానుని సాక్షిగా ఆ ముక్క చెబుతున్నాను. నమ్మండి."

"ఆమాట మీదనే నిలుస్తావా?"

"ఆ. ముమ్మాటికి."

"అలా అయితే తీసుకో." అని ఆక్కడ నుంచి లేచి డ్రాయరు దగ్గర కెళ్లి ఉలిపిరి కాగితంలో నున్న చీరమడతను తెచ్చి పద్మ కందిచ్చాడు.

ఆనందకందళితహృదయారవిందయై పద్మ ఆదుర్దాతో అందుకుని అతనివైపు ఒయ్యారంగా జూచి

"అమ్మ, దొంగ! చీర తెచ్చేనా నన్నిలా వేపటం...నే నంటే పాపం మా ఆయన కాపేక్షే" అని అక్కడే గబగబా ఆకాగితం విప్పి

"అమ్మయ్యా! జార్జెట్ చీరే! ఎలా అయినా మా ఆయనకు చీరలు ఎంచడం బాగా తెలుసు. అందుకనే మరదలు అంతగా పొగడుతుంది" అని ఆ చీరను ముద్దెట్టుకుని గట్టిగా తన వక్షాని కదుముకున్నది.

"మరి నాకో..." అన్నాడు రావు.

"సాయంత్రం ముస్తాబయి ... " అని కొంటెతనంగా అతని వైపు చూచి గెంతులేసుకుంటూ పారిపోయింది లోపలికి—

* * *

సాయంత్రం ౫ గంట లయింది. రావు తన వేషధారణం పూర్తి గావించుకుని పడకకుర్చీలో పడుకున్నాడు. నిమిషాలు లెక్కపెడుతున్నాడు పద్మ కోసం.

ఇంతలో జోళ్లచప్పుడు వినిపించింది. గబగబ బల్లమీద నున్న "సచిత్ర వారపత్రిక" తీసుకుని పేజీలు తిరగేయటం మొదలెట్టాడు.

పద్మ వెనకగా వచ్చి వారపత్రిక లాక్కుంది అతని చేతుల్లోనుంచి.

"ఒహో! అయిందీ వేషధారణం."

దీర్ఘవినీలవేణీభరం వక్షోజాల మీద పడవైచుకుని చెవులమీద జుట్టు సర్దుకుంటూ నిలబడ్డది.

చిరునగవు మొలకలు ఆమె పెదవులపై తొణికిసలాడినాయి. అరవిరిసిన నేత్రద్వయం నుంచి ఆహ్వానాన్ని అందజేస్తూ

"ఏం ఎలాగున్నాను. నచ్చానా మీకంటికీ" అని నునుసిగ్గు అభినయిస్తూ అతని చెంపమీదకు చెయ్యి విసిరింది.

రావు కుర్చీలో నుంచి లేచి పద్మ దగ్గర నిల్చొని మెడ మీద చెయ్యివేసి గోడకున్న నిలువుటద్దం ఎదుటికి తీసు కెళ్లాడు.

ఇద్దరు అద్దంలో తమ్ము తాము చూచుకుంటూ శిలాప్రతిమల లాగు ఉండిపోయారు.

"పద్మ! నీవు యదార్థంగా గం...ధ...ర్వాం..గ...నవు." అని కౌగిట్లోకి లాక్కున్నాడు.

"ఈవిషయాలలో నీవుఅర్భకురాలవుకాదుగా"

"మీరు మాత్రం మహా అసమర్థులా. మీకష్టం వృథాకాదు లెండి" అన్నది వినపడి వినపడనట్లు అతని బుజం మీద వ్రాలి.

నవనవోన్మేషమైన భువనమోహన సౌందర్యంతో ఆధునికాంధ్రయువతీయువకు లిద్దరు రతీదేవి మన్మథుల్లాగు నిల్చుండి పోయారు ఒకరికౌగిట్లో ఒకరు.

భారతీ ప్రశంస

శ్రీమతి అబ్బదొడ్డి- మృత్యుంజయశాస్త్రి సతి సీతమ్మ

వ్రాతలు వ్రాయువారు కడు వ్రాతలు వ్రాయుటె కాని చూడగా
బూతులబుంగపద్యముల బుద్బుదముల్ గరమొప్పుచుండు; నే
నీతులు లేక నల్లికల నేర్పులపై పయిపూత లొప్పఁబెన్
గోతులనిండఁ జిత్తు ల విగో కను భారతి! మాకవిత్వముల్.

మాటలు రావు గ్రంథముల మాటలు రా వవి మాకు కైతలా?
పాటలగంధి, శారద, కృపానిధి, భారతి, యోభవాని, నీ
కాటుకకంటి చిత్కళలు గాఢముగాఁ బ్రసరింపజేసి, మా
బోటులపై కటాక్షమును బూని సుశబ్దము లొల్కఁజేయుమా.

భావము లేని భావకవి భాష విచిత్రము జూడచూడ నే
తావును లేదు తెల్గునకు తందనపాటలె కాని సాహితీ
దేవులు, మౌనిపుంగవుల దేమొ నశించిననాటినుండియున్
నీవరరూపమున్ జెడని నేర్పున వ్రాసిరెయేరు భారతీ!

వారలు వీరలున్ మిగుల వ్రాయుచు నుండగ మేమునున్ సదా
భారతముల్ రచించి వినువారికి దెల్పగరాదొ యంచు నీ
వారలు పిన్నవారలగువారలు కొందరు దిద్ది మీసముల్
బారలు వేసి పైకుబుక బాగన వాగన వేల భారతీ!

పలుపురుగద్యపద్యములు బాలకవుల్ రచియించి పత్రికా
నిలయములన్ మెలంగెడు సునీతులపేరట పంపి ముద్రణల్
సలుపుమనంగ వారటులె సారము లెంచక చేతు రయ్యయో
తెలుఁగుల కైతకున్ దెగులు దెచ్చుచునుందు రిదేమి భారతీ!

భావము సున్న; యన్వయ మభాసు; తెలుంగును గాదు; ధారలో
జీవము లేదు; పాక మతిచిత్రము; వింతలకైత; మేల్ భళీ
పావనిరో విరామసదుపాయము నీ కగునంచు నేమొ పై
రావణభాషలో మునిగి రంజిలుచుండెద వేల భారతీ!

దక్కను లేదు రాష్ట్ర మిఁక దక్కను లేదు స్వరాజ్యలక్ష్మి మా
యక్కన మాదనార్యుల సహాయము లేకను పోయెనేమొ పె
ద్దక్కను జేరె సర్వము భయావహమాయె నిరంకుశత్వ మే
దిక్కున జూచినన్ ప్రజల దీనతయే గదసూవె భారతీ!

పూలకు తోట, బ్రాహ్మణుల పూజకు దేవునిపెట్టె, రాజకీ
యాలకు కోట, దేశమరియాదకు దిద్దిన ముద్దుమూట, శా
స్త్రాలకు పెద్ద, రాపలుకు రాలకు కొండ, యదెంతొ, మం
త్రాలకు నొజ్జవై బహుపరాకులు మానుచు వ్రాయు భారతీ!

విద్యుత్ సాధ్య సంవర్ధనము

(Electro Culture)

శ్రీ దిగవల్లి శేషగిరిరావు

దీన్ని మైనిపురీజిల్లా కలెక్టరు, ప్రొఫెసర్ యస్. యస్. నెహ్రూ ఐ. సి. యస్. గారు కనిపెట్టారు మాగ్నెటోను చెట్లు, పశువులు, మనుష్యులు, నీరుమొదలగు జీవంగలవాటిమీద ప్రయోగిస్తే వాటిలో విద్యుత్తు ప్రవేశించి బలం కలిగించుట, వృద్ధి యగుట, బాగా పెరుగుట, వ్యాధులు కుదురుట మొదలైన లాభాలు కలుగుతాయి. దీని క్కావలసిన మాగ్నెటో (**Magneto**) పదిరూపాయల్లో దొరుకుతుంది. ఎల్ల కాలం పనికివస్తుంది. దీని నిజానిజాలు తెలుసుకొని అమెరికా, జర్మనీ, ఫ్రాంసుదేశాల్లో ఉపయోగించి ప్రజలు చాలాలాభాలు పొందుతున్నారు. మనదేశంలో యునైటెడ్ ప్రావిన్సు గవర్నమెంటువారు ఉపయోగించి చూసి, దీని ఉపయోగాన్ని ఎక్కువగా పొగిడారు.

ఈ పద్ధతిప్రకారం చేసి చూసి అనుభవంమీద అనేకమంది దేశీయులు, విదేశీయులు యిచ్చిన ఎన్నో అభిప్రాయా లున్నాయి. మన మద్రాసురాజధానిలో కూడా యీవిధానాన్ని అక్కడక్కడ అవలంబించి లాభం పొందుతున్నారు ఇందులో వ్రాసిన విషయాలన్నీ అనుభవంమీద వ్రాసినవే. ఇది హిందీ, ఇంగ్లీషు భాషలలో వుండటంచేత నా ఆంధ్రసోదరులకోసం తెలుగులో అనువాదంచేసి ప్రకటిస్తున్నాను. అతి చవుకలో అనేకవిధాల లాభాలు చేకూర్చే యీ విధానాన్ని కనిపెట్టిన శ్రీ నెహ్రూగారు సదా మనభారతీయులకు వందనార్హులు.

మాగ్నెటో

(Magneto)

ఇది ౬,౭అం. పొడవు, ౩,౫అం. వెడల్పు, ౫,౪అం. ఎత్తు వుంటుంది. ఒకవేపు తిప్పటానికి చక్రం, రెండోవేపు తీగెలు వుంటాయి. ఈతీగె ఒక్కొక్కప్పుడు లోపల, ఒకప్పుడు బయటా వుంటుంది. ఒకటిగాని, ఒకటికన్న ఎక్కువగాని తీగలు వుంటాయి. ఎక్కువ తీగెలు వుంటే వాటి నన్నిటిని కలిపికట్టాలి. ఎంతపొడవు కావలిసిస్తే అంతతీగె తీసుకోవాలి. మేగ్నెటోచక్రం తిప్పితే రవ్వలు (**Sparks**) వస్తాయి. రవ్వలు వస్తున్న వనటానికి గుర్తు చేతికి దెబ్బలుతగులుతే. ఈ రవ్వలను కళ్లారా చూడాలంటే మేగ్నెటో పైభాగపు యినుపముక్కపై తీగెకొనను పెట్టి చక్రం తిప్పితే కనిపిస్తవి. ఒక అంగుళంపొడవున్న రవ్వలో ఆరువేల బోల్టుల విద్యుత్తు వుంటుంది. చక్రం ఎన్నిమాట్లుతిప్పితే, ఎన్నిరవ్వలు వస్తాయో తెలుసుకొని దాన్నిబట్టి కావలిసినంతసేపు రవ్వలను పుట్టించవలెను.

విద్యుత్సాధ్యసంవర్ధనము

(Electro Culture)

చెట్లు, మనుష్యులు, నీరు, పశువుల్లో విద్యుచ్ఛక్తిని సమావేశపరచి, అందువల్ల వృద్ధిపరచే విధానాన్నే విద్యుత్సాధ్యసంవర్ధనము (**Electro Culture**) అంటారు.

మూలసిద్ధాంతం

ప్రాణంగల ప్రతి జీవిశరీరంలోనూ, కోట్లకొలది సూక్ష్మరంధ్రా లున్నాయి. వాటిలోగల కణములకు (**Cells**) విద్యుత్తు చేరేలాగు చేస్తే వాటిబలం, శక్తిన్ని వృద్ధి అవుతాయి. దీనివల్ల గుణంకూడ తొందరగానే కనిపిస్తుంది. విధానం తేలిక, డబ్బుకర్చు తక్కువ.

ఇవి ఆరువిధాలు

(౧) రేడియోమేగ్నెటిక్-రేడియోఅయస్కాంతం (**Radio magnetic**).

(౨) అగస్కారైజేషన్ — అగస్కారీకరణము (**Agaskarisation**)

(౩) స్పార్కింగ్-రవలను పుట్టించుట (**sparking**).

(౪) ఎలెక్ట్రో పెయింటింగ్ — విద్యుల్లేపనము (**Electro painting**).

(౫) గుర్విచరేజ్ (**Ultra Violet Rays**)

(౬) సంబద్ధ (**Electro Magnetic**)

౧. వైద్యుత చుంబకము
(Electro Magnetic)

(అ) లోతుగ గొయ్యి తవ్వి దానిమీద యినప జల్లెడపెట్టి దానిమీద ఎరువు, దానిమీదమన్నూపోసి విత్తులు పెట్టినట్టయితే, పాదులు పెట్టినగింజలు జల్లెడలాకొన్న విద్యుచ్ఛక్తివల్ల త్వరగా మొలుస్తయి. ఇదేవిధంగా చెట్టు తొందరగా పెరగాలంటే, చెట్టు మొదలుకు చుట్టూ అంటుకునేలాగ యీజల్లెడచుట్టినా, కొమ్మకు తగిలించినా, లాభం పొందవచ్చును.

(ఆ) పూర్తిగా విడిపోకుండావుండి విరిగిపోయిన కొమ్మవుంటే, ఆకొమ్మకు దీన్ని తగిలిస్తే, ఆకొమ్మ అంటుకుంటుంది.

(ఇ) ఈ యినపజల్లెడ తగిలించిన చెట్ల ఆకులు ఎక్కువ పచ్చగా వుంటాయి. కాయలు బాగా వుండటమే కాక, రుచిగాకూడా వుంటాయి.

చెట్టులావు ననుసరించి, యీ జల్లెడపొడుగూ, వెడల్పూ వుండాలి.

ఈ జల్లెడ వక అంగుళం లోతున భూమిలోను, రెండుఅంగుళముల ఎత్తు నేలపైనా వుండాలి.

దీనివలన లాభాలు: — అప్పుడప్పుడు చెట్టు మొదలుకు చుట్టూవుంచిన యీ జల్లెడకు రవలు పుట్టిస్తే, చెట్టుకు ఏవైనా పురుగులు పడితే చచ్చిపోతాయి.

చాలా చెట్లుంటే?

రెండు కర్రలు తీసుకో. వాటిని పొలం రెండు చివరలా పాతు. పాతినతరువాత రెండుకర్రలపై చివరలకూ యినపదికాని, రాగిదికాని పొడుగాటి తీగెను తీసుకొని, ప్రతిచెట్టు మొదలుకు తాకులాగు కట్టు. తరవాత మాగ్నెటో (**Magneto**) తో, ఆ తీగెకు రవలుపుట్టించు. అప్పుడు చెట్టుకు పట్టిన పురుగులన్నీ చచ్చిపోతాయి.

అన్నిలోహాల జల్లెడల్లోకీ ఇనపది, తుత్తునాగపుది (**Zinc**) యెక్కువ వుపయోగకరమైనవని అనుభవంమీద తెలుసుకొన్నారు.

జల్లెడ యెల్లా తగిలించాలి?

ఏవిధంగా వూడదియ్యాలి?

జల్లెడ ఎప్పుడన్నా తగిలించవచ్చు. ఎప్పుడూ వుంచవచ్చు. చెట్టు ఎప్పుడైతే బాగా పూరి లావు అవుతూందని తోస్తుందో అప్పుడు జల్లెడను కొంచెం వొదులుచెయ్యాలి.

జల్లెడజాకెటు తగిలించడం: —

చెట్టుకు ఎక్కడైనా జబ్బువస్తే, అక్కడ జల్లెడను గొలుసులాగు తగిలిస్తే వెంటనే తగ్గుతుంది. ఇట్టిహారాన్నే మనుష్యులకు మెడలో తగిలిస్తే నిద్ర రానివారికి తొందరగా నిద్ర వొస్తుంది. చెట్లకు ౩ లేక అంగుళం వెడల్పుగల గొలుసు లాభకారి. మనుష్యులకైతే వక అంగుళంనుండి నాలుగంగుళాల పొడవు వరకుగల గొలుసు తగిలించాలి.

౨. ఆగస్కారీకరణము
(Agaskarisation)

బి. బి. డబ్ల్యు. ఆగాస్కార్ గారు కనిపెట్టటం వల్ల దీనికీపేరు వచ్చింది. ఈయన విద్యుత్తు ప్రవహింపజేసిన నీటివల్ల లాభాలు కనిపెట్టారు. నీటిలో విద్యుత్తును ప్రవహింపజేయుటానికి రవలు వొదలాలి. నీటిలో మేగ్నెటోతీగెను వొదలితే, అందులో విద్యుత్తు ప్రవహిస్తుంది. విద్యుత్తు నీటిలో చేరుతున్నట్లు దృష్టాంతానికి నీటిలో చెయ్యిపెట్టితే (విద్యుత్తుపంపేప్పుడు) చెయ్యి నెట్టివేయబడుతుంది.

ఉపయోగించేవిధము: — ఈనీటిని ఎప్పుడన్నా వుపయోగించవచ్చును. నీళ్లలో విత్తనాలగింజలు వేసి

విద్యుచ్ఛక్తి గలనీటిలో వకటి, రెండుగంటలసేపు వుంచితే చెట్లు చాలా పెద్దవి అవుతాయి. అన్నిరకాల విత్తనాల గింజలూ యీవిధంగా చెయ్యవచ్చు. కాయలు, పువ్వులు బాగా వుంటాయి. తుపాను వచ్చినా, గాలి వచ్చినా కాయలు రాలవు.

ఎక్కువ నీటిలోనికి విద్యుత్తు పంపుట:— నీళ్లల్లో ఎక్కడికి విద్యుత్తు పంపాలంటే అక్కడ మేగ్నెటో తీగెను పెట్టు. కుండలోగాని, చెరువు, నుయ్యి, కాలువ, నదులలోకిగాని విద్యుత్తు పంపవచ్చును. నీరు నిలవవున్న చోటయితే అక్కడ తీగెను తగిలించి కొంచెంసేపు స్పార్కు చేస్తే (మూడు, నాలుగునిమిషాలు సాధారణంగా చాలు) ఆనీటికి విద్యుత్తు వస్తుంది. పారే నీరైతే దానిమధ్యకు తీసికొనిపోయి స్పార్కు చెయ్యాలి. చుట్టూ రాళ్లతోగాని, సిమెంటుతోగాని కట్టిన వాటిలో మూడువారాలు దాదాపు యీశక్తి నిలిచి వుంటుంది. మట్టివైతే వకవారం వుంటుంది. తరవాత మళ్లీ స్పార్కు చేస్తే విద్యుత్తు వస్తుంది. పెద్ద పెద్దభాగాల్లో విద్యుత్తు ప్రవేశపెట్టాలంటే అయిదారు చోట్ల తీగెను వుంచి స్పార్కు చెయ్యాలి.

దీనిలాభాలు: — ఈ నీరు చెట్లకు చల్లుట, పోయుటవల్ల చెట్లు పెరుగుతాయి. మంచి కాయలు కాస్తాయి. పువ్వులు బాగా పూస్తాయి. విత్తులు నానవేయుటవల్ల త్వరగా మొలుస్తాయి. బాగా పెరుగుతాయి.

గొడ్లకు యీనీరు యిస్తే బలం వచ్చి యెక్కువ పాలు యిస్తాయి.

గాయాలు యీ నీటితో కడిగితే తొందరగా మానుతాయి. కన్ను, ముక్కు, చెవి గొంతువ్యాధులకు యీనీరు బాగా పనిచేస్తుంది.

ధాతువుతో చేసిన పాత్రల్లో వున్న నీటికి విద్యుత్తు పంపాలంటే, ఆపాత్రలకింద కొయ్య లేక అద్దాన్నుంచి విద్యుత్తును పంపాలి.

ఇట్టి నీటివల్ల చెట్లకు పట్టిన పురుగులు చస్తాయి. చెట్లకు గల జబ్బులు నశిస్తాయి. మంచువల్ల పాడైన చెట్లు బాగుపడుతాయి.

౩. రవలు పుట్టించుట
(Sparking)

విద్యుచ్ఛక్తిని చెట్టు, పశువు, మనుష్యుడు — వీటిలో ప్రవేశపెట్టేవిధానాన్ని స్పార్కింగు (రవలు పుట్టించడం) అంటారు.

నీటికి చెయ్యాలంటే, మేగ్నెటో తీగెను నీటిలో పెట్టి చక్రం త్రిప్పుతుండాలి. అప్పుడు అందులో విద్యుత్తు ప్రవేశిస్తుంది. (౪ లేక ౫ నిమిషాలు చాలు.)

గింజలకు చెయ్యాలంటే, యినపపళ్లెంలో గింజలు పోసి పళ్లెంకు తీగెను తగిలించి స్పార్కు చేస్తే, మొక్క తొందరగా పెరుగుతుంది.

చెట్టుకు తగిలించిన జల్లెడకు తీగె తగిలించి పైవిధంగా చేస్తే చెట్టుకు పట్టినపురుగులు పోతాయి. ఎక్కువబలం వస్తుంది. ఎండినకొమ్మకూడ చిగిరిస్తుంది. అట్టికొమ్మకు జల్లెడ తగిలించి స్పార్కు చెయ్యాలి.

పశువులు, మనుష్యుల కంఠగ్రంథులలో యీ శక్తిని ప్రవేశపెడితే జీర్ణశక్తి వృద్ధిపొందుతుంది. బాధ కలచోట స్పార్కు చేస్తే బాధ పోతుంది. ఒక్కొక్కప్పుడు నాలుగైదుమారులు స్పార్కు చేస్తే ఎక్కువ శాంతికూడా కలుగుతుంది.

౪ సుర్వీచరేజ్

సుర్వీచరేజ్ లేక ఏమరేజ్ నే **Ultra Violet Rays** అంటారు. ఇవి వుల్లిపాయలు, ముల్లంగి, గాజరగడ్డలలో ఎక్కువగా వుంటాయి. ఈ మొక్కలు ఏపంటమొక్కచుట్టూనైనా పాతితే అవి ఎక్కువగా పండుతాయి ఈ విధంగాచేసి రబ్బరు మొక్కగూడా పెంచవచ్చు.

౫. విద్యుత్తు లేపనము
(Electro Culture Painting)

కిరసనాయిలులో స్పార్కుచేసి విద్యుత్తుపంపితే దానిగుణం నీటివలె మారుతుంది. ఆ కిరసనాయిలును కాయలకు పూస్తే, ఆకాయలు చాలారోజులవరకు పచ్చివిగా వుంటాయి. మాపులకు అందంగాకూడ వుంటాయి. ఇట్లే పువ్వులకుకూడ చెయ్యవచ్చును.

౬ సంబద్ధం

పైపద్ధతులలో వకటికి యింకొకటి సహాయం చేస్తే ఆపద్ధతిని సంబద్ధం అంటారు. ౧. గింజలను విద్యుత్తుగల నీటిలో నానబెట్టుట, ౨. చెట్టుకు జల్లెడ తగిలించుట, ౩. చెట్టుకు తగిలించిన జల్లెడకు స్ప్రేర్కు చేయుట, ౪. ఎల్లప్పుడు విద్యుత్తుగల నీటిని పోయుట. నీటిలో విద్యుత్తు వచ్చినట్లు తెలుసుకోవలెనంటే, విద్యుత్తు వచ్చిన నీటిరుచి మారుతుంది. విద్యుత్తు పారుతున్న నీటిలో వేలుపెడితే, ఆ వేలు లోసివేయబడుతుంది.

వకసారి విద్యుత్తు పంపినవిత్తులకు వాటి నాలుగు తరములవరకు ఆశక్తి వుంటుంది. కాని ప్రతిమారు విద్యుత్తు సంపుటే మంచిది. అందువల్ల పంట వృద్ధి అవుతుంది.

ఇట్టిపంటకు ఎటువంటి ఎరువైనా పనికొస్తుంది. **Organic Farm Yard Manure** వుపయోగిస్తే, దానిపైని జల్లెడ పెడితే మంచిది.

ఏరకం భూమిలోనైనా యీ ఎలెక్ట్రోకల్చర్ సహాయంతో వ్యవసాయం చేయవచ్చును. ఊసర క్షేత్రాల్లోకూడా లాభదాయకంగా పనిచేసింది. ఇసుక నేలల్లోకూడా బాగా పనిచేస్తుంది. ఏమాదిరి నీటిలోనైనా సరే యీవిద్యుత్తు ప్రవేశపెడితే దానిదోషాలన్నీ పోయి లాభదాయకం అవుతుంది.

పళ్లు, పువ్వులు, కూరగాయల వ్యవసాయం, కోడిగ్రుడ్ల వ్యాపారం, పాల వ్యాపారం చేసేవాళ్లకు యీ ఎలెక్ట్రోకల్చర్ లాభదాయకం.

ఉల్లిపాయను ఉపయోగించేవిధం

వ్రణం, నాడీవ్రణం, గ్రంథులకు కాగితం గొట్టంలో ఉల్లిపాయ పెట్టి వ్రణంమీద కొంతసేపు ఉంచాలి.

నొప్పి, గాయం, కురుపులు మొదలైనవి కడిగి ఉల్లినీటితో కడిగితే లాభకరం (కొత్తగాతీసిన ఉల్లిపాయ దానికి ౧౦౦ రెట్లు నీటిలో ౫ నిమిషాలు వుంచితే తయారవుతుంది.)

వాపులు, దెబ్బలు మొదలయినవాటిమీద ఉల్లిపాయ చూపించాలి.

వ్రణం పక్వం కావలెనన్నా, నెత్తురుకారటం ఆగిపోవాలన్నా, ప్లేగుగ్రంథులు మానాలన్నా వుల్లిపాయను మెత్తగానూరి వాటిపైని కట్టాలి.

ఆరోజు తీసినవిగాని, అప్పుడే తీసినట్టివిగాని ఉల్లిపాయలను ఉపయోగించాలి.

గ్రంథుల (Glands)కు బలం కలిగించటానికి కూడా ఉల్లిపాయను చూపిస్తే లాభకరం.

ముల్లంగి, గాజరగడ్డలు గొడ్లకు పెడితే చాలా మంచిది.

౧-అ. మంచపుకోళ్ల క్రింద మూడంగుళాలు పొడుగు, మూడంగుళాలు వెడల్పుగల రబ్బరు పెడితే నిద్ర వస్తుంది. పాతసైకిలు లేక మోటారుయొక్క ట్యూబుగాని టైరుగాని పనికివస్తుంది.

ఆ. వక అణా ముత్యాలు తీసికొని ఇనుపతీగకు గ్రుచ్చు. మొదటిరోజు రాత్రి వకతీగతో చేసిన హారం, రెండవరాత్రి రెండుతీగెలది, మూడవరాత్రి మూడుతీగెలది, నాల్గవరాత్రి నాల్గుతీగెలు (ముత్యాలు గ్రుచ్చినట్టివి) గల హారాన్ని ధరించు. వీటితోపాటు అందానికి గుర్తుకు రంగులను కూడా ఉపయోగిస్తారు. ఒక తీగగల హారానికి తెల్లముత్యాలు, రెండుతీగెలు గల దానికి బంగారురంగువి, మూడుతీగెలు గలదానికి బాదంరంగు (పసుపు ఎరుపువన్నెల మిశ్రమం) ముత్యాలు, నాల్గుతీగెలహారముకు ఆకుపచ్చరంగు ముత్యాలు ఉపయోగించు. పడుకోబోయేటప్పుడు పై ప్రకారం ధరిస్తే మంచి నిద్రవస్తుంది.

౨. అగస్క్రైజ్డ్ నీటిని తయారు చెయ్యాలంటే యీవిధంగా చెయ్యాలి:—

పాతమోట్కారు లేక మోటారుసైకిలు మేగ్నెటో (**Magneto**) వర్కుషాపుల్లోనూ, మోటారుకంపెనీల్లోనూ సుమారు ౧౦ రూపాయల ధరలో దొరుకుతుంది. దాన్ని తెచ్చి దానికి వున్న చక్రాన్ని త్రిప్పితే రవ్వలు వస్తవి. చక్రం తిప్పేటప్పుడు దానికివున్న తీగెను నీటిలో పెట్టి చక్రాన్ని వకటిరెండు రవ్వలు

నీటిలో పడేటంతవరకు (గాజు లేక మట్టిపాత్రయందలి నీటికిమాత్రం) తిప్పితే విద్యుత్తుగల నీరు తయారవుతుంది.

చెరువులోగాని, నూతిలోగాని యిట్టి నీరు తయారుచెయ్యాలంటే ౫,౬ చోట్ల ఎక్కువసేపు పైవిధంగా చేస్తే విద్యుజ్జలం తయారవుతుంది. ఇట్లాంటి నీటితో నోరు, కళ్లు, పన్ను, చెవి, ముఖం కడుక్కొంటే వాటిసమస్తబాధలూ పోతాయి. కురుపు, రణం, తీట, గజ్జిపొక్కులకూడా యిది చాల లాభకారి. రోజుకు ౩, ౪ సార్లు జబ్బుగలప్రదేశాన్ని శుభ్రంగా కడగాలి.

ఇట్లా బయటిభాగాలు కడిగినతరవాత ఉదయం వక గ్లాసునీరు, నిద్రించబోయేటప్పుడు వక గ్లాసునీరు త్రాగితే చక్కనినిద్ర వస్తుంది. ఆకలి అగుట, జీర్ణమగుట, నులిపురుగులు తగ్గుట మొదలగు లాభాలు కలుగుతాయి. ఎప్పుడూ యిట్లాటినీరు ఉపయోగిస్తూవుంటే చక్కటి ఆరోగ్యంకలవారై వుంటారు.

౩. ఉదయం ఎండలో రబ్బరుబూటు తొడుక్కొనిగాని, ఎండుగడ్డిమీదగాని సూర్యుడికై వుముఖం పెట్టి యీ క్రిందివిధంగా ప్రాణాయామం చేస్తే బలం కలుగుతుంది. ఆరోగ్యం బాగుపడుతుంది. ౧, ౨, ౩, వరకు లెక్కిస్తూ (ముక్కుతో) గాలిపిల్చు. ౧, ౨, లెక్కించేవరకు గాలిని లోపల ఆపు. మరల ౧, ౨, ౩ వరకు లెక్కిస్తూ గాలిని విడువు. యీవిధంగా క్రమక్రమేపి పైని చెప్పిన లెక్కప్రకారం ఎక్కువ చేసికొంటూరావాలి.

ఈ విధంగా ౫, ౬ నిమిషాలు చేస్తే చాలు. శీతకాలంలో అయితే ౭-౭½ గంటలమధ్య, ఎండకాలం అయితే యింకా ముందు యీ విధంగా చెయ్యాలి.

౪. భోజనంచేసేటప్పుడు ఉల్లిపాయలు,ముల్లంగి మొదలైనవి పళ్లెం లేక మట్టిపాత్రలో పెట్టి వాటిమీద కొద్దిగా మెత్తగా నూరినఉప్పు చల్లి తినటం మంచిది. వీలైతే, దానిమీద నిమ్మకాయరసం పిండితే యింకామంచిది. నిల్వవున్న, ఆరిపోయిన ఆహారవస్తువులను ఉదయం ఎండలో వక అరగంటసేపు వుంచి తింటే ఆరోగ్యకరం.

౫. సంధి వాతపునొప్పులు మొదలైన వాటి చోట్ల ౫ లేక ౧౦ నిమిషాలసేపు ఆ బాధగలచోట ఉదయపు ఎండను చూపించు. గ్లాండులర్ అక్టివికేషన్ మేగ్నటోతీగెను మొట్టమొదటి కంఠగ్రంధి యందలి రెండవకంటి కొనక్రింద, మూడవ గ్లాండుపైన, నాల్గవ గ్లాండుక్రింద వెన్నుముకచర్మం మీద ఒక అరనిముషంసేపు తిప్పాలి. దీనివల్ల భయపడవలసిన పని లేదు. ఏనుగు, గేదెకుకూడా యిట్టి తీగెతోవచ్చిన ఒకరవ్వచేతనే చాలాలాభం కల్గుతుంది. ఆశ్చర్యపడవలసిన పనిలేదు.

అ. జ్వరం వచ్చినప్పుడు **Fever Mixture** విద్యుజ్జలంతో తయారుచేసినా, భోజనపదార్థంపైని ఒక అయస్కాంతపురవ్వ పడవేసినా చాలాలాభం కలిగిస్తుంది. అనుభవంమీద ఇది చాలాలాభకారిగా తేలింది.

ఆ. జలుబు, పడిశెములకు మందుకుబదులు రాత్రిళ్ళు వేడినీళ్లల్లో ఒకవిద్యుత్కణం పడేసి, నిమ్మకాయలేక పుల్లనారింజకాయరసం పిండి త్రాగితే తగ్గిపోతుంది.

ఇ. డయేరియా, రక్తవికారాలకూ విద్యుజ్జలం త్రాగటం చాలా లాభకారి. ఒక్కొక్క విద్యుత్కణము కంఠం, మెడ, తలవెనకభాగంలో వదలితే మరీ లాభిస్తుంది. ఇంకా ప్లీహ, గొంతుకలందుకూడా వదలాలి.

ఈ. బలహీనంగా వున్నచోట్ల బలం వచ్చేటట్టు చెయ్యాలంటే రబ్బరు ఆసనం లేక గడ్డిచాపమీద కూర్చోపెట్టి విద్యుత్తు కోరినభాగంలో సులువుగా పడేటట్టు కూర్చొని, పడుకొని లేక నిలుచొని వుండేటట్టుచేసి విద్యుత్కణాలు అక్కడికి వచ్చేలాగు చేస్తే లాభం కలుగుతుంది.

ఈ రబ్బరుచాప, పాతట్యూబు కోసి కొంచెంసేపు (౪,౫ నిమిషాలు) దానిపైకి విద్యుత్తు పంపితే తయారవుతుంది.

౧. సాధారణంగా వీలైనంతవరకు విద్యుజ్జలం త్రాగుతే మంచిది. విద్యుజ్జలంలో మందు కలిపి తాగితే యింకా గుణకారిగా వుంటుంది.

౨. విద్యుత్కణాన్ని శరీరంమీదకు సంపదలచుకొంటే రబ్బరు ఆసనంమీదగాని ఎండుగడ్డి చాపమీదగాని కూర్చోపెట్టి కొద్దినిమిషాలసేపు విద్యుత్తు పంపాలి. కింద కూర్చుంటే లాభకారిగా వుండదు. ఈప్రకారం మూడురోజులైనా చెయ్యాలి. అవసరమైతే పదిరోజులకొకసారి వరుసగా మూడు రోజులు చెయ్యాలి.

ప్రారంభదశలో వున్న వ్రణం, అన్నివిధాలైన బాధలు తేలు, పాముకాట్లు, తీట, దురద, కురుపులు, పుండ్లు సమస్తమైన కంటివ్యాధులు, జ్వరం, మలేరియా, హృదయవ్యాధులు మొదలైన వాటిమీద బాగా పనిచేస్తుంది.

తెల్లవెండ్రుకలుగలవారికి ఆవనూనెలో విద్యుత్తు ప్రవేశింపజేసి ఆనూనెను తలకు రాస్తే వెండ్రుకలు నల్లబడతాయి.

కొన్ని వాసనగల పూలచెట్లకు విద్యుత్తు పంపటంవల్ల వాటి (పూల)రంగు మారింది.

ఒక మనిషికి ప్రతిరోజూ తలనొప్పి వస్తూ వుండేది. ఎన్నోమందులు ఎంతో డబ్బు ఖర్చుపెట్టి పుచ్చుకున్నా తగ్గలేదు. అప్పుడు కొన్నిరోజులు తలకు విద్యుత్తు పంపుటచే తగ్గింది.

కోడిగ్రుడ్లకు విద్యుత్తు పంపుటచే బాతుగ్రుడ్లవలె పెద్దవయాయి.

విద్యుత్తును జేర్చి విత్తిన విత్తనాల కాయలు చాల రుచిగాను, పెద్దవిగాను వుంటున్నాయి. పూలచెట్లకు ఎక్కువ పువ్వులు పూశాయి.

అకాలంలో కూడా పూయుట, కాయుట విద్యుత్తును ప్రవహింపజేయటంవల్ల చేయవచ్చు. సకాలంలో అయినవాటివలె బాగానే వుంటవి.

విద్యుజ్జలంలో వేసిన తవుడుతో పెట్టిన కుడితి వల్ల పాలు ఎక్కువగాను, రుచికరంగాను వుంటున్నాయి. నెయ్యి బాగావుంటూంది. ఇట్టినేతిని మైన్‌పురీ, కలకత్తాలలో ఎక్కువఖరీదిచ్చి కొంటున్నారు.

చెరుకురసం వండేటప్పుడు విద్యుత్కణాలు దాంట్లో వేయటంచేత బెల్లం తెల్లగానూ, రుచిగానూ ఎక్కువగానూ అయింది.

కోడిగ్రుడ్లకు యీకిరణాలు పంపటంచేత వాటి నుండి పెద్దకోళ్లు వచ్చి ఆరోగ్యంగానూ, బలిష్ఠంగానూ వుంటున్నాయి. అవి ఎక్కువగుడ్లనుకూడా పెడుతాయి.

మురుగునీరు, అనగా పురుగులు మొదలైనవిగల చెరువు లేక నిల్వవున్న నీటిలో ౧౦, ౧౫ నిమిషాలసేపు విద్యుత్తు పంపితే అవిచచ్చి నీరు శుభ్రంగావుంది.

చంటిబిడ్డల తల్లులకు విద్యుజ్జలం తాగటానికిస్తే పాలు వృద్ధి అవుతాయి. ఆపాలు త్రాగినపిల్లలు చురుగ్గానూ, బలంగానూ వుంటారు.

Rickets (పిట్టపారుట) వ్యాధిగల పిల్లలకూ, విరేచనం పచ్చగా అయ్యేపిల్లలకూ కంఠంలోవుండే గ్రంథులమీద కణాలుపడేట్టు తల్లికీ పిల్లవానికీ చేస్తే వెంటనే తగ్గుతవి. నొప్పివున్న చోటుకు కిరణాలుపంపితే నొప్పితగ్గి సుఖంగా వుంటుంది.

గింజలు మునిగేట్టు నీరుపోసి ఆనీటికి విద్యుత్తు పంపి, ౮ గంటలు అయినతరవాత గింజలు నాటితే తొందరగా మొలుస్తాయి. చెట్లు పెద్దవి అవుతాయి. కాయలు పువ్వులు ఎక్కువగా వుంటాయి. రుచిగా వుంటాయి.

స్పార్కుచేసి ఇచ్చిన ప్రతివస్తువు తేలికగా అరుగుతుంది.

కిరసనాయల్లో స్పార్కుచేసి ఆ నూనె పువ్వులమీద చల్లితే వాటిరంగు ముదురుతుంది.

సూర్యోదయసమయమందు, సూర్యాస్తమయసమయమందలి సూర్యకిరణాల్లో విద్యుత్తువుంది. ఆ సమయాల్లో సూర్యుడివేపు చూస్తూవుంటే కొన్నాళ్లకు కంటి జబ్బులుపోయి తేజస్సు వస్తుంది.

సెల్యులైడ్, లైకోపోడియముల కంటే ధాతువుతో చేసినకాడలు కంటి అద్దాలకుబిగిస్తే కంటికాంతి, దృష్టి పెరుగుతుంది.

ఇంటి గోడలకు పైని కొయ్య మేకులు కొట్టి రాగి లేక యినుపతీగ చుట్టి దానికి స్పార్కు చేస్తే కోతులు మొదలైనవి లోపలికి రావు.

ఎలక్ట్రికల్బగ్ గొలుసు మెళ్లో వేసుకొంటే చెడ్డకలలు, కలవరింతలు రావు.

కసరతు, నూనెరాచుకోటం, ఆటలు, ప్రాణాయామం మొదలైన వాటివల్ల శరీరంలో విద్యుచ్ఛక్తి వృద్ధి పొందుతుంది.

విద్యుత్తు ప్రవేశపెట్టిన లోహథస్మంవల్ల పాండురోగం మొదలైనవి తగ్గుతవి.

కాలినపుండ్లకు ఏదన్నా నూనెలో స్పార్కు చేసి అది రాస్తే తగ్గుతుంది.

నీటిలో మునిగినవాడిపొట్ట వొత్తినీరు బయటకు రప్పించి, శ్వాస ఆడకపోతే, ఊపిరితిత్తులు, ప్రక్క టెముకలమీద స్పార్కు చేస్తే సుఖంగా వుంటుంది.

హిస్టీరియా, అపస్మారం, మూర్ఛ, దయ్యం, భూతం, మస్తిష్క వికారం, కల్లు, నల్లమందు మొదలైనవాని మత్తు, గాయం, దెబ్బలు తగిలి స్పృహలేక పడిపోయినవానికి, స్పార్కు చేస్తే స్పృహవచ్చి కులాసాగా వుంటాడు. అవసరమైతే విద్యుజ్జలం అతనిమీద చల్లవచ్చు.

ప్లేగుగ్రంథులకు యీ కణాలు అద్భుతంగా పనిచేస్తాయి.

అలసినప్పుడు అక్కడక్కడ స్పార్కు చేస్తే బలం వచ్చి, ఉత్సాహంగా వుంటుంది.

బెణుకులు మొదలైనవాటిమీద పెదవి, చెయ్యి, ఎముకలు మొదలగువాటిలో వచ్చునొప్పులూ అన్నీ స్పార్కు చేస్తే తగ్గిపోతవి.

పక్షవాతం వున్నచోటా, సంధివాతపునొప్పులు వున్నచోటా స్పార్కింగు చేసి, స్పార్కింగ్ నూనె రాస్తే రక్తం పారి బాగుపడుతుంది.

కలరా, ఉబ్బసం, జలుబు, రాజయక్ష్మ, టైఫాయిడ్, మశూచికం, నరములవల్ల కలిగే కడుపునొప్పి, విరేచనాలు, వాతరోగం, కఫవ్యాధి, వేడి, మొలలు, కుష్ఠు, జ్వరం, బెరిబెరీ, రెడ్‌ఫీవర్, ఎల్లో ఫీవర్, మలేరియా, ప్లీహవ్యాధి, యకృత్తు, కుక్షి సంబంధవ్యాధులు, స్పార్కింగువల్ల యితరమందులు యిచ్చినా యివ్వకపోయినా కుదురుతవి. ఈమూడు రకాలవాటినీ ఉపయోగిస్తే యింకా గుణకారి.

మూత్రాశయంలో రాయి వుండి మూత్రం సరిగా రాకపోతే రాయి వున్నట్టు తోచినచోటుకు క్రిందిభాగంలో స్పార్కు చేస్తే బాధ తగ్గి మూత్రం సాఫీగా అవుతుంది.

గుండెకొట్టుకోటం ఆగితే అక్కడ స్పార్కు చేస్తే తొందరగా గుణమిస్తుంది. ఇంజెక్షన్లకంటె మంచిది

ఎక్కువగా పనిచేసి, ఎక్కువసేపు మేల్కొని వుండవలసినవారు తలమీద స్పార్కు చేసుకొంటే చాలా లాభకారి.

Thyroid Glands మీద స్పార్కు చేసి, తల రెండువైపుల స్పార్కు చేసి మాల ధరిస్తే పిచ్చివాడుకూడా బాగుపడతాడు.

మూలవ్యాధి, పిచ్చి, ప్రదరగర్భవ్యాధి మొదలగువాటికి స్పార్కింగు గొప్పగా పనిచేస్తుంది.

స్త్రీ పురుష రహస్యస్థలాలయందలి వ్యాధులు స్పార్కింగువల్ల తగ్గుతవి. వంధ్యాత్వము, నపుంసకత్వము స్పార్కు చేయటంవల్ల స్పార్కింగ్ ఆయిల్ రాయటం వల్ల తగ్గిపోతవి.

మోటారుడ్రైవర్లు మేగ్నెటోకు బదులుగా ప్లగ్ వైరువల్ల లాభం పొందవచ్చు.

పల్లు కదులుతుంటే దానికి స్పార్కు చేస్తే బిగుస్తుంది.

దీనివల్ల నూటికి ముప్పైపాళ్లు పంట వృద్ధి వుంటుం దని కనిపెట్టారు.

స్పార్కింగునీటిలో స్నానం చేస్తే, గంగాజలంలో స్నానంచేస్తే ఎంత ఆరోగ్యకరమో అంత ఆరోగ్య కరం.

వెన్నెముక, ప్లీహలమీద స్పార్కు చేస్తే దేహానికి శక్తి వచ్చి, సుఖనిద్ర వస్తుంది.

స మా ధి

"సంపత్"

అది వసంతవిలాసిని అల్లుకొనిన
పూలమాల ఆమనిలోనె రాలిపోయె;
ఇంతవిశ్వమ్ము నావలెనే తపించి
కరఁగిపోయిన దోకబాష్పకణముఁ జార్చి.

నిత్యకుసుమార్చనలఁ దోఁగి నీసమాధి
ఏడులోకాలపరిమళ మేలుకొనిన
నాయెద గలట్టి వలపులు పోయిపోయి
కౌఁగిలించును సప్తలోకాలతావి.

పనులపైఁ బోవ నిటు నింబవాటి వెడలు
తెరువరులు చూచి జాలిఁ జెందెదరు, నిన్ను
చిన్ని సురపొన్న వోయంచు, నన్ను ప్రోడు
వోయిన సుమలతావృంత మో యటంచు.

స్వాగతామోదవికచప్రశాంతసాంధ్య
సమయములలోన నచ్చరకొమరుటాండ్రు
వచ్చి నీరాజనము లిచ్చి పరతురేమొ
తావకసమాధి మందమందారవృష్టి!

కర్మజ్ఞానసముచ్చయవాదము

శ్రీ ఓగేటి వెంకటసుబ్బయ్యశాస్త్రి

వేదములును, గీతలును ప్రవృత్తినివృత్తిమార్గములను రెండుమార్గములను బోధించుచున్నవి. ప్రవృత్తి మార్గము కర్మమార్గము, నివృత్తిమార్గము జ్ఞానమార్గము. ప్రవృత్తిమార్గము జన్మపరంపరలకు సాధనము, నివృత్తి మార్గము జన్మబంధములను ఛేదించునది.

"శ్రుతి: ఇమౌ ద్వావేవ పంథానా వను నిష్క్రాంత తరౌ భవతః క్రియాపథశ్చైవ పురస్తాత్ సన్న్యాసశ్చోత్తరేణ నివృత్తిమార్గే ణేషణత్రయస్య త్యాగః తయోస్సన్న్యాసపథ మే వాతిరేచయతి న్యాస మేవాత్యరేచయదితి"

—నారాయణోపనిషత్తు.

ఈ రెండు మార్గములకు నెప్పుడును సముచ్చయము కలుగదు. 'దూర మేతే విపరీతే విషూచీయాచ విద్యాచా విద్యాచ జ్ఞాతా' అని శ్రుతి చెప్పుచున్నది.

ఇట్టి సందర్భమున వేదములయందును, గీతలయందును కర్మజ్ఞానసముచ్చయము చెప్పబడిన దని కొందరు వాదించుచుండుట విపరీతము. కర్మను జ్ఞానసహితముగా నాచరించినచో మోక్షము సిద్ధించు నని వీరి యభిప్రాయము. కర్మలును, ఉపాసనలును కేవలము చిత్తశుద్ధి కారకములుమాత్రమే యనియు, జ్ఞానమునకు సాధనములనియు వీ రంగీకరింపరు. వీరివాదమును శ్రీ శంకరు లిట్లు వర్ణించియున్నాడు:

"అత్ర కేచిదాహుః సర్వకర్మ సన్న్యాసపూర్వకా దాత్మజ్ఞాననిష్ఠామాత్రా దేవ కైవల్యం న ప్రాప్యత ఏవ — కింత ర్హ్యగ్నిహోత్రాది శ్రౌతస్మార్త కర్మ సహితాత్ జ్ఞానాత్ కైవల్యప్రాప్తి రితి సర్వాసు గీతాసు నిశ్చితోఽర్థ ఇతి."

శ్రీరామానుజు డీవాదమును సమర్థించెను. ఈ కాలమున నైతము ఈవాదము నభిమానించువారు లేకపోలేదు. కావున నీవాదమును చర్చించి సత్యనిర్ణయము గావించుటవసర మగుచున్నది.

కర్మయనగానేమి, జ్ఞానమనగానేమి ? ఎట్టికర్మకును ఎట్టిజ్ఞానమునకును సముచ్చయము చెప్పవచ్చును ? ఎట్టికర్మకును ఎట్టిజ్ఞానమునకును సముచ్చయము చెప్పరాదు ? అనువిషయము ప్రప్రథమమున విచారణీయము.

కర్మయనగా ఫలాకాంక్షతో చేయబడు సమస్త వైదికలౌకికకర్మ యని నిర్వచింపదగును. లౌకిక కర్మ యిహసాధనము, శ్రౌతస్మార్తకర్మలు స్వర్గ సాధనములు. ఇహపరసాధనమగు సమస్తకర్మలును శాస్త్రమునందు అనగా వేదమునందు చెప్పబడియున్నవి. ఈ కర్మజాల మంతయు ధర్మాధర్మలక్షణము, విధినిషేధరూపమైనది. ఈ కారణముచేత కార్యాకార్యవ్యవస్థితియందు శాస్త్రమే ప్రమాణముగా నుండదగు నని శ్రీ కృష్ణపరమాత్మ అర్జునునకు బోధించియున్నాడు. కర్మలు ఫలాభిసంధిపూర్వకముగా నాచరించిన దుఃఖములకును, నిష్కామముగా నాచరించిన సుఖమునకును కారణభూతము లగును.

సమస్తవైదిక లౌకికకర్మలును కర్తృత్వ భోక్తృత్వలక్షణములు గల వగుటచేత అవిద్యాజన్యము లగుచున్నవి. "ఈ కర్మలను నేను చేయుచున్నాను; ఈ కర్మఫలమును నే ననుభవింపగలను; అగ్ని వరుణుడు మున్నగు దేవతలు నాకు కర్మఫలములను చేకూర్తురు గాక" అను యాచనాబుద్ధితో జేయబడుకర్మలు జన్మ పరంపరలకు కారణములు. మనము సాధారణముగా చేయు దైనికకర్మలును ఇట్టి అజ్ఞానబుద్ధితోనే చేయబడిన వగుచున్నవి. "సమస్తకర్మలును ప్రకృతిచేత జేయబడుచున్నవి, నీవు నిర్లిప్తుడవుసుమా" యని శాస్త్రము ఘోషించుచున్నను అహంకారమువదలి కర్మలుచేయు

వా డెవ్వడైన కలడా? అహంకారంలేనిది ప్రవృత్తియే లేదుకదా! కావున సమస్తవైదిక లౌకికకర్మలును అజ్ఞానమూలములు, జన్మపరంపరలకు హేతువులు. వేదాంతములయందు కర్మకు అవిద్యయను అన్వర్థ నామము కలదు.

ఫలాకాంక్షతో చేయు అగ్నిహోత్రాదికర్మను వేదములు నిరసించుచున్నవి.

"అవిద్యాయామంతరే వర్తమానాః స్వయం ధీరాః పండితంమన్యమానాః దంద్రమ్యమాణాః పరియంతి మూఢాః అంధేనైవ నీయమానా యథాంధాః" అని చెప్పుచున్నవి. మరియు 'కర్మచితము'లైన లోకములను పరీక్షించి నిర్వేదము జెందినవాడు సమిత్పాణియై బ్రహ్మవిద్యకై శ్రోత్రియుడగు బ్రహ్మనిష్ఠునివద్దకు బోవలెనని చెప్పుచున్నవి.

కర్మస్వరూప మిట్టిది. ఇంక జ్ఞానమెట్టిది? కర్మజాలమును పటాపంచలు చేయునది. హృదయ గ్రంథులను ఛేదించునది. నేను కర్తను, నేను భోక్తను, నేను బ్రాహ్మణుడను, నేను క్షత్రియుడను, నేను బ్రహ్మచారిని, నేను గృహస్థుడను అనుభావముల నన్నిటిని నిర్మూలము గావించునది.

ఇట్టి కర్మజ్ఞానములకును, అవిద్యావిద్యలకును సముచ్చయము చెప్పవచ్చునా? కర్మయు జ్ఞానము అన్యోన్యబాధకములుగదా! కర్మజడునికి జ్ఞానము కలుగదు. జ్ఞానికి కర్మబంధము లంటవు. ఇట్టిఅన్యోన్య విరుద్ధలక్షములు కలవానికి సముచ్చయము పొసగునా?

మరి యెట్టికర్మకును జ్ఞానమునకును సముచ్చయము కుదురును? అగ్నిహోత్రాదికర్మను దేవతాజ్ఞానముతో చేయ వీలగును. కర్మలను అర్థము తెలియక చేయుటకంటె, అర్థము తెలిసి, ఏకర్మలో నేదేవత యుపాసింపబడుచున్నదో ఆ దేవత నుపాసించుట ఫలప్రదముగదా! 'కర్మణా పితృలోకః, విద్యయా దేవలోకః' అని రెంటికిని ఫలము వేరువేరుగా చెప్పబడినది. ఒక్కొక్క దానిని వేరువేరుగా నాచరించుటవలన అనర్థము వాటిల్లుచున్నది. చూడుడు. "అంధం తమః ప్రవిశన్తి యేఽవిద్యాముపాసతే, తతోభూయ ఇతి తేత మోయఉవిద్యాయాగ్ంరతాః" రెంటినికలిపి చేయుచో కర్మ వీర్యవంత మగు నని 'యదేవ విద్యయా కరోతి, శ్రద్ధయా ఉపనిషదా, తదేవ వీర్యవత్తరం భవతి' అని చెప్పబడుచున్నది. మరియు విద్యాం చావిద్యాంచయ స్తద్వేదోభయగ్ంసహ ౨విద్యయా మృత్యుంతీర్త్వా విద్యయా౨మృతమశ్నుతే" అనియు కలదు. దేవతాజ్ఞానముతో కర్మలను చేయనిచో మహానర్థము వాటిల్లునని ఛాందోగ్యమునందలి ఉషస్తిచాక్రాయణుని కథవలన తెలియవచ్చెడిని. శ్రుతి :

"ప్రస్తోతర్యాదేవతా ప్రస్తావ మన్వాయత్తాతాం చే దవిద్వాన్ ప్రస్తోష్యసి మూర్ధా తే విపతిష్యతీతి"

అనగా ఓ ప్రస్తోత్రి! ప్రస్తావమునకు సంబంధించి దేవతను నీవు తెలిసికొనకుండ దానిని గానముచేయుచో నీతల ఊడి క్రిందపడును"

ఇట్టులే యతడు ఉద్గాత్రిని, ప్రతిహర్త్రిని సంబోధించెను. ఈముగ్గురికిని తమకర్మలకు అధిష్ఠానములైన దేవతలు తెలియకపోవుటచేత తమతలలూడి క్రిందపడునేమోయని వారు తమపనులు మానిరి. అప్పుడు ఉషస్తిచాక్రాయణుడు ఆదేవత లెవరో వారికుపన్యసించెను. ఈ ఉపాఖ్యానమువలన కర్మను దేవతాజ్ఞానముతో చేయవలెనని స్పష్టమయ్యెడిని.

ఈశావాస్యము కర్మజ్ఞానసముచ్చయమును బోధించుచున్నదా ?

ఈశావాస్యోపనిషత్తునందు కర్మజ్ఞానసముచ్చయము చెప్పబడుచున్నదని కొందరు చెప్పుచున్నారు. కాని యిది యెంతమాత్రమును అంగీకరింపదగినదికాదు. ఈశావాస్యమునందలి మొదటిమంత్రము సన్న్యాసపరముగా చెప్పబడినది. 'ఈ ప్రపంచమునందు యే కించిత్తు జగత్తుకలదో అదియంతయు పరమాత్మచేత నిండియున్నది. ఇట్టి వైరాగ్యభావముచేత నీవు జీవింపవలసినదని మొదటిమంత్రము చెప్పుచున్నది. రెండవమంత్రమునందు కర్మలు చేయుచునే నీవు నూరుసంవత్సరములు జీవింపవలసినది. నీకు వేరుమార్గము లేదు. నరుడవు నీకు కర్మయంటదు అనికలదు. మొదటిమంత్రమునందు ఈషణత్రయ సన్న్యాసము చెప్పి రెండవ

మంత్రమందు శ్రుతి, తద్విరుద్ధముగా కర్మలు చేయ వలసిన దని చెప్పునా? నీకు సన్న్యాసమునందు అధికారము లేనిచో నూరుసంవత్సరములు నిష్కామకర్మ చేయుచు జీవింపవలెనని శ్రుతియభిప్రాయ మని తల చుట సమంజసము కాదా? రెండవ మంత్రమునందు 'నరే' అనుపదము గమనింపదగినది. నరు డనగా సామాన్యమానవుడు. అహంకారమమకారములువదలని వానికి నిష్కామకర్మ చెప్పబడుచున్నది. కామ్యకర్మ నూరుసంవత్సరములు చేసినను, నూరుజన్మలపర్యంతము చేసినను ప్రయోజనములేదు. ఇట్టివాడు ఆత్మను చంపు దోషమువలన జన్మమృత్యుప్రవాహమున కొట్టుకొని పోవుచు నెన్నడును పారము ముట్టడు. ఇట్లుగాక భగవద్గీతలో చెప్పబడిన కర్మయోగము నాచరించుచో క్రమముగా జ్ఞానము కలిగి ముక్తి కలుగును.

భగవద్గీతయందు చెప్పబడిన ద్వివిధనిష్ఠావిభాగమే ఈశావాస్యమునందు చెప్పబడియున్నది. మొదటిది జ్ఞానమార్గము రెండవది కర్మమార్గము. మొదటి మంత్రముయొక్క అర్థము నాల్గవమంత్రమునుండి ౮-వ మంత్రమువరకు వివరింపబడినది. రెండవమంత్రార్థము ౯-వ మంత్రమునుండి చిట్టచివరివరకు వివరింపబడినది. కర్మజ్ఞాన సముచ్చయమువలననే ఆత్యంతికమోక్షము కలుగు నని శ్రుతియభిప్రాయమైనచో కర్మలను ఉపాసనలను గావించి మోక్షము నొందినవానిచే శ్రుతి మార్గయాచనము చేయించునా? స్వస్వరూపము తెలిసినజ్ఞాని అగ్నిని సూర్యుని యాచించునా? అగ్నిలో నున్నది, సూర్యునిలో నున్నది తానేగదా! కావున ఈశావాస్యోపనిషత్తు కర్మజ్ఞాన సముచ్చయముగా చెప్పుచున్న దనుట విపరీతము.

కర్మకును, ఉపాసనలకును, జ్ఞానమునకును కలుగు ఫలితములు ముండకోపనిషత్తునందు స్పష్టముగా చెప్పబడియున్నవి.

శ్రుతి: "ఇష్టాపూర్తం మన్యమానావరిష్ఠం నాన్యచ్ఛ్రేయో వేదయంతే ప్రమూఢాః నాకస్య పృష్ఠే తే సుకృతేఽనుభూత్వేమం లోకం హీనతరం విశంతి."
అనగా యజ్ఞయాగాదులు, దానధర్మములు వరిష్ఠములుగా నెంచి శ్రేయమునకు ఇతరమార్గము లెవ్వరెరుంగరో వారు స్వర్గసౌఖ్యముల ననుభవించి హీనతరమగు నీలోకమునకు మరలివచ్చుచున్నారు.

—ముండక ౨—౧౯.

ఉపాసనలకు ఫలితము.

శ్రుతి: "తపఃశ్రద్ధే యే హ్యుపవసంత్యరణ్యే శాంతా విద్వాంసో భైక్ష్యచర్యాం చరంతః, సూర్యద్వారేణ తేవిరజాః ప్రయాంతియత్రామృతః సపురుషోహ్యవ్యయాత్మా."

అనగా ఉపాసకులకు సూర్యద్వారమున క్రమముక్తి చెప్పబడినది.

—ముండక ౨—౨౦.

జ్ఞానులకు ఫలము.

శ్రుతి: "వేదాంతవిజ్ఞానసునిశ్చితార్థాఃసన్న్యాసయోగా ద్యతయశ్శుద్ధసత్త్వాః। తే బ్రహ్మలోకేషు పరాంతకాలే పరామృతా పరిముచ్యంతి సర్వే".

ఇట్టివారికి వేరుజన్మములేదు. ఈ జన్మమునందే వారు ముక్తులగుచున్నారు. ఇట్టిజ్ఞాని నామరూపములు వదలి పరమపురుషుని జెందుచున్నాడు.

పైని జెప్పబడినదానివలన వేదాంతములయందు కర్మజ్ఞానవిభాగము స్పష్టముగా చెప్పబడిన దనియు, కర్మజ్ఞానసముచ్చయమున కెచ్చటను తావు లేదనియు స్పష్టము కాగలదు. కర్మలును ఉపాసనలును శ్రుతియందు అపరవిద్యయందు చేర్చబడినవి. జ్ఞానము పరవిద్య.

శ్రుతి: "న్యాసయితి బ్రహ్మహి పరః పరోహి బ్రహ్మ, తాని వా యేతాన్యపరాణి తపాంసి న్యాస మేవాత్యరేచయతి.

అనగా సత్యము, తపస్సు శమదమములు దానము అనువానికంటె జ్ఞానము ఉత్తమమని శ్రుతి అభిప్రాయము—

—నారాయణ.

భగవద్గీతయందు కర్మజ్ఞాన సముచ్చయము కలదా?

ఉపనిషత్తులయందు చెప్పబడిన కర్మజ్ఞాన విభాగమే సమస్తవేదార్థసారసంగ్రహమగు గీతాశాస్త్రము

నందును చెప్పబడియున్నది. 'లోకేస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా, మయానఘ! జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినాం" అని శ్రీకృష్ణుడు చెప్పియున్నాడు. పూర్వ మెప్పుడు చెప్పెను? వేదపురుషుని రూపమున చెప్పియుండెను. శ్రీకృష్ణు డర్జునునకు సాంఖ్యయోగ ముపదేశించినతరువాత అర్జును డడుగు ప్రశ్న గమనింప దగియున్నది. కర్మకంటె జ్ఞానము రెుక్కువయని నీయభిప్రాయమైనచో నెందుకు నీవు ఇట్టి ఘోరకర్మమునందు నియోగించుచున్నావు? అని అర్జును డడిగెను. దీనివలన కర్మకంటె జ్ఞాన మెక్కువ యని శ్రీకృష్ణునిమతమైనట్లు స్పష్టమగుట లేదా? ఇంతియగాక భగవద్గీతయంతటియందును జ్ఞానయోగమును కేవల బ్రహ్మముగానే వర్ణించి కర్మయోగమును జ్ఞానమునకు స్థానముగా చెప్పుచున్నాడు. భగవద్గీత కర్మను బోధించుట కేర్పడిన గ్రంథమనియు, కర్మనే యెక్కువైనదిగా శ్రీకృష్ణుడు చెప్పుచున్నాడనియు కొందరు చెప్పుచున్నారు. కాని గీతలు కేవలము కర్మనుగాని, కర్మయోగమునుగాని బోధించు గ్రంథము కాదనియు, ఉపనిషద్రూప మైనదనియు, బ్రహ్మవిద్య బోధించుటకు రచింపబడిన దనియు, చెప్పదగును. గ్రంథప్రారంభమున వీరుల శంఖారావములు, ఉభయసైన్యముల రణఘోషలు, వీరుల ఉత్సాహములు, నిరుత్సాహములు మన కట్టెదుట గనబడునట్లు చేయబడినను గ్రంథము కొంచెము సాగినకొలది యుద్ధము విషయమై మరువబడుచున్నది. ఏకాంతమున మోక్షకామియగు నంతేవాసి 'శిష్యస్తేహం శాధి మాం త్వాం ప్రపన్నం' అని చెప్పుచు గురువుపాదసమీపములను జేరి ప్రశ్నించుటయు, ఆ ప్రశ్నలకు గురువు సవిస్తరముగా ప్రత్యుత్తరములు చెప్పుటయు, అందుపై శిష్యునికి సందేహములు కలగగా గురువు ఆ సందేహములను బాపుటయు, తటస్థించుచున్నది. వేదమూర్తియగు వ్యాసుడు లోకానుగ్రహబుద్ధితో, వేదాంతార్థమును సుస్థిరముగా వెలయించుటకు ఉత్తరమీమాంసాశాస్త్రమునువలె భగవద్గీతలనుగూడ శ్రీకృష్ణార్జునసంవాదమను మిషతో రచియించెనా యని తోచును.

ఉపనిషత్తులయందువలె గీతలయందును కామ్యకర్మలు నిరసింపబడుచున్నవి.

'త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున' అని శ్రీకృష్ణుడు చెప్పుచున్నాడు. కర్మపరులు

'తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి; ఏవం త్రయీ ధర్మ మను ప్రపన్నాః గతాగతం కామకామా లభంతే"

కర్మను నిరసించి కృష్ణుడు కర్మయోగమును ప్రశంసించుచున్నాడు. ఈ కర్మయోగము జ్ఞానమునకు చాల దగ్గరగా నున్నదని చెప్పవచ్చును. ఒకొక్కచోట రెండును ఒక్కటేనా యని తోపించునట్లుగూడ చెప్పియున్నాడు.

'సాంఖ్యయోగౌ పృథగ్బాలాః ప్రవదంతి' అనగా సాంఖ్యము యోగము వేరువేరని తలచువారు బాలురని, అనగా మూఢు లనిగూడ ఒకచోట చెప్పియున్నాడు. ఇంత చెప్పియు కర్మయోగము చిత్తశుద్ధికరమనియు, జ్ఞానమునకు సాధన మనియు చెప్పియున్నాడుగాని సన్యాసమువలన కలుగు ఫలితము దీనికి కలుగునని చెప్పియుండలేదు. చూడుడు:

"శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరస్సంయతేంద్రియః,
జ్ఞానం లబ్ధ్వా పరాం శాంతి మచిరేణాధి గచ్ఛతి."

మరియు,

"నహి జ్ఞానేన సదృశం పవిత్ర మిహ విద్యతే
తత్స్వయం యోగసంసిద్ధః కాలేనాత్మని విందతి"

అనగా జ్ఞానముతో సమానమగు వస్తువు వేరొకటి లేదు. కర్మయోగమునం దారూఢుడవైన నీవు కాలక్రమేణ జ్ఞానముపొందగలవు అని చెప్పుచున్నాడు.

ఇంక జ్ఞానమును కేవలము బ్రహ్మముగానే శ్రీకృష్ణపరమాత్మ చెప్పియున్నాడు.

'నహి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే,'
'సర్వం కర్మాఖిలం పార్థ! జ్ఞానే పరి సమాప్యతే,'
'జ్ఞానీత్వాత్మైవ మేమతం,'

ఇట్టివాక్యములుజూడుడు. జ్ఞానికి చేయదగిన కార్యము లేవియులేవని

'య స్త్వాత్మరతి రేవ స్యా దాత్మ తృప్తశ్చ మానవః ఆత్మన్యేవచ సంతుష్టః తస్యకార్యం న విద్యతే"

మరియు,

'నైవ తస్య కృతేనార్థో నాకృతే నేహకశ్చన
నచాస్య సర్వభూతేషు కశ్చిదర్థవ్యపాశ్రయః'

యనిగూడ చెప్పియున్నాడు.

గీతలయందు కర్మజ్ఞాన విభాగము స్పష్టముగా కనబడుచునేయున్నది. ఎట్లన:

ఏషా తే అభిహితా సాంఖ్యే బుద్ధిః యోగే త్విమాం శృణు' అనగా యింతవరకు నీకు చెప్పబడినది సాంఖ్యయోగము. ఇకమీద కర్మయోగమును చెప్పెదను వినుము. మరియు,

'ధ్యానేనాత్మని పశ్యంతి కేచి దాత్మన మాత్మనా,
అన్యేసాంఖ్యేనయోగేన, కర్మయోగేన చాపరే"

అనియు చెప్పబడియున్నది.

తమ భగవద్గీతలో విజ్ఞానయోగ వివరణమునందు కీ. శే. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు ఈక్రిందివిధముగా చెప్పుచున్నారు: "మొదటి ఆరధ్యాయములయందును కర్మయోగస్వభావస్వరూపములు వివరింపబడినవి. కర్మయోగమునకు పరమార్థము బ్రహ్మజ్ఞానరూపమైన ఆత్మజ్ఞానము. కర్మలు విషయారాధన పరాయణములు గాక యజ్ఞార్థము లైనప్పుడు ఆత్మజ్ఞానమునకు సాధనములు"

కర్మయోగముద్వారా అస్మదాదులకు సైతము జ్ఞానము సమకూర్చుటయే భగవద్గీతయొక్క పరమార్థమని వేరుగా చెప్ప నవసరములేదు. మనమందరము అర్జునునివంటి శోకమోహావిష్ట చేతస్కులమేగదా! మన మందరము అజ్ఞానులమేగదా! మన మందరము అహంభావసమన్వితులమేగదా! ఇట్టి మనకు జ్ఞానము బోధించిన అర్థమగునా? మనకు నిష్కామకర్మ చెప్పుటయే యుక్తముగదా!

భగవద్గీతయందంతటను జ్ఞానమునకు కర్మయోగమును, భక్తిని సాధనముగా చెప్పుచుండ శ్రీరామానుజుడు భక్తిచేతనే ముక్తికలుగునని చెప్పియున్నాడు. ఈ సందర్భమున ఆయన వ్రాసిన విపరీతవాక్యముల నిచ్చట ఉదాహరించుట అసమంజసము కాదు. అష్టాదశాధ్యాయమున 'భక్త్యా మా మభిజానాతి' అనుశ్లోకమునకు వ్యాఖ్యానము గావించుచు

"విశుద్ధబుద్ధియోగాదిభిః బ్రహ్మప్రాప్తి రాత్మసాక్షాత్కారో భవతి, తతో భగవతి పుండరీకనయనే స్వస్వామి న్యత్యర్థప్రియానుభవరూపా భక్తి ర్జాయతే, భక్త్యా తతో భగవంతం జానాతి, తతో భక్తితఏవ భగవంతం విశతే"

అని వ్రాసియున్నాడు. అనగా "విశుద్ధజ్ఞానయోగమువలన బ్రహ్మప్రాప్తి కలుగుచున్నది. అనంతరము స్వస్వామియు, భగవంతుడు నగు పుండరీకనయనునియందు అత్యంతప్రియానుభవరూపమైన భక్తిజనించుచున్నది. భక్తిచేత తత్వతః భగవంతుని తెలిసికొనుచున్నాడు. అనంతరము భక్తిచేతనే భగవంతుని ప్రవేశించుచున్నాడు" ఈవాక్యములు వేదాంతాభిప్రాయమున కెంతవిరుద్ధములో వేరుగా చెప్ప నవసరము లేదు. ఆత్మజ్ఞానము కలిగినతరువాత నేత్రాద్యవయవ విశిష్టుడగు సాకారమూర్తి విశేషమును చూచుట పోసగునా? భగవంతుడు నిర్గుణుడుగదా!

"అశబ్ద మస్పర్శ మరూప మవ్యయం."

ఈ కారణములచేత ఉపనిషత్తులలోను, గీతలలోను కర్మజ్ఞాన సముచ్చయము చెప్పబడియుండలేదనియు, జ్ఞానము కేవలము పరబ్రహ్మస్వరూపముగాను, కర్మయోగము జ్ఞానమునకు సాధనముగాను, కర్మ తక్కువగాను చెప్పబడియున్నదనియు, కర్మజ్ఞానవిభాగము సర్వత్ర స్పష్టముగా కనబడుచున్నదనియు మనవిచేయుచున్నాను.

చిన్నపిల్లల చిత్తప్రవృత్తులు - శిశు శిక్షణము

శ్రీ గిడుగు వేంకటసీతాపతి

ఈ వ్యాసములో చిన్నపిల్ల లందరికిని సామాన్యముగాగల చిత్తప్రవృత్తులనుమాత్రమే కొంతవరకు విమర్శించి వాటి ననుసరించి ఇంటివద్దను తలిదండ్రులుగాని, బడిలో ఉపాధ్యాయులుగాని ఎటువంటి శిక్షణము చేయవలసి ఉంటుందో సూచిస్తున్నాను. పురాకృతములున్ను, వంశపరంపరాప్రాప్తములున్ను కాగల చిత్తప్రవృత్తివిశేషములను ఇక్కడ విమర్శించుటకు అవకాశము చాలదు గనుక వాటిని — ఎక్కడనో అవసరమైనచోట ప్రసంగరీతిగా సూచించడమే కాని, అంతకంటె ఎక్కువగా ప్రత్యేకించి విమర్శించను.

అనాదిగా ఇంతకాలమై ఉన్న ఈ లోకంలో ఎన్నికోట్లతరముల పిల్లలో పుట్టి శిక్షణము పొంది పెద్దవారవుతూ ఉన్నారుగదా, ఇప్పుడీవిషయం గురించి విమర్శ ఎందుకు? అనడానికి వీలులేదు. ఎన్నితరములనుండి వ్యవసాయము సాగుతూ వచ్చినది కాదు? అయినా, ఇప్పుడు వ్యవసాయశాస్త్రమునకు సంబంధించిన పరిశోధనలు జరుగుతున్నవి కావా? అలాగుననే పిల్లల సంరక్షణమున్ను, శిక్షణమునకున్ను సంబంధించిన పరిశోధనలూ, విమర్శలూ జరుగుతూ ఉన్నవి. వ్యవసాయశాస్త్రంలో ఏవిధంగా భూసారము, శీతోష్ణస్థితి మొదలయిన పరిస్థితులను అనుసరించి చేయవలసిన కృషీ, దానిఫలితములూ వివరించి చెప్పడానికి అవకాశ మున్నదో, ఆవిధంగానే శిశుశిక్షణ విధానంలో శిశువుల చిత్తప్రవృత్తులు పరిశీలించి, వాటిని అనుసరించి చేయవలసిన శిక్షణము వివరించి చెప్పడానికి అవకాశ మున్నది.

మానవుని మనస్సునకు సంబంధించిన విషయములు అనేకంగా మనదేశమందలి ఆధ్యాత్మిక విద్యావంతులు చెప్పి ఉండవచ్చును గాని, 'సైకాలజీ' వంటి మానసికశాస్త్రముమాత్రము మనదేశములో పుట్టలేదు. ఈ 'సైకాలజీ' శాస్త్రము పాశ్చాత్య దేశములలోనైనా పుట్టి కొద్ది సంవత్సరములుమాత్రమే అయినది. ఈ శాస్త్రమునకు సంబంధించిన పరిశోధనలు ఐరోపా అమెరికా ఖండములలో ఇప్పుడు జరుగుతూ ఉన్నవి. ప్రతి సంవత్సరము క్రొత్తక్రొత్త విషయములు బయలుపడుతున్నవి. 'చైల్డుసైకాలజీ' అన్నది 'సైకాలజీ'లో ఒక ముఖ్యమైన భాగము; ఇదిశిశువుల మనస్సునకు సంబంధించిన శాస్త్రము. ఈ శాస్త్ర విషయములను అనుసరించి పాశ్చాత్య దేశములందలి ఉపాధ్యాయులున్ను, తలిదండ్రులున్ను శిశుశిక్షణ పద్ధతులు సవరించుకొంటున్నారు. మనదేశమందు సైతము అట్టి ప్రయత్నములు ప్రారంభమయినవి. అయితే, అవి బడులలో ఉపాధ్యాయులకు మాత్రమే తెలియవలసిన విషయములుగా ప్రకటితము లవుతున్నవి; గాని, ఇంటివద్దను తలిదండ్రులు సైతము నేర్చుకొని ఆచరణలో పెట్టవలసిన విషయములుగా వ్యాప్తిచెందలేదు. అంతేకాక, ఈ శిశుమానసిక శాస్త్రమునకుగాని, శిశుశిక్షణమునకు గాని, సంబంధించిన గ్రంథములు ఇంగ్లీషుభాషలో ఉన్నవేకాని, మంచివి తెలుగుభాషలో లేవు. అందుచేత, ఈ శాస్త్రమును అభ్యసిస్తూఉన్న ఆంధ్రులు నేటతెలుగున వ్యాసములున్ను, గ్రంథములున్ను రచించి ప్రకటింతురుగాక.

నేను చాలాకాలము ఉపాధ్యాయవృత్తిలో నుండి, శిశుమానసికశాస్త్రమునకు సంబంధించిన గ్రంథములు కొన్ని చదువుకొని, చిన్నపిల్లల చిత్తవృత్తులు కొన్ని కొంతవరకు పరిశీలించి, చిన్నపిల్లల కోసము చిన్నచిన్న పద్యాలూ, పాటలూ, కథలూ రచించినవాడను, గనుక సాహసించి ఈ విషయమునకు సంబంధించినవ్యాసములు వ్రాయుటకు పూనుకొన్నాను. నా హెచ్చరికవల్ల నాకంటె ఎక్కువగా ఈ విషయం గురించి పరిశ్రమచేసి, ఎక్కువ అనుభవము గల ఆంధ్రులు ఈ విషయము గురించి ఎక్కువ వ్రాసిన యెడల నా యత్నము సఫలమయినదని సంతోషిస్తాను.

"ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవతు" అంటే శరీరము రథముగాను, ఆత్మ రథముగలవానిగాను తెలుసుకో అని అభిప్రాయము. ఐతే, ఆత్మ (జీవాత్మ) శరీరంలో అంతటా వ్యాపించి ఉంటుందా లేక, ఏదో ఒక భాగంలోనే ఉంటుందా అనే ప్రశ్నకు ఇదమిత్థమని ప్రత్యుత్తరం చెప్పడం కష్టము. ఇక మనస్సు గురించి న్యాయశాస్త్రములో చెప్పినదేమంటే "సుఖదుఃఖాద్యుపలబ్ధిసాధన మింద్రియం ప్రతిజీవం భిన్నమణు నిత్యంచ" అన్నారు; ఇది ఆత్మకు భిన్నమైన ద్రవ్య మన్నారు. ఐతే, ఈ మన స్సనే ద్రవ్యము శరీరంలో ఎక్కడ ఉంటుం దనే ప్రశ్న కూడా చిక్కయినదే. ఇక చిత్తమును హృదయముతో సరిచేసి చెప్పినవారు కూడా గలరు. గాని, మనస్సు మస్తిష్కంలో ఉంది అనిన్ని మస్తిష్కం మస్తకంలో (తలలో) ఉంది అనిన్ని, మనవారు స్పష్టంగా చెప్పకపోలేదు. సైకాలజీశాస్త్రము ఏర్పడకపూర్వము తక్కినదేశములలో సైతము చిత్తప్రవృత్తులు హృదయకోశములో కలుగుతవి అన్న నమ్మకము ఉండేది. ఇంగ్లిషులో 'కైండ్‌హార్ట్' మొదలయిన ప్రయోగములు మనదేశమందలి 'దయార్ద్రహృదయము' మొదలయిన ప్రయోగములవంటివే.

సైకాలజీశాస్త్రము ఏర్పడినతర్వాత హృదయమునకు మనస్సుతో గాని, చిత్తప్రవృత్తులతో గాని సంబంధము లేదని తేలినది. బిడ్డ పుట్టినదిమొదలు బిడ్డ మనస్సు వృద్ధిపొంది, తన ధర్మము చక్కగా నిర్వర్తించుకోడానికి ఇంద్రియముల సాహాయ్యం కావలెను.

ఇంద్రియములను మనవారు రెండువర్గములలో పేర్కొన్నారు. మొదటివర్గములోని ఇంద్రియములకు జ్ఞానేంద్రియములని గాని బుద్ధీంద్రియము లని గాని పేరు; రెండవవర్గములోని ఇంద్రియములకు కర్మేంద్రియములని పేరు. "శ్రోత్రం, త్వక్, చక్షుషీ, జిహ్వా, నాసికా (చైవపంచమీ)" ఈ ఐదున్ను మొదటివర్గములోనివి. "పాయూపస్థం, హస్త, పాద, వాక్ (చైవదశమీ స్మృతా)"—ఈ ఐదున్ను రెండవవర్గములోనివి.

కొందరి మతమున మనస్సు సైతము మొదటి వర్గములో చేరవలసిన ఇంద్రియ మంటున్నారు ఈ మతము అంగీకరిస్తే విషయం బోధపరచుకోవడంలో చిక్కు ఏర్పడుతుంది. అయితే, ఆ మతమువారే ఏమంటారంటే, మనస్సు అనే ఇంద్రియము ఇంద్రియములన్నింటికి రాజు; ఈ ఇంద్రియముయొక్క ఆజ్ఞలను బట్టే తక్కిన ఇంద్రియము లన్నీ పనిచేస్తున్నవి అంటారు. గనుక, పదప్రయోగాలతో వివాదపడక విషయం బోధపరచుకోవాలంటే మనస్సును తక్కిన ఇంద్రియాలకు భిన్నమైన వస్తువుగా నిరూపించడమే మంచిది.

జ్ఞానానికిగాని, బుద్ధికిగాని కావలసిన ఇంద్రియములు ఎప్పటినుండి పనిచేయుట కారంభించును? అనేప్రశ్న మనసులో పెట్టుకొని విద్వాంసులిప్పుడు పరిశోధనలుచేస్తున్నారు. బిడ్డపుట్టినతర్వాతనా? లేక తల్లి గర్భమందు బిడ్డ ఉన్నప్పటినుండినా? అని ప్రశ్న. ప్రహ్లాదచరిత్ర, అభిమన్యుచరిత్ర మొదలయినచరిత్రలు చదివితే, తల్లి నేర్చుకొంటూన్న విషయములు కొన్ని గర్భములో ఉన్నప్పుడే శిశువు తెలుసుకోడానికి సాధ్య మన్నట్లు కనబడుతుంది; గాని, ఇది పురాణములలో చెప్పినవిషయమే కాని శాస్త్రదృష్టితో పరిశోధించి నిర్ణయించి చెప్పినవిషయము కాదు. 'చైల్డ్ సైకాలజీ' పరిశోధనలు చేస్తున్నవా రేమంటున్నారంటే: గర్భోత్పత్తి అయిన రెండుమాసములకే గర్భములో ఉన్న పిండమునకు స్పర్శవల్ల ప్రతిఫలచిహ్నమైన స్పందనం దేహమందు కనబడుతుంది. వెన్నెముకలోగల మానసికద్రవ్యమువల్ల కలిగే చలనము సైతము కాలుసేతులందు కనబడుతుంది. మూడవమాస

ములో నోరు కదులుతూ ఉంటుంది. నాల్గవమాసము నుండి అవయవముల కదలిక స్పష్టమవుతుంది; స్పర్శ వల్ల ప్రతిఫలస్పందనము ఎక్కువగా కలుగుతుంది. ఆరవమాసమునుండిన్ని కొన్ని చేష్టలు అప్పుడే అల వాటుగా ఏర్పడుతవి. ఏడవమాసమునుండిన్ని బిడ్డ తల్లి గర్భములో ఉన్నా, బయటనున్నా బ్రతికి, పెరుగుటకు అవకాశము కలుగుతుంది.

ఈ విషయములు ఏలాగు కనుక్కోగల రని కొందరికి ప్రశ్న పుట్టవచ్చును. గర్భవిచ్ఛేదము జరిగినప్పుడు పాశ్చాత్యశాస్త్రజ్ఞులు దొరికిన అవకాశము విడుచుకోరు. వేలకొలది గర్భవిచ్ఛేదములు ఎక్కడనో ఒకచోట జరుగుతూ ఉంటవి. అందులో ఏనెల పిండమును చూడవలెనని ఉంటే ఆనెలపిండమును పరిశోధించుటకు అవకాశము వస్తూఉంటుంది. ఇట్టి అవకాశములు తరుచుగా రావు; వాటికోసం శాస్త్రపరిశోధకులు కనిపెట్టి చూస్తూఉంటారు.

బిడ్డ పుట్టి కన్నువిప్పి లోకమును చూచినతోడనే దృగింద్రియముద్వారా పొందదగిన జ్ఞానమును పొందుటకు మొదలు పెట్టినదనే చెప్పవలెను. అంతకుముందు, గర్భములో బిడ్డ ఉన్నప్పుడు ఏయే ఇంద్రియముల ద్వారా బిడ్డకు ఏమాత్రము జ్ఞానము ఉదయించడానికి అవకాశ మున్నదో వివరించి చెప్పలేము; గాని, కొంత జ్ఞానము కలుగడానికి అవకాశము లేకపోలేదనిమాత్రం పరిశోధకులు చెప్పుతున్నారు. ఈ విషయము మనవారు సైతము చెప్పకపోలేదు. ఈ విషయము మనసులో పెట్టుకొని గర్భిణీస్త్రీలు ఎట్లు ప్రవర్తించవలెనో మనవారు అనుశ్రుతంగా వస్తూఉన్న ఉపదేశములు ఇస్తూఉంటారు. గర్భంలోఉన్న శిశువుయొక్క ఆరోగ్యమును కాపాడుటకు కావలసిన విషయములే కాక శిశువుయొక్క మనోవికాసమునకున్ను, మనోధర్మముల అభివృద్ధికిన్ని కావలసిన విషయములు ఉపదేశిస్తారు. శిశువు నేర్చుకోదగినవన్నీ తల్లి నేర్చుకొంటూ ఉండడము, అదివరకే నేర్చుకొనిఉంటే, అవి మననం చేసుకోవడం, అభ్యసించడం మంచిది; శిశువు నేర్చుకోకూడని విషయములున్ను, అలవరచుకోదగని అభ్యాసములున్ను తల్లిపూర్తిగా విడిచిపెట్టుకోవలెను; తల్లిమనస్సు ఎంత ఆనందముతోను, ఉత్సాహముతోను ఉంటే గర్భములో ఉన్నబిడ్డకు అంత ఆనందము, అంత ఉత్సాహము కలుగవచ్చును-అని అంటారు.

పుట్టినతర్వాత ఏడుదినములు గడవగానే బిడ్డ పూర్తిగా కండ్లువిప్పి ఏదైనాఒక వస్తువును నిదానించి చూడడమునకు మొదలుపెడుతుంది. ఆ తరుణమున తల్లి పలురంగులుగల వేరువేరు వస్తువులను చూపిస్తూ ఉండవలెను. పుట్టిన తర్వాత సుమారు రెండు నెలలకు చేతికి అందిచ్చిన వస్తువులను బిడ్డలు పట్టుకోగలరు. అప్పుడు చిన్న రబ్బరుచక్రాలుగాని, రబ్బరువలెనే మెత్తగాను, మృదువుగాను ఉండే చిన్నచిన్నవస్తువులుగాని, వారిచేతికి అందిస్తూ వివిధములైన స్పర్శానుభవములు కలుగజేయవలెను. సుమారు మూడునెలల ఈడుగలపిల్లలు ఒకప్రక్కనుండి మరియొకప్రక్కకు తమ దృష్టి సారిస్తూ ఉంటారు. అప్పుడు బంతిగాని, మరి యేదైనా చిన్నవస్తువుగాని స్ఫుటమైన రంగుగలది పిల్లల కండ్లయెదుట పట్టుకొని ఒకప్రక్కనుండి మరియొకప్రక్కకు నెమ్మదిగా త్రిప్పుతూ ఉండడం వల్ల ఏకాగ్రదృష్టికి సులువైన అభ్యాసం పిల్లలకు కలుగుతుంది. మనవారు గుడ్డలతో కుట్టిన రంగురంగుల చిలుకలపంజరము వ్రేలాడకట్టుతూ ఉంటారు. ఇది మంచిదే కాని, పిల్లలు తమ తల కదల్చకుండా, ఎల్లప్పుడు ఒక్కవైపే-అనగా ఆ చిలుకలపంజరము వైపే దృష్టినిలిపి చూస్తూ ఉండడంవల్ల కొంతసేపటికి వారికి విసుగుదల పుడుతుంది. అందుచేత, అప్పుడప్పుడు ఆ పంజరము ఒకప్రక్కనుండి మరియొకప్రక్కకు ఊగుతూఉండేలాగు చేయడం మంచిది. కొందరు చిలుకలపంజరము బొంగరమువలె వడిగా తిరుగునట్లు చేస్తూఉంటారు. అట్లు తరుచుగా చేయరాదు. దృష్టి దానిని అనుసరించి వడివడిగా త్రిప్పుటకు పిల్లలు ప్రయత్నించి దృష్టి చెదరగొట్టుకొంటారు. అప్పుడప్పుడు ఈ అభ్యాసము మంచిదే; కాని, తరుచుగా చేయరాదు.

సుమారు నాలుగుమాసముల ఈడుగల పిల్లలు ఎగుటనున్న వస్తువులవైపు నిదానించిచూస్తూఉంటారు.

అప్పుడు, వివిధవస్తువుల పరిచయము వారికి కలుగజేస్తూ ఉండవలెను. సుమారు అయిదుమాసముల ఈడుగలపిల్లలు వారికి చేరువగా ఉన్న వస్తువులు పట్టుకొనుటకు ప్రయత్నిస్తూ ఉంటారు. అప్పుడు వారు పట్టుకొని ముఖమునకుగాని, దేహమునకుగాని తగిలించుకొన్నా బాధకరములు కాని చిన్నచిన్న వస్తువులు వారికి చేరువగా పెడుతూ ఉండవలెను. బరువులోను, లావులోను హెచ్చుతగ్గులు గల వస్తువులు ఉంచుట మంచిది. వాటిని పిల్లలు పట్టుకొని చేతులుఆడిస్తూ ఉన్నప్పుడు బరువు, లావు, స్పర్శ విషయములలో వారికి క్రొత్తక్రొత్త అనుభవములు కలుగుతూ ఉంటవి.

పిల్లలు సాధారణముగా మూడునెలలు దాటిన తరువాత నాల్గవ మాసములోగాని, అయిదవ మాసములోగాని,బోర్లపడుతూఉంటారు.బోర్లపడి తల ఎత్తడం రాగానే చేతులు,కాళ్లు కూడ దీసుకొని ప్రాకడానికి ప్రయత్నిస్తారు. అప్పుడు మెత్తనిదూదిపరుపులు పనికి రావు. అవి వారి ప్రయత్నమునకు భంగం కలుగజేస్తూ ఉంటవి. గరుకుగా లేనినేలను పిల్లలను పరుండబెట్ట వచ్చును. ఆయీడున చేరువగా ఉన్నవస్తువులను అందుకోడానికి ప్రయత్నించి వారు ముందుకు ఉబుకుతూ ప్రాకడం నేర్చుకొంటారు. అప్పుడు ఏ వస్తువులు పిల్లల దృష్టిని వేగంగా ఆకర్షించగలవో వాటిని ఉంచవలెను. వాటిని అందుకోగానే, ఆ వస్తువులనే కానీ,ఇతర వస్తువులనే కాని మరికొంత దూరాన ఉంచి, అక్కడికి సైతము పిల్లలు ప్రాకుతూ వచ్చేటట్లు చేస్తూఉండవలెను.

సుమారు ఏడుమాసముల ఈడుగలవారు కాగానే పిల్లలు కూర్చుండుటకు ప్రయత్నిస్తారు. ఆ ప్రయత్నము సఫలమయేటట్లు తల్లులుగాని, వారిని ఆడించే ఇతరులుగాని కొద్దికొద్దిగా తోడుపడుతూఉండవలెను. అంతేకాని, వారు పిల్లలను బలవంతంగా కూర్చుంపబెట్టరాదు. ఆ సమయమున పిల్లలు తాము చేతబట్టుకొన్న వస్తువు నేలపైని వేసి కొట్టుతూ, అప్పుడు కలిగే చప్పుడు విని ఆనందిస్తూ ఉంటారు, ఆ చప్పుడు ఎంత ఎక్కువగాను, స్ఫుటంగాను ఉంటే అంతసంతోషిస్తారు. అందుకుగాను పిల్లలచేతి కిచ్చేవస్తువు ఇత్తడి, కంచుతో చేసినదై, ఆ వస్తువు తగిలి చప్పుడయ్యేచోటు గట్టిగా ఉండి నాదం పుట్టగలదై ఉన్నట్లు చూడవలెను. వేరువేరు నాదములు పుట్టేటట్లు వేరువేరు వస్తువులు పిల్లల చేతికి అందిస్తూ ఉండవలెను. అప్పటినుండిన్ని పిల్లలకు సంగీతస్వరములలో ముఖ్యమైన స్వరములు వినిపిస్తూ ఉంటే పిల్లలకు సహజముగా ఉండే సంగీతాభిలాష సరియైన మార్గమున పడుతుంది.

సుమారు ఎనిమిదిమాసముల ఈడు గలవారు కాగానే, పిల్లలు కొద్దిగా బరువైన వస్తువులు సైతము చేత బట్టుకొని ఎత్తడానికి ప్రయత్నిస్తారు. అప్పుడు వారిని ఆడిస్తూఉండేవారు కడుజాగరూకతతో బరువు గల వస్తువులను అందిస్తూ ఉండవలెను. ఏ వస్తువులు, ఎంత బరువుగలవి పిల్లలు సులువుగా ఎత్తగలుగుతున్నారో పరిశీలించి, క్రమక్రమముగా, అంతకంతకు కొద్దికొద్దిగా ఎక్కువ బరువైన వస్తువులు అందిస్తూ ఉండవలెను.

ఈ యీడుగల పిల్లలు అప్పుడే రుచులు పోల్చుకోగలవారు కాగలరు. గిన్నెలో చక్కెర పెట్టి, అది పిల్లలకు చూపిస్తూ రవ్వంత చక్కెర పిల్లల నోటికి అందిస్తూ దాని రుచి పిల్లలు అనుభవించి జిహ్వేంద్రియమునకు తగిన అభ్యాసము కలిగించుకొనేటట్లు చేయవలెను. అప్పుడప్పుడు వినోదకరముగా ఉప్పు కొద్దిగా నోటబెట్టి దానిరుచిన్ని, పుల్లదానిమ్మగింజ వ్రేళ్లతో పట్టి పిల్లల నోటిలో నొక్కి, దాని రసము జిహ్వకు తగలజేసి దాని రుచిన్ని పిల్లల అనుభవమునకు తీసుకొనిరావడం మంచిది.

ఈ యీడున పిల్లలు కనబడ్డ వస్తువల్లా నోట బెట్టుకొంటూఉంటారు. వారు నోట బెట్టుకోరాని వస్తువు వారి అందుబాటులో ఉండనీయరాదు. ఒకవేళ వారు పట్టుకొని నోటిలో పెట్టుకోబోయినా వారిని మరపించి, మరియొక మంచివస్తువు వారి కందిచ్చి దానిని తీసి దాచివేయవలెను. పిల్లలకు అసహ్యమైనా, అది బాధించనివస్తువు అయితే, దానిని ఒకసారి పిల్లలు నోట బెట్టుకొని దానిరుచి అనుభవించి ఏవగించుకొనేటట్లు చేయడమే మంచిది. దానివల్ల ఆ వస్తువుకు రుచిలో గల గుణము బోధపడుతుంది.

పదిమాసముల ఈడుగల పిల్లలు కొందరు ఏదైనా ఒకవస్తువు చేత బట్టుకొని దానిని నిదానంగా పరిశీలించి, దానిలో గల భాగములను తదేకధ్యానంతో పరిశోధిస్తూ ఉంటారు. ఈ అలవాటు హెచ్చరించ వలసినదే. ఒక పిల్లవాడు కీచుకీచుమనే రబ్బరుబొమ్మ చేత బట్టుకొని నొక్కుతూనే ఆ నాదము ఎక్కడనుండి వస్తున్నదో పరిశోధిస్తాడు. మరియొక పిల్లవాడు చిన్నగంట పట్టుకొని లోపల వ్రేలాడుతూ ఉండే కంచుముక్క పట్టుకొని గంట వాయించ బోతాడు, గంట మ్రోగకపోవడం కనుక్కొంటాడు. ఈ విధంగా ఏదైనా ఒక విషయం పరిశోధించడానికి అవకాశముగల వస్తువులు ఈ యీడు పిల్లలచేతికి ఇస్తూఉండడంవల్ల, పిల్లలకు పరిశోధనయందుగల ఆసక్తి పుట్టి వృద్ధిపొందుతుంది.

సంవత్సరం ఈడుగలపిల్లలచేతికి సుద్ద ఇచ్చినయెడల వారు నేలపై గీతలు పెడుతూ ఉంటారు. అప్పుడు వారిని ఆడించేవారు తాము గీతలుపెట్టి చూపించి ఆగీతలను ఆ పిల్లలు సైతము అనుకరించి గీచునట్లు చేస్తూ ఉండవలెను.

ఈ మొదటిసంవత్సరమందు జ్ఞానేంద్రియముల ద్వారా అలవడే జ్ఞానమున్ను అభ్యాసములున్ను కొంచెమే అయినా పునాదివలె ముఖ్యమైనవి గనుక ఇవి సరియైనమార్గములో పడునట్లు తలిదండ్రులు చూడవలెను.

పిల్లలకు కనబడేదృశ్యములు గాని, వినబడే మాటలుగాని పిల్లలు నేర్చుకోదగినవే కావలెను; గాని, పిల్లలబుద్ధికి చెరుపుచేయగలవి కాకూడదు. కొందరు తలిదండ్రులు తమ పిల్లలయెదుటనే 'వీరు పసిబిడ్డలుగదా, వీరు చూస్తే వీరి కేమి తెలుస్తుంది?' అని నిర్లక్ష్యంగా నస్నులైగాని, భోగలాలసులైగాని ఉంటారు. అది చాలా తప్పు. అప్పటి కది యేమో తెలియకపోయినా, ఆదృశ్యముమాత్రము ఆ పసిపిల్లల మనస్సున నిల్చి ఉంటుంది.

ఇంక రెండవయేటనుండిన్ని పిల్లల చిత్తప్రవృత్తులు ఎట్లు పరిణమిస్తూ ఉంటవో వాటిని అనుసరించి శిశుశిక్షణము ఎట్లుండవలెనో పరిశీలింతాము.

(సశేషము)

ఘనరాగములేవి?

"జూన్" నెలలో వెలువడిన 'భారతి'లో ఘనరాగగీతములు అనే శీర్షికతో శ్రీ బేతపూడి వెంకటశివరావుగారు ఐదుగీతములను ప్రచురించారు. ఆగీతములు అఠాణా, శహానా, సురటి, కనడా, పూర్వీకల్యాణి రాగములలో వున్నాయి. ఈ రాగములు కేవలము నయ దేశీయరాగము లనిన్నీ, నాట, గౌళ, ఆరభి, శ్రీరాగం, వరాళి, కేదార-నారాయణగౌళ, రీతిగౌళ, సారంగ, నాట, భౌళి, అనే రాగములు మాత్రమే ఘనరాగము లనిన్నీ ప్రసిద్ధసంగీతవిద్వాంసుల మతము. సంగీతశాస్త్ర గ్రంథములు కూడా యీసిద్ధాంతాన్నే ధ్రువపరుస్తున్నాయి. ఘనరాగముల కింద ప్రసిద్ధములుగా వున్నపై పదిరాగములలోనూ, ఒకదానినైనా శ్రీ బేతపూడివారు ఉదాహరించలేదు. 'ఘన' అనే పదాన్ని పారిభాషికంగా కాకుండా, లోకవ్యవహారరీత్యా 'గొప్ప' అనే అర్థంలో వారు వాడివుంటే, ఆవిషయమైనా వారిప్రచురణలో స్పష్టపరచి వుండవలసినది. అలాగు కాకుండా నాట, గౌళ, మొదలైన రాగములవలెనే, శహన, సురటి మొదలైన రాగాలుకూడా ఘనరాగములని చెప్పడానికి తగిన ప్రమాణాలు వుంటే, ఆవిషయం పత్రికాముఖంగా శ్రీ బేతపూడివారుగాని, యితర సంగీతకళోపాసకులు గాని తెలియజేయవలసిన దని వందనపూర్వకమైన విన్నపము.

— పట్నాయుని నారాయణరావు.

ఐరోపాఖండ పరిస్థితులు - యుద్ధాలకు మూలకారణము

"భరద్వాజ"

ఐరోపాఖండంలోని రాజ్యాలన్నీ ఎల్లప్పుడూ పోరాడుటకు కారణ మేమిటి? ఎప్పటికైనా సుస్థిరమగు శాంతి యైరోపాఖండంలో ఏర్పడునా? క్రీస్తుశకానికి పూర్వము ౮౦౦ సంవత్సరం నుండి క్రీస్తుశకము ౧౫౦౦ సంవత్సరమువరకు యైరోపా నవనాగరికత సర్వతోముఖంగా అభివృద్ధి పొందినది. శాస్త్రరీత్యాగాని, పారిశ్రామికరంగమందు కాని, సాహిత్యప్రపంచమున కాని, రాజకీయములందు గాని యైరోపాఖండమందలి రాజ్యాలన్నీ ప్రపంచనాగరికతకు తోడ్డోగోప్ప సేవ చేసినాయి. అట్టిరాజ్యాలు యిరువదవ శతాబ్దమందు పరస్పర సంఘర్షణలకు దిగి, తమలో దాము యుద్ధాలు చేసికొంటూ, ప్రపంచశాంతిని ఎల్లప్పుడు భంగపరచుస్థితికి వచ్చినాయి. నాగరికతలో వెనుకపడిన ఆఫ్రికాఖండములో కూడ, యిట్టి నిరంతర అశాంతి యెప్పుడును లేదు. పాశ్చాత్యులు కాలిడకపూర్వము ఆసియాఖండంలో కూడ యిట్టి అశాంతి యేర్పడలేదు. ప్రపంచంలో యైరోపాఖండం లేకపోతే ప్రపంచశాంతిని స్థిరముగ యేర్పరచవచ్చునను భావం ఎల్లరకును కల్గుచున్నది. ఇట్టి పరిస్థితులు యైరోపాఖండమందు ఎందుకు యేర్పడినాయి? నవనాగరికతాభివృద్ధికి తోడ్పడిన యైరోపాఖండం తన ధర్మాన్ని యేల నిర్వహింప లేకున్నది? ఈప్రశ్నలకు సమాధాన మివ్వాలంటే ఒక్కమారు ప్రపంచ చరిత్రను సూక్ష్మంగా అవగాహన చేసికొనుట అవసరం.

ఐరోపాఖండం వ్యవసాయముపై ఆధారపడిన భూభాగం. ౯, ౧౨ శతాబ్దములమధ్య పాశ్చాత్యులు వ్యవసాయాన్ని తమ జీవనంగా భావించుకొని ౫౦౦ లేక ౬౦౦ చిన్నకుటుంబరాజ్యాలుగ యేర్పడినారు. తమ ఆస్తిగా భావించుకొన్న భూమిపై యీ చిన్న రాజ్యాలన్నీ పరస్పరసహకారము చేసికొంటూ హాయిగా జీవనం గడపినాయి. ఈరాజ్యాలలో వ్యవసాయము స్థానికరూపము దాల్చినది. రైతుప్రథమంలో తానాక్రమించినభూమినే నమ్ముకొని తరములతరబడి అచ్చటనే నివసిస్తూ వచ్చినాడు. దాదాపు ౧౦౦౦, లేక ౧౨౦౦ సంవత్సరములనుండి తమ పూర్వీకులు నివసించిన పొలములమీదనే యిప్పటికిని నివాస మేర్పరచుకున్న కుటుంబములు ఫ్రాన్సు మధ్యభాగమందును, బ్రిటానీలోను, నార్మండిలోను, స్కాట్లండులోను, స్పెయిను ఉత్తరమందును, జర్మనీ నైరుతిభాగమందును, యిటలీ పశ్చిమోత్తర ఉత్తరభాగములందును గలవు. అందుచే వ్యవసాయము వారికి దైనికజీవనసాధనమైనది. కాలక్రమేణా ఒక్కొక్క రాజ్యభాగానికి ఆర్థికంగా విలువ హెచ్చుగట ప్రాప్తించినది. అప్పుడు కొన్ని రాజ్యభాగాలు యేకమై పెద్దరాజ్యాలుగా యేర్పడుటయు, మిగిలినవి స్వతంత్రముగా నుండుటయు, తమ సాహిత్యమును, కళలను, సాంఘికసంస్థలను, శిల్పములను, రాజకీయసంస్థలను, తమ ప్రత్యేకసంప్రదాయములననుసరించి వృద్ధిచేసుకొనుటయు సంభవించినది. మధ్యయుగములందు యైరోపాఖండ పశ్చిమభాగములో జాతులు (**Nations**) యేర్పడినాయి. ౧౮౦౦ సంవత్సరమునాటికి యింగ్లండు ఫ్రాన్సులు తమ ప్రత్యేకవ్యక్తిత్వమును స్థిరపరచుకున్నాయి. రాజ్యపాలనగావించు వంశములవారి సహకారముతోను, నైసర్గికపరిస్థితుల సానుకూలతతోను యింగ్లండు ఫ్రాన్సులలోని రాజకీయనాయకులు వ్యవసాయమునే తమ జీవ

నంగా యేర్పరచుకున్న రాష్ట్రములను సంరక్షిస్తూ, బలమగురాజ్యాంగమును యేర్పరచి సర్వతోముఖమగు నాగరికాభివృద్ధికి కృషి సల్పినారు. ఫ్రాన్సులో కపేషియను కుటుంబమువారు ౧౬౬౦ సంవత్సరము మొదలు ౧౭౯౨-వ సంవత్సరమువరకు ఇట్టిపని చేసిన వారిలో ముఖ్యులు.

కాని యైరోపాఖండ మధ్య భాగమందు యిట్టి ఫలితములు కల్గుటకు సల్పిన ప్రయత్నము లన్ని యు వ్యర్థము లయ్యెను. డాన్యూబు నదీతీరము నానుకున్న రాజ్య భాగాలందు జాతీయముగగాని, సమాఖ్యపద్ధతి ననుసరించి గాని యైకమత్య మేర్పరచవలె నని కొందరు నాయకులుచేసిన కృషి నిరుపయోగమయ్యెను. ఆర్థికసహకారమును సైనికపరిపాలనముతో అమలులో పెట్టవలె నని రోమనులు చేసిన సృష్టి నాశనమయ్యెను. సైనికముగా బలవత్తరమయినను కొన్నాళ్లకు సరిహద్దులులేని భూభాగాలను దండయాత్రలు గావించు అనాగరికులనుండి రోమనులు సంరక్షించుకొనలేక పోయిరి.

తరువాత ౧౧.శతాబ్దములకు మధ్య యైరోపాఖండములో మతముపేరట యైకమత్య మేర్పరచుటకు మతాధికారులు (చర్చి) ప్రయత్నించారు. పరస్పరసంఘర్షణలు కల్గినపుడు మతాధిపతియగు పోపును మధ్యవర్తిగనుంచుకొని వివాదములను పరిష్కరించుకొనుటకును, పోపునిర్ణయములను సామ్రాజ్యాధిపతి అమలులో పెట్టుటకును నిర్ణయింపబడెను. అప్పటికి యీ యేర్పాటును జయప్రదంగా నిర్వహింపవచ్చు నని ఆశింపబడెను కాని కొంతమంది క్రైస్తవులు పోపుమతాధికారమును ఎదిరించుటచే యీ నిర్ణయముపై యేర్పడిన రాజ్యాంగము భగ్నమయ్యెను. అప్పుడు వర్తకాభివృద్ధికి బలవత్తరమగు రాజ్యపాలనము యేర్పరచవలె ననియు, పశుబలము నాధారము చేసికొని శాంతిస్థాపన గావింపవలె ననియు, పదునాల్గవ లూయీరాజు, నెపోలియన్‌లు ప్రయత్నించిరి. ఫ్రాన్సు లాభముకొరకు యైరోపాఖండమునంతను తమ వశము చేసికొనుటకు వారు కృషి సల్పిరి. ఎన్ని యుద్ధములలో విజయము పొందినా, ఎన్ని రాజ్యభాగాలను తా మాక్రమించినా, వారి ఆశయము నెరవేరలేదు. మధ్య యైరోపాఖండమందున్న వివిధజాతుల, మతముల, వర్తకస్వప్రయోజనముల సంఘర్షణలవలనను, యింగ్లండు రష్యాల ప్రతికూలతవలనను లూయీ, నెపోలియనుల ఆదర్శము ఫలింపలేదు.

అటుపై హోహెన్ జొల్లరన్ రాజకుటుంబమువారు రోమనుల, లూయీ నెపోలియనుల ఆదర్శమును తమదిగా భావించుకొని జర్మనీలాభముకొరకు యైరోపాఖండమును వశపరచుకొనుటకు కృషి సల్ప ప్రారంభించిరి. కడచిన మహాసంగ్రామము (౧౯౧౪, ౧౯౧౮) మూలమున వారిప్రయత్నము విఫలమయ్యెను. ౧౯౧౮-వ సం॥ లో ప్రపంచయుద్ధము ముగియగనే పశ్చిమ యైరోపా యందున్న రాజ్యాలవారు మధ్య యైరోపాఖండాన్ని తమ పలుకుబడిలో నుంచుకొనుటకు తమ ఆదర్శములను వారి నెత్తిపై రుద్ద ప్రయత్నించిరి. మధ్యయైరోపాను అనేకచిన్నస్వతంత్రరాజ్యములుగ విభజించి, యీ రాజ్యముల యన్నిటిమధ్య సహకారమును, సాహచర్యమును పెంపొందించుటకు నానాజాతిసమితిసంస్థ నొకటి సృష్టించిరి. పూర్వము క్రైస్తవమత గురువగు పోపు యైరోపాలోని రాజ్యముల యైక్యతకు చేసినకృషినే నానాజాతిసమితివారు సల్ప ప్రయత్నించిరి. కాని సమితికి రాజకీయాధికారము లేక పోవుటవలన తన కార్యక్రమమును అమలులో పెట్టలేకపోయెను. ప్రపంచరాజకీయ నాయకులు ఆదర్శ ప్రకటనములు గావించుటకు సమితి సభలు వేదికలయ్యెను. కార్యాచరణమున కనుకూలమగు కార్యక్రమములను సమితి సూచింపలేదు. కొన్ని సమయములలో సమితిసభ్యులు పరిపాలకుల సంఘము వలె ప్రవర్తించిరి. మధ్యయైరోపాలో సక్రమరాజ్యపాలనకు తోడ్పడువిధానమును సమితి అమలులో పెట్టలేకపోయెను. దీనికితోడు సమితివారికి ఆర్థికసమస్యలన్న వెగటయ్యెను. ఆస్ట్రియాకు వ్యవసాయమునకు వీలగు భూభాగాన్ని కాని, హంగరీకి పరిశ్రమలకు తోడ్పడు భూభాగాన్ని కాని సమితి యిప్పించలేక పోయెను...

ఇట్టిస్థితిలో మధ్యయైరోపాయందున్న జాతులలో అసంతృప్తి, నిరాశ, నిస్పృహ కల్గి విప్లవములకు, యుద్ధములకు తా విచ్చెను. ౧౯౧౮-వ సం॥ మొదలు ౧౯౩౯-వ సం॥ వరకు మధ్యయైరోపాలో జెకోస్లవోకియా, హంగరీ, రుమేనియా, ఆస్ట్రియా, యూగోస్లావియా, బల్గేరియా, పోలండులమధ్య సమాఖ్య నొకటి యేర్పరచుటకును, ఆసమాఖ్య యీ రాజ్యాలమధ్య ఆర్థికసహకారమును రాజకీయసాహచర్యమును పెంపొందించుటకు కృషిసల్పవలెనని ప్రయత్నములు జరిగెను. కానియీ రాజ్యాలే అట్టిసమాఖ్యస్థాపనకు ప్రతికూలముగ నుండుటచే వానిమధ్య సహకారము లేకుండెను. ఈ రాజ్యాలలో జాతీయభావము సంకుచితరూపము దాల్చుటవలన అవి తమ స్వాతంత్ర్యమును కొంతవరకు ప్రపంచసౌఖ్యమునకై త్యాగము చేయుటకు ఒప్పుకోలేదు. ఎట్టి మంచి సూచనలైనా, కార్యక్రమములైనా సమితివారు యీ రాజ్యాలకు నివేదించిన అయ్యది విదేశీయమను భావంతో యీ రాజ్యములు నిరాకరించెను. తమ వ్యవహారములను స్వతంత్రముగ తమంతట తామే నిర్వహించుకోవాలను ఉద్దేశ్యమును యీ రాజ్యాలు ప్రకటించినాయి. కాని సమితినుండి అప్పులు తీసికొనుటకుమాత్రము యీ రాజ్యాలు సందేహించలేదు. ధనసహాయము పొందవలెనను తలంపుతో సమితివారొసంగిన నైతికసందేశములకు చెవి యొగ్గిరి. ఈ రాజ్యాలన్నీ తమ స్వప్రయోజనాభివృద్ధికి ఎప్పుడు సమయము వచ్చునా, ఎప్పుడు చుట్టుప్రక్కల భూభాగాలను ఆక్రమించుదుమా అని వేచియున్నాయి.

హిట్లరురాక వారి ప్రయత్నముల ఫలితమేయని చెప్పవలెను. మధ్యయైరోపాలోని వివిధసంఘర్షణల ప్రతిరూపము హిట్లరు. హిట్లరు పుట్టుకవలన ఆస్ట్రియా దేశీయుడు, జర్మనీపాలకుడయ్యెను. మత ప్రపంచంలో హిట్లరు ప్రథమంలో కొథలిక్కు. నేడు స్టాలిన్‌వలె మతమన్న ఆతనికి అరికాలిమంట. స్వల్పవిద్య కల్గి బీదకుటుంబమునుండి పైకి వచ్చుటచే నిరంకుశత్వము, ధనాఢ్యతత్వము హిట్లరులో మూర్తీభవించెను. సమితి యొక్క లోపములను బాగుగా కనిపెట్టి, మధ్యయైరోపాలోనున్న వివిధరాజ్యాల పరస్పరసంఘర్షణలను ఊతగా గొని ౫ సంవత్సరములలో జర్మనీని బలమగు రాజ్యముగ నొనర్చెను. సార్ భాగాన్ని తీసికొనటం, ఆస్ట్రియా ఆక్రమణ, జెకోస్లవోకియాను దిగమ్రింగుట, బల్గేరియా యూగోస్లావియాలలో తన పలుకుబడి స్థాపించుకొనుట — యీసందర్భముల యన్నిటిలోను హిట్లరు శాంతముగనే తన పని చేసికొనెను. సెప్టెంబరు ౧౯౩౯-వ సంవత్సరమువరకును యుద్ధానికి దిగకుండా పశుబలప్రదర్శనంతో హిట్లరు తనకార్యవిధానమును అమలులో పెట్టెను.

మధ్యయైరోపాలో రాజ్యపాలనమును నూతన పద్ధతులపై యేర్పరచవలెననీ, మధ్యధరాసముద్రమును అట్లాంటిక్ మహాసముద్రమును ఆనుకొనియున్న రాజ్యములు అనాదినుండియు ప్రదర్శించిన నాగరికతల సమన్వయము గావించవలెననీ హిట్లరు ఆశయము. మధ్యధరాసముద్రము, అట్లాంటిక్ మహాసముద్రము అనాదినుండి ప్రాక్పశ్చిమముల సౌభాగ్యసౌఖ్యముల పెంపొందించుటకు తోడ్పడినవి. అందుచే పూర్వము దక్షిణయైరోపాఖండరాజ్యాలు అనుభవించిన గొప్ప వర్తకలాభములను ఉత్తర, మధ్యఖండములందున్న రాజ్యాలు పొందుటకు ప్రయత్నించుటయే నాజీపక్ష ఆలోచన. అందుకుగాను డాన్యూబు రైను నదుల మధ్య కాలువలు త్రవ్వి రెండు నదులను కల్పుటకును, రుమేనియా జర్మనీ హంగరీలమధ్య రాకపోకలకు విశాలమగురోడ్లు వేయుటకును ప్రయత్నములు జరుగుచున్నాయి.

హిట్లరు ఆశయమునకు ఫ్రాన్సు యిటలీల యొక్కయు, యింగ్లండు యిటలీల యొక్కయు స్వప్రయోజనసంఘర్షణలు తోడ్పడుటకు అవకాశము కల్గుచున్నది. మధ్యధరాసముద్రమందు పశ్చిమమందు ఫ్రాన్సు, మధ్య భాగములో యిటలీ, తూర్పు భాగమందు యింగ్లండు పలుకుబడి కల్గియుండుటచే వీరి స్వప్రయోజనముల సంఘర్షణ తీవ్రమయి, సూయజ్ కాలువ పాలనసందర్భమందు పరిస్థితులు మరింత విషమరూపము దాల్చినాయి. ఈ సమయమునే ఊతగా గొని హిట్లరు తన ఆశయఫలితానికి కృషి సల్ప దలచినాడు. ౧౯౧౮-వ సం॥ మందు మధ్య యైరోపా

లోని రాజ్యాలు పశ్చిమభాగమందున్న ఆర్థికముగ లాభకరమగు భూభాగాలను ఆక్రమించాలని ప్రయత్నించినాయి. కాని తూర్పు యైరోపా యందున్న రాజ్యాలు తమ అప్పులను ఎగగొట్టి, దివాలా ఎత్తి, ఆర్థికాభివృద్ధి పొందుటకు సిద్ధపడినాయి. కడచిన ౧౫ సంవత్సరాలనుండి జర్మనీ తనదృష్టిని పశ్చిమరంగమునుండి తూర్పురంగముపైకి త్రిప్పినది. రష్యాతో జర్మనీ ఒడంబడిక చేసికొనుటలో ఆశ్చర్యమేమియూ లేదు. హిట్లరు విధానముయొక్క ప్రతిఫలమే రష్యా జర్మనీల యొడంబడిక.

ఇంతపని చేసినా హిట్లరుకు ఆందోళన తగ్గలేదు. ఆతనిని ఒకసమస్య బాధిస్తున్నది. జర్మనీలో రాకపోకలకు సౌకర్యములను కల్గించినప్పటికినీ, మాస్కోనుండి బ్రసెల్సువరకును, స్టాకోహోమునుండి రోమువరకును మధ్య యైరోపాలో ఉత్పత్తియగు పదార్థములకును, వస్తువులకును బర్లినును కేంద్రవర్తకస్థానముగ యేర్పరచినప్పటికినీ, రష్యా ఆర్థిక జీవనాన్ని జర్మనీ పారిశ్రామికపద్ధతుల కనుగుణముగా నుండునట్లు చేసినప్పటికినీ మధ్య యైరోపాలో రాజకీయ సమస్యను హిట్లరు పరిష్కరించినట్లు దలంచుటకు వీలు లేదు. జెకోస్లవోకియా ఆక్రమణ, పోలండును వశపరచుకొనుట, రష్యాతో ఆతని సహకారము డాన్యూబురంగమందు హిట్లరు ఎదుర్కొనవలసిన సమస్యలను మరింత క్లిష్టభూయిష్ఠము గావించినాయి. హంగరీ, యుగోస్లావియాలు జర్మనీకి దాసోహం అనటానికి యిష్టపడుటలేదు. ఈరంగమందున్న రాజ్యాల సరిహద్దులన్నియు అస్పష్టము లగుటచే ఎవరికిని సంతృప్తి కల్గుటలేదు.

యైరోపాలోని అశాంతికి మూలకారణములు నైసర్గికపరిస్థితులు, నైతికస్థితి అని చెప్పకతప్పదు. జర్మనీలోకూడ లోలోన ప్రబలుచున్న అశాంతికి యివియే కారణములు. నేటి పరిస్థితులకు జర్మనీదేశీయులే విషాదాశ్చర్యములను పొందుచున్నారు. వారు రైతువర్గానికి చెందినవారగుటచేతను భూములను, తమ ఎస్టేట్లను అభిమానంతో చూచుకునేవారు. నేటిస్థితివలన వారిభవిష్యత్తు వారికే గోచరమగుటలేదు. స్వల్పకాలములో తమ దేశము నలుగడల వృద్ధియగుటచే ముమ్ముందు జర్మనీ యేరూపముదాల్చునో వారికి స్పష్టపడుటలేదు. ఇదియే వారిలో గొప్పలోపము. పశ్చిమఖండమందు, ఏ రాజ్యమైనా స్వస్వరూపమును తాను గుర్తించుకొనలేక పోయినచో ఆజాతిఆత్మ నశించినట్లు చెప్పకతప్పదు. ౧౮౧౩-వ సం॥నుండి ౧౮౧౫-వ సం॥వరకు నెపోలియన్ పొందిన పరాభవానికి అదియే ముఖ్యకారణమని చెప్పాలి. నేటి జర్మనీకూడ అట్టిస్థితిలోనే ఉంది. ఒక చిన్నపిల్లవానికి తుపాకి యిచ్చిన ఆత డేమిచేయును? గొప్ప అంగబలము, ఆయుధబలము జర్మనీ కున్నాయి. కాని వానికి తగిన నైతికబలము లేదు.

అందుచేతనే హిట్లరు శాంతికై యింత ఆశిస్తున్నాడు, పెనగులాడుతున్నాడు. జర్మనీ అంగబలముపై ఆతని కపనమ్మకము లేదు. తన అంతరాత్మప్రబోధల ననుసరించి, తనయిష్టము వచ్చినట్లు నడచుకొనువాడు హిట్లరు. అట్టివానికి యిప్పుడు ఎదుర్కొనవలసిన విషమసమస్యను పరిష్కరించుటకు తగిన మార్గము కన్పడుటలేదు. ధైర్యముతో, నిర్లక్ష్యముతో ఎంత క్రూరస్వభావమును ప్రదర్శించియైనా హిట్లరు అనేక పనులు చేయకల్గినాడు. బాల్టిక్ బాల్కనురంగముల నుండి జర్మనీ అల్పసంఖ్యాకులను ఉపసంహరించి వారిని తా నాక్రమించినప్రదేశాలలో నివాసము ఏర్పరచుకొనునట్లు చేసినాడు. ఆతనికి భీతి అనునది లేదు. ఎట్టి కార్యక్రమమైనా పట్టుదలతో, దీక్షతో అమలులో పెట్టగలడు. కాని తూర్పు యైరోపాలో తానేమి చేయాలో, అన్పటిక్లిష్టపరిస్థితుల . ఎల్లా పరిష్కరించాలో — యీ సమస్య ఆతని ఆలోచనాశక్తిని ధిక్కరించినది తూర్పు యైరోపాలో శాంతియే ప్రపంచశాంతికి మూలబీజము.

ఈ సమస్య ఫ్రాన్సు యింగ్లండులకుకూడ తెలగముద్ద అయినది. ఇప్పుడు జరుగుయుద్ధమును ,యింగ్లండు ఫ్రాన్సులు కాంక్షించలేదు. కాని వర్సేల్సు సంధి సమయమందు తాము యేర్పరచుకున్న యేర్పాట్లే యీ యుద్ధానికి కారణభూతము లయినాయి. ఫ్రాన్సు యీ యుద్ధమందు జర్మనీచే ఓడింపబడినది. ఇంగ్లండు ఒక్కటే యుద్ధాన్ని సాగిస్తున్నది. సైనికంగా గొప్ప

విజయమును పొందుటయే యింగ్లండులక్ష్యము కాదు. ఈతూరైనా యైరోపాలో నిరంతరశాంతి చేకూర్చు యేర్పాట్లు చేయాలను ఆలోచన యింగ్లండుకు గలదు. ఎట్లాగైనా మధ్యయైరోపాలోని వివిధరాజ్యముల సంఘర్షణలు సమసిపోవువిధానమును యింగ్లండు సూచింపక తప్పదు. తన సామ్రాజ్యపాలనములో మునిగి తేలు యింగ్లండు జర్మనీపై ఎల్లప్పుడును ఒక కన్ను వేసియుంచుట అసంభవము.

జర్మనీతో యుద్ధముచేసి, అపజయము వాటిల్లునట్లు చేసేందుకు యింగ్లండు తన నౌకాబలంమీదను, సైన్యాలమీదను ఆధారపడి యున్నది. కాని యైరోపాలో శాంతి నెలకొల్పుటకుఅంగబలముగాని,ఆయుధబలంగాని తోడ్పడవు. డాన్యూబు, నీష్టర్, వోల్గానదుల ప్రాంతాలలో నివసించు వివిధజాతులమధ్య యైక్యతయేర్పరచి, శాంతి చేకూర్చుటకు ఒక రాజకీయ రాజ్యాంగమును సుకరమగు నైసర్గికవిభజనము పై నిర్మించుటకు యింగ్లండు కృషి సల్పుట అవసరము. ఈ ప్రాంతాలందున్న ప్రజలు నవనాగరికతారుచులకు అలవడినవారు కారు. ఇంగ్లండు ఫ్రాన్సులందు అమలులోనున్న రాజకీయపద్ధతులను, సంస్థలను యీ ప్రాంతాలలో బలవంతముగ స్థాపించినయెడల, అవి జయప్రదముగ నిర్వహింపబడుట బహు కష్టము. ౧౯౧౦-వ సంవత్సరమునుండి ౧౯౩౮-వ సంవత్సరమువరకు యిట్టి ప్రయత్నమును యింగ్లండు ఫ్రాన్సులు గావించినాయి. దాని ఫలితమును యిప్పుడు పొందుచున్నాయి. ఇకముందిట్టి పనిచేయుట ప్రమాద జనితమగు, ద్రోహ్య దృష్టికరమగు పనియని చెప్పకతప్పదు. ఈ యుద్ధమందు యింగ్లండు విజయము పొందదలచిన మధ్య యైరోపారాజ్యాల మధ్య సంఘర్షణలను సంపూర్ణముగా రూపు మాపు పద్ధతులను ముందుగ సూచించుట అవసరము. నేడు నామమాత్రావశిష్టములయిన రాజ్యములును, నామ రూపములు లేకుండ పోయినరాజ్యాలును యికముందు యేరూపము దాల్చునో, ఎట్లు యీ రాజ్యములు నవ నాగరికతగల పెద్దరాజ్యములతో సహకార మొనర్చి ప్రపంచమందు శాంతిని నెలకొల్పునో — యిదియే యైరోపాలోని పెద్దరాజ్యాలవారి నెదుర్కొనుచున్న భీకరసమస్య. దీని పరిష్కారమునకు యింగ్లండు పూనుకోవలసియున్నది. తూర్పు యైరోపాలో శాంతిలేనంత కాలము యైరోపాఖండమందు సంఘర్షణలు తప్పవు.

సవరణ

ఈ సంచికలోనే పుట ౧౯౩, పేడ ౨, పంక్తి ౨౦, పుట ౧౯౪, పేడ ౧, పంక్తులు ౪, ౧౦, ౧౩, ౧౪—వీటి చివరనున్న ' గురుతు లేకుండాను, పుట ౧౯౮ లో కట్టకడపటను ' గురుతుపాటించిన్ని చదువవలెను.

ఆంధ్రభారతి

శ్రీ అయ్యగారి విశ్వేశ్వరరావు

ఏనుగంబారు లెక్కింగ వేనవేలు
కవులు నీదివ్యతేజమ్ము గణుతిజేయ
పుడమిరేడులు నీరూపు పూజసేయ
నాంధ్రభారతీ ! జోహారు లందితమ్మ !

కవులను గాంచి, రండనుచు కమ్మనిమాటల నాదరించి, యా
కవనమునందు సొంపుగని, కానుక లిచ్చుచు సత్కరింప, ము
న్నవిరళ భోగభాగ్య మహిమాన్వితవై తుల దూగితమ్మ, ఆ
ప్రవిమలభూపతుల్గలుగు భాగ్యము లేదిక నాంధ్రభారతీ !

కాకతీయులు నిన్ను కన్నాకుగా, జూడ గారాబుబిడ్డవై గ్రాలినావు
రాజరాజనరేంద్రు రాకుమారిక వౌచు, కలకలస్వనముల గులికినావు
ఆ రెడ్డిరాజుల యనురాగమున్బొంది, చిరతరంబగు కీర్తి జేర్చినావు
శ్రీకృష్ణరాయలు చేదోడుగానుండ, నిరుపమానపురీవి వరలినావు

అహూహా ! నీగాథ వినినట్టి ఆంధ్రు డెపుడు
నతులితానందసౌభాగ్య మందునమ్మ
దాస్యజలనిధి మున్గుచుం దానమాడ
నాంధ్రభారతీ ! యాశౌర్య మంతరించె.

ఆంధ్రదేశీయగాథల నన్ని విన్న
గుండె నీ రగు ! తోషమ్ము గూలిపోవు
మగిడి నాశౌర్య మందగా మనకు వశమె
యనెడి సందియ మొక్కటే యావహించు
నాంధ్రభారతీ ! దాస్యంబు నందుకతన.

కలుముల తల్లియా తెలుగుగడ్డకు దాస్యవిమోచనం బనన్
గలుగదు, తెల్గువారలను గర్భదరిద్రము వీడిపోదు, యే

యలబలమైన నాద్రమిళ మాంధ్రుల సొత్తును విడదమ్మ, మ
మ్మిమ్మల సృజియించె ధాత, కడుహీనత నందగ నాంధ్రభారతీ !
శ్రీనాథకవిరాజసీసపద్యాలలో తూగుటుయ్యెలలను నూగినావు !
బమ్మెరాన్వయుభక్తిపక్షమునందున బ్రీతి నాట్యమ్ము జేయుచు నడచినావు
అలసాని పెద్దన్న యల్లికజేపట్టి, వింతగు ఠీవితో వెడలినావు !
ముక్కుతిమ్మనకవిముద్దుపల్కులతోడ సవిలాసఫణితిగ సాగినావు !

దేశభాషల ఘనముగ దేజమంది
ఖండఖండాంతరమ్ముల ఖ్యాతి గాంచి
యెల్లవారల కానంద మొసగువేళ
ఆంధ్రభారతీ ! స్థిరకీర్తి నందితమ్మ.


కీ. శే. ఆనందమోహనశాస్త్రి

గడచిన మేనెల ౨౧-వ తేదిని కాతా ఆనంద మోహన శాస్త్రిగారు మరణించిరన్న ఘోరవార్త పత్రికలద్వారా అందరకును తెలిసిన విషయమే.

క్రిందటి సంచికలోనే వారి జీవిత చరిత్ర ప్రకటించవలసియుండెనుగాని, అవకాశము లేకపోయినది.

వీరు ఆంధ్ర లోకమునకు సుపరిచితులైన శ్రీ కాతా శ్రీరామ శాస్త్రిగారి రెండవ కుమారులు. శ్రీ శ్రీరామ శాస్త్రిగారు లోగడ 'శారదా' పత్రికస్థాపించి సంపాదకులుగా పనిచేసి ఆంధ్ర సారస్వతమునకు సేవచేసినారు. వీరి కుమారులలో జ్యేష్ఠులైన శ్రీరామ మోహన శాస్త్రిగారున్ను ఇప్పుడు కీర్తిశేషులైన ఆనంద మోహనశాస్త్రిగారున్ను చిత్రకళ అభిమాన విషయంగా అభ్యసించి మన దేశమందేకాక యూరపు ఖండమందును ప్రసిద్ధిపొందినవారు. వీరిలో ఆనంద మోహనశాస్త్రిగారి చిత్రకళా నైపుణ్యము ఎక్కువగా వ్యాప్తిపొంది పెద్దవారిమన్ననలనుపొందినది. డాక్టరు జె. హెచ్. కజిన్సుగారు వీరిని ప్రశంసిస్తూ వ్రాసిన వాక్యములు హిందూపత్రికలో మే ౨౫ తేదీని ప్రకటితములైనవి.

"౧౬ సంవత్సరముల ఈడుగలవాడుగా నున్నప్పుడే — సుందరమైన అతని ఆత్మ మనోహర చిత్రములలోనికి పరివర్తనము పొందినప్పుడే, భారత దేశచిత్రకళ ఎట్లు పునర్జీవమును పొంది విలసిల్లి, ప్రపంచమందెట్టి ఉన్నతస్థానమును ఆక్రమించి, యెట్టి మహాశయములతో తేజోవంతమై కనబడుతున్నదో ఆనందమోహనశాస్త్రి తెలియజేసినాడు. ఇతని చిత్రములలో కొన్ని మైసూరు, తిరువేంద్రం చిత్ర ప్రదర్శనాలయమందు కలవు. అవి యీ కళోపాసకుని జీవితమును మరపునకు రానీయవు. వాటిలో తిరువేంద్రమునందుగల చిత్రమొకటి కడు రమణీయమైనది. ఈ చిత్రమందు ప్రతిభాగంలోను భారతదేశీయచిత్ర కళాసంప్రదాయమున్ను, మహిమయున్ను, ప్రకృతి పరిసరములందుగల మాధుర్యమున్ను, ఈ చిత్రలేఖకుని విశిష్ట కళానైపుణ్యప్రాభవమున్ను కడు సుందరముగా మిళితమై కనబడును. ఇది యేకలవ్యుని చిత్రము. ఇది చూచినంతనే ప్రపంచమందలి ప్రఖ్యాతచిత్రకారులతో ఇతడు తులతూగగల కళాప్రగల్భుడని తోచక మానదు.



"బాల్యమందే యితడు నిరాడంబరముగా తన కళానైపుణ్యమును తానే పోషించుకొంటూ కళాప్రపూర్ణుడైనాడు. ఇట్టివారు లోకములో అరుదు. ఇండియావంటి దేశములో ఇప్పుడు విద్యయింకా సర్వతోముఖముగా వ్యాపించనందున కళా స్వాతంత్ర్యము గల చిత్రలేఖకుల చిత్రకళారచన పూర్తిగా గుర్తించి అభినందించ గలవారులేరు. అంతేకాక యిక్కడివారు తమ దేశమువారి గొప్ప యితరులు చెప్పేదాకా తాము తెలుసుకోజాలరు. అందుచేతనే, ఆనంద మోహనుని చిత్రకళా నైపుణ్యము దేశమువారి యెన్నికకు రాక పూర్వమే యూరపు అమెరికా ఖండములందు ప్రస్తుతి పొందినది. పెద్దపేరుగల చిత్రకళా నిపుణులు ఇతని చిత్రములను చాలా మెచ్చుకొన్నారు.

"ఏడు సంవత్సరముల క్రిందట ఆనందమోహను ఇరవై ఐదేండ్లవాడై యున్నప్పుడే "నేటికళాభిజ్ఞులు" అనే ఒక ఫ్రెంచిపత్రికలో యీ భారతీయ చిత్రకళా బాలకుని కళాప్రౌఢి కళావిశిష్టతలు ఎక్కువగా మెప్పువడసినవి.

"మొదటి నుండిన్ని యితనికి సహజముగా పుట్టిన కళాభిజ్ఞత, స్వతంత్రశక్తి యితనికి మార్గదర్శకములుగా పనిచేసినవి.

"౧౯౩౦ లోనే లండనులో ప్రదర్శించిన సామ్రాజ్యచిత్రవస్తు ప్రదర్శనమందు ఇతను రచించిన చిత్రములు రెండు మంచిస్థలమును అలంకరించగలిగినవి. ఇది సామాన్య విషయముకాదు. ఈ ప్రదర్శనాలయమందు భారతీయ చిత్రములలో ఆరింటికంటె యెక్కువ ఉంచుటకు అవకాశములేదు. అవకాశమంత సంకుచితమై ఉన్నప్పటికిన్నీ మన ఆనందమోహనుని చిత్రములలో రెండింటికి అవకాశము దొరకడము గొప్పవిశేషము.

"చిన్న యువకుడుగా నున్నప్పుడే యింత పెద్ద ఖ్యాతిగడించిన ఈ ఆనందమోహను ఆయుర్దాయమున్న యెడల యింకా ఎంత గొప్పవాడై తనకు, తన కుటుంబమునకే కాక భారతదేశమంతటికిన్ని యెంత కీర్తి తెచ్చియుండునో ఆంధ్రులు అతనిని చూచి యెంత గర్వపడవలసి యుండునో ఆలోచింతురుగాక. ఇతని చిత్రములు పరిపూర్ణముగా పరిణమించుటకు ప్రాప్తము లేకపోయినా, ఉన్నంతవరకైనను దేశమందు వ్యాప్తిలోనికి వచ్చేటట్లు ఒక ప్రధానస్థలమందు ఇతని పేరు శాశ్వతముగా నిలుచునట్లుగా ఇతని చిత్రముల నన్నిటిని చేర్చి ప్రదర్శించుట మంచిది. ఈ విధముగానైనా యితనియెడల తమకుగల కృతజ్ఞత తెలియచేసుకొనుటకు భారతీయులకు అవకాశము కల" దని డాక్టరు కజిన్సుగారు హెచ్చరించినారు.

Les Artistes D'ajourd'hui అనేపత్రికలో పాస్కల్ లెవీగారు ఆనందమోహనుని మెచ్చుకొంటూ ఎట్లు వ్రాసినారో చూడండి: "౨౫ యేండ్ల ప్రాయము వాడైనప్పుడే ఆనందమోహనశాస్త్రి **Salon Des Aristes Francais** అనే చిత్రవస్తుప్రదర్శనమునకు పంపించిన చిత్రములు అతని కళాప్రౌఢిని, చిత్రకళలో గల అతని స్వతంత్రబుద్ధిని తెలియజేసినవి. ఈ కళాభిజ్ఞుడు భారతీయుడు గనుక ప్రకృతిని చూచి తన కళానైపుణ్యము వృద్ధిచేసుకొనుటకు ఇతని దేశములోనే అవకాశములు మెండుగా గలవు. ఇతడు తనకండ్లయెదుట తాండవమాడుచున్న ప్రకృతిని చూచి చిత్రకళా విషయములను అవగాహనము చేసుకోవడంలో యితనికి సహజముగా కలిగిన విషయగ్రహణశక్తి, ఆత్మ పారిశుధ్యము, విజ్ఞానము, సౌందర్యరసగ్రహణము ఇతనికెక్కువగా తోడ్పడినవి. ఇతనిచిత్రములు సజీవములైన చిన్న నాటకములు; రాగోద్దీపితమైన తన దేశమందలి ప్రతిదిన జీవితమునకు వాస్తవమైన అనువాదములు. 'నీడలు' 'కత్తి పదను పట్టువాడు' అనే చిత్రములు రచించిన విధము అతిరమణీయమైనది ఈ రెండు చిత్రములందున్ను అతని కళా నైపుణ్యము పరిణతి పొందినది. ఇతనిలో ఇంత గొప్పనైపుణ్యముండుటచేతనే యితని చిత్రములకు ౧౯౩౦ లో లండను నగరమందలి సామ్రాజ్య చిత్ర వస్తుప్రదర్శనాలయమునందు ప్రవేశము గల్గినది.

రామమోహన, ఆనంద మోహనసోదరులు మొట్టమొదట బందరులో ఆంధ్రజాతీయకళాశాలలో చిత్రకళయందు ప్రారంభ శిక్షణము పొందినవారు. పిమ్మట, మైసూరులో కె. వెంకటప్పగారితో కలిసి పనిచేసినవారు. ఈ సోదరులలో ఆనంద మోహనుడు ౩౨యేండ్లు నిండినంతనే అస్తమించుటవల్ల ఆంధ్ర దేశమునకేకాక ఇండియా దేశమునకే గొప్పలోపము కలిగినది. శ్రీరామమోహను శాస్త్రియైనా చిరకాలము జీవించి తమ్ముడు లేనిలోపము లేకుండజేసి తన చిత్రకళా నైపుణ్యము అభివృద్ధి చేసుకోగలుగునట్లు భగవంతుడు అతనిని సంరక్షించుగాక.

ఆనందమోహనుని చిత్రములలో ఒకటి ౧౯౨౫లో లక్నోనగరమందు జరిగిన చిత్రవస్తు ప్రదర్శనమందు 'రాజామోతీచందు" పతకమును బహుమానముగా పొందినది. ఆ సంవత్సరమందే 'తన్మయత్వం' అనేచిత్రం 'డెయిలీ ఎక్స్ప్రెసు' అనే పత్రికయొక్క సంవత్సరాది సంచికలో ప్రకటితమైనది. ఇతని 'జీవాత్మ గోపాలుడైన కృష్ణుడు' అనే చిత్రము **Illustrated London News** అనేపత్రికలో ౧౯౨౯ లో ప్రకటితమైనది.

—సీతాపతి



బీచిషికారు

నాన్నా, అమ్మా, అన్నా, నేనూ
కారుమీదనో, కాలినడకనో
షైరుకు వెళతాం సరదాగానూ
బీచికి పోయీ కూర్చుంటామూ.

నీలి అలలపై నిలిచే నావలు
తీరమునందున తిరిగే పీతలు
వలలో జాలరి పట్టే చేపలు
చూదామమ్మా! చూదాం రావే.

సూటూ బూటూ నీటుగ తొడిగి
తొక్కుడు బండీ ఎక్కిస్తావా ?
నాన్నా, నీవూ, అన్నా, తొక్కుడు
బండీ పక్కను పరుగిడుతారా ?

పిచికల గూండ్లూ పిల్లకొండలూ
బొమ్మరిండ్లు మరి బొట్టుపెట్టెలూ
కట్టి ఇసుకలో గంతులు వేదాం
బీచికి పోదాం వేగం రండీ.

బంతి ఆటలూ, బండ్ల సందడీ,
గాలిపడగలూ, గంటల శబ్దం,
పిల్లల ఆటలు, పెద్దల పాటలు,
చూదాం రండీ చోద్యంగానూ.

సాయంకాలం చంద్రుని చూచీ
బీచి ఇసుకపై వెన్నెలచూచీ
పిల్లవాయువులు పీల్చి పీల్చి
ఆడుకు వద్దాం అన్నా! రారా.

శ్రీ కె. వి. ఉమామహేశ్వరరావు



సూర్యుడు, గాలి, చందమామ

మనం ప్రతిరోజూ ఆకాశంమీద పగలు సూర్యుణ్ణీ, రాత్రి చందమామనూ చూస్తుంటాము.

సూర్యుడికి ఒక చెల్లెలు, ఒక తమ్ముడు ఉన్నారు. సూర్యుడి చెల్లెలు చందమామ. సూర్యుడి తమ్ముడు గాలి. వాళ్లు ముగ్గురూ కలిసిమెలిసి ఆడుకుంటూ వుండేవాళ్లు.

ఇలా వుండగా ఒకరోజున వాళ్ల చుట్టాలలో ఒకరు వాళ్ల ముగ్గురికీ ఒక కొత్తరకం తియ్యటి మిఠాయి పెట్టాడు. సూర్యుడూ, గాలీ తమ వంతు మిఠాయిని తినేశారు. కాని చందమామ తన వంతు మిఠాయిని తినేయకుండా యిలా ఆలోచించింది. "అమ్మ చాలా మంచిది. మాకు రోజూ స్నానం చేయించి, మంచిబట్టలు తొడిగించి వేళ తప్పకుండా అన్నం పెడుతూ వుంటుంది. అదిగాక మేము అడిగినప్పుడల్లా మంచిమంచి మిఠాయి పెడుతూ వుంటుంది. అలాంటప్పుడు అమ్మకు పెట్టకుండా ఏవస్తువూ మనం తినకూడదు" అనుకొని మిఠాయిలో సగం తాను తిని మిగిలినదాన్ని వాళ్ల అమ్మకు పెట్టింది.

చందమామ అమ్మ చాలా సంతోషపడింది. చందమామకు తనయందు గల ప్రేమకు చాలా మెచ్చుకుంది. కాని ఆ మిఠాయిని తినలేదు.

ఆమె సూర్యుని దగ్గరకు వెళ్లింది. "అబ్బాయీ! నావంతు మిఠాయి ఏదిరా ?" అని అడిగింది. అందుకు సూర్యుడు—

"అమ్మా! నీకోసం నేను ఏమీ దాచి పెట్టలేదు. నీకు పెట్టాలనే సంగతి ఆలోచించకుండా అంతా తినేశాను" అని బదులు చెప్పాడు.

ఆమె గాలిని పిలిచింది. "అబ్బాయీ! నా కేమన్నా మిఠాయి దాచివుంచావా ?" అని అడిగింది.

అందులకు గాలి—"అమ్మా! నీ సంగతి నేను ఆలోచించలేదు. నీకు దాచకుండా మిఠాయిఅంతా నేనే తినేశాను" అన్నాడు.

అప్పుడు ఆమె చాలా విచారించింది. తాను కష్టపడి కని, యిన్నాళ్లవరకూ పెంచిన తల్లియందు వారు ప్రేమ చూపించక పోవటంచేత ఆమెకు చాలా కోపం వచ్చింది. ఆమె సూర్యుణ్ణి చూచి—"నువ్వు చాలా చెడ్డవాడవు. నిన్ను కని పెంచిన తల్లిమీద నీకు ప్రేమ లేకపోయింది. కనుక యీ రోజు మొదలు నువ్వు చాలా వేడిగా ప్రకాశిస్తూండు. ప్రజ లంతా నిన్ను చూడంగానే భయపడి యిళ్లల్లోకి పారిపోవుదురుగాక!" అని శపించింది.

ఆమె గాలిని జూచి — "నీక్కూడా నిన్ను కనిపెంచిన తల్లియందు ప్రేమ లేకపోయింది. కనుక యీ రోజుమొదలు నువ్వు రాత్రియనక పగలనక ఎప్పుడూ తిరుగుతునే యుందువుగాక!" అని శపించింది.

ఆ తరువాత ఆమె చందమామను ప్రేమతో కౌగలించుకొని ముద్దుపెట్టుకొని "నువ్వు నా బంగారు తల్లివి. చాలా మంచిదానవు. నిన్ను కనిపెంచిన తల్లియం దెంతో ప్రేమను చూపిస్తున్నావు. కనుక నేటినుండి నువ్వు చల్లనితల్లి వని నిన్ను పురుషులు

స్త్రీలు, బాలురు ప్రేమిస్తుంటారు" అని ఆశీర్వదించినది.

అందుచేతనే సూర్యుడు ఎప్పుడూ వేడిగా ప్రకాశిస్తూంటాడు. మనం వానిని చూడగానే భయపడియిండ్లలో దాక్కుంటూ వుంటాము. గాలి, రాత్రి అనక పగలనక ఒక్కక్షణమన్నా విశ్రాంతి లేకుండా ప్రపంచ మంతటా పరుగెత్తుతూ వుంటాడు. ఇక చందమామ ఎంతో చల్లగా వుండి ఎంత సేపు చూచినా విసుగుపుట్టించకుండా మనకు ఆనందాన్ని యిస్తుంది.

చూశారా! మనంకూడా సూర్యుడూ, గాలీలాగు కాకుండా మనలను కనిపెంచిన అమ్మలను ప్రేమిస్తుంటే! చందమామలాగు మనంకూడా అందరిచేతా మంచివాళ్లు మని పించుకోవచ్చు.

చిలుకూరి శేషగిరిరావు

పుస్తక సమీక్ష

శ్రీ మహారాజ విక్రమదేవవర్మ రచనలు

శ్రీ జయపురాధీశులును సాహిత్యసమ్రాణ్మహారాజోపాధియుతులు నగు శ్రీ.శ్రీ.శ్రీ విక్రమదేవవర్మ డి. లిట్. వారు అప్పుడప్పుడు రచించిన ఖండకావ్యములు, చాటువులు, కథలు, వ్యాసములు మొదలయినవి—ఇదివరకు పత్రికలలో ప్రకటితము లయినవీ, కానివీ - అన్నీ చేర్చి "శ్రీ మహారాజ విక్రమదేవవర్మ రచనలు" అనే పేరను శ్రీ తలిసెట్టి రామారావుగారు ఒక గ్రంథమును ప్రకటించినారు. ఇది ౧౯౪౦ లో విశాఖపట్టణము శ్రీ శారదాముకుట ముద్రణాలయమునందు ముద్రితమైనది. ఇందులో కొద్దిగా సంస్కృతరచనలున్నూ, ఎక్కువగా తెలుగు రచనలున్నూ ఉన్నవి. ఇందు ౯౪ వివిధ విషయములకు సంబంధించిన రచనలు గలవు. అందులో ౫౪ పద్యరచనలు, ౩౦ గద్యరచనలు. పద్యరచనలలో ప్రార్థన శ్లోకములు, స్తోత్రములు, క్షేత్రతత్త్వములు, సమస్యలు, ఋతువర్ణనములు, నీతిపద్యములు మొదలయినవి కలవు.

పద్యరచనలలో 'రాజధర్మము' గురించి వ్రాసిన పద్యములందు, శ్రీ వారు తాము రాజులున్నూ ప్రభువులున్నూ గనుక, తాము ఆదర్శముగా పెట్టుకొని ఆచరణములోనికి తీసుకొని వచ్చిననీతిని ఉపదేశించినారు.

> "రాజు నిజదేశమునకును బ్రజలకు దొర
> ననుచుఁ దలఁపక తన్ను శ్రీహరి జనులకు
> సేవఁ జేయుటకొఱకే సృజించె నంచు
> నెంచి విఙ్ఞ వీగక సంచరించు టొప్పు.
>
> "ప్రజలు శ్రమపడి యార్జించి భక్తిఁదనకు
> నిచ్చినధనంబు వారికై వెచ్చపెట్ట
> కాత్మభోగాళికొఱకును ఖ్యాతికొఱకు
> వమ్ము సేయుట దగునె? నృపాలకులకు."

సమస్యలు పూర్తిచేయుటలోను, వింతలెక్కలు, ప్రశ్నోత్తరములు, చమత్కారప్రహేళికలు మొదలయినవి రచించుటలోను శ్రీ వారికిగల ఆసక్తి, నేర్పు తెలియజేసే పద్యములు సైతము ఈ గ్రంథములో గలవు. స్తుతులు, స్తోత్రములు మొదలయినవి వారి దైవభక్తి పరత్వమును సూచిస్తవి. వర్షర్తు, శరదృతు వర్ణనములు తులసీదాసుని రచనల కనువాదములే అయినా స్వేచ్ఛానువాదములై తెలుగునుడికారమున కనుకూలముగా రచితములైనవి. "భామరో! సామి నెడఁబాసి తాళఁగ లేనే" అని హిందూస్తాని తోడిరాగములో ఆదితాళమునందు పాడుటకుద్దేశించి రచించినపాట శ్రీ వారి గానకళాభిరతిని ప్రకటిస్తుంది. కవిజన్మకుండలిగీతము శ్రీ వారి జ్యోతిశ్శాస్త్రజ్ఞానమును సూచిస్తుంది.

గద్యరచనలు సైతము వివిధ విషయములకు సంబంధించినవి. కేవల సాహిత్య విషయములకు సంబంధించిన వ్యాసములలో నన్నయభట్టు యుగము, ఆంధ్ర సాహిత్య పరిషదధ్యక్షోపన్యాసము, నాటకములు, నేఁటితెలుఁగు ముఖ్యమైనవి. సాంఘిక విషయములకు సంబంధించినవాటిలో అశ్లీలవిగ్రహవిషయము, పతిసహగమనము, హింస, మునలిమగఁడు- శ్రీ వారి ఆశయములను తెలియజేస్తవి. గురునానకు, తులసీదాసుడు— వీరి జీవితచరిత్రలలోని ముఖ్యమైన విషయములను ఎత్తుకొని శ్రీ వారు చక్కని వ్యాసములు రచించినారు.

వీరి రచనలనుబట్టి వీరిసర్వతోముఖ పాండిత్యము కొంత వెల్లడి యగునుగాని పూర్తిగా కాదు. వీరితో కొంత సేపు ప్రసంగించునప్పుడు గాని, వీరు సభాధ్యక్షులయి సభలో ఒక్కొక్క విషయమును గురించి ఒక్కొక్క పండితుడు ఉపన్యసించునప్పుడు వీరు ఉపన్యాస విషయమును విమర్శించి ప్రసంగించునప్పుడుగాని వీరి జ్ఞాన విజ్ఞానములు ఎంత ఎక్కువగాను నిండుగాను పరిణతి పొందియున్నవో తెలుసుకోవచ్చును; శాస్త్రములన్నిటితోను వీరికి కొద్దిగానో గొప్పగానో పరిచయము కల దని చెప్పవచ్చును.

ఇంత ఎక్కువగా శ్రీ వారిని, వారి రచనలను ప్రశంసించినా, వ్యాకరణము, గ్రాంథిక వ్యావహారిక భాషాప్రయోజనము మొదలయిన విషయములలో మాత్రము వీరి ఆశయములతోను, అభిప్రాయములతోను

మేము ఏకీభవించలేము. మరియొక సంచికలో ఈవిషయములగురించి వ్యాస మొకటి ప్రకటించదలచినాము గనుకను, ఇక్కడ అవకాశము చాలదు గనుకను, ప్రధాన విషయము సూచనగా మాత్రమే తెలియజేస్తున్నాము. "సిద్ధిర్లోకా ద్దృశ్యా" "శబ్దసిద్ధి లోకంబువలనఁ దెలియును"—ఈ విషయము గుర్తించకుండా రచితములయిన వ్యాకరణ సూత్రాలు ఎంత గొప్ప పరిషత్తువారు విధించినా చెల్లవు; గ్రంథములో ముద్రితములై ఉండవలసినవే కాని ఆచరణలోనికి రావు. లోకమే కవికిన్ని, లాక్షణికునకున్ను ప్రమాణముగాని, లోకానికి కవిగ్రంథముగాని, లాక్షణికుని లక్షణముగాని ప్రమాణము కాదు.

మరియొక విషయము, 'నిత్యా ప్రవాహినీ దేశ్యా' అనే మూలసూత్రములోని భావము సైతము పూర్తిగా గ్రహించవలసి ఉన్నది. కేవలము గ్రంథములందు మాత్రమే నిలిచి ఇప్పుడు వాడుకలో లేని ప్రాచీనభాషలు హ్రదమువంటివి; కాని, వాడుకలో ఉన్న దేశభాషలు నదులవంటివి. నన్నయనాటి గోదావరియే నేటికిన్ని నిలిచి ఉన్నది. ఎన్నటికీ ఉంటుంది. అందుచేతనే 'నిత్యా' అనే విశేషణము సార్థకమైనది. అయితే నన్నయనాడు గోదావరిలో ఉన్న జలములే నేటికిన్ని ఉన్నవి అనిగాని ఉండవలెననిగాని చెప్పలేము. ఆవిధంగానే దేశ్యమందు పైని చెప్పినటువంటినిత్యత్వ మున్నా, అందులోని శబ్దరూపములున్ను, శబ్దార్థములున్ను మారుతూ ఉంటవి.

వ్యాకరణ శాస్త్రములోని అనుశాసనములు రాజకీయనియంతల శాసనములవంటివి కావు; కానేరవు. వృక్షశాస్త్రము, జంతుశాస్త్రము మొదలయిన లౌకికశాస్త్రములవలె ఈశాస్త్రమున్ను యథాస్థితి నిరూపణము చేసే శాస్త్రమే కాని, లాక్షణికుల ఇష్టానిష్టములనుబట్టి శాసనములను జారీచేసే శాస్త్రము కాదు.

'ప్రతివాడు', 'దృఢనమ్మకము', 'నిజానిజములు' మొదలయినవి శ్రీవారు తలచినట్లు దుష్టసమాసము లని చెప్పుటకు వీలులేదు. ఇటువంటివి అనేకంగా పెద్దలు, పిన్నలు, పండితులు, పామరులు నేడు వ్యవహరిస్తున్నారు. వీటిలో కొన్ని కవులు తమ కావ్యములలో ప్రయోగించారు. వీటిని మిశ్రసమాసా లనికాని వైరిసమాసా లనికాని చెప్పవచ్చును; గాని, దుష్టసమాసాలని నిందించి ప్రయోగించరా దనరాదు; అన్నా చెల్లదు. 'కఱకంఠుఁడు, ప్రాణగొడ్డము, జీవగఱ్ఱ అని తాము చూచిన మూడుమాత్రమే పేర్కొని ఇవే సాధువులు; తక్కినవి ఎటువంటివే అయినా అసాధువులు అని లాక్షణికులు చెప్పినంతమాత్రాన లోకంలో ప్రసిద్ధంగా ఉన్న మిశ్రసమాసాలు దుష్టము లవుతవా? అర్ధరూపాయి, అర్ధణా, మహారాణి, గర్భగుడి, రామచిలుక, తలపెద్ద మొదలయిన వెన్నో స్థిరముగా నిలిచి ఉన్నవి. 'ప్రతివాఁడు' — ఇది చాలా చక్కని ప్రయోగం; ఈభావం వ్యక్తపఱచడానికి ఇంత సులువైన ప్రయోగం మరియొకటి వాడుకభాషలో లేదు. ఎల్లవాఁడు, ఎల్లవారు, ఎల్లరు ప్రాచీనభాషలో ఉండేవి; గాని, ఇప్పుడు వాడుకలో లేవు. 'చూచిందల్లా కావాలి' మొదలయిన ప్రయోగాలుమాత్రము ఉన్నవి. అందుచేతనే శ్రీ తిరుపతివేంకటేశ్వరకవులు 'ప్రతివాఁడు' ప్రయోగించారు (చూ. గుంటూరుసీమ పు. ౩౫). కళాప్రపూర్ణ వేంకటరాయశాస్త్రులవారు 'ప్రతిది' ప్రయోగించారు. (చూ. అలంకారశాస్త్రము.)

వాడుకభాషలో చేయుట, చేయటం, చేయడం అని రూపాంతరాలు ఉంటవిగదా; ఏది సాధువనడం? అంటారు. సంస్కృతభాషలో కొన్ని శబ్దాలకు ఎన్నెన్ని రూపాంతరాలు లేవు. "భల్లః, భల్లకః, భల్లుకః, భల్లూకః..."; "ధువతి, ధవతి, ధవతే, ధూనుతే, ధూనోతి, ధునుతే, ధునోతి, ధునాతి, ధూనయతి, ధూనయతే" ఈవిధముగా రూపాంతరాలు ఉన్నవి. ఇట్లే శ్రీవారు సాధువనే గ్రాంథికాంధ్రభాషలో సైతము కొమరిత, కొమరితె, కొమరె, కొమిరె, కొమారి, కొమారిత, కొమారితె, కొమార్త, కొమార్తె; పూజించితివేనియున్, పూజించితివేని, పూజించితివేన్, పూజించితేనియున్, పూజింతేన్, పూజించితే; మొదలయిన రూపాంతరాలు ఎన్నెన్ని పదములకు ఎన్నెన్ని లేవు. అన్నీ సాధువులే అనవలెను.

సంస్కృతభాషలో వాల్మీకి "ప్రదీయతాం దాశరథాయ మైథిలీ" అని ప్రయోగించినంతమాత్రాన దాశ

రథిశబ్దమును అకారాంతముగా వ్యవహరింతుమా ? అని శ్రీవారు ప్రశ్నిస్తున్నారు. సంస్కృతభాష ఇప్పుడు వాడుకభాషగా లేదు గనుక, 'వ్యవహరింతుమా' అంటే వారి అభిప్రాయము రచనలో ప్రయోగింతుమా అనే అయిఉండవలెను. ఇష్టము లేనివారు మానుకోవచ్చును; గాని, తమ కిష్టములేని రూపము తప్పనడానికి వీలులేదని మా అభిప్రాయము. దాశరథ రూపము అకారాంతముగాసైతము ఉన్నది గనుకనే వాల్మీకి ప్రయోగించినాడు ; ఆపటే తన నిఘంటువులో చేర్చుకొన్నాడు. ఆ విధంగానే "వైరోచనః, వైరోచనిః, వైరోచిః" రూపాలుసైతము చేర్చుకొన్నాడు. 'స్థితస్య గతిశ్చింతనీయా' అని ఉన్నరూపాలు నిఘంటువులో చేర్చుకోకపోతే నిఘంటువు దుష్టమో అసంపూర్ణమో అవుతుందిగాని శబ్దాలు దుష్టములుకావు. నిఘంటువునుగురించి చెప్పినట్లే వ్యాకరణమును గురించి సైతము చెప్పవలెను.

అర్ధానుస్వారము 'వీఁగు' లో ఉన్నదనిన్నీ, 'తోఁచు' లో లేదనిన్నీ మా అభిప్రాయము. "వీఁగు" లో అర్ధానుస్వార మున్నది. "వీఁగి తనతల్లి దాస్యంబు నీఁగఁబూని" భారతప్రయోగము. 'వీఁగు'లో అర్ధానుస్వారము ఉండ దని కాబోలు శ్రీవారు 'విజ్జవీగక' అని రచించారు (చూ. పు. ౧౮ పంక్తి ౨.) ఈ విషయములు మరియొక సంచికలో ఎక్కువగా తెలియజేస్తున్నాము.

పైని చెప్పిన విషయములలో శ్రీ వారి అభిప్రాయములతో మేము ఏకీభవించ లేకపోయినా శ్రీవారి గ్రంథమందలి రచనలలో పెక్కింటిని మేము మొదట చెప్పినట్లు ఎక్కువగానే ప్రశంసిస్తున్నాము. అంతేకాదు; అవి ఆంధ్రులందరూ చదివి తీరవలెనని హెచ్చరిస్తున్నాము.

ఒక్కమనవి—ఇందులో అచ్చుతప్పులుఎక్కువగా ఉన్నవి. తప్పొప్పుల పట్టిక చాలా పెద్ద దయినది. అయినా పూర్తిగా లేదు. చాలా తప్పులు పట్టికలో చేరక ఉండిపోయినవి. అందుచేత, ఈగ్రంథము తప్పులు లేకుండా సవరించి ఇంతకంటె ఎక్కువ ఆకర్షకంగా మరల మేలైన ముద్రణాలయమందు ముద్రింతురుగాక అని ప్రార్థిస్తున్నాము.

మంచి రచనలు, వ్యాసములు రచించినశ్రీవారు ఆంధ్రుల కృతజ్ఞతకు పాత్రులు. ఈ గ్రంథము ప్రకటించిన శ్రీరామారావుగారు ధన్యులు.

సీతాపతి

సావర్కర్

గ్రంథకర్త : శ్రీ కె. రంగదాసుగారు. ప్రకాశకులు:- అణా గ్రంథమాల. ౩౬౯౧ తురుపు బజారు, హైదరాబాదు (దక్కన్).

ప్రస్తుతము హిందూమహాసభకు అధ్యక్షుడుగానున్న శ్రీ వినాయక దామోదర్ సావర్కరుగారి జీవితచరిత్రము. భారతదేశస్వాతంత్ర్యమునకై ఈ మహాపురుషుడు గావించిన అద్భుతచర్యలు, సాహస కార్యములు చిత్తాకర్షకమైన భాషాశైలిలో వర్ణించబడినవి. యమదూతలవంటి పహారాదార్ల రక్షణలో స్టీమరుమీద ఇంగ్లండునుండి ఇండియాకు ప్రయాణము చేయుచున్నసమయమున ఈ వీరపురుషుడు కావించియుండిన మహాసాహసకృత్యములు చదువునప్పుడు భారతీయులందుసైత మిట్టి పరాక్రమవంతులు ఉన్నారా యను సందియము కలుగును. దేశదాస్యవిముక్తి నభిలషించువారి కందరికీ ఈ చిన్ని పుస్తకము పారాయణముచేయతగినది. ఇట్టి ఉత్తమ చరిత్రను ఒక్కఅణాలో అందరికీ అందుబాటులోనుండు లాగు చేయుచున్నందులకు అణాగ్రంథమాల వారునూ అభినందనీయులు.

దయానందసరస్వతి

గ్రంథకర్త : శ్రీ వెల్దుర్తి మాణిక్యారావుగారు. అణాగ్రంథమాలవారిచే ప్రకటితము: ౩౬౯౧ తురుపుబజారు, హైదరాబాదు (దక్కను).

ఇది ఆర్యసమాజస్థాపకులగు శ్రీస్వామి దయానంద మహర్షి యొక్క జీవితచరిత్రము. మహమ్మదీయయుగములో, లక్షలకొలది హిందువులు ముసల్మానులుగ

మారుచుండిన కాలమున శ్రీగురునానకు జన్మించి హిందూమతము నెట్లు కాపాడెనో అట్లే ఆంగ్లయుగమున శ్రీదయానందు డవతరించి వేలకొలది హిందువులు క్రైస్తవులుగ మారకుండ రక్షించెను. అన్యథా ఉత్తర భారతమున ప్రస్తుతము సిక్కుమతము నవలంబించి యున్నవా రందరూ మహమ్మదీయులుగనూ, ఆర్య సమాజికు లనువా రందరూ క్రైస్తవులుగనూ మారియుందురు. ఈమహర్షి జీవితచరిత్రమును సమగ్రముగ పండిత లేఖరాం అనువారు వ్రాసియుండిరి. కాని అది ఉర్దూ, హిందీభాషలలో ఉన్నందున మన కందుబాటులో లేకుండెను. ఇప్పుడు అణాగ్రంథమాల వారి కారణమున ఈ మహాత్మునిగురించి తెలుసుకొనుటకు మంచి యవకాశము కలిగినది. ఇందు మొదట దయానందుని జీవితము సంగ్రహముగ వ్రాయబడినది. అనంతరము ఆయన జీవితములో ఘటిల్లిన వృత్తాంతములలో కొన్ని అపూర్వసంఘటన లనుపేర వ్రాయబడియున్నవి.

గ్రంథస్వీకారం

చింతాదేవి — గ్రంథకర్త: శ్రీ విద్వాన్ శతావధాని అనుముల వేంకటశేషకవిగారు. ఆంధ్రజాతీయ గ్రంథమాలవారి ప్రథమ ప్రచురణము. ఆంధ్రజాతీయ గ్రంథమాల, కర్నూలు, వెల రు. ౧-౦-౦.

సిద్ధాంత శిఖామణి — రచయిత: శ్రీ శివయోగి శివాచార్యులు: మేనేజరు, శివధర్మ గ్రంథమాల, రజబ్ సజన్‌లాల్ వీథి, సికింద్రాబాదు, దక్కన్. వెల రు. ౦-౮-౦.

శివమహిమ్నస్తుతి - భీమఖండము — ఇవి రెండు చిన్నరచనలు. రచయిత: శ్రీ వడ్డాది సీతారామాంజనేయకవిగారు.

మరోమార్గం — సంపాదకులు: రాడికల్ కాంగ్రెసువారుల సమితి; మూచిపూడి, తెనాలి తాలూకా, గుంటూరు జిల్లా. వెల ౦-౬-౦.

కేనోపనిషత్తు: వ్యాఖ్యాత: శ్రీ ముమ్మనేని లక్ష్మీనారాయణ చౌదరిగారు. అమృతలూరు. శ్రీ భాషా సంజీవనీ గ్రంథమాలవారిచే ప్రకటితము. వెల రు ౦-౮-౦ లు.

ఆర్యగృహిణి — రచయిత: శ్రీమదనమోహన విద్యాధరుగారు. అనువాదకులు: శ్రీ ముమ్మనేని లక్ష్మీనారాయణగారు, శ్రీ పం. గోపదేవుగారు. దేశోద్ధారక ప్రెస్, తెనాలిలో ముద్రితము.

ఈశోపనిషత్తు — వ్యాఖ్యాత: శ్రీ ముమ్మనేని లక్ష్మీనారాయణ చౌదరిగారు. అమృతలూరు, తెనాలి తాలూకా, జిల్లా గుంటూరు. వెల రు. ౦-౮-౦

గ్రంథనవకం — ఆంధ్రావళి వెల రు. ౧-౦ ౦, స్నేహలతాదేవి౦-౮-౦, తెనుగుతోట౦-౮-౦, కష్టకమల ౦-౮-౦, జడకుచ్చులు ౧-౦-౦, రమ్యాలోకము ౦-౮-౦, స్వప్నకుమారము ౦-౮-౦, మధుకలశం ౧-౦-౦, తృణకంకణము వెల ౦-౮-౨. గ్రంథకర్త: శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారు. ప్రకాశకులు: నవ్యసాహిత్యపరిషత్తు: గుంటూరు.

ఆహుతి — రచయిత: శ్రీ దండంరాజు కేశవరావుగారు. ప్రకాశకులు: నవ్యకళాపరిషత్తు, నరసారావుపేట, గుంటూరు జిల్లా.

కల్క్యవతారము — ప్రణేత: శ్రీ చెళ్లపిళ్ల సుందరరావు చిత్రావధానిగారు. దుగ్గాడ, పిఠాపురం తాలూకా, తూ. గోదావరి.

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press,
No. 7, Thambu Chetty St., Madras. Editor:— S. Sambhu Prasad.

భారతి

సచిత్ర మాసపత్రిక

BHARATHI

(A TELUGU MONTHLY)

సంపాదకుడు:

శి. శంభుప్రసాద్

ఆంధ్రపత్రికా ముద్రాలయము,

మద్రాసు.

౧౯౪౧

సంపుటము ౧౮, సంచిక ౯

ప్రకటన

ఈ క్రింది కనబరచిన నెంబర్ల వారికి ఈ నెల భారతి (1940 సం. సెప్టంబరు నెల)తో ఇదివరకు చెల్లించిన చందా పూర్తి యగుచున్నవి. తిరిగి ఇంకొక సంవత్సరమున కగు చందా మాకు చేరునట్లు ఈ నెలాఖరులోగా మనియార్డరు చేసినచో తెంపు లేకుండ పత్రికను పంపుచుందుము. అట్లు తమ యొద్దనుండి 30-వ తేది లోపుగ సొమ్ము రానిచో సహజభాషాభిమానులగు తాము తిరిగి ఇంకొక సంవత్సరమువఱకు భారతి చందాదారులుగ నుందురను నమ్మకముతో 1940 సం. అక్టోబరు 10-వ తేదిని రూ. 6—4—0 లకు వి. పి. పంపుచున్నాము. కావున తా మెప్పటివలెనే పత్రికయం దభిమాన ముంచి సొమ్ము చెల్లించి వి. పి. ని గైకొన బ్రార్థితులు. ఒకవేళ తమకీ పత్రిక ప్రస్తుత మనవసరముగ దోచినచో మాకావిషయము వెంటనే తెలియంజేసిన యెడల వి. పి. పంపుట నాపుదుము.

A 9. H 28, 36, 37, 39, 40, 41. J 7. P 14, 15, 16. R 25, 26. S 10, 37, 41, 43, 45, 91, 103, 106, 109, 114. T 5.

వ్యాసవిలేఖకులకు మనవి

వ్యాసాలు ఎనిమిదిపుటలకు మించకుండా ఉండాలి. కాగితానికి ఒకపెడే వ్రాయాలి. శాస్త్రీయవిషయాలనుగురించిన వ్యాసాలుకూడా ఎక్కువ పరిభాషా, ఎక్కువ వివరాలూ లేకుండా సంగ్రహంగాను, సామాన్యపాఠకునికి విషయం బోధపడేటట్టు సులభంగాను, మనస్సును కథలా ఆకట్టేటట్టు ఆకర్షకంగాను ఉండాలి. శాసనవ్యాసాలు పదిపన్నెండు పుటలకు మించేయెడల రెండు సంచికలలో ప్రకటింపవలసివచ్చును. "బాలానందమున" కుచితమైన కథలు, పాటలు, సాధ్యమైనంతవరకు పిల్లలభాషలో రచించి పంపించవలసినదని కవులకు మనవి. విమర్శలకు గ్రంథములు పంపువారు రెండుప్రతులు పంపవలెను. ఇతరత్ర ప్రకటితమైన రచన లేవీ పంపవద్దు.

దేశాన్ని ఎక్కువగా కలవరపరుస్తున్న సాంఘిక, ఆర్థిక, రాజకీయాది విషయాలనుగురించీ, మనఆంధ్రుల ప్రత్యేకసమస్యలనుగురించీ ప్రత్యేకవ్యాసాలు కావాలి. సాధ్యమయినంతవరకు ఎత్తుకునే విషయంలోను, చూచే దృష్టిలోను, రచించే రచనలోను కొత్తదనంకావాలి. మన ఉద్యమాలు, మనదేశం, మనసంఘం, మనఆశయాలు భారతిలో ప్రతిఫలించేటట్టు చూడవలసిదని వ్యాసకర్తలకు మనవి.—భా. సం.

విషయసూచిక - September - 1960

బ్రహ్మప్రళయములు ... ...
శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు ౨౭౩

సంపాదకీయ వ్యాఖ్యలు ౨౭౪

గతజలసేతుబంధనపర్వము ... ...
శ్రీ శ్రీనివాస సోదరులు ౨౭౯

ఉపమా కాళిదాసస్య ... ...
శ్రీ కొత్త సత్యనారాయణ చౌదరిగారు ౨౮౧

మహాత్మాగాంధి ... ...
శ్రీ సాదలి రామస్వామిగారు ౨౮౩

గసడదవాదేశము - తన్మతభేదములు ...
శ్రీ ఖండవిల్లి సూర్యనారాయణగారు ౨౮౫

పుష్పాంజలి ... ...
శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు ౨౮౯

గద్య కవిత్వ మగునా ? ... ...
శ్రీ బూరుగుల సూర్యనారాయణమూర్తిగారు ౨౯౦

మలయమారుతము ... ...
శ్రీ పిలకా గణపతిశాస్త్రిగారు ౨౯౪

నవలారచన ... ...
శ్రీ ముళ్లపూడి వెంకటకృష్ణానందరావుగారు ౨౯౫

విమర్శకుని కలము ... ...
శ్రీ ఉమర్ అలీషాకవిగారు ౩౦౧

కాశీఖండము - కొన్ని పాఠభేదములు ...
శ్రీ చిలుకూరు పాపయ్యశాస్త్రిగారు ౩౦౩

చిన్ననాటి చేష్టలు-సీతాఫలము ... ...
శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ౩౦౭

ధన్యజీవి ... ...
"భమిడిపాటి" ౩౧౧

కొత్తపద్ధతులు ... ...
శ్రీ కొడవటిగంటి కుటుంబరావుగారు ౩౧౩

నాయూహ ... ...
శ్రీ కొత్త రాధాకృష్ణమూర్తి గారు ౩౨౦

శ్రీమదానందగజపతీంద్రులు - వింతచరిత్రలు ...
శ్రీ వాసా సూర్యనారాయణశాస్త్రిగారు ౩౨౧

స్మృతిమాల ... ...
డాక్టరు చక్రవర్తి రామానుజాచార్యులుగారు ౩౨౭

మతాబా ... ...
శ్రీమతి అబ్బెదొడ్డి సీతమ్మగారు ౩౨౮

ఆంధ్ర తేజము ... ...
శ్రీ ఉదయగిరి సన్యాసిరాజుగారు ౩౩౬
ఆశ ... ...
“జయదేవ” ౩౩౯
ఒకక్షణం ... ...
శ్రీ శ్రీరంగం నారాయణబాబుగారు ౩౪౪
‘జీవితకళ’ ప్రతివాదము ... ...
‘సత్యాన్వేషి’ ౩౪౫
ప్రణయస్వైరిణి ... ...
శ్రీ సత్యదుర్గేశకవులు ౩౫౪
శాస్త్రదృష్టి ... ...
శ్రీ వ. దుర్గా ప్రసాదరావుగారు ౩౫౭
శ్రీసూర్యరాయాంధ్రనిఘంటువు ... ...
శ్రీ వల్లమూడి వెంకటరత్నంగారు ౩౬౧
గచ్ఛపోద ... ...
శ్రీ సింగరాజు సుబ్బారావుగారు ౩౬౪
బాల్యస్నేహం ... ...
‘కళ్యం’ ౩౬౫
కన్యాశుల్కం సమీక్షణ (౪-వ భాగం) ...
శ్రీ సోమయాజుల వెంకటరామమూర్తిగారు ౩౬౯
నీతిపద్యమాల ... ...
శ్రీ పురాణం సూర్యనారాయణ తీర్థులుగారు ౩౮౦
గ్రామపునర్నిర్మాణము ... ...
శ్రీ టి. జ్ఞానానందముగారు ౩౮౨
కర్మజ్ఞాన సముచ్చయవాద విమర్శలేశము ...
శ్రీ పంచాంగం వెంకటచార్యులుగారు ౩౮౬
గీత ... ...
శ్రీమతి స్థానాపతి రుక్మిణమ్మగారు ౩౮౭
నీపుట్టుపూర్వోత్తరాలు ... ...
శ్రీ వి. ఆర్. ఎస్. శాస్త్రిగారు ౩౮౮
చిన్నపిల్లల చిత్తప్రవృత్తులు—శిశుశిక్షణము ...
శ్రీ గిడుగు వెంకటసీతాపతిగారు ౩౯౭
నిజం ... ...
శ్రీ కప్పగంతుల సత్యనారాయణగారు ౪౦౨
బాలానందం ౪౦౬
పుస్తకసమీక్ష ౪౦౭

చిత్రములు

త్రివర్ణ చిత్రము: బుద్ధ.
శ్రీమతి యస్. శకుంతల

